



# బోల్షివిక్

సంచిక: 7 సి.పి.ఐ(మావోయిస్టు) ఎ.ఓ.బి సమాచార పత్రిక జనవరి-సెప్టెంబర్ 2016

## లోపలి పేజీల్లో...

బోల్షివీకరణ క్యాంపెయిన్ .......... 03
కాశ్మీర్ ప్రజలకు మద్దతు .......... 08
విద్యార్థి ఉద్యమాలు .......... 06
కరపత్రం .......... 15
నారాయణపట్నా అనుభవం .......... 17
సిద్ధాంత వ్యాసం-శ్రామిక వర్గ ఎత్తుగడలు-లెనిన్ .......... 21
అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సి.పి.ఐ. (మావోయిస్టు) సందేశం .......... 23
ఇరోం షర్మిల నిరాహార దీక్ష విరమణ .......... 29
నేను గెరిల్లా నెందుకయ్యానంటే? .......... 32
అమరుల జీవిత చరిత్రలు .......... 35
పోరాట స్రవంతి .......... 46
సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపు .......... 62

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2016 జనవరి నుండి జూన్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ .ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బి.లో  కామ్రేడ్స్ రవి (డి.వి.సి.ఎమ్), జైయరాం (పి.పి.సి.ఎమ్.), ఆజాద్ (ఎ.సి.ఎస్.), కమల (ఎ.సి.ఎమ్), ఆనంద్ (ఎ.సి.ఎమ్)లు నేలకొరిగారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి. ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది.  అందుకే వారు సదా చిరస్మరణీయులు.

వ్యాసం

# అసాధారణ, గడ్డు పరిస్థితులను తొలగించుకుంటూ పురోగమిస్తున్న బోల్షివీకరణ క్యాంపెయిన్

ఎ.ఓ.బి విప్లవోద్యమం స్వీయాత్మక బలహీనతలతో పాటు శత్రు బలాధిక్యత వల్ల 2006 నాటికే తాత్కాలిక వెనుకపట్టు స్థితికి చేరింది. నేడు దేశ వ్యాపిత విప్లవోద్యమం కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఈ విషయాన్ని 2013 లోనే కేంద్రకమిటి నిర్ధారించింది. అయితే విప్లవోద్యమంలో కొనసాగుతున్న ఈ గడ్డు పరిస్థితి వివిధ జోన్లలో తరతమ స్థాయిలలో కొనసాగుతున్నది. మొత్తంగా చూసినప్పుడు దండకారణ్యంలో విప్లవ ప్రతీఘాతుకాన్ని ప్రజాయుద్ధం ఎదుర్కొంటూ నిలదొక్కుకొంటున్నప్పటికీ, అక్కడ కూడా వివిధ రీజియన్లలో తరతమ స్థాయి తేడాలతో గడ్డు పరిస్థితి కొనసాగుతున్నది. ఈ పరిస్థితి తలెత్తడానికి 2009 ఆగస్ట్/సెప్టెంబర్ తరువాత కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కొనసాగిన, కొనసాగుతున్న నిరంకుశ ప్రభుత్వాలు 'గ్రీన్‌హంట్' పేరుతో అపారంగా సాయుధ బలగాలను సమీకరించి ఉద్యమ ప్రాంతాలపై కేంద్రీకరించి దాడి చేయడం ఒక ముఖ్యమైన కారణం కాగా, విప్లవ యుద్ధంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పద్ధతులు మార్చుకోవడంలో వెనకబడటం, పార్టీ, పి.ఎల్.జి.ఎ లలో కార్మికవర్గేతర ధోరణులు వాటిని బలహీన పరిచే స్థాయిలో కొనసాగటం, నష్టాలు నివారించుకోవడంలో విఫలత చెందడం వంటి స్వీయాత్మక వైఫల్యాలు ఇతర ముఖ్యమైన కారణాలుగా పనిచేసాయి.

గత మూడున్నర దశాబ్దాల విప్లవోద్యమ చరిత్రలో మనకు ఇటువంటి పరిస్థితి కొత్త కాదు. ప్రతి దీర్ఘకాలిక విప్లవమూ అలలు అలలుగానే పురోగమిస్తుంది. ఇది చారిత్రక నియమం. మన భారత దేశ విప్లవోద్యమ చరిత్ర కూడా ఇదే నియమాన్ని అనుసరిస్తూ కొనసాగుతున్నది. గతంలో కూడా మనం ఇటువంటి అసాధారణ గడ్డు పరిస్థితులు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కొని అధిగమించి, ఉద్యమాన్ని పురోగమన బాట పట్టించాము. విప్లవోద్యమం ఎదుర్కొనే గడ్డు పరిస్థితుల గురించి కామ్రేడ్ లెనిన్ మాటల్లో చెప్పాలంటే "విప్లవం బలమైన, సమైక్య విప్లవ ప్రతీఘాతుకాన్ని ఉత్పన్నం చేస్తూ పురోగమిస్తుంది." అంటే విప్లవ అభివృద్ధే అసాధారణ, గడ్డు పరిస్థితుల్ని సృష్టిస్తూ వాటిని అధిగమిస్తుంటుదనేదే. కనుక విప్లవ పురోగమనంలో గడ్డు పరిస్థితులు సహజమనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

ప్రస్తుతం విప్లవోద్యమంలో నెలకొన్న గడ్డు పరిస్థితులను అధిగమించేందుకు మనం గత రెండు సంవత్సరాలుగా బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను కొనసాగిస్తూ కొన్ని ఫలితాలు పొందాము. ఈ విషయాన్ని ఎ.ఓ.బి ఎస్.జడ్.సి 11వ సమావేశం గత 19 నెలల క్యాంపెయిన్ కార్యాచరణను సమీక్షించి నిర్ధారించింది. ఈ సమీక్షను అనుసరించి, ఈ కాలంలో జరిగిన సిద్ధాంత అధ్యయనం పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులలో అనేక విషయాలపై సరైన అవగాహనను పెంచింది. సిద్ధాంత, రాజకీయ అవగాహన పెరిగిన చోట అనైక్యతలు తగ్గాయి. ఫీల్డ్ ట్రైనింగ్ జరిగిన చోట పార్టీ రాజకీయ పంథా వెలుగులో కొన్ని ముఖ్యమైన ఉద్యమ, నిర్మాణ సమస్యలను పరిష్కారమయ్యాయి. ఈ పరిష్కారాలు ప్రజల భాగస్వామ్యంతో జరిగాయి. దీంతో ప్రజలలో పార్టీ పైనా, పి.ఎల్.జి.ఎ పైనా నమ్మకం, విశ్వాసం పెరిగాయి. వాళ్ళలో ఉత్సాహం నెలకొన్నది. ఫీల్డ్ ట్రైనింగ్ లో వచ్చిన అనుభవాలు స్థానిక క్యాడర్లలో వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయగలిగేలా ఆత్మ విశ్వాసాన్ని పెంచాయి. ఈ కాలంలో శతృవుతో రాజకీయ రంగంలో కూడా తలపడ్డాము. ఎ.పిలో చంద్రబాబు ప్రభుత్వం బహుళ జాతి సంస్థలకు ఊడిగం చేస్తూ విశాఖ జిల్లా మన్యం ప్రాంతంలో 'అభివృద్ధి' పేరుతో బాక్సైట్ గనులు తవ్వేందుకు పూనుకుంటే, ఈ ప్రభుత్వ వర్గ ప్రయోజనాలనూ, కుట్రలనూ ప్రజలలో బహిర్గతం చేసి గొప్ప ప్రజా ఉద్యమాన్ని నిర్మించి, తాత్కాలికంగా గనుల తవ్వకాలను వాయిదా వేయించగలిగాము. కోరాపుట్ జిల్లాలో కూడా బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచి ప్రజా పోరాటాలను నిర్వహించాము. శతృవు మనల్ని ఒంటరి చేసి మట్టు పెట్టాలని చేస్తున్న కుట్రలనూ, వేస్తున్న పథకాలనూ ఈ ప్రజా పోరాటాల ద్వారా తిప్పికొట్టాము. ప్రజలలోకి విస్తృతంగా వెళ్ళడం ద్వారా విశాఖ బాక్సైట్ పోరాటంలో శతృవును ఒంటరి చేసాము. ఇంకా వివిధ సందర్భాలలో మనం చేపట్టిన రాజకీయ ప్రచార కృషి ప్రజలను ప్రత్యామ్నాయ రాజకీయాధికారం దిశగా ఆలోచించేందుకు దోహదపడింది.

బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో అతి ముఖ్యమైన విషయంగా చెప్పుకున్న 'ప్రజలను అంటిపెట్టుకునే పని శైలి' లో కొంత పురోగతి జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా వందల సంఖ్యలో బలగాలను మొహరించి 'ఏరియా డామినేషన్ల' పేరుతో ఉద్యమ ప్రాంతాలన్నింటిపై ఏక కాలంలో సాయుధ దాడిని కొనసాగిస్తున్నాడు. కొన్ని సందర్భాలలో ఎంపిక చేసుకొన్న ప్రాంతాలపై 'ఏరియా డామినేషన్లు' చేపడుతున్నాడు. ఈ దాడులు ప్రధానంగా పార్టీని, పి.ఎల్.జి.ఎనీ నిర్మూలించే లక్ష్యంతో జరుగుతున్నాయి. ప్రజలలో తెల్ల భీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఈ దాడులలో ఆరుగురి వరకూ సాధారణ ప్రజలు చనిపోయారు. కొద్దిమంది గాయపడ్డారు. పార్టీని, పి.ఎల్.జి.ఎని నిర్మూలించలేని పరిస్థితులలో నిరంతరాయమైన (కొనసాగింపు) దాడులతో వాటి పై వత్తిడి పెంచి ప్రజలను కలవనీయకుండా దూరం చేసే కుటిల లక్ష్యం కూడా ఈ దాడులకు వుంది. శత్రు లక్ష్యాలను, ప్రజలతో మరింతగా ఐక్యం కావడం

ద్వారానే తిప్పికొట్టగల్గుతున్నాము. అయితే విప్లవ పురోగమనానికి ప్రజల నుండి పొందుతున్న ఈ సాధారణ మద్దతును చురుకైన మద్దతుగా, భాగస్వామ్యంగా మలచాలి. అంటే ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికారం నెలకొల్పే దిశగా వాళ్ళను ప్రజాయుద్ధంలో చురుకైన భాగస్వాములుగా మలచాలి. ఈ విషయంలో మన సిద్ధాంత, రాజకీయ కృషి ప్రజలలో ఇంకా పెరగాల్సే వుంది. అందుకు తగిన నైపుణ్యాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంది. లేమి చేత, ఆకలి చేతా తమ జీవితమంతా కర్ర పెత్తనం కింద పని చేసేటటువంటి నిర్బంధంలో ఉన్న ఈ పేద ఆదివాసి రైతాంగం, ఇతర విప్లవకర వర్గాలూ ప్రజాయుద్ధ రాజకీయాలతో సంఘటిత పడేందుకు మన కృషి ఇంకా మెరుగుపడాలి. అయితే మనం నిర్వహిస్తున్న వర్గ పోరాటం వాళ్ళలో ఈ గుణాలను మేల్కొలుపుతున్నది. పాత ప్రతిబంధకాలను కొంత మేరకు బద్దలు చేస్తున్నది. ఏదైనా ఈ గడ్డు పరిస్థితిని అధిగమించడంలో ప్రజా పునాదిని నిర్మించడం, బలోపేతం చేసుకోవడం అనే కర్తవ్యం కీలకమైనదిగా వుంటుంది.

గతంతో పోల్చినప్పుడు అన్యవర్గ ధోరణులపై పోరాట తీవ్రత పెరిగింది. అవి పాత వ్యవస్థను కాపాడి నూతన వ్యవస్థ నిర్మాణానికి ఆటంకమనే విషయాన్ని లోతుగా అర్థం చేసుకుంటున్న కామ్రేడ్స్‌లో పరివర్తన జరుగుతున్నది. ఈ పరివర్తన మొత్తం ఉద్యమ ప్రయోజనాల పట్ల బాధ్యతను పెంచుతున్నది. నిర్దిష్టంగా అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడే కర్తవ్యం విషయంలో కూడా బాధ్యత పెంచుతున్నది. కార్మికవర్గ క్రమశిక్షణ పెంచుకునే విధంగా నిరంతరం బోధన, చెకింగ్, సమీక్ష వంటి ప్రక్రియల ద్వారా పి.ఎల్.జి.ఎలో పోరాటతత్వం పెరుగుతున్నది. తీవ్రమైన కష్టాలనూ, కఠిన పరిస్థితులనూ తట్టుకొనే మానసిక సంసిద్ధత పెరుగుతున్నది. మొత్తంగా చూసినప్పుడు 11వ ఎస్.జడ్.సి సమావేశం సమీక్షించినట్టు బోల్షివీకరణ క్యాంపెయిన్ ద్వారా కొన్ని సత్ఫలితాలను పొందాము. ముఖ్యంగా పార్టీలో సాపేక్షంగా భావసమైక్యత, ఉమ్మడి కార్యచరణ పెరిగాయి. దిగజారుళ్ళు కొంత వరకు తగ్గాయి. ప్రజా పనిలో పురోగతి వుంది. సంఘటితీకరణ ఒక ముఖ్యమైన కర్తవ్యంగా మన ముందు నిలిచి వుంది. గెరిల్లా చర్యలలో కొంత పురోగతి వుంది. ఆగస్ట్ 2015 నుండి మార్చి 2016 లోపు ఒడిశా, ఎపి భూభాగాలలో మూడు ఆంబుష్‌లు నిర్వహించి ఐదుగురు బి.ఎస్.ఎఫ్ పోలీసులను మట్టుపెట్టి 10 మంది బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్ పోలీసులను గాయపరిచాము. ఈ ఫలితాలు శతృదాడిలో మనల్ని నిలదొక్కుకునేలా చేసాయి. అయితే బలమైన విప్లవ ప్రతీఘాతుకత్వం మన ముందు నిలిచే ఉంది. దీనిని ధ్వంసం చేస్తూ విప్లవాన్ని పురోగమింప చేసేందుకు 11వ ఎస్.జడ్.సి సమావేశం ఇచ్చిన పిలుపునందుకుని మరో సంవత్సర కాలం బోల్షివీకరణ క్యాంపెయిన్ కొనసాగించాలి. అయితే బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను ఒక సంవత్సర కాలం పొడిగించినంత మాత్రానే మన సమస్య పరిష్కారం అవుతుందని భావించరాదు. పార్టీ మరింతగా కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకుని శతృదాడిని తిప్పికొట్టాలంటే ఇప్పటికే మనలో వచ్చిన మార్పు నిలకడగా కొనసాగి అభివృద్ధి దిశగా కొనసాగాలి. భావాల అభివృద్ధి దిశగా కొనసాగాలి. భావాల అభివృద్ధి క్రమం కొనసాగి మన స్వభావంలోనూ, దృక్పథంలోనూ గణనీయమైన మార్పు రావాలి. ఇందుకు బోల్షివీకరణ క్యాంపెయిన్ తదనంతరం కూడా రోజువారీ పని మొదలు మొత్తం పనిలో బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో రూపొందించుకున్న కార్యాచరణను కొనసాగించాలి.

మనం బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను ఒక సంవత్సర కాలం పొడిగించుకున్న నేపథ్యంలో కార్మికవర్గ సిద్ధాంతం వెలుగులో మన భావనలనూ, ఆచరణను మరింతగా మెరుగు పరుచుకునేందుకు కీలకమైన విషయాలను మరొకసారి పరిశీలిద్దాం.

1. ప్రధానంగా పార్టీ, పి.ఎల్.జి.ఎలలో సైద్ధాంతిక స్థాయిని మరింతగా పెంచుకోవాలి. సిద్ధాంత అధ్యయనంలో భాగంగా పార్టీ మౌలిక రాజకీయ, మిలటరి పంథాలను మన కార్యాచరణకు మార్గదర్శిగా ఎంచుకుని లోతుగా అధ్యయనం చేపట్టాలి. అధ్యయనం ద్వారా మనం ఏర్పరుచుకొన్న అవగాహనను నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి కార్యాచరణగా మలచాలి. నేడున్న గడ్డు పరిస్థితులలో సిద్ధాంతం ఆచరణలోకి మార్చబడుతూ, ఆచరణ చేత జీవవంతం చేయబడుతూ, సరిదిద్దబడుతూ, పరిరక్షించబడుతూ, అభివృద్ధి చెందటం కీలకమైన విషయంగా వుంటుంది. ఈ క్రమాన్ని ఫీల్డ్ ట్రైనింగ్ ప్రక్రియ ద్వారా కొనసాగించి అభివృద్ధి చేయాలి. సిద్ధాంత స్థాయిని పెంచుకోవడంలో భాగంగానే వుద్యమ ప్రాంతాలలో వర్గ పరిశీలన చేపట్టడంతో పాటు శతృ దాడి పథకాలను లోతుగా నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. ఇటువంటి నిర్దిష్ట అధ్యయనం ద్వారా మాత్రమే మారిన పరిస్థితులను ప్రతిబింబించేలా ఎత్తుగడలు రూపొందించుకోవడం సాధ్యపడుతుంది.

2. దోపిడీ పాలక వర్గాల రాజకీయాలను బహిర్గతం చేస్తూ, కార్మికవర్గ రాజకీయాలను ఆధిపత్యంలో వుంచేలా కృషి చేయాలి. పాలక వర్గాలు చేసే సైనిక, మత, రాజకీయ, సాంఘిక పదజాల, ప్రకటనల, వాగ్దానాల వెనుక తమ దోపిడీని, ఆధిపత్యాన్ని, అధికారాన్ని నిలబెట్టుకొనేందుకు చేసే కుట్రలనూ, తద్వారా తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చేసే ప్రయత్నాలనూ ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ ప్రజలను చైతన్యపరచాలి. అంతే కాకుండా వర్ణనాతీతమైన తమ కష్టాలకూ, కడగండ్లకూ, అజ్ఞానానికి కారణభూతులైన దోపిడీ పాలక వర్గాలనూ, వారి రాజ్యాంగయంత్రాన్ని ధ్వంసం చేసి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ నేతృత్వంలో నాలుగు విప్లవకర వర్గాల (కార్మికులు, రైతులు, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా) ఐక్యసంఘటనా ప్రభుత్వాన్ని ఏర్పరిచే దిశగా ప్రజలను రాజకీయంగా సంఘటిత పరచాలి. మన అంతిమ లక్ష్యమైన కమ్యూనిజం చేరేదాక ప్రజల సిద్ధాంత రాజకీయ స్థాయిని ప్రతి సందర్భంలోనూ, ప్రతి మలుపులోనూ, పెంచడం అనేది కీలకమైన, నిర్ణయాత్మకమైన కర్తవ్యంగా వుంటుంది.

3. పార్టీ పని శైలినీ, పి.ఎల్.జి.ఎ పోరాట శైలినీ ద్విగుణీకృతం

చేయాలి. అందుకు ప్రజలను ఎటువంటి క్లిష్ట పరిస్థితులలో సైతం విడవకుండా అంటిపెట్టుకొని వుండాలి. మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పిన సరైన పార్టీ పని శైలిలో ఇది ముఖ్యమైన విషయం. 1985లోనూ, 1991లోనూ పార్టీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు, ఆ పరిస్థితులను అధిగమించడంలో ప్రజలను అంటిపెట్టుకుని వుండటం కీలకమైన అంశంగా పని చేసింది. ఆ గొప్ప అనుభవాల్ని మనం ఇప్పుడు మరింత శ్రద్ధా పూర్వకంగా తెలుసుకుని అమలు చేయాలి. ప్రజలను అంటిపెట్టుకుని వుండటం మన మొత్తం పనిలో, కార్యాచరణలో ప్రధానమైన రూపంగా, పద్ధతిగా వుండాలి. ప్రజలనంటిపెట్టుకొని ఉండటం అంటే ముందుగా వారి సమస్యలు, ఆశలు, ఆకాంక్షలు వినయంగా, ఓపికగా తెలుసుకోవాలి. ప్రజల నుండి నేర్చుకోవడంలో ఇదొక ముఖ్యమైన అంశం. ఈ పద్ధతి ద్వారానే వాస్తవాలను అర్థం చేసుకోగల్గుతాము. అప్పుడే వారి ఆకాంక్షలకూ అవసరాలకూ అనుగుణంగా పోరాటాలు చేపట్టి ప్రజలను విస్తృతంగా కదిలించగల్గుతాము. మరో వైపు ప్రారంభం నుండి మనం వారికి సిద్ధాంత, రాజకీయాలను బోధించాలి. ఇలా పరస్పరం నేర్చుకోవడం, నేర్పడం అనే ప్రక్రియల కొనసాగింపే ప్రజలను అంటిపెట్టుకొని వుండటం. అప్పుడు మాత్రమే ప్రజలు పార్టీ సిద్ధాంత, రాజకీయాలను తమ కార్యాచరణగా మలుచుకొంటారు. తద్వారా బలమైన, విప్లవకర ప్రజా పునాది ఏర్పడి, అది శతృవును దీటుగా ఎదుర్కొనే శక్తిని పార్టీకి, పి.ఎల్.జి.ఎకి ఇస్తుంది.

4. పార్టీ, పి.ఎల్.జి.ఎలలో కొనసాగుతున్న అన్యవర్గ ధోరణులను తొలగించుకోవాలి. ఈ కర్తవ్యం చాలా కీలకమైనది. ఈ ధోరణులు పార్టీలోకి కార్మికవర్గేతర వర్గాల నుండీ, గ్రూపుల నుండీ, పొరల నుండి వస్తాయి. మన పార్టీ కంపోజిషన్ చూస్తే పట్టణ, గ్రామీణ మధ్యతరగతితో పాటు వ్యవసాయకూలి వర్గం నుండి వచ్చిన వారే ప్రధానం. కనుక పార్టీలో అన్యవర్గ ధోరణులు కొనసాగేందుకు ఎక్కువ అవకాశం ఉంది. ఇవి పార్టీలో స్వప్రయోజనాలను కేంద్రంగా చేసుకోవడమూ, స్వార్థం, అశాస్త్రీయత, అజ్ఞానం, మూఢనమ్మకాలు, ప్రగతి నిరోధకత్వం వంటి అనేక రూపాలలో ప్రతిఫలిస్తుంటాయి. ఈ ధోరణులు పార్టీ కమిటీలలో అనైక్యతలను పెంచుతాయి. నాయకత్వంపై పార్టీ శ్రేణులకూ, పార్టీ పై ప్రజలకు విశ్వాసం సడలేలా చేస్తాయి. ఊగిసలాటలనూ, పారుబోతుతనాన్ని పెంచుతాయి. విప్లవ యుద్ధంలో పార్టీని బలహీనపరుస్తాయి. పార్టీ ప్రజలకు సమర్థవంతంగా నాయకత్వం వహించలేదు. తత్ఫలితంగా శతృవుకు ఆధిక్యతను కనుక పార్టీలోనూ, పి.ఎల్.జి.ఎలోనూ నాయకత్వ శ్రేణుల నుండి కింది శ్రేణుల వరకూ తమ పాత వర్గ ఆలోచనల నుండీ, అలవాట్ల నుండీ, ఆచరణ నుండి బయటపడి నికరమైన కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకోవాలి (డీ–క్లాసిఫై కావాలి). మన పార్టీ అనుభవంలో పార్టీ కమిటీలలో వస్తున్న విబేధాలు పార్టీ మౌలిక రాజకీయ, మిలటరి పంథాకు చెందినవిగా కాక, మామూలు విబేధాలుగా వుంటున్నాయి. ఈ మామూలు విబేధాలు ఆయా వ్యక్తులలో వుండే అన్యవర్గ ధోరణుల వల్లనే ఉత్పన్నమవుతున్నాయి. నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే సమిష్టి, విప్లవ ప్రయోజనాల స్థానంలో వ్యక్తి ప్రయోజనాలను వుంచడం ద్వారానే వస్తున్నాయి. కనుక ఈ అన్యవర్గ ధోరణులను తొలగించుకునేందుకు ఓపికతో కూడిన బోధన, గట్టి పోరాటం చేపట్టాలి. ఈ విషయంలో చైనా కమ్యూనిస్టు పార్టీ 10వ కాంగ్రెస్ రూపొందించిన చేయవలసిన మూడు, చేయకూడని మూడులను మనం సదా గుర్తుంచుకోవాలి.

1. మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజాన్ని కాదు

2. ఐక్యం కండి, చీలిపోకండి

3. బహిరంగంగా వుండండి, కుట్రలు, కుహకాలకు పాల్పడవద్దు

అయితే పురోగామి వర్గపు పోరాట పార్టీ పొరపాట్లకు భయపడనక్కర లేదు. అది భయపడవలసిందల్లా ఆ పొరపాటును పట్టుకు వేళ్ళాడటం, దురభిమానం కారణంగా చేసిన పొరపాటును ఒప్పుకోక పోవడం, దాన్ని సరిదిద్దుకోక పోవడమూ.

5. కార్మికవర్గ క్రమశిక్షణను దృఢంగా అమలు చేయాలి. కార్మికవర్గ క్రమశిక్షణ మాత్రమే మన పార్టీ పంథా అమలుకు హామి పడ్తుంది. ఎందుకంటే మనం ఈ దేశంలో శిధిలావస్థకు చేరిన పాత అర్ధభూస్వామ్య, అర్ధవలస వ్యవస్థను ధ్వంసం చేసి కోటాను కోట్ల పీడిత ప్రజల నూతన జీవితాన్ని, రాజ్యాధికారాన్ని నెలకొల్పేందుకు శాస్త్రీయమైన, సరైన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను ఎంచుకొన్నాము. ఈ పంథా అమలులో ఎదురయ్యే ఎటువంటి కష్టాన్నైనా తట్టుకొంటూ, ప్రజల పక్షాన నిలిచి శతృవుపై నిర్భీతిగా, అత్యంత శక్తివంతంగా, త్యాగసంసిద్ధతతో దాడిని చేపట్టాలి. ఇందుకు అనుగుణంగా మనల్ని మనం మలచుకొనేందుకూ, తర్ఫీదు చేసుకొనేందుకూ కార్మికవర్గ క్రమశిక్షణ తప్పనిసరి అవసరం. కనుక పార్టీ రూపొందించిన క్రమశిక్షణా నియమాలను తప్పక పాటించాలి. ముఖ్యంగా పి.ఎల్.జి.ఎకు రూపొందించిన స్టాండింగ్ ఆర్డర్లు మొదలుకొని వివిధ సందర్భాలలో రూపొందించిన నియమాలు, నిబంధనలు, కార్యాచరణ సూత్రాలు మరింత దృఢంగా అమలు అయ్యేలా పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణుల్ని తీర్చి మలుచుకోవాలి. కార్మికవర్గ క్రమశిక్షణా సూత్రాలు పీడిత వర్గ ప్రయోజనాలను నెరవేర్చే సామాజిక విప్లవ విజయంతో ముడిపడి వున్నవన్న విషయం మన శ్రేణులకు అర్థం చేయించాలి. అప్పుడు వారు వాటిని కష్టంతోనూ, ఇష్టంతోనూ సంబంధం లేకుండా చైతన్యవంతంగా, స్వచ్ఛందంగా అమలు చేస్తారు.

6. మనకంటే అనేక రెట్లు బలమైన శతృవు పెద్ద సంఖ్యలో తన సాయుధ బలగాలను ఉద్యమ ప్రాంతాలలో కేంద్రీకరించి మనల్ని దెబ్బ తీయాలని చూస్తున్నాడు. ఇప్పటికే మన ఉద్యమ ప్రాంతాలను కార్పెట్ సెక్యూరిటీతో చుట్టివేసారు. ఈ చుట్టివేతను ఇంకా తీవ్రం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. శతృవు మనల్ని దెబ్బతీయాలని చేస్తున్న ఈ ప్రయత్నాలకు అవకాశం ఇవ్వని విధంగా మన ఎత్తుగడలు, పని పద్ధతులు వుండాలి. ఈ విషయంలో

మనకు ఎ.పి, తెలంగాణాలలో కొన్ని చేదు అనుభవాలు ఉన్నాయి. ఆ చేదు అనుభవాలను దృష్టిలో వుంచుకొని ఇక్కడి నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి నష్టాలను సాధ్యమైనంత వరకు పరిమితం చేసుకోవాలి. ఇందుకనుగుణంగా మన యుద్ధ దీర్ఘకాలిక స్వభావాన్ని దృష్టిలో వుంచుకుని తగిన ఎత్తుగడలు, పని పద్ధతులు రూపొందించుకోవాలి. మన దేశంలో తీవ్రమైన అసమానతలతో ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కొనసాగుతుండటంతో నూతన ప్రజాస్వామిక విప్లవాభివృద్ధి కూడా అసమానతలతో పురోగమిస్తున్నది. ఈ సంక్లిష్ట క్రమమే మన యుద్ధ దీర్ఘకాలిక స్వభావాన్ని తెలియచేస్తున్నది. గత మూడున్నర దశాబ్దాల మన విప్లవ కార్యాచరణ కూడా దీన్నే రుజువు చేస్తున్నది. కనుక దేశ వ్యాపితంగా విప్లవ విజయానికి అనుకూలంగా మారుతున్న పరిస్థితులను దృష్టిలో వుంచుకొని వాటిని అందుకొనేందుకు సన్నాహాలను చేసుకొంటూ, నిలదొక్కుకుంటూ పురోగమించేందుకు సిఎమ్‌సి, సిఆర్‌సి, ఎస్‌జడ్‌సిలు రూపొందించిన ఎత్తుగడలనూ, పని పద్ధతులను దృఢంగా అమలు చేస్తూ, పరిస్థితులలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేసుకోవాలి.

ఈ గుణపాఠాలన్నీ గత మహత్తర విప్లవ పోరాటాల నుండి లభించినవే. మహోపాధ్యాయుల బోధనలలో ఇవే సారాంశాలుగా వున్నాయి. ఈ అంశాలే నేడు మనం నిర్వహిస్తున్న బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో కీలక అంశాలుగా వున్నాయి. అయితే ఈ అంశాలన్నింటిలోకి కీలకమైనది సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంచుకోవడమే. అందుకు మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని అధ్యయనం చేస్తూ, నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడం ద్వారా అంతకంతకు స్పష్టమైన అవగాహనను పెంపొందించుకోవాలి. పాత ప్రపంచ దృక్పథం నుండి సంక్రమించిన సాంప్రదాయక భావాల నుండీ, దురభిప్రాయాలనుండీ, అంతకంతకు విముక్తి చెందాలి. అప్పుడే పార్టీ శ్రేణుల స్థాయిలోనూ, దృక్పథంలోనూ ప్రగతి ఏర్పడుతుంది. పార్టీ మరింతగా కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకొంటుంది. నేడు మనం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించగల్గుతాము. 9వ-ఐక్యతా కాంగ్రెస్‌తో పాటు వివిధ స్థాయిల కాన్ఫరెన్స్‌లు మన ముందుంచిన కర్తవ్యాల నిర్వాహణకు తగిన పరిష్కారాలు కనుక్కొని, వాటిని సమర్ధవంతంగా నిర్వహించగల్గుతాము.

మన ఈ స్వీయాత్మక కృషి ద్వారా సాధించే ఫలితాలను వేగవంతం చేసే విధంగా ప్రపంచంలోనూ, దేశంలోనూ వస్తుగత స్థితి వేగంగా మారుతున్నది. ప్రపంచ వ్యాపితంగా మారుతున్న ఆర్థిక రాజకీయ పరిస్థితులు ప్రజల్ని మరింత, మరింతగా విప్లవ దిశగా నెడ్తాయి. ఈ క్రమం ఇప్పటికే ప్రారంభమై మన అనుభవంలోకి వస్తున్నదే. ఈ పరిస్థితుల్ని స్థూలంగా పరిశీలిద్దాం.

2008లో అమెరికాలో గృహ రుణాల సంక్షోభంతో ప్రారంభమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభం నేడు ప్రపంచాన్ని అలుముకొని సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నది. 1930ల సంక్షోభంతో పోల్చినప్పుడు ఇది మరింత లోతుగా, విస్తృతంగా దీర్ఘకాలంగా కొనసాగుతున్నది. అన్ని రకాల సరుకులకు డిమాండ్ పడిపోయి ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక వృద్ధికి అవకాశమే లేని పరిస్థితి ఏర్పడింది. సోమరి పోతులు, పరాన్నభుక్కులైన డబ్బు మూటల యజమానులు (ఫైనాన్స్ గుత్త పెట్టుబడిదారులు) నిర్వహిస్తున్న 'డబ్బు ద్వారా డబ్బు'ను సంపాదించే స్పెక్యులేషన్ వ్యాపారం సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థను మరింత అధోగతి పాలు చేసింది. మొత్తంగా నేడు దారి, తెన్నూ తెలియని సంక్షోభ కీకారణ్యంలో ఇరుక్కుపోయిన ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థను తిరిగి రక్షించుకొనేందుకూ, జీవం పోసేందుకూ సామ్రాజ్యవాదులు సంస్కరణల పేరుతో బందిపోటు దొంగల్లా వెనుకబడిన దేశాల సంపదనూ, శ్రామికుల శ్రమశక్తిని చౌకగా కొల్లగొట్టేందుకు తీవ్రంగా పోటీపడ్తున్నారు. మరో వైపు పెట్టుబడిదారీ దేశాలలో సైతం కార్మిక వర్గాన్ని కొల్లగొడుతున్నారు. ఈ పరిణామాలు ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యంగా సామ్రాజ్యవాదులకు పీడితజాతులకూ, ప్రజలకు మధ్య వైరుధ్యం రోజురోజుకు తీవ్రతరమవుతున్నది. ఈ వైరుధ్యం తీవ్రమై ఘర్షణ రూపం తీసుకొని జాతుల పోరాటాలుగానూ, ప్రజాస్వామిక విప్లవాలుగానూ, ప్రజా పోరాటాలుగానూ బద్దలవుతున్నాయి. ప్రపంచాన్ని దోచుకోవడంలో సామ్రాజ్యవాదుల మధ్య నెలకొన్న కుమ్మక్కు స్థానంలో పోటీ తీవ్రతరమవుతున్నది. రష్యా తిరిగి మార్కెట్ల కోసం పోటీకి సిద్ధమవుతుండటంతో అమెరికా కూటమికీ రష్యాకూ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ సామ్రాజ్యవాద దేశాల మధ్య పెరుగుతున్న వైరుధ్యాల ఫలితంగా ఉక్రెయిన్, సిరియా, లిబియా, యెమన్ వంటి దేశాలు అంతర్గత పోరాటాలతో అగ్నిగుండాలుగా మారుతున్నాయి. రష్యా, చైనానూ మరి కొన్ని దేశాలనూ కలుపుకుని వాణిజ్య, మిలటరీ కూటములను ఏర్పరిచింది. అమెరికా నేతృత్వంలోని ద్రవ్య సంస్థలైన ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్.లకు పోటీగా చైనాతో పాటు మరి కొన్ని దేశాలను కలుపుకుని బ్రిక్స్ బ్యాంకును ఏర్పరిచింది. ఈ పోటీలో భాగంగానే చైనా ఎ.ఐ.ఐ.బి (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్)ని ఏర్పరిచింది. మరో వైపు పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలలో ప్రజాస్వామిక పోరాటాలు ఊపందుకుంటున్నాయి. సోషలిజం లక్ష్యంగా కార్మికవర్గ పోరాటాలు, నిర్మాణాలు పెరుగుతున్నాయి. ఈ మొత్తం పరిణామాలు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ కాలం చెల్లిన, శిథిలమైన స్వభావాన్ని మరింతగా వ్యక్తం చేస్తున్నాయి. దానితో ప్రజలకు పెరుగుతున్న ఘర్షణ నేపథ్యంలో, దానిని సంపూర్ణంగా ధ్వంసం చేసి సోషలిస్టు విప్లవం దిశగా నడిపించే నూతన పురోగామి కార్మికవర్గ శక్తుల జననం మరింత పెరగడం తథ్యం.

సామ్రాజ్యవాద రథ చక్రాలకు కట్టివేసి ఉంచిన భారత ఆర్థిక వ్యవస్థ నేడు సామ్రాజ్యవాద సంక్షోభ భారాన్ని మోస్తూ, తిరిగి కోలుకోలేనంత స్థాయికి చితికిపోయింది. ఇది ఇలా ఉంటే దీనికి విరుగుడు ఫాస్ట్ ట్రాక్ సంస్కరణల అమలేనంటూ సామ్రాజ్యవాద యజమానులు ఇక్కడి దళారీ పాలక వర్గాలకు ఆదేశాలు ఇస్తున్నారు.

వారి ఆదేశాలను సమర్ధవంతంగా నిర్వహించలేని కాంగ్రెస్ ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌ను తొలగించి 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల ద్వారా బి.జె.పి కి చెందిన మోడిని అధికారంలోకి తెచ్చారు. ప్రస్తుతం మోడి పరివారం రెండు లక్ష్యాలతో పని చేస్తున్నారు. బీటలు వారిన బ్రాహ్మణవాద హిందూ ఫ్యూడలిజానికి జీవం పోయడం, ఈ పునాది పైన దేశ సంపదను మరింతగా సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయడంతో పాటు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వాముల బొక్కసాలు నింపడం. ఈ రెండు అసలు ఆర్థిక, రాజకీయ లక్ష్యాలను మరుగుపరిచే విధంగా మోసపూరిత నినాదాలతో మోడి షడ్యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే దేశభక్తి జాతీయత, సామాజిక సామరస్యం (సోషల్ హార్మోనీ) వగైరా నినాదాలతో క్రూరమైన కుల వ్యవస్థను కల్గిన బ్రాహ్మణీయ హిందూ సమాజంలోని వైరుధ్యాలను మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తున్నది. మరో వైపు ప్రజలలో ఉన్న మత ఆచారాలు, నమ్మకాలు వంటి వెనకబడిన భావాలను ప్రోత్సహిస్తూ ముస్లిం, క్రిస్టియన్ వగైరా మత మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా మెజారిటీ హిందువులను ఒక్కటి చేయాలని చూస్తున్నది. ఈ జిమ్మిక్కులకు వెనుకబడిన ప్రజానీకంలో ఒక సెక్షన్ ప్రభావితులవుతున్నారు. బ్రాహ్మణీయ హిందూ సమాజాన్ని నిలబెట్టడం వల్ల లబ్ది పొందే ప్రతీఘాతుక సెక్షన్ మోడి విధానాలకు మద్దతునిస్తూ దూకుడుగా వుంటున్నది. అయితే మరో వైపు దేశంలోని పీడిత కులాలు, పీడిత వర్గాలు, మత మైనార్టీలు, అత్యధిక ప్రజానీకం, పెరుగుతున్న సామాజిక ఘర్షణల నేపథ్యంలో హిందూ మతోన్మాదానికీ అది ముందుకు తెస్తున్న అనేక వ్యక్తీకరణలకూ, సమస్యలకు వ్యతిరేకంగా పోరాటాలలోకి సమీకృతులవుతున్నారు.

మరో వైపు సామ్రాజ్యవాద సంస్కరణల అమలుకు దారి సుగమం చేసుకొనేలా 'మేకిన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' వంటి అనేక మోసపూరిత నినాదాలు ఇస్తున్నారు. ఈ నినాదాల ముసుగులో భారతదేశ సంపదను సామ్రాజ్యవాదులు , దళారీ నిరంకుశ బూర్జువా భూస్వాములు యధేచ్ఛగా కొల్లగొట్టేందుకు పార్లమెంటు ద్వారా చట్టాలలో మార్పులు తెస్తున్నారు. నూతన చట్టాలు చేస్తున్నారు. తమ ఈ ప్రజా వ్యతిరేక, ప్రతీఘాతుక చర్యలను సమర్ధించుకునేందుకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో వున్నప్పటికీ భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. ఈ వాదనకు సాధికారత కల్గించేలా గుంటనక్క లాంటి ప్రపంచబ్యాంక్, ఐ.ఎమ్.ఎఫ్‌లు మరింత ముందుకు పోయి భారత దేశ అర్థవ్యవస్థ వెలిగిపోతున్నదని కితాబులిస్తున్నాయి. ఈ సర్కస్ ఫీట్లన్నీ ప్రజలను అభివృద్ధి భ్రమల్లో ముంచి సర్వం దోచుకుపోవడానికే.

మోడి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నది. ఈ కాలంలో మోడి అనుసరించిన ఆర్థిక, రాజకీయ విధానాలు కొత్తవేమి కావనీ, అవి కాంగ్రెస్ మన్‌మోహన్ సింగ్ విధానాల నకలేననీ, అయితే మోడి వాటిని దూకుడుగా అమలు చేస్తున్నాడనీ ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. మోడియే కాకుండా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలతో పాటు ఇతర రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులు అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ విధానాలు కూడా ఇవే. వీరంతా ఏ పార్టీలకు చెందిన వారైనప్పటికీ బ్రాహ్మణవాద హిందూ ఫ్యూడలిజాన్నీ, సామ్రాజ్యవాదుల, భారత పాలక వర్గాల దోపిడీనీ, ఆధిపత్యాన్ని ఆమోదిస్తున్న వారే. అయితే వీరు పీడిత వర్గాలను మోసం చేసేందుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రిపబ్లిక్, దేశభక్తి, జాతీయత, అభివృద్ధి వంటి అందమైన మోసపూరిత నినాదాలు ఇస్తున్నారు. ఈ నినాదాలు ప్రజలను ఎక్కువ కాలం మోసగించలేవు. ఇప్పటికే ప్రజలు ఈ దోపిడీ పాలక ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలలోకి సమీకృతులవుతున్నారు. భవిష్యత్‌లో ఇవి ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ సమీకరణలుగా మారుతాయి. ఇవి మిలిటెంట్ స్వభావాన్ని సంతరించుకుంటాయి. రాబోయే ఈ పరిణామాలను పసిగట్ట గలిగిన భారత పాలక వర్గాలు ఒక వైపు మోసపూరిత ప్రయత్నాలు చేస్తూనే, మరో వైపు ప్రజా పోరాటాలనూ, తిరుగుబాట్లనూ, వాటికి నాయకత్వం అందిస్తున్న సంస్థలను క్రూరంగా అణచివేసేందుకు రాజ్యాంగ యంత్రాన్ని ఫాసిస్టీకరిస్తున్నారు. మరో వైపు సమాజంలో ఫాసిస్టు సంస్థలను (ఆర్.ఎస్.ఎస్, భజరంగదళ్, రామ్‌సేన, వగైరా) నెలకొల్పి సాంఘిక పునాదిని ఏర్పరుచుకుంటున్నారు. ఇప్పటికే గ్రీన్‌హంట్, రెడ్‌హంట్ పేరుతో మన పార్టీ, పి.ఎల్.జి.ఎ, విప్లవ ప్రజా సంస్థలపైనా, ప్రత్యేకంగా ఆదివాసీ ప్రజానీకం పైనా జరుగుతున్న ఫాసిస్టు దాడి మనం చూస్తున్నదే. ఈ పరిణామాలన్నీ రాజీ పడని వర్గాల మధ్య మరో సంగ్రామం బద్దలయ్యే స్థితిని తెలియచేస్తున్నాయి.

పై ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మనల్ని మనం రక్షించుకుంటూ ప్రజా యుద్ధ సిద్ధాంత, రాజకీయాలను పీడిత ప్రజలకు అందించడంతో పాటు సరైన నినాదాలు రూపొందించి సరైన కేటాయింపులు చేసి అన్ని ప్రజా పోరాటాలనూ, అన్ని ప్రజా నిర్మాణాలనూ, ప్రజా సైన్యం, ప్రజా యుద్ధాలనూ అభివృద్ధి చేసే దిశగా సంఘటిత పరుస్తూ బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలి. అయితే ఈ క్రమం అంత సులువుగా వుండదని మాత్రం దృష్టిలో వుంచుకోవాలి. ఇది అత్యంత కఠినంగా, ప్రయాసతో, త్యాగాలతో, దీర్ఘకాలిక స్వభావం కల్గినదై వుంటుంది. ఇందుకు పార్టీనీ, పి.ఎల్.జి.ఎని సిద్ధం చేయడమే బోల్షివీకరణ క్యాంపెయిన్‌లోని సారం. ఇందులో మనం విజయం సాధించడం ద్వారా విప్లవ ప్రతీఘాతుకాన్ని ఓడించి అసాధారణ, గడ్డు పరిస్థితులను తొలగించుకుంటూ విప్లవాన్ని పురోగమింప చేయగల్గుతాము. ❐

పత్రికా ప్రకటన

# స్వతంత్ర జాతి ఆకాంక్షలతో భారత కిరాయి సాయుధ బలగాలతో తలపడుతూ కర్ఫ్యూలను ధిక్కరిస్తూ మిలిటెంట్‌గా పోరాడుతున్న కాశ్మీర్ ప్రజలకు మద్దతు తెలుపుదాం!

*ప్రజాందోళనను సాయుధ మిలిటెంటు ఉద్యమాన్ని జమిలిగా కొనసాగిస్తూ దోపిడీ పాలక వర్గాలకు దీటైన జవాబు చెబుతూ స్ఫూర్తిదాయకంగానూ, దృఢదీక్షనూ, త్యాగ సాంప్రదాయాలను నెలకొల్పుతున్న కాశ్మీర్ ప్రజలకు విప్లవ జేజేలు !*

ఇటీవల కాలంలో కాశ్మీర్ మరోసారి వార్తలలోకి వచ్చింది. దేశీయ, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. కాశ్మీర్‌లో జరుగుతున్న ఘటనలను సక్రమంగా అర్థం చేసుకోవడానికి కాశ్మీర్ సమస్య మూలాలను ఒకసారి విశ్లేషించుకొని దాని పట్ల సరైన అవగాహనను పెంపొందించుకుందాం. న్యాయమైన ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతునివ్వడం, మద్దతును కూడగట్టడం మన కర్తవ్యం. అదే విధంగా దేశంలోని ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల శక్తులు ఇటువంటి ఉద్యమాల పట్ల న్యాయమైన వైఖరిని కలిగి ఉండాలని కోరుకుందాం. ఆ ఉద్యమాల గురించి వాస్తవాలను ప్రజలలో ప్రచారం చేసి మద్దతు నివ్వాలి.

కాశ్మీర్‌లో జులై 8, 2016 న బుర్హాన్ ముజఫర్ వానీ అనే ఇరవై ఏళ్ల యువకుడిని, అతని ఇద్దరు అనుచరులనూ పోలీసు బలగాలు పట్టుకొని చంపివేసి ఎదురు కాల్పులలో ఉగ్రవాది మరణించాడని కట్టుకథలు చెప్పారు. ఆ తరువాత కాశ్మీర్ భగ్గుమన్నది. ఇప్పటికి 50 రోజుల నుండి నిరంతరం కర్ఫ్యూ కొనసాగుతోంది.

ప్రజలు కర్ఫ్యూలను ధిక్కరిస్తూ వీధులలోకి వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు. సాయుధ బలగాలతో ముఖాముఖీ తలపడుతున్నారు. ఇప్పటివరకు సాయుధ బలగాలు 100 మందికి పైగా ప్రజలను హత్య చేసారు. 10,000 మంది ప్రజలను గాయపర్చారు. ఇప్పటికీ 1,650 మందికి శస్త్రచికిత్సలు చేయవలసి వచ్చింది. ప్రతి రోజు వందల మంది ప్రజలు గాయపడుతున్నారు.

మొత్తం కాశ్మీర్‌లోయ అంతా ఒక 'నిర్బంధ శిబిరం'గా మార్చబడింది.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో కొంత చరిత్రను, ఇటీవలి కేంద్ర ప్రభుత్వ చర్యలను ఒకసారి పరిశీలిద్దాం.

1947 లో బ్రిటన్ భారతదేశాన్ని ఇక్కడి దళారీ బూర్జువా వర్గానికి అప్పజెప్పే నాటికి దేశంలో స్వతంత్ర సంస్థానాలు 500 ఉండినాయి. 1947 కు ముందు కాశ్మీర్ ఒక స్వతంత్ర దేశం కింద లెక్క. 1949లో భారత ప్రభుత్వం అక్కడి రాజు హరిసింగ్‌తో ఒప్పందం చేసుకొని స్వతంత్ర కాశ్మీర్‌లోని మూడు వంతుల భూభాగాన్ని ఆక్రమించుకున్నది. ఒక వంతు భాగాన్ని పాకిస్తాన్ ఆక్రమించుకున్నది. అప్పటి నుండి ఒకటిగా ఉండే కాశ్మీర్‌ను భారత, పాకిస్తాన్‌లు విభజించుకున్నాయి. కాశ్మీర్ స్వతంత్రం వివాదాస్పద విషయంగా మారింది. 1949లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఒప్పందం జరిగింది. ఆ ఒప్పందంలో భాగంగా కాశ్మీర్‌లో 'రిఫరండం' (ప్రజాభిప్రాయ సేకరణ) జరపాలని అంగీకరించారు.

ఒప్పందాన్ని అమలు జరపమని అన్నందుకు (అనాటి కాశ్మీర్ ప్రధానమంత్రి) షేక్ అబ్దుల్లాను జైల్లో పెట్టారు. 1958 లో 'సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని' తెచ్చారు. ఈ చట్టం ద్వారా సైనికులు ఎవరినైనా కాల్చి చంపి ఎదురు కాల్పుల కతలు చెప్పవచ్చు. దాని మీద ఎటువంటి విచారణ ఉండదు. ఆనాటి నుండి నేటి వరకు ఆ చట్టం కొనసాగుతూనే ఉంది.

కాశ్మీర్ ముఖ్యమంత్రులు ఎవరైనా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే వారిని పాకిస్తాన్ ఏజెంట్లుగా ముద్ర వేయడం వలన అక్కడి రాజకీయ పార్టీలు భారత పాలక వర్గాలకు పూర్తిగా లొంగిపోయాయి. అన్ని ఎన్నికల పార్టీలూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. దాని నుండి జె.కె.ఎల్.ఎఫ్ (జమ్ము కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్) సంస్థ పుట్టుకువచ్చింది. కాశ్మీరు జాతి ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించి సాయుధ పోరాటాన్ని ప్రారంభించింది. భారత పాకిస్తాన్‌లు దాని మీద తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించాయి. ఆజాద్ కాశ్మీరు డిమాండ్‌తో 'హుర్రియత్ కాన్ఫరెన్స్' ముందుకు సాగుతోంది. 'హుర్రియత్ కాన్ఫరెన్స్' సిమ్లా ఒప్పందాన్ని రిఫరండం ద్వారా కాశ్మీరు సమస్యకు పరిష్కారం చేయాలని కోరుతుంది. వాస్తవానికి 1949లో ఐక్యరాజ్యసమితిలో కాశ్మీరు విషయంలో భారత్, పాకిస్తాన్‌లు రెండు సంతకాలు చేసాయి. ఈ విషయంలో ఇరు దేశాల పాలకవర్గాలూ నేరస్తులే. కాశ్మీర్ సమస్య పరిష్కారం అంటే కాశ్మీరును ఏకం చేయాలి. ప్రజాభిప్రాయం ప్రకారం దానిని నిర్ణయించాలి. కానీ భారత పాలక వర్గాలు కాశ్మీరును ఒక నిర్బంధ శిబిరంగా మార్చివేసారు. కోటి మంది కంటే తక్కువ జనాభా ఉన్న కాశ్మీర్‌లో 7 లక్షల మంది సైనిక బలగాలున్నాయి. నేడు కాశ్మీర్ ప్రపంచంలోనే ఎక్కువ 'సైనికీకరించిబడిన' ప్రాంతం.

కాశ్మీరీలు ఎన్నికల్లో ఏనాడు స్వచ్ఛందంగా పాల్గొన్నది లేదు. భద్రతా బలగాల పదఘట్టనల్లో, బెదిరింపులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో భద్రతా బలగాలను ఉపసంహరించి అంతర్జాతీయ స్థాయిలో పేరు కలిగిన సంస్థలను పరిశీలకులుగా పెట్టమని కాశ్మీరీలు కోరుతున్నారు. అటువంటి పని చేసే ధైర్యం పాలక వర్గాలకు లేదు. అలా చేస్తే వారి నిజస్వరూపం బట్టబయలవుతుందని వారి భయం.

ఇప్పటి వరకు కాశ్మీర్‌లో 70 వేల మంది పై చిలుకు ప్రజలను భారత ప్రభుత్వపు కిరాయి మూకలు హత్య చేశాయి. 8 వేల మందిని మాయం చేసాయి. చిత్రహింసలు, లైంగిక హత్యలు, అత్యాచారాలు లెక్కలేనన్ని జరుగుతున్నాయి.

గతంలో 2008, 2009, 2010 లల్లో కూడా పెద్ద ఎత్తున ప్రజలు వీధులలోకి వచ్చి సాయుధ బలగాలకూ, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేసిన సందర్భాల్లోనూ, మరీ ముఖ్యంగా కాశ్మీరు స్వాతంత్రం గురించి డిమాండ్ చేసిన సందర్భాల్లో ఇదే పద్ధతిలో ప్రజల మీద అణచివేత పెద్ద ఎత్తున ప్రయోగించబడింది.

అయితే ఇటీవల కాలంలో, ముఖ్యంగా మోడి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి, హిందూ ఫాసిస్టు సంస్థలు, బి.జె.పి పార్టీ నాయకులు చేస్తున్న ప్రకటనలు కాశ్మీరు ప్రజలను రెచ్చగొట్టే విధంగా వుంటున్నాయి. ముఖ్యంగా బి.జె.పికి ముస్లిం మైనార్టీలను టార్గెట్ చేస్తూ మెజారిటీ హిందువులను తమ వెనకాల కూడగట్టుకునే పథకం ఉండనే ఉంది. దాని కోసం గత పార్లమెంటు ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్‌లో మత ఘర్షణలను రెచ్చగొట్టింది. బి.జె.పి పాలిత రాష్ట్రాలలో 'గోమాంసం' మీద నిషేధం విధించింది. 2015లో కాశ్మీరులో గోమాంసం తిన్నాడని ఒక ఎమ్.ఎల్.ఎపై అసెంబ్లీ హాల్‌లోనే బి.జె.పి నాయకులు దాడి చేసారు. జె.ఎన్.యు(జవహర్‌లాల్‌నెహూ యూనివర్సిటీ)లో అఫ్జల్ గురుకు మరణశిక్ష విధించడం తప్పని సభ పెట్టినందుకు అక్కడి విద్యార్థుల మీద దేశద్రోహం నేరం మోపారు. దీని వెనకాల డిల్లీ విశ్వవిద్యాలయపు ప్రొఫెసర్ గిలానీ ఉన్నాడని ఆయనను జైల్లో పెట్టారు. శ్రీనగర్‌లోని ఎన్.ఐ.టిలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకున్నది. పై విషయాలు కాశ్మీర్ ప్రజలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయి.

మరీ ముఖ్యంగా ముస్లిలంను దేశ ద్రోహులుగానూ, ఉగ్రవాదులుగానూ, పాకిస్థాన్ ఏజెంట్లుగాను బి.జె.పి దాని ఫాసిస్టు సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. అక్కడక్కడ దాడులు చేస్తున్నాయి. ఎవరు దేశభక్తులో, ఎవరు కాదో సర్టిఫికట్లు ఇస్తున్నారు. 2002లో మోడి నాయకత్వంలో గుజరాత్‌లో వేలమంది ముస్లింలను హత్య చేసిన విషయం ఏ ముస్లిం మరచిపోడు. వాస్తవానికి ఆనాడు బ్రిటిషు సామ్రాజ్యవాదానికి నమ్మకంగా ఉంటానని సావర్కార్ జైలు నుండి లెటర్ రాసాడు (ఆనాటి ఆర్.ఎస్.ఎస్ నాయకుడు, నేటి వారి ఆరాధ్య దైవం). వీరు నేడు ఆయన అడుగు జాడలలో అమెరికన్ సామ్రాజ్యావాదానికి నమ్మకమైన బంటుగా మారి దేశాన్ని టోకున అమ్ముతున్న విషయం విదితమే. బి.జె.పి పార్టీ అధికారానికి వచ్చిన నాటి నుండి 371వ ఆర్టికల్ (కాశ్మీరుకు స్వయం ప్రతిపత్తి)ను రద్దు చేయాలనీ, కాశ్మీరు భారతదేశంలోని ఒక రాష్ట్రమని మాట్లాడుతున్నారు. కాశ్మీరులో జరుగుతున్న పోరాటం పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదమని ప్రచారం లంకించుకున్నారు. కాశ్మీరు ప్రజల పట్ల, పోరాటం పట్ల విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. అవమానకరమైన పద్ధతుల్లో కాశ్మీరీలమీద దుష్ప్రచార దాడి  చేస్తున్నారు.

మరో వైపున మోడి ఎన్నికల వాగ్దానాలు చెత్తబుట్టలోకి పోయాయి. మోడి అధికారంలోకి వచ్చిన తరువాత భూ సేకరణ చట్టం మీద పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. నల్లధనాన్ని వెనక్కి తెస్తానని చెప్పిన దానిని ప్రస్తావించగా ఎగతాళిగా కొట్టిపారేసాడు. మధ్య తరగతిలో కూడా మోడి పట్ల విశ్వాసం సన్నగిల్లింది. 2015 సెప్టెంబర్‌లో దేశ వ్యాపితంగా మోడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేసారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో ఎన్నికలు రాబోతున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం మొదలైన వాటి నుండి గుజరాత్‌లోనే రిజర్వేషన్లను డిమాండ్ చేస్తూ పటేళ్ళ ఆందోళన, దళిత ఆందోళనలు మొత్తం పాలకవర్గాన్నే ఓ కుదుపు కుదిపాయి. ఈ పరిస్థితుల్లో ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకు కాశ్మీరు సమస్యను పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదమని ఒక  ప్రచారం మొదలుపెట్టారు. తమ హిందుత్వ ఎజెండాలో భాగంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో కూడిన అఖండ భారత్ నినాదాన్ని ప్రచారం చేస్తూ ప్రజల్లో దురహంకారాన్ని రెచ్చగొడుతున్నారు.

కాశ్మీరు ప్రజల్లో అసంతృప్తి పెరగడానికి కొన్ని స్థానిక కారణాలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం వలస పోయిన కాశ్మీరీ పండితులకు ప్రత్యేకంగా కాలనీలు నిర్మించింది. ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చింది. దీనిలో పోలీసు, మిలటరీ, ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు డబ్బు మూటలు కట్టుకున్నారు. స్థానిక కాశ్మీరీలకు మేలు జరగలేదు. కాశ్మీరులో వరదలు వస్తే పెద్ద పెద్ద మాటలు తప్ప వాస్తవంగా మోడి ప్రజలను ఆదుకున్నదేమిలేదు. పండితుల పేరుతో కాశ్మీరేతర పారిశ్రామికవేత్తలు వచ్చి స్థానిక భూములను కొనుగోలు చేయడం, లీజుకు తీసుకోవడం చేస్తున్నారు. వారికి ప్రభుత్వం రాయితీలు యిచ్చింది. ఈ చర్యతో కాశ్మీరులో కాశ్మీరీలు మైనార్టీలుగా మారే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. కాశ్మీరు భూములను, సంపదను ఇతరులకు అప్పగించడాన్ని అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అందమైన కాశ్మీరులో టూరిజం పరిశ్రమను ఏర్పరిచి సామ్రాజ్యవాద కంపెనీలకు, దళారీ నిరంకుశ బూర్జువా కంపెనీలకు కట్టబెట్టే పథకం మోడి ప్రభుత్వం తయారు చేస్తోంది.

ఈ రకంగా ప్రభుత్వ చర్యలన్ని కాశ్మీర్ ప్రజలలో కోపాన్ని రగిలిస్తున్నాయి. బుర్హాన్‌వానీ 21 సం॥ల యువకుడు, విద్యాధికుడు. సంపన్న కుటుంబం నుండి వచ్చిన యువకుడు. కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారం కోసం ప్రజలను పోరాటం చేయమని, కాశ్మీర్ నుండి భద్రతా బలగాలను తరిమి వేయాలనీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తుండేవాడు. అందువలన అతను కాశ్మీరీ ప్రజలకు, మరీ ముఖ్యంగా యువతకు ఒక 'రోల్ మోడల్'గా మారాడు. అతనిని కావాలనే పట్టుకొని కాల్చి చంపారు. దాంతో కాశ్మీర్ ప్రజానీకంలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. పాలకవర్గాలు అతన్ని చంపి ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించి ఉద్యమాన్ని అణచివేయాలని ఊహించారు. దానికి  భిన్నంగా బుర్హాన్‌వానీ అంత్యక్రియలకు లక్షలాది మంది హజరయ్యారు.

ఆ రోజు నుండి అనగా జులై 8 నుండి నిరవధికంగా కాశ్మీర్‌లో కర్ఫ్యూ కొనసాగుతున్నది. డిజిటల్ ఇండియా అని పెద్ద డైలాగులు చెప్పే మోడి కాశ్మీరులో 60 రోజులుగా ఇంటర్‌నెట్ సర్వీసులనూ, మొబైల్ సర్వీసులను రద్దు చేయించాడు. గుజరాత్‌లోనూ ఆందోళన

సందర్భంగా పై రెండు సర్వీసులను రద్దు చేయించాడు. అయినప్పటికీ ప్రజలు సాంప్రదాయక పద్ధతిలో సమాచారాన్ని చేరవేసుకుంటూ కర్ఫ్యూని ధిక్కరించి, వీధులలోకి వచ్చి సాయుధ బలగాలతో ఘర్షణ పడుతున్నారు. సాయుధ బలగాలు నిరాయుధులైన ప్రజల మీద కాల్పులు జరుపుతున్నారు.

పిల్లలు, మహిళల మీద బులెట్లు మరియు పెల్లెట్లతో పాటు విపరీతమైన బలప్రయోగం చేయడం ఆమోదయోగ్యం కాదని రాజ్యసభలో జరిగిన చర్చలో బూర్జువా ప్రతిపక్షాలే అంగీకరించాయి. కాశ్మీర్‌లో ఏడాదిన్నరగా రగులుతున్న అగ్ని పర్వతం ఇప్పుడు లావాను విరజిమ్మిందని వర్ణించారు.

ముఖ్యంగా భద్రతా బలగాలు యువకులను మరియు పిల్లల మీద కేంద్రీకరిస్తూ పెల్లెట్స్ ద్వారా కంటి చూపు పోయేలా కాల్పులు జరుపుతున్నారు. అంటే యువతను నిర్మూలించడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో ఈ పథకం పన్నారు. ఈ దుర్మార్గ, కౄర మారణకాండకు సూత్రధారులు నరేంద్రమోడి, రాజనాథ్‌సింగ్, భద్రతా సలహాదారు అజిత్ దోబాల్, రక్షణ మంత్రి మనోహర్ పారికర్, హెూంశాఖ మరియు రక్షణ శాఖలోని ఇతర అధికారులు.

ఈ ఆందోళన సందర్భంగా కాశ్మీరులో అనధికారికంగా పత్రికలను కూడా మూత వేయించారు. ప్రజాస్వామ్యం పేరుతో పరమ ఫాసిస్టు పద్ధతులను అమలు జరిపినందుకు జర్నలిస్టుల యూనియన్‌లు కూడా ఈ చర్యలను ఖండించాయి. దేశంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు కాశ్మీర్ విషయంలో పోలీసు, మిలటరీ, ప్రభుత్వ దుష్ప్రచార ప్రకటనలు మాత్రమే ప్రచారం చేస్తూ కాశ్మీర్ పోరాటకారుల ప్రకటనలను ప్రచురించేందుకు ఏ మాత్రం వీలు కల్పించలేదు. మరో రకంగా ప్రభుత్వ దుష్ప్రచారంలో మీడియా కూడా మద్దతుగానే ఉంది. వేలాది మంది ప్రజలు కర్ఫ్యూను ధిక్కరించి సాయుధ మూకలతో బాహాబాహీ తలపడుతూంటే, దీనిని పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమాదమనీ, కొద్దిమంది చేసే టెర్రరిస్టు చర్యలని పి.డి.పి, బి.జె.పి ప్రభుత్వాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. 70 సంవత్సరాలుగా కాశ్మీర్ పోరాటం కొనసాగుతూనే ఉంది. పాలకవర్గాల స్వభావం స్పష్టంగా బహిర్గతం అయింది. బూటకపు ప్రజాస్వామ్యం, బూటకపు సెక్యులరిజాల గురించి దేశంలోని మేధావులు, ప్రజాస్వామికవాదులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇంత జరుగుతున్నా కాశ్మీర్‌లోని దళారీ రాజకీయ పార్టీల నాయకులు మాజీ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా నాయకత్వంలో డిల్లీకి వచ్చి రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలిసి కాశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు చర్చలు జరపాలనీ, శాంతియుత వాతావరణాన్ని ఏర్పర్చాలని కోరారు. ఆ తరువాతనే మరో 26 కంపెనీల బి.ఎస్.ఎఫ్ బలగాల్ని కాశ్మీర్‌కు తరలించారు. ప్రజలను మోసం చేయడానికి కంటి తుడుపుగా అఖిలపక్ష సమావేశం వేసి కాశ్మీరు పర్యటన నాటకం ఆడారు. అక్కడి బాధిత ప్రజలను కలిసి పరామర్శించలేదు. పైగా హురియత్ నాయకులపై నిందలతో కూడిన రెచ్చగొట్టే ప్రకటనలు రాజ్‌నాథ్‌సింగ్ చేసాడు.

చివరిగా మరింత ఫాసిస్టు పద్ధతులల్లో 11/9/2016న అజిత్ దోబాల్ మొదలయిన అధికారులతో సమావేశం నిర్వహించి కాశ్మీర్‌లోని విద్యార్థులను, యువతను నిర్మూలించే పథకాన్ని అమలు జరపమని మిలటరీ, పోలీసు అధికారులకు రాజ్‌నాథ్‌సింగ్ ఆదేశాలిచ్చాడు. వారం రోజులలోనే కాశ్మీర్‌లో శాశ్వత ప్రశాంతత రావాలని ఆదేశిస్తున్నాడు. ఇది మరింత దారుణమైన విషయం. దీనిని ప్రజాస్వామిక వాదులు, ప్రగతిశీల శక్తులు, దేశ భక్తులు, పీడిత ప్రజలు, ముక్తకంఠంతో ఖండించి హిందూ ఫాసిస్టుల కుట్రలను బహిర్గతం చేయాలి.

ఇటీవలనే బ్రిటన్ నుండి విడిపోవటానికి స్కాట్‌లాండ్‌లో రిఫరండం జరిపారు. 'బూర్జువా ప్రజాస్వామ్యం'లో ఏదైనా సమస్యకు పరిష్కారంగా రిఫరండం జరపడం ఒక సాధారణ విషయమే. ప్రజాస్వామ్యం అని గొంతు చించుకునే పార్టీలు కాశ్మీర్ సమస్యకు రిఫరెండం జరపాలనే డిమాండ్ పెట్టడానికి నోరు పెగలడం లేదు. అంటే మన దేశంలో ఉన్నది 'బూర్జువా ప్రజాస్వామ్యం'. ఇక్కడ దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వం కొనసాగుతున్నది. పాలకవర్గాలు సాయుధ అణచివేతను ప్రయోగించి సమస్యలకు అణచివేతనే సమాధానంగా ఎంచుకున్నారు.

ప్రపంచంలో పెట్టుబడిదారి-సామ్రాజ్యవాద వ్యవస్థ ఉనికిలోకి వచ్చిన తరువాత ఎక్కడా కూడా జాతుల స్వయం నిర్ణయాధికారం అమలు కాలేదు. జారు కాలంలో కూడా రష్యా 'జాతుల బందిఖానా'గా ఉండింది. బోల్షివిక్ విప్లవం తరువాత జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికార హక్కులు ఉన్నాయి. రష్యాలో విప్లవానికి ముందే జాతుల సమస్య పట్ల కమ్యూనిస్టు పార్టీ తన వైఖరిని స్పష్టం చేసింది. కమ్యూనిస్టు పార్టీలతో కలిసి ఆ జాతులు ఆ పోరాటంలో పాల్గొన్నారు. లెనిన్, స్టాలిన్‌ల కాలంలో జాతులకు విశేష ప్రతిపత్తినిచ్చి వారిని అభివృద్ధి చేసారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ మీద వారికి విశ్వాసం ఏర్పడి పార్టీ నాయకత్వంలోనే సోవియట్‌లో వారు కలిసి ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టుగా మారి 'నయా జారులు'గా మారిన తరువాత రష్యా నుండి జాతులు పోరాడి విడిపోయారు. ఇంకా కొన్ని జాతులు పోరాడుతున్నారు.

కాబట్టి కాశ్మీర్ సమస్య దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నంతకాలం పరిష్కారం కాదు. కేవలం కాశ్మీర్ సమస్యే కాదు. మిగిలిన సామాజిక వర్గాలైన ఈశాన్య జాతులు, ఆదివాసీలు, దళితులు, మత మైనార్టీలు, పీడిత ప్రజల సమస్యలు పరిష్కారం కావు. ఈ అధికార చట్రాన్ని మార్చడం ద్వారానే దేశంలోని జాతుల పీడిత ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దేశంలో సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ నాయకత్వంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో జాతుల పోరాటాలు కూడా భాగమై ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా పోరాడాలి. హిందూమతోన్మాదులు ప్రచారం చేసినట్లుగా అది ఉగ్రవాదం కాదు. హుర్రియత్ నాయకులు ఆ పోరాటం గురించి ఎప్పుడో స్పష్టం చేసారు. ఆ ఉద్యమం గుడులు, గోపురాలు కట్టాలని డిమాండ్లతో కొనసాగడం లేదు. అది ఒక రాజకీయ, ఆర్థిక, సాంఘిక ఉద్యమం. పాకిస్తాన్ ప్రేరేపితమైనది కాదు. మన పాలకవర్గాలు చేసేది అబద్ధపు ప్రచారాలు మాత్రమే. జాతులకు స్వయం నిర్ణయాధికార హక్కు ఉంటుంది (విడిపోయే హక్కుతో సహా). అది వారి జన్మహక్కు. ఇది ఎవరూ

కాదనలేని నిజం.

ప్రజాస్వామిక వాదులు, ప్రగతిశీల శక్తులు, దేశభక్తులు, విద్యార్థులు, మేధావులు, పీడిత ప్రజలు కాశ్మీర్ ప్రజల న్యాయమైన పోరాటాన్ని అర్థం చేసుకోవాలి. పాలకవర్గాల నిజస్వరూపాన్ని బట్టబయలు చేయాలి. ఈ క్రింద పేర్కొన్న ప్రజాస్వామిక డిమాండ్లతో కాశ్మీర్ ఉద్యమానికి మద్దతు నివ్వాలి.

➢ కాశ్మీర్‌లో రిఫరెండం జరపాలి.

➢ జనీవా ఒప్పందపు నియమాలను ఉల్లంఘించిన భద్రతా బలగాల మీద చర్యలు తీసుకోవాలి.

➢ బుర్హన్ వానీని కుట్ర చేసి చంపిన పోలీసు అధికారుల మీద చర్యలు తీసుకోవాలి.

➢ హుర్రియత్ నేతల మీద అమలు జరుగుతున్న గృహనిర్బంధాన్ని ఎత్తి వేయాలి.

➢ ఎన్‌కౌంటర్లు, అత్యాచారాల చేసిన భద్రతా బలగాల మీద న్యాయవిచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

➢ సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలి

➢ కాశ్మీర్ సంపదల మీద, ప్రకృతి వనరుల మీద హక్కు కాశ్మీరీలదే.

➢ విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికార హక్కు కాశ్మీరీలకు ఉన్నది.

➢ కాశ్మీర్ పోరాటం మీద హిందూమతోన్మాద ఫాసిస్టులు చేస్తున్న దుష్ప్రచార దాడిని ఖండించి కాశ్మీర్ పోరాటం గురించి సకారాత్మక ప్రచారం చేయాలి.

➢ బ్రాహ్మణీయ హిందూమతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టాలి.

➢ కుళ్ళిపోయి పతనమైపోతున్న పార్లమెంటరీ బూటకపు ప్రజాస్వామ్య వ్యవస్థకు బదులుగా ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించాలి.

➢ కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు వర్గాల – కార్మికులు, రైతాంగం, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల ప్రాతినిధ్యంతో కూడిన నూతన ప్రజాస్వామిక రాజ్యాలలో కాశ్మీర్, ఈశాన్య జాతులకు కూడా గౌరవ ప్రదమైన, స్వయం ప్రతిపత్తి కల్గిన స్థానం ఉంటుందని ప్రచారం చేయాలి.

➢ పతనపు అంచులకు చేరిన పెట్టుబడిదారి–సామ్రాజ్యవాద వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయం.

**విప్లవాభినందనలతో**

**ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి**

**రాజకీయ ప్రతినిధి**

**దేశబంధు**

❒

## సామ్రాజ్యవాదులు, అణుబాంబులు ఎన్నటికీ కాగితపు పులులే

**ఒక మహా రాక్షసుడిలా కనబడే అమెరికా సామ్రాజ్యవాదం, అంతస్సారంలో మరణ శయ్యపై పోరాటంలో వున్న కాగితం పులే. నేటి ప్రపంచంలో వాస్తవంగా ఎవరు ఎవరిని చూసి భయపడుతున్నారు? అమెరికా సామ్రాజ్యవాదానికి భయపడేది వియత్నాం ప్రజలు, లావోటియస్ ప్రజలు, కంబోడియన్ ప్రజలు, పాలస్తీనా ప్రజలు అరబ్బు ప్రజలు లేదా ప్రపంచంలోని ఇతర దేశాల ప్రజలు కాదు. అమెరికా సామ్రాజ్యవాదమే ప్రపంచ ప్రజలను చూసి భయపడిపోతోంది. గాలికి ఆకులు గలగలమనగానే, అది భీతిల్లి పోతోంది. ధర్మమైన ఆశయానికి పుష్కలంగా మద్దతు దొరుకుతుందనీ, అధర్మ ఆశయానికి స్వల్ప మద్దతు దొరుకుతుందనీ, ఒక చిన్న దేశం పెద్ద దేశాన్ని ఓడించగలదనీ అనేకానేక వాస్తవాలు రుజువు చేస్తున్నాయి. ఒక చిన్న దేశపు ప్రజలు పోరాటంలోకి దూకే సాహసం చేస్తే, ఆయుధాలను చేపట్టడానికి సాహసిస్తే, తమ దేశ భవిష్యత్తును కాపాడుకోగలుగుతారు. పెద్ద దేశ దురాక్రమణను ఓడించగలుగుతారు. ఇది చరిత్ర నియమం.**

**- కామ్రేడ్ మావో**

**(మావో రచనలు, 9వ సంపుటి, పేజి -410)**

# మోసపూరిత సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాల ముసుగును చీల్చుకొని పెల్లుబుకుతున్న విద్యార్థి ఉద్యమాలు 'సామాజిక చైతన్యాన్ని' సంతరించుకొని సాయుధ విప్లవోద్యమంలో భాగం కావాలని ఆశిద్దాం!

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫాసిస్టు మోడి ప్రభుత్వంలోని మంత్రులు, ఎ.బి.వి.పి, యూనివర్సిటీ వి.సి అప్పారావులు సంయుక్త దుర్మార్గపు ఫాసిస్టు చర్యల కారణంగా ప్రగతిశీల విద్యార్థి రోహిత్ వేముల మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి ప్రత్యక్షంగా కారకులైన మంత్రులు బండారు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ, ఎ.బి.వి.పి, వి.సి అప్పారావుల మీద కేసులు పెట్టాలని అరెస్టు చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆందోళన మొదలు పెట్టారు.

దీనికి మద్దతుగా దేశ వ్యాపితంగా యూనివర్సిటీల విద్యార్థులు ఈ ఆందోళనలోకి వచ్చారు. కలకత్తా, ముంబాయి, పూనే, ఢిల్లీ, చెన్నై, విశాఖ లాంటి నగరాల నుండి విశ్వవిద్యాలయ విద్యార్థులు సమన్వయంతో ఈ ఆందోళనను కొనసాగించారు. కొద్ది రోజులకు ఢిల్లీ జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయపు కొందరి విద్యార్థులపై దేశద్రోహం కేసు పెట్టి జైలుకు పంపించారు. ఈ రెండు సంఘటనలలోనూ పరిశోధనలు జరిగే చోట, పోలీసుల జోక్యం అవసరం లేని చోట, కనీసం బూర్జువా చట్టాలను కూడా ఉల్లంఘించి, విశ్వవిద్యాలయపు స్వతంత్రతను కూడా కాలరాచి, విద్యార్థుల మీద అణచివేత చర్యలు చేపట్టారు. వీరు ఊహించిన దానికి భిన్నంగా విద్యార్థి లోకం పోరాటంలోకి దిగింది. ఈ విధంగా చైతన్యపూర్వక పాత్రను నిర్వహిస్తూ పోరాటాన్ని కొనసాగించిన విద్యార్థి లోకానికి బోల్షివిక్ పత్రిక విప్లవ జేజేలు పలుకుతుంది.

ఇటీవల సమయంలో విద్యార్థులలో అసంతృప్తి, ఆందోళన పెరుగుతున్నాయి. ఇవి ఆగ్రహంగా మారుతున్నాయి. ఈ విషయాన్ని 2012లో వైద్య విద్యార్థిని 'నిర్భయ' పై జరిగిన అత్యాచారం-హత్యకు వ్యతిరేకంగా పెల్లుబికిన ఆగ్రహం దేశ వ్యాపిత పోరాటంగా మారి ప్రభుత్వ, పార్లమెంటరీ రాజకీయ పార్టీల స్వభావాలను బహిర్గతపర్చింది. ఆ పోరాటం మీద కూడా పాశవిక దమనకాండ కొనసాగింది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో కూడా విద్యార్థుల భాగస్వామ్యం 1960ల ప్రత్యేక తెలంగాణా ఉద్యమం నాటి రోజులను తలపింపజేసింది. మొత్తంగా చూసినప్పుడు విద్యార్థుల్లో పెరుగుతున్న ఆగ్రహం విద్యార్థుల పోరాటాలు దేశవ్యాపిత రూపాన్ని సంతరించుకోవడం హర్షనీయం. ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇది ఎటువైపు దారితీయవచ్చుననే విషయాన్ని మనం పరిశీలించవలసి ఉంది. అందుకు నేడున్న ఆర్థిక, రాజకీయ వ్యవస్థను ఒకసారి పరిశీలించాలి. దీనిలో జరుగుతున్న మార్పులను గమనించాలి.

1970ల చివర జార్జిరెడ్డి, సూరపనేని జనార్థన్ వంటి విద్యార్థి నాయకుల నేతృత్వంలో పెల్లుబికిన విద్యార్థి ఉద్యమం సమాజ, సమూల మార్పు దిశగా పురోగమించింది. దాన్ని పాలకవర్గాలు 1980ల చివరికి అణచివేసారు. తర్వాత పథకం ప్రకారం విద్యార్థులను సమాజ పరిశీలన నుండి దూరం చేసేందుకు కుట్రపన్నారు. ఇవి ముఖ్యంగా 1990 ప్రారంభం నుండి నూతన ఆర్థిక విధానాల పేరుతో సామ్రాజ్యవాద సంక్షోభం నుండి బయట పడేందుకు, విద్యార్థి మేధావి లోకాన్ని సమాజం నుండి దూరం చేసేందుకు పథకం వేసారు. ఈ విధానాల వలన దేశం అభివృద్ధి అవుతుందని చెప్పారు. నిరుద్యోగం సమాప్తం అవుతుందనీ చెప్పారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చి విద్యార్థులను సమాజం నుండి దూరం చేసారు. ప్రజల నుండి దూరం చేసేందుకు రకరకాల పద్ధతులు ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో కెరియరిజాన్నీ, వ్యక్తివాదాన్ని ప్రచారం చేసి పెంచారు. దీనికి తోడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లాంటి కోర్సులను మన దేశంలోకి తీసుకువచ్చి పెద్ద ఎత్తున కౌన్సిలింగ్ సెంటర్లను పెట్టి, ట్రెయినింగ్ ఇచ్చి విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలలో చేర్చి విద్యార్థుల సేవలను చౌకగా వాడుకున్నారు. కొంతకాలం పాటు ఈ ప్రభంజనం సాగి చతికిలబడింది. దీని నిజ స్వరూపం బయట పడసాగింది. మరోవైపు సామ్రాజ్యవాద విషసంస్కృతి కార్పోరేట్ సంస్థల ద్వారా కూడా మన దేశంలోకి వచ్చింది. హబ్-పబ్‌ల ద్వారా విచ్చలవిడితనం, బాధ్యతలేనితనం, మత్తు పదార్థాలకు బానిసలవ్వడం జరిగింది. ఈ సంస్థలలో 24 గంటలు చాకిరి చేసి పెద్ద మొత్తంలో డాలర్లు సంపాదించినప్పటికీ మానసిక అశాంతికి గురయ్యారు. కొత్త రకాల జబ్బులొచ్చాయి. మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోయి సెల్‌ఫోన్లు, కంప్యూటర్, ఇంటర్‌నెట్ చాటింగ్‌లతో పరిస్థితి మరింత విషమించింది. ఇది పూర్తిగా పతనస్థాయికి చేర్చింది. దీని విష ఫలితాలు ముఖ్యంగా మధ్య తరగతిని నష్టపరిచాయి. ఈ విధానాల దుష్ఫలితాలు దేశంలోని అన్ని వర్గాల ప్రజల మీద పడ్డాయి. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, చేతి వృత్తుల వారు, చిన్న వ్యాపారులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు ఈ విధానాల బారిన పడి నష్టపోతున్నారు. 2008లో సబ్-ప్రైమ్ సంక్షోభం ప్రపంచాన్ని కుదిపివేసిన తర్వాత ప్రజలలో మరింత అసంతృప్తి పెరిగింది. విద్యార్థుల్లో పెరుగుతున్న అసంతృప్తి వారిని పోరాటాలలోకి ఈడ్చింది. ఒకప్పుడు ప్రభుత్వాలు చెప్పిన మాటలను ప్రజలు ఇప్పుడు నమ్మే స్థితి పోయింది.

మరోవైపున సామ్రాజ్యవాద ముఠా నాయకుడు అమెరికా ప్రజాస్వామ్య రక్షణ గురించి మాట్లాడుతూ ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ వంటి సార్వభౌమ దేశాలపై 'టెర్రరిజం-వ్యతిరేక యుద్ధం' పేరుతో సైనిక దాడికి దిగింది. ఇంకా అనేక దేశాల అంతర్గత విషయాలలో సాయుధ జోక్యం చేసుకున్నది.

ప్రస్తుత పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ మరణశయ్యపై ఉన్నది. నేటి ప్రపంచ యుద్ధాలకు, ఆర్థిక సంక్షోభాలకు, రాజకీయ విప్లవాలకు గురవుతున్నది. ''సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయడం ద్వారానే సోషలిజానికి ప్రయాణించగలమని'' మహోపాధ్యాయుడు లెనిన్ చెప్పిన మాటలు నేటి ప్రపంచానికి అద్దం పడుతున్నవి.

ఈ నేపథ్యంలో మన దేశంలో ఈ విధానాలను వేగంగా అమలు జరపదలచుకున్నారు. గుజరాత్‌లో మోడి 2002లో నరమేధాన్ని జరిపి అసంతృప్తిని, పోరాటాలను అణచివేసి ఈ విధానాలను అమలు జరిపాడు. మరోవైపు మన్‌మోహన్‌సింగ్ సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేయలేకపోవడంతో సామ్రాజ్యవాదులకు మోడిని ఢిల్లీ గద్దెపై పెట్టవలసిన అవసరం ఏర్పడింది. మోడి ప్రధానమంత్రి అయితే గుజరాత్‌లో చేసినట్లుగా దేశవ్యాపితంగా సంస్కరణలను అమలు చేయగలుగుతాడని పాలక వర్గానికి నమ్మకం కుదిరింది.

బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు భావజాలం బి.జె.పి-ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతం. ఈ భావజాలం మన దేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజంతో విడదీయలేని విధంగా పెనవేసుకుపోయింది. ఎటువంటి అసమ్మతిని కూడా ఇది సహించదు. ఇది సామ్రాజ్యవాదానికి సేవ చేస్తుంది కనుక నయా ఉదారవాద విధానాలు వేగంగా అమలు జరపడానికి ఆర్.ఎస్.ఎస్‌ను, ఇతర కాషాయ మూకలను, అన్ని ప్రభుత్వ యంత్రాంగాలనూ తన అదుపులోకి తెచ్చుకొని వీటి అమలుకు పరుగులు పెడుతున్నారు.

హిందూ మత భావనను రెచ్చగొట్టి అన్ని కులాలలోని పేదలను తనవైపుకు త్రిప్పుకునేందుకు హిందుత్వాన్నీ, దాని చిహ్నాలను అన్ని రంగాలలోకి చొప్పించడం మొదలు పెట్టింది. ముఖ్యంగా భావజాల రంగంలో హిందుత్వాన్ని పటిష్టం చేయడం దానికి నేడు మరింత అవసరం. అయితే విద్యారంగం ముఖ్య ఆసరాగా ఉంటుంది. కనుక పాఠ్య పుస్తకాల మార్పిడిల దగ్గర నుండి మొదలుకొని విశ్వవిద్యాలయాల్లో, ఐ.ఐ.టి వంటి పరిశోధన సంస్థల్లో శాస్త్రీయ ఆలోచనను పెంచవలసిన చోట మూఢనమ్మకాలు, దేవుళ్ళు, దయ్యాలు, జోతిష్యం వంటి వాటిని బి.జె.పి పాలిత రాష్ట్రాలలో ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో దేశవ్యాపితంగా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు తీవ్రం చేసారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్.ఎస్.ఎస్ వ్యక్తులను వి.సిలుగా నియమిస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలను తొలగిస్తున్నారు. పరిశోధక విద్యార్థులకు యిచ్చే స్కాలర్‌షిప్‌లను తగ్గించటం, రద్దు చేయటం, హాస్టల్ సౌకర్యాలను రద్దు చేయుట, హిందుత్వానికి సంబంధించిన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించి మిగిలిన వారిని, ప్రగతిశీల విద్యార్థులనూ తొలగించటం, రద్దు చేయడం చేస్తున్నారు. ఇది అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను పోరాట మార్గం పట్టేలా చేస్తున్నది.

సైన్స్ కాంగ్రెస్, వర్క్‌షాప్, కాన్ఫరెన్స్ మొదలయిన కార్యక్రమాలకు ఆర్.ఎస్.ఎస్ వ్యక్తులను నియమించారు. ఈ సంస్థలలో జోక్యం చేసుకోవడం, నిధులను ఆపి వేయడం, మొదలయిన చర్యలకు నిరసనగా అనిల్ కకోద్కర్ లాంటి న్యూక్లియర్ సైంటిస్టులు నియమకాలు చేసే కమిటీల నుండి నిరసనగా తప్పుకున్నారు.

రక్షణ రంగంలో సైన్స్ టెక్నాలజీ రంగాలను నూరు శాతం విదేశీ సంస్థలకు అప్పజెప్పడం కోసం ముందుగానే వీటిని నిర్వీర్యం చేసేందుకు నిధులు ఆపివేసారు.

మరో వైపున హేతువాది, ప్రగతిశీల చరిత్రకారుడు, గొప్ప మేధావి ఎమ్.ఎమ్ కల్బుర్గి లాంటి వారిని ఫాసిస్టు సంస్థలైన విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్, భజరంగ్‌దళ్, రాంసేనలు దుర్మార్గంగా హత్య చేసి మిగిలిన వారిని బెదిరిస్తున్నారు. అంధవిశ్వాసాలు, పురాణాలు, మూఢనమ్మకాలను ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ కాషాయ మూకలు ప్రత్యక్షంగా ఆయుధాలు పట్టుకొని స్వైరవిహారం చేసినా చట్టాలు, కోర్టులు, పోలీసులు వీరిని ఏమి చేయకపోగా వారికే మద్దతుగా ఉంటున్నారు. ఈ పరిస్థితి ఒకప్పుడు యూరప్‌లో పోపులు, రాజులు కలిసి సైంటిస్టులను చంపి విజ్ఞానశాస్త్ర పురోగమనాన్ని అడ్డుకున్న వైనాన్ని తలపిస్తున్నది. మనది ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్యమనీ, దీనికి సెక్యులరిజం, ప్రజాస్వామ్యం ఆయువు పట్టులని చెప్పుకుంటూ నమ్మించే విఫల ప్రయత్నం చేస్తున్నారు.

నయా ఉదారవాదం ప్రజాస్వామ్యాన్ని మరింతగా లాంఛనప్రాయం చేస్తుంది. సారాంశంలో ఇది బూర్జువా నియంతృత్వమే. మన దేశంలో నైతే దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాల ఫాసిస్టు నియంతృత్వం అది మోసపూరిత పద్ధతుల్లో సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలను అమలు జరిపిస్తుంది. గతంలో పార్లమెంటులో చర్చలు జరిపి ఏవో కొన్ని చట్టాలు తయారు చేసినట్లు నటించేవారు. ఇప్పుడు ఆ అవసరం కూడా లేదు. నయా ఉదారవాదానికి పార్లమెంట్ల కంటే బ్యూరోక్రట్లు, టెక్నోసెట్స్ ద్వారా తయారు చేయించబడిన ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్ ఆర్థిక విధానాలు అమలు జరపాలి. అందువలన పార్లమెంటులో చర్చ జరిపి ఆమోదించినట్టు నటించవలసిన అవసరం లేదు. అందుకనే ఇప్పుడు పార్లమెంటు సమావేశాలు అల్లరి గోలతో ముగుస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్ పథకాలను అన్ని పార్టీలు ఆమోదించాయి. లోక్‌సభలో సగం మందికి పైగా దళారీ బూర్జువా వర్గం, మిగిలినవారు క్రిమినల్స్‌లే ఎక్కువ మంది ఉన్నారు. ఇటువంటి పార్లమెంటును మోడి ప్రజాస్వామ్యపు గుడి అని పొగుడుతున్నాడు. కాబట్టి ప్రభుత్వ విధానాలన్ని సామ్రాజ్యవాద వర్గాన్నీ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాన్నీ, భూస్వామ్య వర్గాన్ని బలోపేతం చేయడానికి అమలు జరుపుతున్నారు. భూస్వామ్య వర్గం గ్రామీణ ప్రాంతంలో సామ్రాజ్యవాదానికి సామాజిక పునాదిగా ఉండి పీడిత వర్గాల మీద, పీడిత కులాల మీద ఫాసిస్టు దాడులతో ఇదే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నది.

ఈ నేపథ్యంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోనూ, ఢిల్లీ జవహర్‌లాల్ నెహూ విశ్వవిద్యాలయంలోను మతతత్వ ఎ.బి.వి.పితో ఘర్షణ జరిగింది. విద్యార్థుల సమస్యల మీద, స్వేచ్ఛా, సమానత్వం మొదలయిన విషయాల మీద కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు చర్చించటం, అవగాహన పెంచుకోవటం దాని కనుగుణంగా కార్యాచరణను రూపొందించుకొని పురోగమించడం జరుగుతుంది. విశ్వవిద్యాలయాల్లో ప్రగతిశీల శక్తులు సంఘాల మీద దాడి చేసి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భావజాలాన్ని సంస్థలను బలోపేతం చేయాలనే దానిలో భాగంగానే విద్యార్థుల మీద దాడి జరిగింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినందుకూ, మరణశిక్షను వ్యతిరేకించినందుకు (ప్రపంచంలో మరణశిక్షను 144 దేశాల ప్రభుత్వాలు వ్యతిరేకించి సంతకాలు చేసాయి) వీరిని దేశద్రోహులని అదే సెక్షన్ కింద కేసు పెట్టి జైలుకు పంపించారు. చివరికి ఏకంగా విశ్వవిద్యాలయం నుండే సస్పెండ్ చేసారు.

మొత్తంగా చూసినప్పుడు ఇటీవల కాలంలో విద్యార్థులు అనేక సమస్యల మీద స్పందించారు. విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అప్పారావును అరెస్టు చేసిన సందర్భంలో విద్యార్థులు ఉద్యమించారు. ఢిల్లీలో ప్రొఫెసర్ సాయిబాబా (ఆర్.డి.ఎఫ్ ఉపాధ్యక్షుడు)ను అరెస్టు చేసినప్పుడు విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున కదిలారు. జె.ఎన్.యు విద్యార్థి హేం మిశ్రాను అరెస్టు చేసినప్పుడు ఆయన విడుదల కోసం డిఫెన్స్ కమిటీగా ఏర్పడ్డారు. తమిళనాడులోనూ, కేరళంలోనూ వామపక్ష కళాకారులను అరెస్టు చేసినప్పుడు విద్యార్థులు స్పందించారు. గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమించారు. తెలంగాణాలో జరిగిన వివేక్, శృతి, సాగర్ ఎన్‌కౌంటర్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

విద్యను సరుకుగా మార్చినందుకు, డబ్ల్యు.టి.ఒ ఒప్పందంపై సంతకాలు పెట్టినందుకు సేవ్ ఎడ్యుకేషన్ పేరుతో దేశ వ్యాపితంగా అనేక విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు-మేధావులు దీర్ఘకాలిక పోరాటాన్ని చేపట్టారు.

తెలంగాణా ఉద్యమంలో అపూర్వంగా స్పందించారు. తెలంగాణా ఉద్యమంలో ఎంతోమంది పోరాటంలో పాల్గొన్నారు. పోరాట క్రమంలో వారిలో కొందరు సమాజం పట్ల, సమాజ మార్పు పట్ల స్పష్టమైన అవగాహనకు వచ్చారు.

దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావాలి. సమాజాన్ని ప్రజాస్వామికం చేయాలి. ఆ విధంగా ఫాసిస్టు హిందుత్వ భావజాలాన్ని ఎదుర్కోగలం. దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, భూస్వామ్యవర్గం, తమ చేతుల్లో రాజ్యాధికారాన్ని పెట్టుకొని ప్రజాస్వామ్య నాటకాన్ని ఆడుతూ పబ్బం గడుపుతున్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో దోపిడీ వర్గాలను అధికారం నుండి కూలదోయకుండా రైతాంగ, కార్మిక, విద్యార్థి, మేధావి వర్గాలకు ప్రజాస్వామ్యం లభించదు.

ఈ ఉద్యమంలో కొందరు రోహిత్ చట్టం తేవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది విద్యార్థి ఉద్యమ స్థాయికనుగుణంగా లేదు. ఒక రకంగా ఉద్యమ వేడిని చల్లార్చుతుంది. పాలకవర్గాలకు నిమ్మలం చేకూర్చే విధంగా ఉంటుంది. ప్రస్తుతం విద్యార్థుల నుండి ముందుకు వచ్చిన 'నేరస్తులను శిక్షించడమే' సరైన డిమాండ్‌గా ఉంటుంది. ఈ డిమాండ్ ద్వారా పాలకవర్గాల అసలు స్వభావాన్ని బయట పెట్టవచ్చు. ఈ తక్షణ డిమాండ్‌తో విద్యార్థి లోకాన్ని సమీకరించి మిలిటెంట్ పోరాటం చేపట్టాలి. ఈ క్రమంలోనే వ్యవస్థ మౌలిక మార్పు కోసం ఆలోచించేలా కార్యాచరణకు పూనుకొనేలా సంఘటితం చేయాలి.

తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న వివేక్, శృతి, సాగర్ లాంటి విద్యార్థులు స్పష్టమైన అవగాహనను ఏర్పర్చుకొని సమాజ మార్పు కోసం విప్లవోద్యమంలోకి వచ్చారు. ఇప్పుడు వీరు అమరులై వేలాది మందికి ప్రేరణగా ఉంటూ మార్గదర్శకులయ్యారు.

రోహిత్ కుల పునాదులపై ఏర్పడ్డ బ్రాహ్మణవాద హిందూ భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ముఖ్యంగా దళితులపై గ్రామస్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు అమలవుతున్న అగ్రకుల వివక్షను తీవ్రంగా వ్యతిరేకించాడు, మధన పడ్డాడు. కాబట్టి విద్యార్థుల ముందున్న కర్తవ్యం ఏమిటి?

సమాజాన్ని ప్రజాస్వామికంగా మార్చినప్పుడే అందరికీ సమానత్వం దొరుకుతుంది. దాని కోసం ప్రస్తుతం ఉన్న రాజకీయ, ఆర్థిక వ్యవస్థను మార్చాలి. ఇది కఠినమైనది, కొంత సుదీర్ఘమైనది, మరొక తేలిక దారి లేదు.

అందువలన ఆనాటి భగత్‌సింగ్, అల్లూరి నుండి మొదలుకొని నేటి వివేక్, సూర్యం, శృతి, విద్యాసాగర్‌ల వరకు మనకు ఆదర్శమూర్తులుగా ఉన్నారు. వీరి మార్గంలో ప్రయాణించి మన కర్తవ్యాన్ని నెరవేర్చవలసిన పరిస్థితి మన ముందున్నది. అందువలన బండారు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ, వి.సి అప్పారావు మరియు ఎ.బి.వి.పి నాయకులను శిక్షించాలనే డిమాండ్‌తో పాటు విద్యార్థులు ఈ క్రింది కర్తవ్యాలను జోడించుకొని ఉద్యమాన్ని నడిపించాలి.

1. హిందూ ఫాసిస్టు శక్తుల వర్గ స్వభావాన్ని విద్యార్థులలో ప్రచారం చేసి బహిర్గతం చేయాలి.

2. మోడి ప్రభుత్వపు సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలను, విద్యను కాషాయికరించి మరింత 'సరుకుగా' మార్చే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మిలిటెంట్‌గా తీసుకుపోవాలి.

3. విద్యార్థుల్లోనూ, మేధావుల్లోనూ హేతువాద, శాస్త్రీయ ఆలోచనలు, సామాజిక చైతన్యం, వర్గ చైతన్యం గురించి అవగాహన కలిగించాలి.

4. కాషాయమూకల గూండాయిజాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైతే సాయుధమవ్వాలనే ఆలోచనను విద్యార్థుల్లో ప్రచారం చేయాలి.

5. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని గురించి, జనతన సర్కార్‌ల గురించి విద్యార్థులల్లో ప్రచారం చేయాలి.

6. ప్రస్తుత కుళ్ళిపోయిన వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయమని ప్రచారం చేయాలి.

మిగతా సెక్షన్లతో కలిసి ఐక్యమై ఐక్య పోరాటంగా కూడా పోరాటాన్ని ముందుకు తీసుకుపోవాలి. ఐక్య పోరాటాల్లో విద్యార్థులు కీలక పాత్ర నిర్వహించాలి.

**విప్లవాభివందనాలతో**

**ఎ.ఒ.బి-ఎస్.జెడ్.సి**

కరపత్రం

# అభివృద్ధి పేరుతో సామ్రాజ్యవాదుల దోపిడీకి రెడ్‌కార్పెట్ పరుస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్వాసిత ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 4, 5న ఎ.ఒ.బి వ్యాపితంగా తలపెట్టిన బందును విజయవంతం చేయండి!

*ప్రియమైన ప్రజలారా!*

మానవుడు చారిత్రక అవసరాలకోసం ప్రకృతిని ఉపయోగించుకోవడం విజ్ఞానం. అదే ప్రకృతిని వ్యాపార అవసరాల కోసం ధ్వంసం చేయడం అజ్ఞానం. చారిత్రక పరిణామంలో ఒకప్పుడు మొదటి దశలో వుండే మానవుడు ఇప్పుడు రెండవ దశలో ఉన్నాడు. అందులో భాగంగా అడవులు, నదీజలాలు, కొండలు, భూగర్భ సంపద ఒకట్రేమిటి ప్రకృతిని ఎన్ని విధాల ధ్వంసం చేయాలో అన్ని విధాలుగా ధ్వంసం చేసి అభివృద్ధి అంటున్నాడు. ఈ ప్రభావం సమాజంలోని ఆదివాసీలు, దళితులు, వెనకబడిన జాతులు, ఇతర మైనారిటీ ప్రజలు విధ్వంసమై వారి జీవితాలనూ, జాతులనూ, సంస్కృతిని అంతిమంగా ప్రకృతిని సర్వనాశనం చేస్తుంది. సంక్షేమ ప్రభుత్వాలమని చెప్పుకుంటున్న ఆధునిక ప్రభుత్వాలు కూడా ప్రపంచ వ్యాపితంగా ఈ విధ్వంసకర చర్యలకు పాల్పడటం ఎంతో ఆందోళన కలిగించే విషయం. భారత దళారీ పాలకవర్గాలు దేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో వున్న ఖనిజ సంపదను నీళ్ళనూ, భూమిని, సంపన్నవర్గాలకూ, దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తూ దోచిపెడుతూ ఆదివాసీలనూ, పీడిత ప్రజలను విస్థాపితులను చేస్తున్నాయి. ఆదివాసీల, పీడిత ప్రజల బతుకులు పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగానే పేదరికంలో మగ్గిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఫ్యూడల్ కాలం నుండి నేటి వరకు జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అధికారంకై పోరాడుతున్నప్పటికీ ఆదివాసీలు, పీడిత ప్రజలు అత్యంత దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.

సామ్రాజ్యవాదం తీవ్రమైన ద్రవ్య ఆర్థిక సంక్షోభంలో ఉంది. అది సంక్షోభంలో నుండి బయటపడేందుకు వెనకబడిన దేశాలలో ప్రకృతి వనరులతో పాటు శ్రమశక్తిని చౌకగా కొల్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. దానికి ఇంతకన్న ప్రత్యామ్నాయం లేదు. ఈ పరిస్థితికి అనుగుణంగానే మన దేశంలో దళారీ పాలకవర్గాలు మన దేశంలో అభివృద్ధి పేరుతో సామ్రాజ్యవాదులకు రెడ్‌కార్పెట్ (ఎర్ర తివాచీ) పరుస్తున్నారు. విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆహ్వానిస్తున్నారు. విదేశీ పెట్టుబడులకు లాభాలు చేకూర్చే పలు ఖనిజ నిక్షేపాలు, సముద్రతీరం చౌక శ్రమశక్తి (దేశ జనాభాలో 60 శాతం 35 సంవత్సరాలలోపు యువత ఉంది) భారతదేశంలో ఉన్నాయని ప్రకటిస్తున్నారు. అయితే 1947 నుండే ఈ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడుకుంటూ వస్తున్నారు. వీరు సామ్రాజ్యవాదానికి సాంఘిక పునాదిగా ఉన్నారు. వీరు 1947 నుండి అధికారంలో ఉంటూ సామ్రాజ్యవాదుల పరోక్ష పాలన, దోపిడీ ఆజమాయిషీలను దేశంలో అమలయ్యేలా దళారీ పాత్ర నిర్వహిస్తూ వస్తున్నారు. 1990ల తర్వాత సామ్రాజ్యవాదుల నయావలస దోపిడీ మరింత తీవ్రమయ్యింది. ఈ దోపిడీ దేశంలో 'సంస్కరణలు' నయా ఉదారవాద విధానాలైన ఎల్.పి.జి పేర్లతో కొనసాగుతున్నది. ఈ 25 ఏళ్ళ కాలంలో దేశం "అభివృద్ధి" చెందిందనీ, జి.డి.పి ముందెన్నడూ లేని స్థాయికి చేరిందనీ, మన్‌మోహన్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే ప్రస్తుతం కొంత వెనకబడిందని కాకి లెక్కలు చూపుతూ ప్రస్తుతం రెండవతరం సంస్కరణలు అమలు జరిపి దేశాన్ని 'వికాస్ భారత్'గా మలుస్తామని మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్నది.

గడిచిన 22 నెలల కాలంలో మోడీ 'అభివృద్ధి' పేరుతో చేసిందల్లా 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడమే. ఇందుకనుగుణంగా పర్యావరణ చట్టాలనూ, కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నాడు. రైల్వేలు, భీమా, రక్షణా రంగాలను ప్రైవేటీకరిస్తున్నాడు. లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలైన కోల్ ఇండియా, ఒ.ఎన్.జి.సి., హెచ్.పి.సీలలో ప్రభుత్వ వాటాలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు విక్రయిస్తున్నాడు. మాటలలో ప్రజలకు ప్రథమ సేవకుడినని చెప్పుకుంటూ సామ్రాజ్యవాదులకు, నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య శక్తులకు ప్రథమ సేవకుడిగా నిరూపించుకొన్నాడు. ముఖ్యంగా విదేశీ, దేశీయ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రూపొందిస్తున్న విధానాలను చట్టరూపంలో తెచ్చేందుకు రాజ్యసభలో మెజారిటీ లేకపోవడంతో ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించేందుకు ఆర్డినెన్సులు తెస్తున్నాడు. గడిచిన 22 నెలల కాలంలో దోపిడీ శక్తులకు అనుకూలంగా 8 ఆర్డినెన్సులు తెచ్చి తనది నిరంకుశ పాలన అని నిరూపించుకున్నాడు. మరోవైపు దేశ ప్రజలపై ప్రేమను ఒలకబోస్తూ స్వచ్ఛభారత్, మరుగుదొడ్ల పథకం, జన్‌ధన్‌యోజన లాంటి పథకాలను ప్రవేశపెడుతున్నాడు. అసలు దేశాన్ని కాలుష్యపూరితంగానూ, మురికికూపంగాను మార్చిన విదేశీ, దేశీయ సంస్థలపైగానీ, ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు లేకుండా దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేసిన పాలకవర్గాలనుగాని కించిత్ విమర్శించకుండా గొప్ప సంస్కర్తలాగా ఫోజులు కొడుతున్నాడు.

ఇక ఆంధ్రప్రదేశ్, ఒడిశా ముఖ్యమంత్రులైన చంద్రబాబు, నవీన్ పట్నాయక్‌లు 'అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్న తీరులో మోడీని మించి సామ్రాజ్యవాదులకు నమ్మిన బంట్లులా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరు విదేశీ పెట్టుబడుల కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. చంద్రబాబు ఏకంగా రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ పెట్టుబడుదారులను ఆహ్వానించాడు. వందల ఎకరాల అవసరం ఉన్న రాజధాని కోసం 33 వేల ఎకరాలు అవసరమని ప్రకటించి గుంటూరు, మంగళగిరి, విజయవాడ పరిసరాలలో 3 పంటలు పండే భూములను 'లాండ్ పూలింగ్' పేరుతో రైతుల నుండి బలవంతంగా లాక్కున్నారు. ఇట్లా స్వాధీనం చేసుకున్న మెజారిటీ భూమిని రియల్‌ఎస్టేట్ వ్యాపారం ద్వారా తాను, తన పరివారం వేలకోట్లు సంపాదించుకునే పథకాన్ని రూపొందించాడు. మరోవైపు పి.సి.పి.టి.ఆర్ (పెట్రో కారిడర్ పెట్రో ఇన్‌వెస్ట్‌మెంట్ రిజియన్) విశాఖ, కాకినాడ మధ్య గల లక్షల ఎకరాల భూమిని రైతుల నుండి చంద్రబాబు ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటున్నది. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పెట్రో కారిడర్ పరిశ్రమల వలన సముద్రతీరం కాలుష్యానికి గురవుతుందని మత్స్యకారులు ఆందోళన పడుతున్నా వేల సంవత్సరాలుగా తమ జీవనం కోసం ఆధారపడుతున్న భూమి తమ చేతుల నుండి జారిపోవడాన్ని రైతాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తూన్నా చంద్రబాబు మాత్రం ప్రజలపై పోలీసులను, గూండాలను పురిగొల్పి నిరంకుశ పద్ధతులలో భూములను స్వాధీనం చేసుకుంటున్నాడు. ఉత్తరాంధ్ర ప్రజల వ్యతిరేకతను నిపుణుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా ఉత్తరాంధ్రను అణు కుంపటిగా మార్చే కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ వద్ద ఏర్పాటు చేస్తుంది. ఇది చాలదన్నట్టు రష్యా సహకారంతో రాష్ట్రంలో మరో అణువిద్యుత్ పార్క్ ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ స్థాయిలో విమానాశ్రయం నిర్మించేందుకై 4 వేల ఎకరాల భూమిని రైతాంగం నుండి బలవంతంగా గుంజుకోవడానికి ప్రయత్నం చేస్తున్నది.

మన్యంలో '90ల నుండి పాలకవర్గాలు బాక్సైట్ గనులు తవ్వాలని ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రజల ప్రతిఘటనతో అది వాయిదా పడుతూ వస్తున్నది. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక మన్యంలో ఉన్న బాక్సైట్ గనులపై దృష్టి పెట్టి వాటిని తవ్వితీయడానికి సిద్ధపడ్డాడు. అనుకున్నదే తడవుగా

2015 నవంబర్ 5న జి.ఒ.ఎమ్.ఎస్ 97 అనే ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేయించాడు. ఆ ఉత్తర్వుల ప్రకారం 1,212 హెక్టార్ల మేర జర్రెల పరిసర ప్రాంతాల్లో మైనింగ్ జరుపుకోవడానికి అనుమతినిస్తూ ఆంధ్రప్రదేశ్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎ.పి.ఎమ్.డి.సి) కి అనుమతినిచ్చింది. దానితో విశాఖ మన్యం మొత్తం బగ్గుమంది. ఈ విధ్వంసకర ఉత్తర్వులపై సమరం పూరించారు. దీంతో చంద్రబాబు ఒక అడుగు వెనక్కు వేసాడంతే. కానీ పూర్తిగా కాదు. అందుకే ఈ జి.ఒను రద్దు చేస్తూ మరో జి.ఒ వచ్చేంతవరకు పోరాడాల్సిందే. అప్పుడు గానీ జరగబోయే మైనింగ్ ప్రమాదాన్ని ఆపలేం. పాలకవర్గాలు వేలాది మంది ఆదివాసీల జీవితాలను నిర్లక్ష్యం చేసి పోలవరం డ్యాం నిర్మించడానికి పూనుకుంది. ఈ డ్యాం నిర్మాణం వల్ల తెలంగాణాలో ఖమ్మం, ఎ.పిలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని 9 మండలాల్లో 276 గ్రామాలు ముంపుకు గురవుతాయి. 1లక్ష 20 వేల మంది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లాలో 25 గ్రామాలు మునిగిపోతాయి. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరికొన్ని గ్రామాలు మునిగిపోనున్నాయి. ఈ డ్యాం కోస్టల్ కారిడర్‌ను నిర్మించే సెజ్‌లు, సాఫ్ట్‌వేర్ సోర్సులకు అవసరమైన నీటిని అందించేందుకు నిర్మిస్తున్నారు. తమ యజమానులైన సామ్రాజ్యవాదుల దేశీయ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చడంలో చాంపియన్‌లా వ్యవహరిస్తున్నారు. ఇంకా పారిశ్రామిక పార్కులు, థర్మల్ ప్లాంట్లు, అణువిద్యుత్ కేంద్రాలు, గనులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, కోస్టల్ కారిడర్‌లు, పెట్రో కారిడర్‌లు, విమానాశ్రయాల పేరుతో లక్షలాది ఎకరాల భూమిని ఆదివాసీలు, రైతాంగం, పట్టణ, పేద, మధ్య తరగతి ప్రజల నుండి బలవంతంగా గుంజుకొని కారుచౌకగా బహుళజాతి సంస్థలకు దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి అప్పనంగా అప్పజెపుతున్నాడు. లక్షల మంది ఆదివాసీలను పీడిత రైతాంగాన్ని పట్టణ, పేద మధ్య తరగతి ప్రజలను నిర్వాసితులను చేసి వాళ్ళ జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాడు.

ఇక ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సామ్రాజ్యవాదులకు దళారీగా వ్యవహరించడంలో అందరికంటే ముందున్నాడు. ప్రకృతి వనరులు దండిగా ఉన్న ఒడిశా రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదుల దోపిడీకి ఒక నిలయంగా మార్చాడు. గత 20 సంవత్సరాల కాలంలో డ్యాంలు, పరిశ్రమలు, గనులు, ప్రాజెక్టులు వలన 10 లక్షల హెక్టార్ల భూమి అన్యాక్రాంతం కాబడ్డది. స్వాతంత్రానంతరం అధికారంలోకి వచ్చిన దళారీ పాలకవర్గాలు భారీ ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలతో పోల్చుతూ అనేక భారీ డ్యాంల నిర్మాణం చేసారు. అందులో భాగంగా 1956 లో మాచ్‌ఖండ్ డ్యాం నిర్మాణం జరిగింది. సుమారు 10వేల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. తదనంతరం 1964లో బలిమెల డ్యాం నిర్మాణం చేసారు. దాదాపు 12వేల మంది ఆదివాసీలు నిరాశ్రాయులయ్యారు. ఏ ఒక్కరికి పునరావాసం కల్పించబడలేదు. కేవలం 160 రూపాయల చొప్పున ఒక్కొక్కరి చేతిలో పెట్టి వెళ్లగొట్టారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్, కలహండి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఇంద్రావతి నది మీద నిర్మించిన ఆనకట్ట మూలంగా అక్కడి స్థిరనివాసులైన 'పొరజ' తెగకు చెందిన 65 గ్రామాలు ముంపుకు గురయ్యాయి. 2001 నుండి 2012 మధ్యలో నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం దేశ విదేశీ కంపెనీలతో 97 ఎమ్.ఒ.యులను కుదుర్చుకున్నాడు. 2012 మార్చి నాటికి 54 కంపెనీలకు 35,793.498 ఎకరాల భూమికి అనుమతులు ఇచ్చింది. దీనిలో 25,012.498 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు 10,741.157 ఎకరాల భూమి ప్రభుత్వం తన దగ్గర పెట్టుకుంది. రాష్ట్రంలో బాక్సైట్ నిలువలు 1,808.81 మిలియన్ టన్నులు ఉంది. వివిధ కంపెనీలు 74.61 మిలియన్ టన్నులు చొప్పున సంవత్సరానికి తవ్వితే 24 సంవత్సరాలలో బాక్సైట్ మిగలకుండా పోవడం ఖాయం. 1995 నుండి 2005 వరకు దేశంలో గనుల కోసం లక్ష హెక్టార్లు ధ్వంసమైతే, ఒక ఒడిశా రాష్ట్రంలోనే 25 వేల హెక్టార్ల అడవి ధ్వంసమైంది. స్వాతంత్రానికి పూర్వం 47 శాతం అడవి వుండేది. ప్రస్తుతం 17 శాతం మాత్రమే ఉంది. ఒడిశాలో విస్తాపిత సమస్య రోజురోజుకి తీవ్రతరమవుతోందనడానికి పైన తెలిపిన గణాంకాలే నిదర్శనం.

ఇప్పటికే కళింగనగర్‌లో టాటాలు నిర్మించతలబెట్టిన ఉక్కు పరిశ్రమను అడ్డుకున్న ఆదివాసీలపై తన పోలీసుల ద్వారా కాల్పులు జరిపి 9 మందిని హత్యగావించాడు. పోస్కో ఉక్కు పరిశ్రమను వ్యతిరేకిస్తున్న ప్రజలపై తీవ్రమైన దమనకాండను అమలు జరుపుతున్నాడు. మాలి, దేవమాలి, చేరుబంద, నియంగిరి, పర్వతాలపై బాక్సైట్ గనులు వెలికితీయాలనీ, దంగుదేవుళలో ఉన్న చైనా క్లే మట్టిని తవ్వి అక్కడి ఆదివాసీ ప్రజలను విస్తాపితుల్ని చేసే ప్రయత్నాన్ని అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు.

ఇక దేశం అభివృద్ధి చెందడమంటే వారి దృష్టిలో దోపిడీవర్గాలు వారి అవసరాలు తీర్చే నిపుణులు జీవించేందుకు అవసరమైన పార్కులు, హైస్పీడ్ రైళ్ళు, ఓడరేవులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ విలేజస్, కోస్టల్, పెట్రో కారిడర్లు నిర్మించడమనేదే. ఈ అభివృద్ధిని మరింతగా సాధించేందుకు మోడీ, చంద్రబాబు, నవీన్, చంద్రశేఖర్‌రావు ఇంకా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోటీ పడుతున్నారు.

వాస్తవంగా ఈ 25 ఏళ్ళ కాలంలో నయా ఉదారవాద విధానాల పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థనూ, రాజకీయాలనూ, సంస్కృతిని రక్షణరంగాన్ని సామ్రాజ్యవాదులు నియంత్రించడం పెరిగింది. ప్రభుత్వ కీలక విధానాలన్నింటిని వారే నిర్ణయిస్తున్నారు. సహాయం, రుణం పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను వారి ద్రవ్య సాలెగూటిలోకి ఇరికించారు. సలహాదారులు, నిపుణుల పేరుతో ప్రభుత్వ శాఖలపై పట్టు పెంచుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సామాజిక అవసరాలలో రాజ్యం ఉపసంహరణ చాలా సాధారణమైపోతుండగా మానవ కార్యకలాపాలన్నింటిని 'సామ్రాజ్యవాద మార్కెట్' నిర్దేశిస్తున్నది.

దేశ ప్రయోజనాలకూ, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఈ 'సోకాల్డ్ అభివృద్ధి'ని ప్రజలంతా వ్యతిరేకించాలి. ఈ దేశ దోపిడీ పాలకులైన మోడీ, చంద్రబాబు, నవీన్‌పట్నాయక్, ఇతర రాష్ట్రాల నేతలు దేశంలో అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను దానితో విడదీయలేనంతగా పెనవేసుకుపోయిన కులపీడన, బ్రాహ్మణవాదాలను కాపాడేందుకు కంకణం కట్టుకున్నవారే. సామ్రాజ్యవాదులకు సేవ చేయడంలో ముందుపీఠిన నిలుచున్నవారే.

కనుక దేశంలో భూస్వాముల నుండి రైతాంగ విముక్తి కోసం ప్రజాస్వామిక విప్లవాన్ని సామ్రాజ్యవాదుల నుండి దేశ విముక్తి కోసం జాతీయ విముక్తి యుద్ధాన్ని నిర్వహించాలి. అందుకనుగుణంగా దున్నేవారికే భూమి ప్రాతిపదికన సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కావాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము. ముఖ్యంగా ఈ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా, ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా మే నెలంతా నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, రాస్తారోకోలు, కాగడాల ప్రదర్శనలు, దిష్టిబొమ్మల దగ్ధం వంటి పలు రూపాల్లో ఉద్యమించాల్సిందిగా ఆదివాసీ, దళిత, పర్యావరణ, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి యువజనులు మొదలైన వారందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సందర్భంగానే మే 4, 5 తేదీలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎ.ఒ.బి వ్యాపితంగా మావోయిస్టు పార్టీ తలపెట్టిన 'బంద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ప్రజాస్వామిక వాదులకూ, అన్ని సెక్షన్ల ప్రజలకూ విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఎ.ఒ.బి.-ఎస్.జడ్.సీ**

**సిపిఐ. (మావోయిస్టు).**

❒

## బోల్షివీకరణ క్యాంపెయిన్ అనుభవాలు-2

# గడ్డు పరిస్థితుల్లో ప్రజల్ని అంటిపెట్టుకోవడం, ప్రజలపై ఆధారపడటం ద్వారానే అనుకూల పరిస్థితులను సాధించగలమని నిరూపించిన నారాయణపట్నా కామ్రేడ్స్ !

ఒడిశాలో కోరాపుట్ జిల్లా నారాయణపట్నాలో 2009లో జరిగిన భూపోరాటం ఆ ప్రాంతంలోని కువ్వి ఆదివాసీ ప్రజల గొప్ప పోరాట శక్తిని, తెగువను చాటి చెప్పింది. తరతరాలుగా ఆదివాసేతర భూస్వాములు, షావుకార్లు, కాంట్రాక్టర్లు, ప్రభుత్వ, ఫారెస్ట్ అధికారుల దోపిడీ దౌర్జన్యాల కింద నలిగిపోతూ, వెట్టి చాకిరి చేస్తూ, సాంఘికంగా, రాజకీయంగా అసమానతలకూ, అత్యాచారాలకు గురవుతూ, గ్రామాలలో తెగ పెత్తందార్ల పెత్తనం, ఆజమాయిషీతో తమకంటూ స్వేచ్ఛా, స్వతంత్రత లేకుండా అత్యంత దుర్భరమైన బానిస జీవితాన్ని గడిపిన ప్రజలు ఆ ప్రాంతంలో మన పార్టీ వచ్చాక పార్టీ రాజకీయాలతో చైతన్యవంతులయ్యారు. సంఘటితమయ్యారు. దారిద్ర్యం, ఆకలితో అలమటిస్తూ బానిసలుగా లొంగి వుండటం కన్న మనుషులుగా జీవించడం కోసం పోరాడక తప్పదని అర్థం చేసుకున్నారు. అలా ఆనాడు వేలాది మంది ఆదివాసీలు కదిలి భూముల్లో ఎర్రజెండాలు పాతి దోపిడీ వర్గాల వెన్నులో వణుకు పుట్టించారు. సారాను మొత్తం బంద్ చేసారు. ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని స్తంభింపచేసారు. తెగ పెత్తందార్లు సైతం సంఘం ముందు తలవంచక తప్పలేదు. మన పార్టీ నాయకత్వంలో "దున్నే వారికే భూమి, సంఘాలకే సర్వాధికారాలు" అనే నినాదాలతో స్వాధీనం చేసుకున్న భూములను పంచుకొని స్వేచ్ఛగా సాగు చేసుకున్నారు. విప్లవ ప్రజా కమిటీలు పెట్టుకొని విప్లవకర భూ సంస్కరణలు, అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలలో మార్పు తీసుకురావడానికి ఎంతో కృషి చేసారు.

ఈ క్రమంలో ప్రజల పోరాట ఫలాన్ని ప్రజలకు దక్కనీయకుండా దోపిడీ వర్గాలు తిరిగి ప్రజలపై తమ అధికారాన్నీ, ఆధిపత్యాన్ని నెరపడం కోసం ఆదివాసేతర భూస్వాములు, షావుకార్లు, స్థానిక తెగ పెత్తందార్లు, ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు అంతా కలిసి కుమ్మక్కై నారాయణపట్నా ప్రాంతంపై కేంద్రీకరించి బహుముఖ, ఫాసిస్టు దాడిని తీవ్రతరం చేసారు. క్రూరమైన పోలీసు నిర్బంధంతో ప్రజలనూ, ఉద్యమాన్నీ అణచివేయడానికి తీవ్రమైన కృషి చేస్తున్నారు. పోలీసు జులుంకు వ్యతిరేకంగా 2009 నవంబర్ 20న నారాయణపట్నా పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్ళిన ప్రజలపై కాల్పులు జరిపి సింగన్న, ఆండ్రూలను హత్య చేసిన సంఘటన నుండి మొదలు పెడితే ఇప్పటివరకు ఆ ప్రాంతం పైన, ప్రజల పైన పోలీసులు చేసిన దాడులు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు, ఇండ్ల కాల్చివేతలు, వంటల ధ్వంసం, వందల సంఖ్యల్లో సంఘనాయకులనూ, కార్యకర్తలను అరెస్టు చేసి జైళ్ళలో నిర్బంధించడం వంటి అమానుషమైన చర్యలతో ప్రజలను తీవ్రమైన మానసిక ఒత్తిడికీ, చిత్రహింసలకూ, భయాందోళనలకు గురిచేసారు. మరోవైపు ఆనాడు భూపోరాటానికి నాయకత్వం వహించిన నాచిక లింగ ఈ కఠిన పరిస్థితులలో శత్రు దాడిని సాయుధంగా ఎదుర్కొనే సంసిద్ధత లేక దోపిడీ వర్గాలతో రాజీ వైఖరిని అవలంబించాడు. స్వార్థంతో, మితవాద, అవకాశవాద రాజకీయాలతో ప్రజల పోరాట చేవనూ, మిలిటెన్సీని పక్కదారి పట్టించాడు. పార్లమెంటరీ పంథాపై ప్రజలకు భ్రమలను కల్పించాడు. నారాయణపట్నా ఉద్యమం ఒక గొప్ప మలుపు తీసుకోవాల్సిన సమయంలో తమ భూముల కోసం భూస్వాములకు వ్యతిరేకంగా తిరగబడిన ప్రజల చైతన్యాన్ని పెంచి మరింత మిలిటెంట్‌గా సాయుధ పోరాటంలోకి తీసుకురావల్సిన సమయంలో నాచిక లింగ రాజకీయాలు ప్రజలను గందరగోళానికి గురి చేసాయి. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న నారాయణపట్నా ఉద్యమానికీ, ప్రజలకూ ద్రోహం చేసాయి. ఈ పరిస్థితిని దోపిడీ వర్గాలు మరింత అనుకూలంగా ఉపయోగించుకున్నారు. ప్రజాయుద్ధ మార్గంలో ప్రజలు సాధించుకున్న విజయాలను వమ్ము చేసేందుకు 'లొంగుబాటు విధానాన్ని' ఒక ప్రముఖ ఎత్తుగడగా తీసుకువచ్చారు. లొంగుబాటు ద్వారా చేకురే బానిసత్వాన్ని 'శాంతి', 'అభివృద్ధి'గా అభివర్ణిస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు దోపిడీ ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రంగంలోకి దిగి 'జన సంపర్క్ శిబిర్'ల పేరుతో పోలీసు సంస్కరణలను అమలు చేయడంతో పాటు మన పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశారు. పుకార్లు సృష్టించి ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించారు. పార్టీ నుండి ప్రజలను దూరం చేసి, విప్లవానికి వ్యతిరేకంగా ప్రతిఘాతుక విప్లవాన్ని వ్యాపింపజేసి సమూలంగా విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో ఎల్.ఐ.సి వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా 2013 ప్రారంభం నుండి నారాయణపట్నాలో లొంగుబాటు విధానాన్ని అత్యంత పకడ్బందీగా, పథకం ప్రకారం ప్రారంభించారు. ముందుగా భూ పోరాటానికి నాయకత్వం వహించిన 'కోర్' ను (ఏరియా, పంచాయితీ, గ్రామస్థాయి సంఘ నాయకత్వం, ఆర్.పి.సి అధ్యక్షులు) నయాన, భయానా లొంగదీసుకున్నారు. ఇందులో గ్రామ పెత్తందార్లు తిరిగి తమ ఆధిపత్యం కోసం ప్రముఖ పాత్ర పోషించారు. 3, 4 నెలల పాటు వరుసగా నారాయణపట్నా బ్లాక్‌లోని 9 పంచాయితీల్లో మెజారిటీ గ్రామాలను సరెండర్ చేసుకుని, "ప్రజలు శాంతిని, అభివృద్ధిని కోరుకుంటున్నారు, మావోయిస్టుల హింసను వ్యతిరేకించి లొంగిపోతున్నారు" అని పెద్ద ఎత్తున ప్రచారం చేసారు. ఈ లొంగుబాటు పథకాన్ని ప్రారంభించేందుకు కొద్ది ముందు అంటే 2013 జనవరిలో ఒక ఇన్‌ఫార్మర్ ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో మన నాయకత్వాన్ని టార్గెట్ చేసి పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో ఏరియా డామినేషన్ ఆపరేషన్ చేసారు. ఆ సందర్భంగా ఒక చోట ఫైరింగ్ జరిగినప్పటికీ ప్రజల, పి.ఎల్.జి.ఎల మద్దతుతో మన నాయకత్వం ఈ ఆపరేషన్ నుండి క్షేమంగా బయటపడింది. ఆ తర్వాత మన పార్టీ సంస్థాగత పనుల రీత్యా వేరే ప్రాంతానికి వెళ్ళాల్సి రావటంతో 4 నెలల పాటు నారాయణపట్నా ఏరియా మొత్తం ఖాళీ అయ్యింది. (ఈ కాలంలోనే సరెండర్స్ జరిగాయి) దీంతో

మావోయిస్టులు పారిపోయారనీ, ఇక ఆ ప్రాంతంలో పార్టీ లేదనీ, ఇక రాదని జరిగిన ప్రచారంతో పాటు నిర్బంధ పరిస్థితుల్లో స్థానిక నాయకత్వం దృఢంగా నిలబడలేకపోవడంతో ప్రజల మనోబలం దెబ్బతిన్నది. అదే విధంగా మరోవైపు లొంగిపోయిన సంఘ నాయకులనూ, మిలీషియా కమాండర్లను మావోయిస్టులు చంపుతారని, కనుక వాళ్ళంతా గ్రామాల్లో ఉండకుండా నారాయణపట్నా రావాలనీ, ఎస్.పి.ఒ, హోంగార్డు ఉద్యోగాలు కల్పిస్తామనే ప్రచారం కూడా పోలీసులు చేసారు. ఇదిలా వుండగానే 2013 జూన్‌లో మనం సిక్కు, జాడూ అనే ఇద్దరు ఇన్‌ఫార్మర్లను చంపాం. మరికొంత మందిని ఇంటరాగేషన్ చేసి వదిలిపెట్టాం (వీళ్ళంతా సంఘాలలో పని చేసి లొంగిపోయి ఇన్‌ఫార్మర్‌గా మారినవాళ్ళు). ఆ నాటి పరిస్థితులలో ఈ సంఘటనలు శత్రువు చేస్తున్న దుష్ప్రచారానికి మరింత బలాన్ని చేకూర్చాయి. మన కున్న అననుకూలతల రీత్యా ఆ ఇన్‌ఫార్మర్లను ప్రజల్లో, తగినంత బహిర్గత పర్చకుండానే చంపాం. దీన్ని ఆసరా చేసుకుని శత్రువు సృష్టించిన పుకార్లు ప్రజల్లో గందరగోళాన్ని, భయందోళనలను కలిగించాయి. చాలా మంది ముఖ్యమైన సంఘ నాయకులు, మిలీషియా సభ్యులూ గ్రామాలు విడిచి పారిపోయారు.

ఈ పరిణామాలు మనకు గ్రామాలనూ, ప్రజలనూ కలవటంలో చాలా ప్రతికూలతలు సృష్టించాయి. సరెండర్ల కారణంగా ఎవరిని నమ్మాలో, ఎవరి మీద ఆధారపడాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అనేక గ్రామాల్లో ప్రజలు మనల్ని చూసి భయంతో దాక్కోవడం, పారిపోవడం, సహకరించకపోవడం వంటి చేదు అనుభవాలు ఎదురయ్యాయి.

ఒక రోజు 'ఎక్స్' అనే గ్రామ పరిసరాల్లో మన దళం మకాం వేసింది. ఉదయం ఊరిని కాంటాక్ట్ చేసి ఆహారం తీసుకురావడం కోసం ఒక ఏ.సి మెంబర్ ఊరికి వెళ్ళారు. దారిలో కొండపోడులో పని చేసుకుంటున్న ప్రజలు దూరం నుండే చూసి గుర్తుపట్టి ఆ కామ్రేడ్‌ను కలవకుండా క్షణాల్లో మాయమైపోయారు. గ్రామంలోకి వెళ్ళేటప్పటికి ఎవరూ లేరు. వున్న ఒకరిద్దరు ముసలివాళ్ళు పలకరించినా మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయి బయటకు రాలేదు. ఎందుకలా జరుగుతుందో, ఏమయ్యిందో అర్థం కాక, ఎన్నో పోలీసు డామినేషన్లలో దళాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్న ఈ గ్రామ ప్రజలు ఇప్పుడెందుకిలా వున్నారో అర్థం కాక మన కామ్రేడ్ అతి కష్టం మీద ఒక పాకలో కొంచెం సోడిపిండి, ఉప్పు సంపాదించుకొని తిరిగి దళం వద్దకు వచ్చి విషయం చెప్పాడు. జరిగిన దాంతో అతడి ముఖం బాధ, అవమానం, ఆవేదనతో నిండి వుండటం అందరూ గమనించారు. ఇక అప్పుడు చేసేదేమిలేక రాత్రికి గ్రామంలోకి వెళ్ళి మాట్లాడామని నిర్ణయించుకొని దళం ఆ రోజంతా ఆ కొద్ది పిండితో జావ చేసుకుని తాగి వుంది. దళంలో కొద్ది మంది పేషెంట్స్ కూడా వుండటంలో వాళ్ళను మకాంలోనే వదిలి ఒక చిన్న టీం గ్రామంలోకి వెళ్ళింది. ఎప్పుడూ లేనిది ఆ రోజు 7 గంటలకే గ్రామం నిశ్శబ్దంగా వుంది. ఎవరూ బయట లేరు. అందరూ తలుపులు వేసుకుని లోపల వున్నారు. ఇంటింటికీ తిరిగి తలుపులు కొట్టి ఎంత పిలిచినా ఎవరూ తలుపులు తీయలేదు. బయటకు రాలేదు. ఆ గ్రామానికి దళం వస్తే ఊరు ఊరంతా దళానికి చేతులు కలుపుతూ ఎంతో సందడిగా కోలాహలంగా వుండేది. కానీ ఆ రోజు ప్రజలతో కలిసి ఆటలాడి, పాటలు పాడి, ఎన్నో మీటింగులు, చర్చలు చేసిన స్థలం ఊరి మధ్యలో బోసిపోయి మౌనంగా వుంది. ఎంతో ఆకలితో ఉండి ఊరికి వెళితే అన్నం దొరుకుతుందని ఆశించిన దళ సభ్యులకు ఎదురైన ఈ పరిస్థితి ఎంతో కష్టంగా వుంది. ఎంతో ప్రయత్నించిన తరువాత చివరకు ఒక 'డొంబ' కుటుంబం మాత్రం భయంగానే తలుపులు తీశారు. ఎందుకలా జరుగుతుంది ? ఊర్లో ఏమయ్యింది ? అని అతడిని చాలా ఓపిగ్గా, భయపడవద్దని అనేక రకాలుగా ప్రశ్నించిన తరువాత "గ్రామంలో పార్టీ పేరుతో ఒక పోస్టర్ వేశారనీ, అందులో గ్రామం సరెండర్ అవటానికి బాధ్యులైన సంఘ నాయకుడినీ, మిలీషియా వాళ్ళనూ, పెద్దమనుషులను చంపుతామనీ, సరెండర్ అయినందుకు గ్రామం పార్టీకి క్వింటాల్ బియ్యం, కోళ్ళు, డబ్బులు తప్పుగా కట్టాలని (ఫైన్) రాసి వుందనీ, అందుకని ఆ విషయంలో ఊరంగా మీటింగ్ చేసుకున్నారనీ, పార్టీ వాళ్ళు వస్తే ఎవరు బయటకు రాకూడదు, మాట్లాడకూడదు, సహకరించకూడదు, ఒకవేళ ఏదైనా పరిస్థితుల్లో గ్రామంలో పార్టీ ఎవరినైనా పట్టుకుంటే అందరూ తిరగబడాలని మీటింగ్ జరిగింది" అని చెప్పాడు. ఈ మీటింగ్ ఎవరు చేశారు అంటే అది మాత్రం చెప్పలేదు. మన పార్టీ అలాంటి పోస్టర్లు ఏమి వేయలేదనీ, అదంతా గ్రామంలోనే ఎవరో పార్టీకి వ్యతిరేకంగా సంఘ నాయకత్వాన్ని భయపెట్టి, గ్రామం నుండి వెళ్ళగొట్టడానికి చేస్తున్న దుష్ప్రచారం అనీ, దాన్ని నమ్మవద్దనీ, ఈ విషయాన్ని ఊర్లో చెప్పమని అతడికి చెప్పి వెళ్ళిపోయింది. ఊర్లోకి వెళ్ళిన వాళ్ళు అన్నం తెస్తారని ఎంతో ఆకలితో, ఆశగా ఎదురుచూస్తున్న మకాంలో ఉన్న కామ్రేడ్స్‌కు నిరాశే మిగిలింది. ఆ రాత్రి దళం ఆకలితో పడుకుంది. జరిగిన దాన్ని దళం సమీక్షించుకుని వెంటనే చేసేదేమి లేదు కనుక జరిగిన విషయాన్ని శత్రువు దుష్ప్రచారాన్ని వాస్తవాలను మన వాయిస్‌గా ఒక పెద్ద పోస్టర్ రాసి ఊర్లో అతికించి వెళ్ళిపోయాం.

మరో రోజు 'వై' అనే గ్రామానికి అటవీ ప్రాంతం కావటం, ప్రయాణానికి అనుకూలంగానే ఉండటంతో బోరున కురుస్తున్న వర్షంలో పగలే వెళ్ళాం. దళం గ్రామంలోకి ప్రవేశించకముందే దూరం నుండే దళాన్ని చూసిన గ్రామస్తులు దళం చూస్తుండగానే వర్షంలోనే తలోదిక్కు పారిపోయారు. ఊర్లోకి వెళ్ళేటప్పటికి ఒక్క పురుషుడు కూడా లేడు. మహిళలు, ముసలివాళ్ళు, చిన్న పిల్లలు మాత్రమే ఉన్నారు. అప్పటికే ఇలాంటి అనుభవం ఎదురయ్యివున్న దళం ఈ సారి పరిస్థితిని అర్థం చేసుకుని గ్రామంలో వున్న వాళ్ళందరిని అతి కష్టం మీద ఒక చోటుకి చేర్చి కూర్చోబెట్టి మాట్లాడింది. ఒకప్పుడు ఆ ప్రాంతంలో సుండి భూస్వాములను తరిమేసి, భూములు స్వాధీనం చేసుకున్నాక గ్రామానికి వచ్చిన దళానికి పూలమాలలు వేసి, బాజాలు వాయించి, ఊరేగించిన ప్రజలు, ఎప్పుడో ఒకసారి తాము తినే గొడ్డు మాంసాన్ని, తాము పండించిన కూరగాయలను దళం కోసం ఒక వాటా దాచిపెట్టి ఎదురు చూసిన వాళ్ళు, తాము జావ తాగినా దళానికి అన్నం పెట్టిన ఆ గ్రామ ప్రజలు ఆ రోజు దళం ముందు మౌనంగా, భయంతో కూర్చున్నారు. ఎన్ని విషయాలు మాట్లాడినా వాళ్ళ నోటి నుండి ఒక్క విషయాన్ని కూడా రాబట్టలేకపోయాం. ఇక మనం చెప్పాల్సినదంతా చెప్పి మన పార్టీ నిస్వార్థంతో పీడిత వర్గ ప్రజల పక్షాన నిలబడి ప్రాణాలను సైతం త్యాగం చేస్తుందని, ప్రజల నుండి పార్టీని దూరం చేయటానికే శత్రువు కుట్రలు పన్నుతున్నాడని, దాన్ని

నమ్మవద్దనీ, మమ్మల్ని చంపినా మీరే, పెంచినా మీరే అని ఎంతో ఉద్వేగంతో మాట్లాడిన తరువాత అన్నం మాత్రం తెచ్చి పెట్టారు. ఆ గ్రామంలో సంఘ నాయకులు, మిలీషియాలో చురుగ్గా పని చేసిన వాళ్ళు కొద్దిమంది అప్పటికే గ్రామం విడిచి పారిపోయారు. వాళ్ళకు మన పార్టీ నుండి ఎటువంటి హాని వుండదనీ హామి ఇచ్చి వాళ్ళు నిశ్చితంగా తిరిగి గ్రామానికి వచ్చి వుండాలనీ, వాళ్ళను పిలవమనీ గ్రామస్తులకు చెప్పాం. అలాగే ఆ రోజు దళాన్ని చూసి పారిపోయిన పురుషులంతా ఎటువంటి భయాలు లేకుండా మరుసటి రోజు దళం వద్దకు వచ్చి కలవాల్సిందిగా కోరాం. చెప్పినట్లుగానే మన దళం వున్న మరో గ్రామానికి వాళ్ళు వచ్చి కలిశారు. అయితే యువకులు కాకుండా కొద్ది మంది ముసలివాళ్ళు మాత్రమే వచ్చి కలిశారు. వాళ్ళతో కూడా అవే విషయాలు చెప్పి అర్థం చేయించాం.

మరికొన్ని గ్రామాల్లో దళం వచ్చిందని తెలిస్తే సంఘ నాయకులు, మిలీషియాలో పని చేసిన వాళ్ళు మాత్రం దళానికి కనిపించకుండా తప్పుకునేవాళ్ళు. మిగతా వాళ్ళు మనకు తిండి పెట్టడం మాత్రమే చేసేవాళ్ళు. కొన్ని గ్రామాల్లో ఇన్‌ఫార్మర్లు వుండటం, వీళ్ళతో పాటు తెగ పెత్తందార్లు కూడా కలిసి గ్రామాన్ని కంట్రోల్ చేయడంతో పాటు ప్రతి రోజు దార్లను చెక్ చేయడం, మన అడుగులు, గుర్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం చేసేవాళ్ళు. ఇలాంటి గ్రామాలను, దార్లను తప్పించి అత్యంత కష్టమైన టెర్రయిన్‌లో కొండలను అడ్డంగా ఎక్కి దిగుతూ ప్రయాణాలు చేయడం, దళానికి చాలా కష్టం అయ్యేది. ముఖ్యంగా ఒక పాకెట్ నుండి మరో పాకెట్‌కు వెళ్ళేటప్పుడు మధ్యలో 2, 3 రోజులపాటు ఏ గ్రామానికీ, ప్రజలకూ సంబంధం లేకుండా అడవిలో మకాంలు వేసుకుంటూ వెళ్ళాల్సి వచ్చేది. ముఖ్యమైన రోడ్లను దాటే దగ్గర, చెక్ చేసుకునే దగ్గర ప్రజలను ఉపయోగించుకోలేకపోవడం, మనమే అన్నీ చేసుకోవడం చాలా సమస్య అయ్యేది. ఇలాంటి పరిస్థితుల్లో 2,3 రోజులకు సరిపడా రేషన్ అందరూ పట్టుకోవాల్సి వచ్చేది. నారాయణపట్నా ప్రాంతంలో దగ్గర దగ్గర పోలీసు క్యాంపులు వుండటంతో పగలు అడవిలో వంటలు చేస్తే పొగ కనిపించినా, రాత్రిపూట లైట్లు వేసినా శత్రువుకు అర్థమయ్యే అవకాశం వుంటుంది. కనుక 2 పూటలకు సరిపడా అన్నం రాత్రికే వండుకునేవాళ్ళం. ఎండకాలంలో ఒక్కోసారి రెండవ పూట అన్నం చెడిపోయేది. అలాంటప్పుడు ముందే అన్నంలో నీళ్లు పోసి ఉప్పు వేసుకుని తినేవాళ్ళం. మనకు తిండి సరుకులు తెచ్చి ఇచ్చేవాళ్ళు కూడా లేకపోవడంతో చాలా దూరం నుండే అవకాశం వున్న దగ్గర తెప్పించుకునేవాళ్ళం. ఈ విధంగా ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆ ప్రాంతాన్నీ, ప్రజలను విడిచిపెట్టకుండా ముందు మనం నిలదొక్కుకోవడం కోసం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ, ఎక్స్‌పోజ్ కాకుండా రహస్యంగా వుంటూ ఆహారం సంపాదించుకోవడం వరకు కృషి చేశాం. కానీ ప్రజలను కలవటం ఎలా? ప్రజల్లో వున్న భయాలను పోగొట్టి, వాళ్ళ మనోబలాన్ని పెంచి తిరిగి ప్రజలను ఉద్యమంలోకి తీసుకురావటం ఎలా? అన్నదే సమస్య. పోస్టర్ల ద్వారా ప్రచారం చేద్దామన్నా కనీసం పోస్టర్లు వేసేవాళ్ళు కూడా కరువయ్యారు. ఈ సమస్యలన్నింటిని కమిటీలలో చర్చించుకున్నాం. స్థానిక శత్రువుపై చర్యలు తీసుకోవడం (ఇన్‌ఫార్మర్లు, ప్రజా వ్యతిరేకులు), శత్రు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడం, సాయుధ శత్రువుపై చిన్న చిన్న చర్యలు చేయడం, శత్రు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజల ముందుకు వాస్తవాలను తీసుకువెళ్ళటం ద్వారా ఫలితాలను సాధించగలం అని అంచనాకు వచ్చాం. అయితే ఇవన్నీ చేయాలంటే ప్రజల మద్దతు, సహకారం అవసరం. అలాగే ఆ ప్రజల మద్దతును సంపాదించుకునేందుకు ఎంతో ఓపికతో కూడిన మన స్వీయాత్మక కృషి, రాజకీయ కృషి అవసరం. కనుక ఆ ప్రాంతంలో పని చేసే ఆర్గనైజర్లకు, పి.ఎల్.జి.ఎ బలగాలకు పరిస్థితిని అర్థం చేయిస్తూ, ఎడ్యుకేషన్ ద్వారా మోటివేట్ చేసాం. అందరం ఎన్ని కష్టాలు, ఇబ్బందులు వచ్చినా ఐక్యంగా పని చేయాలనీ నిర్ణయించుకున్నాం.

మనం సాయుధంగా దళమే వెళ్ళి ప్రజలను కలవటానికి అనుకూలంగా వున్న గ్రామాలకు (రోడ్ల పక్క గ్రామాలు, పోలీసు క్యాంపు పరిసర గ్రామాలు)1+1 సివిల్‌లో వెళ్ళి పరిమితమైన వ్యక్తులను రహస్యంగా కలవడం, మన వాయిస్‌ను ప్రచారం చేయడం, అక్కడి పరిస్థితిని, సమస్యలను అర్థం చేసుకోవడం, ముఖ్యంగా శత్రు సమాచారాన్ని సేకరించడం, రహస్యంగా సంబంధాలను ఏర్పర్చుకోవాలని అనుకున్నాం. మన సాయుధ బలగాలు టెర్రయిన్ అనుకూలంగా వున్న కొండల ప్రాంత గ్రామాలకు వెళ్ళి ప్రజలను కలిసి రాజకీయ కృషి ద్వారా ప్రజలను మలచుకోవాలని అనుకున్నాం.

ఈ విధంగా 2 సం॥రాల పాటు అనేక సమస్యలను, ఆటంకాలను ఎదుర్కొంటూ నారాయణపట్నాలో కృషి చేసాం. మొత్తం కాలంలో శత్రు దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, పోలీసు సంస్కరణలను, లొంగుబాట్ల పథకంలోని కుట్రను బహిర్గత పరస్తూ, మితవాద-అవకాశవాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ, జల్, జంగల్, జమీన్ అధికారం కోసం పోరాటం ఒక్కటే మార్గమని చెబుతూ అనేక పేపర్ స్టేట్‌మెంట్స్, పోస్టర్లు, బ్యానర్లు వేసాం. పారిపోయినవాళ్ళు తిరిగి గ్రామానికి రావాల్సిందిగా, వారికి పార్టీ నుండి ఎలాంటి హానీ వుండదని హామీనిస్తూ ప్రకటనలు ఇవ్వడం, వివిధ పద్ధతుల్లో కబుర్లు పంపటం వగైరా అనేక ప్రయత్నాలను చేయడంతో 2014 ప్రారంభం నుండి పారిపోయిన వాళ్ళు తిరిగి గ్రామాలకు రావడం ప్రారంభమైంది. అలా వచ్చిన వాళ్ళు పార్టీని కలుస్తామని కబుర్లు పంపి, పార్టీని కలిసారు. తాము ఎందుకు పారిపోవాల్సి వచ్చిందో, అలా పారిపోయాక తమ జీవితాలు మరింత దుర్భరంగా ఎలా మారాయో పార్టీకి చెప్పారు. ముఖ్యంగా సిక్కు, జాడులను చంపినట్టే అందర్ని పార్టీ వాళ్ళు చంపుతారని ప్రచారం జరగడంతో పాటు గ్రామాల్లో వాళ్ళ పేర్లు ప్రకటించి పోస్టర్లు వేయడం, రాత్రిపూట ఎవరో వచ్చి తలుపులు కొట్టడం, ఇంటి వెనుక నుండి తలుపు సందుల్లో లైట్లు వేయడం వంటివి జరగటంతో భయభ్రాంతులకు గురయ్యామనీ, కొంత కాలం దూరంగా వెళ్ళిపోయి పరిస్థితి మారితే రావాలనుకున్నామని చెప్పారు. పార్టీ తమను తిరిగి రావల్సిందిగా చేసిన ప్రయత్నాలన్నీ తమకు తెలుసని కానీ పార్టీ వాళ్ళు అలా కబురు పెట్టి, వెళ్ళిన తరువాత చంపేస్తారు, మీరు గ్రామానికి వెళ్ళాలంటే మీ ప్రాణాల మీద ఆశ వదులుకోండి' అని పోలీసులు, హోంగార్డులు మళ్ళీ భయపెట్టారనీ చెప్పారు. అయినా అక్కడ వుండటానికి సరైన వసతి లేక, కూలీ పనులు దొరకకా చాలా ఇబ్బందులు పడ్డామనీ, చావైనా, బ్రతుకైనా ఉన్న ఊరికే పోదామనుకున్నామని చెప్పారు.

మనల్ని చూసి ప్రజలు పారిపోయిన గ్రామాలలోనే, తిరిగి అదే

ప్రజల ముందు పారిపోయి తిరిగి వచ్చిన వాళ్ళు ఈ విషయాలన్నీ చెప్పారు. మన దళం కూడా ఆ సమయంలో ఎన్ని ఆటంకాలనూ, ఇబ్బందులనూ ఎదుర్కొన్నదో, అయినా కూడా ప్రజలను కలవటానికి ఎన్ని ప్రయత్నాలను చేసిందో వివరంగా చెప్పినప్పుడు నిజంగా ప్రజలు తల్లడిల్లిపోయారు. జరిగిన దానికి క్షమించమని కోరారు. దళం కూడా ఆశించిన ఫలితాన్ని పొందినందుకు, తిరిగి ప్రజల మనసులను గెలుచుకున్నందుకు ఎంతో సంతోషించింది. అలాగే 1+1గా సివిల్‌లో వెళ్ళిన కామ్రేడ్స్ కూడా ఎంతో కృషి చేసి, ధైర్యంగా వెళ్ళి పోలీసు క్యాంపుల పరిసర గ్రామాల ప్రజలను కలవటం, శత్రు సమాచారాన్ని సేకరించడం, ప్రజల మద్దతు, సహకారంతో పోస్టర్లు, బ్యానర్లు వేయటం వంటి కార్యక్రమాలతో పాటు 2015....లో బలిపట్ట వద్ద మైన్స్ అమర్చి బి.ఎస్.ఎఫ్ క్యాంపు నుండి నడిచి వస్తున్న పోలీసులపై ఆంబుష్ చేయడం జరిగింది. అయితే మైన్ తయారీలో వున్న లోపం కారణంగా అది శత్రువుకు నష్టం కలిగించలేకపోయినా ఆ సంఘటన అప్పటి పరిస్థితుల్లో ప్రజలపై గొప్ప ప్రభావాన్ని వేసింది. ''మావోయిస్టులను తరిమేశామని, ప్రజలు కూడా మావోయిస్టుల హింసను వ్యతిరేకించి లొంగిపోయారనీ, మావోయిస్టులకు ప్రజల మద్దతు లేదనీ, ప్రచారం చేసుకుంటున్న పోలీసులకు ఈ సంఘటనతో ముఖాల్లో నెత్తురు చుక్కలేదు. ప్రజల్లో మాత్రం పోలీసులకు నష్టం జరగనందుకు వాళ్ళు చావనందుకు బాధ పడుతూ ఈ సారి తప్పకుండా మంచిగా పేల్చాలనీ, పెద్ద వాహనాన్ని పేల్చి ఎక్కువ మందిని చంపాలనీ చెప్పారు. తీవ్రమైన పోలీసు నిర్బంధంలో లొంగిపోయి తమ భూములు కోల్పోయి, తిరిగి గ్రామ పెత్తందార్ల ఆధిపత్యాన్ని, ఇన్‌ఫార్మర్ల అరాచకత్వాన్నీ భరించలేక మళ్ళీ పార్టీకి సహకరిస్తూ ఇన్ఫార్మర్లను ఖతం చేయడంలో కూడా చాలా మద్దతునూ, సహకారాన్నీ ఇచ్చారు.

ఈ విధంగా అనేక విషయాలపై మనం చేసిన రాజకీయ ప్రచారం, కృషి మూలంగా, పోలీసు ఇన్ఫార్మర్లపై, పోలీసులపై చేసిన చిన్న చిన్న చర్యల వలన ప్రజల్లో భయాలు, గందరగోళాలు చాలా వరకు పోయాయి. మన పార్టీపై విశ్వాసం పెరిగింది. మద్దతు, సహకారం పెరిగింది. ఇప్పటికీ మనం వెళ్లలేకపోతున్న కొన్ని గ్రామాల ప్రజలు మా ఊరికి పార్టీ ఎందుకు రావటం లేదు ? మా మీద ఏమైనా డౌట్ వుందా? మేము పార్టీని కలుస్తామనీ, తమ గ్రామానికి పార్టీ రావాలనీ, కాపాడుకుంటామని కబుర్లు చేస్తున్నారు. దళం వెళితే పక్క గ్రామానికి కూడా తెలియకుండా, మన సమాచారం వెళ్ళకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సెంట్రీలు చేసి దళాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. రాత్రికి రాత్రే వంటలు చేసి అన్నం పెడుతున్నారు. అయితే ఇప్పటికీ ప్రజల్లో మళ్ళీ తాము పార్టీని కలుస్తున్నామని తెలిస్తే మళ్ళీ పెద్ద ఎత్తున రాజ్యహింసను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయాలు బలంగానే ఉన్నాయి. అందుకని మనం ఇప్పుడు బహిర్గతం కాకూడదనీ, అన్ని గ్రామాల్లో రహస్యంగా సంఘాలు పెట్టుకొనీ, మన బలం పెంచుకునీ మళ్ళీ భూముల్లోకి దిగుదామని మనకు ఎత్తుగడలు చెబుతున్నారు. రహస్యంగా సంఘాలు పెట్టుకుంటున్నారు. ప్రజలకు, ఉద్యమానికి ద్రోహం చేసిన నాచిక లింగను, లొంగిపోయి పోలీసులు ఇచ్చిన డబ్బులతో నారాయణపట్నాలో ఇళ్ళు కట్టుకుంటున్న మాజీ సంఘ నాయకులనూ, ద్రోహులుగా మారిన వారినీ ప్రజలు అసహ్యించుకుంటున్నారు. తాము సాధించుకున్న భూములు భూస్వాములు తిరిగి స్వాధీనం చేసుకున్నా అవి ఎప్పటికైనా తమకే హక్కు వుందని అంటూ ఆ భూముల్లో కూలీలుగా వెళ్ళటం లేదు. ఈ సంవత్సరం మొత్తంగా ఆ భూముల్లో పంటలు వేయలేదు. ఇవన్నీ ప్రజల విజయాలే.

అయితే నారాయణపట్నా ప్రాంతంలో మన పార్టీతో 10 సం။లకు పైగా అనుబంధం వున్న ప్రజలు పార్టీ నాయకత్వంలో జరిగిన భూ పోరాటంలోనూ, భూస్వాములను, ఫారెస్టు అధికారులను, సారా కాంట్రాక్టర్లనూ శిక్షించడం, తరిమివేయటంలో గొప్ప పాత్రను పోషించిన వాళ్ళు సంఘాలు, మిలీషియా, ఆర్.పి.సిలను ఏర్పర్చుకుని ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో మంచి ఫలితాలను పొందిన ప్రజలు తీవ్రమైన శత్రు దాడికి లొంగిపోవడమే కాక, మన పార్టీని చూస్తేనే పారిపోయే పరిస్థితి రావటానికి కారణమేమిటి? అంటే

1. తరతరాలుగా అనేక రకాల అణచివేతలకు గురై ఎప్పుడూ లొంగి వుండే బానిస మనస్తత్వంతో, ఓటమి మనస్తత్వంలో వున్న ప్రజలు ఎన్నడూ లేనంత అత్యంత క్రూరమైన శత్రుదాడి, రాజ్య నిర్బంధం అమలవడంతో దాన్ని ఎదుర్కొనే చైతన్యం పెరగకపోవడం.

2. ఆ ప్రాంతంలో నాచిక మితవాత-అవకాశవాద రాజకీయాల ప్రభావం ప్రజల పోరాట చైతన్యాన్ని నీరసపరిచింది.

3. మన పార్టీ రాజకీయ, మిలటరీ కృషిలో ఉన్న పరిమితులు, ప్రజల చైతన్యం పెంచడంలోనూ, ప్రజలకు మన పార్టీపై విశ్వాసం కల్పించడంలోనూ వున్న లోపం కూడా ఒక కారణం.

శత్రువు ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా, ఎంత దుష్ప్రచారం చేసి ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా, ప్రజలను పార్టీ నుండి దూరం చేయాలని ఎన్ని కుట్రలు పన్నినా, ప్రజలు లొంగిపోయి భయంతో, గందరగోళంతో పార్టీకి సహకరించకపోయినా అది తాత్కాలికమే. ఎందుకంటే శత్రువు ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకపోగా మరింత దోపిడీ, పీడనలకు గురిచేస్తారనే విషయం తమ అనుభవంలో ప్రజలే లోతుగా అర్థం చేసుకుంటున్నారు. తీవ్రమైన శత్రు నిర్బంధంలో శత్రు క్రూరత్వాన్ని మరింత లోతుగా అర్థం చేసుకుంటున్నారు. ప్రజాసైన్యం లేకుండా తమకేమీ వుండదనే వాస్తవాన్ని తెలుసుకుంటున్నారు. తమ బ్రతుకులు మారాలంటే దోపిడీ రాజ్యాన్ని అంతం చేయాలనీ, అందుకు యుద్ధమే ఏకైక మార్గమనీ క్రమంగా అనుభవం ద్వారా అర్థం చేసుకుంటున్నారు. అందుకే శత్రువును పూర్తిగా నిర్మూలించమని మనల్ని కోరుతున్నారు. యుద్ధం ప్రజలకు కష్టాలనే కాదు అధికారాన్ని కూడా తెచ్చిపెట్టింది. మొదటిసారిగా తమ జీవితంలో విప్లవ ఫలాల రుచి చూసిన ప్రజలు దాన్ని కోల్పోతే తమ జీవితాలు ఎంత దయనీయంగా మారుతాయో తెలుసుకున్నారు. అందుకే తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం, అధికారం కోసం పార్టీని రమ్మని కోరుతున్నారు. పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇస్తున్నారు.

నారాయణపట్నాలో మనకు ఎదురైన ఈ అనుభవం ప్రజలే గురువులు, ప్రజలే చరిత్ర నిర్మాతలు అనే చారిత్రక సత్యాన్ని రుజువు చేసింది. గడ్డు పరిస్థితుల్లో ప్రజల్ని అంటిపెట్టుకోవడం ప్రజలపై ఆధారపడటం ద్వారానే తిరిగి అనుకూల పరిస్థితులను సాధించగలం అనే గొప్ప విశ్వాసాన్ని కలిగించింది. గెలుపు, ఓటమి, గెలుపు, ఓటమి ... అంతిమంగా గెలుపు అని మన సిద్ధాంతం చెబుతుంది. చరిత్రలో ప్రజాయుద్ధాలన్నీ గెలుపు, ఓటముల గుండా పయనించి చివరకు గెలిచాయి. మనమూ గెలుస్తాం. న్యాయమైన ప్రజాయుద్ధంలో అంతిమ విజయం ప్రజలదే. ❐

సిద్ధాంత వ్యాసం

# శ్రామిక వర్గపు వర్గపోరాట ఎత్తుగడలు

- లెనిన్

పూర్వకాలపు భౌతికవాదంలోని ప్రధాన లోపాలను, అంటే, ప్రత్యక్ష విప్లవ కార్యచరణ పరిస్థితులను అర్థం చేసుకోలేకపోవడాన్నీ, లేక దాని ప్రాముఖ్యతను గుర్తించలేకపోవడాన్ని 1844-45 నాటికే పరిశీలించి తెలుసుకొని మార్క్స్ తన సిద్ధాంత గ్రంథ రచనతో పాటు తన జీవిత కాలమంతా శ్రామికవర్గపు వర్గపోరాట ఎత్తుగడలను గురించిన సమస్యలను తదేక శ్రద్ధతో పరిశీలించాడు. దీనికి సంబంధించిన బోలెడంత సమాచారం మార్క్స్ రచనలన్నింటిలోనూ, ప్రత్యేకించి ఎంగెల్స్‌తో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు నాలుగు సంపుటాలలోనూ వుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు 1913లో ప్రచురించబడ్డాయి. ఈ సమాచారమంతటినీ సేకరించి, సంకలనం చేసి, పరిశీలించి, అధ్యయనం చేయవలసిన పని ఇంకా చాలా వుంది. అందుచేత ఇప్పుడు మనం యీ విషయాన్ని గురించి అత్యంత సాధారణమైన క్లుప్తమైన గమనికలకు పరిమితం కావాల్సి వుంటుంది. ఈ అంశాన్ని వివరించపోతే భౌతికవాదం అసంపూర్ణమూ, ఏకపక్షమూ, నిర్జీవమూ అవుతుందని మార్క్స్ భావించడం సబబేనని నొక్కి చెప్పవలసి వుంది. మార్క్స్ తన భౌతికవాద గతితార్కిక ప్రపంచ దృక్పథానికి కచ్చితంగా అనుగుణంగా వుండేలాగ శ్రామికవర్గ ఎత్తుగడల మౌలిక కర్తవ్యాలను నిర్వచించాడు. ఒక నిర్దిష్ట సమాజంలోని వర్గాలన్నిటి మధ్య వున్న సంబంధాలన్నింటినీ మొత్తంగా వస్తుగతంగా లెక్కలోకి తీసుకోవడం, తత్పర్యవసానంగా ఆ సమాజం యొక్క వస్తుగత అభివృద్ధి దశనూ, ఆ సమాజానికి ఇతర సమాజాలకీ వున్న సంబంధాలనూ పరిశీలించడం మాత్రమే పురోగామి వర్గం అవలంబించవలసిన సరి అయిన ఎత్తుగడలకు ప్రాతిపదిక కాగలదు. అదే సమయంలో, అన్ని వర్గాలూ, అన్ని దేశాలూ స్థిరపడిపోయి వున్నవేనని కాకుండా చలనశీలములని, అంటే, అచల స్థితిలో కాకుండా చలన స్థితిలోనే వున్నట్టు భావించాలి. (ఈ చలనం యొక్క నియమాలు ఆయా వర్గాల ఉనికి యొక్క ఆర్థిక పరిస్థితులను బట్టి నిర్ణయమవుతాయి.) ఈ చలనాన్ని గతకాలం దృష్ట్యా మాత్రమేగాక, భావికాలం దృష్ట్యా కూడా పరిశీలించాలి, మెల్లగా జరిగే మార్పులను మాత్రమే గమనించే ''పరిణామవాదుల'' అపభ్రంశ దృక్పథంతోగాక, గతిగార్కిక దృక్పథంతో పరిశీలించాలి: ఎంగెల్స్‌కి మార్క్స్ రాసినట్టు "...అటువంటి బృహత్తర చారిత్రక పరిణామాల విషయంలో ఇరవై యేళ్ళు ఒక రోజుతో సమానం, ఇక ముందు ఇరవై ఏళ్ళు ఒక్క రోజులోనే నిక్షిప్తమై వుండే కాలం రావచ్చు" (మార్క్స్-ఎంగెల్స్ "ఉత్తర ప్రత్యుత్తరాలు," సంపుటి 3, పేజి 127). శ్రామికవర్గపు ఎత్తుగడలను, అభివృద్ధి యొక్క ప్రతి దశలోనూ, ప్రతి క్షణంలోనూ మానవ చరిత్రలో వస్తుగతంగా అనివార్యమైన గతితర్కాన్ని లెక్కలోకి తీసుకుంటూ, ఒక వైపున రాజకీయ నిస్తబ్ధత ఏర్పడే కాలాన్ని లేదా "శాంతియుతం" అనబడే నత్తనడక గమనపు కాలాన్ని పురోగామి వర్గ వర్గచైతన్యాన్ని, బలాన్ని, సమరశీలతను పెంపొందించడానికి వినియోగించుకుంటూ, మరో వైపున యీ వినియుక్త కృషినంతనూ యీ వర్గ పురోగమనపు "అంతిమ లక్ష్య" సాధన దిశగా నడిపించడం కోసమూ "ఇరవై ఏళ్ళు ఒక్క రోజులోనే నిక్షిప్తమయ్యే" మహత్తర కాలంలో నిర్వర్తించవలసిన మహత్తర కర్తవ్యాలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనే శక్తి సామర్థ్యాలను యీ వర్గంలో కలిగించడం కోసమూ వినియోగించుకుంటూ వుండాలి. ఈ సందర్భంలో మార్క్స్ ప్రతిపాదించిన రెండు వాదనలు ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి వున్నాయి : వాటిలో ఒకటి "తత్వశాస్త్ర దారిద్ర్యం" అనే మార్క్స్ గ్రంథంలో వుంది, అది శ్రామికవర్గపు ఆర్థిక పోరాటాన్నీ, ఆర్థిక సంస్థలనూ గురించినది. రెండవ వాదన ''కమ్యూనిస్టు ప్రణాళిక''లో వుంది. అది శ్రామికవర్గపు రాజకీయ కర్తవ్యాల గురించినది. మొదటి వాదన ఇలా వుంది : "భారీ పరిశ్రమ, ఒకరితో ఒకరికి పరిచయం లేని ప్రజా సమూహాన్ని ఒక చోట గుమికూరుస్తుంది. పోటీవల్ల వారి స్వప్రయోజనాలు భేదిస్తాయి : కాని కూలి రేట్లు పడిపోకుండా నిలబెట్టుకోవడం అనే ప్రయోజనం, వారి యజమానికి వ్యతిరేకంగా వారందరికీ వున్న యీ ఉమ్మడి ప్రయోజనం, ప్రతిఘటించాలి అనే ఉమ్మడి ఆలోచనలో వారిని ఐక్యపరుస్తుంది, కలయికను ఏర్పరుస్తుంది.... మొదట విడివిడిగా వుండి, తరువాత గ్రూపులుగా ఏర్పడిన యీ కలయికలు ఎల్లప్పుడూ ఐక్యమై వుండే పెట్టుబడిని ఎదుర్కొనవలసి వచ్చేసరికల్లా కూలి రేట్లను నిలబెట్టుకోవడం కంటే కూడా యీ కలయికను నిలబెట్టుకోవడమే వారికి, అంటే కార్మికులకి, మరింత అవసరం అవుతుంది.... ఈ పోరాటంలో నిజమైన అంతర్యుద్ధంలో రానున్న యుద్ధానికి అవసరమైన శక్తులన్నీ ఐక్యమై అభివృద్ధి చెందుతాయి. ఈ స్థితిని చేరుకోగానే యీ కలయిక రాజకీయ స్వభావాన్ని సంతరించుకుంటుంది." రానున్న అనేక దశాబ్దాల వరకూ, "రానున్న పోరాటానికి" శ్రామికవర్గం తన శక్తులను సన్నద్ధ పరిచే దీర్ఘకాలం అంతటికీ ఆర్థిక పోరాటమూ, ట్రేడ్ యూనియన్ ఉద్యమమూ అనుసరించవలసిన కార్యక్రమమూ, అవలంబించవసిన ఎత్తుగడలూ ఇందులో వున్నాయి. దీనినంతటినీ బ్రిటిషు కార్మికోద్యమం నుంచి మార్క్స్ ఎంగెల్స్‌లు యిచ్చిన అనేక ఉదాహరణలతో పోల్చి చూడాలి : ఏ విధంగా పారిశ్రామిక ''సౌభాగ్యం'' ''శ్రామికవర్గాన్ని కొనివేయడానికి" చేసే ప్రయత్నాలకు దారి తీస్తుందో ("ఉత్తర ప్రత్యుత్తరాలు," సంపుటి 1, పేజి 136) ఏ విధంగా వారిని పోరాటం నుంచి మరలించి పక్కదారి పట్టించడానికి దారితీస్తుందో, ఈ సౌభాగ్యం మొత్తం మీద "కార్మికులను ఎలా దుర్నీతిపాలు చేస్తుందో" (సంపుటి 2, పేజి 218) : బ్రిటిషు కార్మికవర్గం ఏ విధంగా "బూర్జువా"గా తయారైందో -"అన్ని దేశాలకంటే అత్యంత ఎక్కువ బూర్జువా దేశమైన యీ దేశం అంతిమంగా బూర్జువా ప్రభువర్గాన్ని, బూర్జువావర్గంతో పాటుగా బూర్జువా శ్రామికవర్గాన్నీ కలిగి వుండటానికి ఉద్దేశించుతున్నట్టు కనబడుతూంది" (సంపుటి 2, పేజి 290) : ఏ విధంగా బ్రిటిషు కార్మికోద్యమ "విప్లవ శక్తి" నీళ్ళు కారిపోతుందో (సంపుటి 3, పేజి 124) : ఏ విధంగా బ్రిటిషు కార్మికోద్యమానికి "చార్టిస్టు సత్తువ లోపించిందో" (1866: సంపుటి 3, పేజి 305) : ఏ విధంగా బ్రిటిషు కార్మిక నాయకులు "రాడికల్ బూర్జువాకీ కార్మికునికీ" మధ్యస్థంగా వుండే రకంగా తయారవుతున్నారో (హొలియోక్‌ను గురించి రాసినది, సంపుటి

4, పేజి 209) : బ్రిటన్ యొక్క గుత్తాధిపత్యం మూలంగానూ, ఆ గుత్తాధిపత్యం వున్నంత కాలమూనూ ఏ విధంగా "బ్రిటిషు కార్మికుడు కదలడో" (సంపుటి 4, పేజి 433) మార్క్సు ఎంగెల్సులు పేర్కొన్నారు. కార్మికోద్యమం యొక్క మొత్తం గమనం (దాని పర్యవసానం) సందర్భంగా ఆర్థిక పోరాటపు ఎత్తుగడలు ఆశ్చర్యకరమైనంత విస్తృతమైన, సమగ్రమైన, గతితార్కికమైన, నిజంగా విప్లవాత్మకమైన దృక్పథం నుంచి యిక్కడ పరిశీలించబడ్డాయి.

రాజకీయ పోరాటపు ఎత్తుడగల గురించిన మౌళిక మార్క్సిస్టు సూత్రాన్ని ''కమ్యూనిస్టు ప్రణాళిక'' ఇలా నిర్వచించింది: "కమ్యూనిస్టులు కార్మికవర్గం యొక్క తక్షణ లక్ష్యాలను సాధించడానికీ తాత్కాలిక ప్రయోజనాలను అమలు పరచడానికీ పోరాటం చేస్తారు. కానీ వాళ్ళు వర్తమాన ఉద్యమంలో ఆ ఉద్యమం యొక్క భవిష్యత్తును ప్రతిబింబిస్తూ, ఆ భవిష్యత్తు పట్ల కూడా శ్రద్ధ వహిస్తారు". ఈ కారణం వల్లనే "1846లో పోలండ్‌లోని క్రాకొవ్‌లో తిరుగుబాటును లేవదీసిన వ్యవసాయ విప్లవ పార్టీనే" 1848లో మార్క్సు బలపర్చాడు. జర్మనీలో 1848-49లలో అతివాద విప్లవ ప్రజాస్వామికవాదులను మార్క్సు బలపర్చాడు, ఎత్తుగడలను గురించి తానప్పుడు చెప్పిన మాటలను తరువాత ఎన్నడూ కూడా ఉపసంహరించుకోలేదు. జర్మన్ బూర్జువావర్గం "మొదటి నుంచీ కూడా ప్రజలకు ద్రోహం చేసే ధోరణి''నే కలిగివుందనీ (రైతాంగంతో సయోధ్య కలిగివుంటే మాత్రమే బూర్జువా వర్గం తన లక్ష్యాలను పూర్తిగా సాధించగలిగి వుండేది), "పురాతన సమాజపు కిరీటధారులైన ప్రతినిధులతో రాజీపడతారనీ" ఆయన అభిప్రాయపడ్డాడు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవ యుగంలో జర్మన్ బూర్జువావర్గపు వర్గస్థానాన్ని మార్క్సు యీ కింది విధంగా విశ్లేషించాడు-సందర్భవశాత్తూ యీ విశ్లేషణ, తిరోగామి చలన పార్శ్వం నుండి మాత్రమే గాక, చలన స్థితిలో వున్న సమాజాన్ని పరిశీలించే భౌతికవాద పద్ధతికి మచ్చుతునక: "తనలో తనకే విశ్వాసం లేకుండా, ప్రజలలో విశ్వాసం లేకుండా, పై స్థానాలలో వున్నవారిని గురించి గొణుగుతూ, కిందనున్నవారిని చూసి భయంతో వణకిపోతూ.... ప్రపంచ కల్లోలం అంటే హడలిపోతూ: ....ఏ సందర్భంలోనూ శక్తి లేక, అన్ని సందర్భాలలోనూ అభిప్రాయ చౌర్యం చేస్తూ: ...చొరవ అనేది లేకుండా: ... బలిష్ఠులైన ప్రజలలోని తొలి యౌవనోత్సాహపు ఉద్వేగాలకు విధివశాత్తూ నాయకత్వం వహించవలసి వచ్చి, వాటిని తన వృద్ధాప్యపు ప్రయోజనాల కోపం మళ్ళింప జూస్తున్న పాపిష్టి ముసలివాడు" "Neue Reinische Zeitung'' 1848: "సారస్వత వారసత్వం" సంపుటి 3, పేజి 212). ఇరవై యేళ్ళ తరువాత ఎంగెల్సుకు రాసిన ఉత్తరంలో ("ఉత్తర ప్రత్యుత్తరాలు," సంపుటి 3, పేజి 224) స్వాతంత్ర్యం కోసం పోరాడవలసి రావడం కంటే బానిసత్వంతో కూడిన శాంతే మెరుగు అని బూర్జువావర్గం ఎంచుకోవడం మూలంగానే 1848 విప్లవం విఫలమైందని మార్క్సు రాశాడు. 1848-49 విప్లవ కాలం అంతమొందిన తరువాత విప్లవంతో ఆటలాడే ప్రయత్నాలనన్నింటినీ మార్క్సు వ్యతిరేకించాడు (షాప్పెర్, విల్లిహ్‌లిద్దరికీ వ్యతిరేకంగా ఆయన జరిపిన పోరాటం), పైకి "శాంతియుతం"గానే కనబడుతూ నూతన విప్లవాల కోసం సన్నద్ధం అవుతున్నా నూతన దశలో పని చేసే సామర్థ్యాన్ని సంపాదించుకోవాలని నొక్కి చెప్పాడు. ఈ పని ఏ సరళిలో కొనసాగింపబడాలని మార్క్సు ఉద్దేశించాడో అది 1856లో అభివృద్ధి నిరోధక శక్తులు జర్మనీలో ప్రబలంగా వున్న అంధకారయుగ పరిస్థితిని గురించి ఆయన వేసిన అంచనాలో తెలుస్తుంది. "జర్మనీలోని పరిస్థితి అంతా శ్రామికవర్గ విప్లవాన్ని మరో రైతు యుద్ధం ద్వారా బలపర్చే అవకాశం మీద ఆధారపపడి ఉంటుంది" ("ఉత్తర ప్రత్యుత్తరాలు", సంపుటి 2, పేజి 108). జర్మనీలో ప్రజాతంత్ర (బూర్జువా) విప్లవం పూర్తి కాకుండా వున్నంత కాలమూ మార్క్సు తన దృష్టినంతటినీ రైతాంగం యొక్క ప్రజాస్వామిక శక్తిని అభివృద్ధి పరచడానికి సోషలిస్టు శ్రామికవర్గం అవలంబించవలసిన ఎత్తుగడలపైనే కేంద్రీకరించాడు. సందర్భవశాత్తూ, భూస్వాముల పట్ల, ప్రష్యన్ జాతీయవాదం పట్ల లాసాల్ సహిష్ణుతను ప్రదర్శించుతూన్నందువల్ల అతని వైఖరి "వస్తుగతంగా చూస్తే... కార్మికవర్గ ఉద్యమాన్ని యావత్తునూ ప్రష్యాకు అప్పగింత పెట్టి ద్రోహం చేయడమే'' (సంపుటి 3, పేజి 210) అని మార్క్సు అభిప్రాయపడ్డాడు. 1865లో తాము పత్రికలలో చేయబోయే సంయుక్త ప్రకటనపై తమ అభిప్రాయాలను పరస్పరం తెలియజేసుకుంటూ మార్క్సుతో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలలో ఎంగెల్స్ ఇలా రాశాడు : "వ్యవసాయమే ప్రధాన వృత్తిగా గల దేశంలో ఫ్యూడల్ నిరంకుశ ప్రభువుల కొరడా జాడింపుల కింద గ్రామీణ శ్రామికవర్గం పై జరిగే పితృస్వామిక దోపిడీని గురించి పల్లెత్తు మాటైనా అనకుండా పరిశ్రమలలోని శ్రామికవర్గం పేరుతో బూర్జువావర్గం మీద మాత్రమే దాడి చేయడం దుర్మార్గం" (సంపుటి 3, పేజి 217). 1864 నుండి 1870 వరకూ, జర్మనీలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ముగింపుకు వచ్చే కాలంలో, ప్రష్యన్, ఆస్ట్రియన్ దోపిడీ వర్గాలు పై నుంచే విప్లవాన్ని ఏదో విధంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తూ వుండిన కాలంలో బిస్మార్క్‌తో సరససల్లా పాలు జరుపుతూండిన లాసాల్‌ను ఖండించడమే గాక, "ఆస్ట్రియన్ అభిమానతత్వం"లోకి దిగజారి ప్రత్యేకతావాదాన్ని సమర్థిస్తూ వుండిన లీబ్‌క్నెఖ్ట్‌ను కూడా మందలించి సరిదిద్దాడు మార్క్సు. బిస్మార్క్‌నూ, ఆస్ట్రియన్ అభిమానులనూ కూడా ఒకే విధమైన నిర్దాక్షిణ్యంతో ఎదిరించి పోరాడే విప్లవాత్మకమైన ఎత్తుగడలు, "విజేత" అయిన ప్రష్యన్ భూస్వామికి అనుకూలమైనవి గాకుండా అతనికి కూడా వ్యతిరేకంగా, ప్రష్యన్ సైనిక విజయాలు సృష్టించిన పరిస్థితులలో విప్లవ పోరాటాన్ని తక్షణమే తిరిగి ప్రారంభించగలిగే ఎత్తుగడలు కావాలని మార్క్సు గట్టిగా కోరాడు ("ఉత్తరప్రత్యుత్తరాలు", సంపుటి 3, పేజీలు 134, 136, 147, 179, 204, 210, 215, 418, 437, 440-41). 1870 సెప్టెంబరు 9 నాటి ఇంటర్నేషనల్ ప్రఖ్యాత విజ్ఞప్తిలో అకాల తిరుగుబాటు ప్రారంభించవద్దని ఫ్రెంచి శ్రామికవర్గాన్ని మార్క్సు హెచ్చరించాడు, కానైతే తిరుగుబాటు జరిగినప్పుడు (1871) "స్వర్గాన్నే ముట్టడిస్తున్న" ప్రజానీకపు విప్లవాత్మక చొరవను ఉత్సాహంతో కొనియాడాడు. కూగెల్‌మన్‌కు మార్క్సు రాసిన ఉత్తరం). మార్క్సు యొక్క గతితార్కిక భౌతికవాద దృక్పథం నుండి చూస్తే, అనేక ఇతర పరిస్థితులలో లాగానే ఆ పరిస్థితిలో విప్లవాత్మక చర్యకు సంభవించిన ఓటమి, శ్రామికవర్గ పోరాటపు సాధారణ గమనంలోనూ, పర్యవసానంలోనూ ఇదివరకే ఆక్రమించిన స్థానాన్ని వదులుకొని, పోరాడకుండా లొంగిపోవడం కంటే తక్కువ కీడు అవుతుంది. పోరాటం లేకుండా లొంగిపోయి వుంటే శ్రామికవర్గం నిరాశా నిస్పృహలకు లోనై దాని సమరశీలత నాశనమై వుండేది. రాజకీయంగా స్తబ్ధత ఏర్పడి బూర్జువా న్యాయమే

సందేశం

# భారత దేశంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి మద్దతుగా ఇటలీలోని మిలన్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సంఘీభావ కాన్ఫరెన్స్‌కు పంపించిన సందేశం

ఈ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయటానికి కృషి చేసిన అన్ని పార్టీలకూ, సంస్థలకూ వ్యక్తులకూ భారతదేశంలో ప్రజాయుద్ధానికి మద్దతుగా నిర్వహిస్తున్న ఈ కాన్ఫరెన్స్‌కు నాయకత్వం వహిస్తున్న అంతర్జాతీయ కమిటీకి సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ, పి.ఎల్.జి.ఎ తరపున, విప్లవ ప్రజా కమిటీల (ఆర్.పి.సి.ల) తరపున, విప్లవ ప్రజాసంఘాల తరపున మరియు భారత విప్లవ ప్రజానీకం తరపున హృదయపూర్వకంగా రెడ్‌శాల్యూట్స్ చెబుతూ ఉల్లాసభరిత విప్లవాభివందనాలను తెలియజేస్తోంది.

సామ్రాజ్యవాద సంక్షోభం తీవ్రతరమై ప్రపంచవ్యాప్త అల్లకల్లోల పరిస్థితులలో ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ని జరుపుకుంటున్నందుకూ, అదే సందర్భంలో మా పార్టీ దశమ వార్షికోత్సవాలను ఉల్లాసంగా జరుపుకుంటున్న మేము మిమ్మల్ని గొప్పగా అభినందిస్తున్నాం. విప్లవకారుల, ప్రజల చిరకాల స్వప్నమైన రెండు ప్రధాన విప్లవ ప్రవంతులు కలిసిపోయి సి.పి.ఐ (మావోయిస్టు) ఏర్పడటం ఒక ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ పదేళ్ళ కాలంలో విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేసే లక్ష్యంలో భాగంగా 2332 మంది కామ్రేడ్స్ ఉన్నతమైన త్యాగాలు చేసారు. అమరత్వం పొందిన వారిలో పొలిట్‌బ్యూరో, కేంద్రకమిటీ, స్టేట్‌కమిటీల, రీజనల్ కమిటీల, జిల్లాకమిటీల, సబ్‌జోనల్ కమిటీల, ఏరియా కమిటీల మరియు గ్రామస్థాయి పార్టీ కమిటీల సభ్యులూ, పార్టీ ప్రాథమిక సభ్యులూ, పి.ఎల్.జి.ఎ. యోధులూ, ఐక్యసంఘటనకు చెందిన సభ్యులూ ఉన్నారు. కమ్యూనిస్టు సమాజ స్థాపన కోసం జీవితాలను త్యాగం చేసిన వారందరికి, ప్రభుత్వ దమనకాండలో జీవితాలను మరియు సర్వస్వాన్ని కోల్పోయిన విప్లవ ప్రజానీకానికీ, ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిజం ఆశయం కోసం అమరులైన అందరికీ శ్రద్ధాంజలి తెలుపుతున్నాం.

పార్టీ 10వ వార్షికోత్సవాల సందర్భంగా ఈ మొత్తం కాలంలో సాధించిన విజయాలనూ, లోటుపాట్లనూ బేరీజు వేసుకొనేందుకు ఇదొక అవకాశం. అమెరికా సామ్రాజ్యవాద గైడెన్స్‌లో భారత పాలక వర్గాలు కొనసాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ., ప్రజామిలీషియా మరియు విప్లవ ప్రజారాశులు వీరోచిత రాజకీయ, మిలటరీ పోరాటాలను చేసారు. భారీ ఆయుధాలు, గొప్ప శిక్షణ పొందిన శతృవుకు వ్యతిరేకంగా వీరోచిత మిలటరీ దాడుల్ని కూడా చేసారు. జైళ్ళలోని మా పార్టీ కామ్రేడ్స్ చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కొనసాగుతున్న లోటుపాట్లను గమనంలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకువెళ్ళే దానిలో భాగంగానే ఈ విజయోత్సవాలు జరుపుకుంటున్నాం.

కామ్రేడ్స్

గత పదేళ్ళ కాలంలోని వివరాలను మీ ముందుంచుతున్నాం.

పార్టీ ఏర్పడిన సందర్భంగా తీసుకున్న కర్తవ్యాలను పరిపూర్తి చేసేందుకు పార్టీ, పి.ఎల్.జి.ఎ., ఆర్.పి.సి.లు మరియు విప్లవ ప్రజా సంఘాలు విశేష కృషి చేసాయి. 2007లో పార్టీని నష్టపరచాలనే శతృవు నిరంతర ప్రయత్నాలను వమ్ము చేస్తూ మా పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌ని విజయవంతంగా జరుపుకున్నాం. దీని ద్వారా సిద్ధాంతపరమైన మా అవగాహనను మెరుగుపర్చుకుని రాజకీయ ఐక్యతను మరింత గట్టిపరుచుకున్నాం. విలీనం తర్వాత రెండున్నర సంవత్సరాలలో మేం సాధించిన వాటినీ, లోపాలనూ, విజయాలనూ, వైఫల్యాలనూ సమగ్రంగా సమీక్షించుకున్నాం. కేంద్ర, ప్రధాన కర్తవ్యాలతో పాటు ఇతర ముఖ్యమైన కర్తవ్యాలను రూపొందించుకున్నాం. నాయకత్వాన్ని మరింత పరిపుష్టం చేసుకున్నాం. ఆ విధంగా కాంగ్రెస్ ఫలితంగా పార్టీ నూతన ప్రజాస్వామిక విప్లవానికి తన కర్తవ్యాలను నెరవేర్చడానికి సైద్ధాంతిక, రాజకీయ వైఖరుల విషయంలో మరింత పదునుదేరింది. అంతర్జాతీయ కార్మికవర్గంలోని ఒక డిటాచ్‌మెంట్‌గా భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి అగ్రగామి దళంగా మా పార్టీ ఆ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి తన ఐక్యతను మరింత పటిష్ట పరుచుకుంది. దాని సంకల్పమూ, పోరాట చేవ మరింత గట్టిపడ్డాయి.

పి.ఎల్.జి.ఎ 2004 నుండి, ముఖ్యంగా కాంగ్రెస్ తర్వాత గట్టి ప్రయత్నాల ద్వారా వీరోచితమైన దాడులను, ఆంబుష్‌లను చేసి ఒక ముఖ్యమైన గెంతును సాధించింది. కంపెనీ స్థాయి నిర్మాణాలు సాధారణమై బెటాలియన్ల నిర్మాణానికి పురోగమిస్తూ ప్రైమరీ, సెకండరీ

---

ప్రబలమైన కాలంలో చట్ట సమ్మతమైన పోరాట పద్ధతులను అవలంబించడాన్ని పూర్తిగా గుర్తించిన మార్క్స్ 1877లోనూ 1878లోనూ సోషలిస్టు వ్యతిరేక చట్టం అమలులోకి వచ్చిన తరువాత మోస్ట్ ఉపయోగించిన "విప్లవకర పదజాలాన్ని" నిశితంగా ఖండించాడు: అంతేకాదు అధికారయుత సోషల్ డెమొక్రటిక్ పార్టీలో తాత్కాలికంగా వచ్చిన అవకాశవాద ధోరణిని కూడా ఇంచుమించు అంతే నిశితంగా ఖండించాడు. అప్పుడు అధికారయుత సోషల్ డెమొక్రటిక్ పార్టీ, సోషలిస్టు వ్యతిరేక చట్టానికి జవాబుగా రహస్య పోరాటాన్ని చేపట్టడానికి తన దృఢ నిశ్చయాన్నీ, పట్టుదలనూ విప్లవాత్మక ఉత్సాహాన్నీ, సంసిద్ధతనూ ప్రదర్శించలేదు. ("ఉత్తర ప్రత్యుత్తరాలు," సంపుటి 4, పేజీలు 397, 404, 418, 422, 424, సోర్గెకు రాసిన ఉత్తరాలు కూడా చూడండి.)

**రచన: 1914 జులై-నవంబర్** ❐

మరియు పునాది బలగాల మధ్య కమాండ్‌ని, సమన్వయాన్ని సాధించటంలో నైపుణ్యం పెరిగింది. ఈ పరిస్థితితో ప్లాటూన్ స్థాయి ప్రభుత్వ కిరాయి బలగాలను నిర్మూలించటం మామూలు విషయమైంది. ముకరం దాడిలో కంపెనీ స్థాయి బలగాలను కూడా నిర్మూలించింది. విస్తృత స్థాయిలో వేలాది ప్రజా మిలీషియాను నిర్మించింది. సల్వాజుడుం, సేంద్ర లాంటి ప్రతీఘాతుక హంతక ముఠాల్ని ఏర్పరచి ప్రజల్ని ప్రజల మీదికే ఉసిగొల్పే ఘోర దమనకాండను ఓడించటంలో ప్రజా మిలీషియా గొప్ప పాత్రను పోషించింది. పి.ఎల్.జి.ఎ సాధించిన అనేక విజయాలలో ప్రజా మిలీషియా, విప్లవ ప్రజానీకం గొప్ప పాత్రను పోషించారు. విప్లవకర పోరాటాల విషయంలోనూ, సాయుధ, ప్రజాపోరాటాల మధ్య సమన్వయం విషయంలో కూడా విలువైన పాఠాలను పొందాం. బహిరంగంగా ప్రజాసంఘాలనూ, పార్టీతో సంబంధాలున్నాయన్న అనుమానాలతోనూ ఆ సంఘాల్ని నిషేధించటం, ఆ సభ్యుల్ని వేటాడటం, జైళ్ళలో పెట్టటం, హత్యలు చేయడం మొదలయిన చర్యలు ఈ కాలంలోనే జరిగాయి. ఈ విధమైన అణచివేత మధ్య 'ప్రజలే చరిత్ర నిర్మాతలనీ, మనం వారి పిల్లలమనే' అవగాహనను కలిగి ఉండి పరిస్థితులకనువైన నిర్మాణాల్ని చేసి వేలాదిగా ప్రజల్ని కదిలించటం వల్లనే మమ్ములను నిర్మూలించాలనే శత్రు ఎత్తుగడలను వమ్ము చేసాం. పెద్ద ప్రజా తిరుగుబాటు రూపాన్ని సంతరించుకున్న పెద్ద ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాం. లాల్‌ఘడ్, నారాయణపట్నా లాంటి పోరాటాల్లో కొత్త పోరాట రూపాలు ముందుకు వచ్చాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వేదికను సంఘటితం చేసుకొనే అనుకూల పరిస్థితులేర్పడినాయి. దేశ వ్యాప్తంగా ప్రజలు తమ భూమిని రక్షించుకునేందుకు పెద్ద ఎత్తున పోరాటాల్లో ముందుకు వచ్చారు. పెద్ద ఎత్తున తమను విస్థాపితం చేసే సామ్రాజ్యవాద అనుకూల మరియు పాలక వర్గాల అనుకూల ప్రాజెక్టులు, డ్యాములు మరియు గనులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారు. ఈ పోరాటాలకు మనం మద్దతు తెలిపాము. కొన్నిటికి నాయకత్వం వహించాము. వివిధ రకాల శక్తులను ఐక్యం చేసే ఇటువంటి పోరాటాలకు నాయకత్వం వహించటం ద్వారా మంచి అనుభవాలే పొందాము. ఈ పోరాటాలు ప్రజాయుద్ధానికి నాయకత్వం వహిస్తున్న పార్టీ నాయకత్వ పాత్ర యొక్క విశిష్టతను ముందుకు తెచ్చాయి. ఈ పరిస్థితులలో కొత్త శక్తులను కలుపుకోవటం ద్వారా గెరిల్లాజోన్లను విస్తృతం చేయటానికీ, పార్టీని బలోపేతం చేసుకోవడానికీ పి.ఎల్.జి.ఎ.ని బలోపేతం చేసుకోవటానికీ తోడ్పడింది.

జైళ్ళలోని పోరాటాలు క్రమంగా పెరుగుతూ ఉండటం మరో ప్రాధాన్యత కలిగిన విషయం. వేలాది మంది కామ్రేడ్స్ జైళ్ళలో వున్నారు. 20 రాష్ట్రాలలోని సెంట్రల్, జిల్లా మరియు సబ్ జైళ్ళు అక్కడి రాజకీయ ఖైదీలు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న నిరాహార దీక్షలు, ఆమరణ దీక్షలాంటి పోరాటాలతో హోరెత్తుతున్నాయి. ఈ పోరాటాలతో పాటు జైలులోని మన కామ్రేడ్స్ సాధారణ ఖైదీల హక్కుల సాధన కోసం కూడా సాధారణ ఖైదీలను పోరాటాలలోకి దించారు. దేశవ్యాప్త తీవ్ర నిర్బంధం మధ్యనే ప్రజాస్వామిక సంస్థలూ, శక్తులూ కూడా ఇందులో కీలక పాత్రను నిర్వహిస్తున్నాయి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగానూ, అంతర్జాతీయంగానూ పోరాటాలను కొనసాగిస్తున్నారు. భారతదేశంలోని రాజకీయ ఖైదీలకు మద్దతుగా మీరు చేపట్టిన సంఘీభావ కార్యక్రమాలు అంతర్జాతీయతకు ప్రకాశవంతంగానూ, చిరకాలం మా స్మృతుల్లోనూ ఉంటాయి.

గత పదేళ్ళ కాలంలో పార్టీ వివిధ రంగాలలో సామర్థ్యాలను పెంచుకున్నది. సైద్ధాంతిక పెడధోరణులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశంలోనూ మరియు అంతర్జాతీయ స్థాయిలోనూ చురుకుగా పాల్గొన్నది. దక్షిణాసియా మావోయిస్టు పార్టీల సంస్థల సమన్వయ కేంద్రం కంపోసాను ఏర్పరచటంలో కీలకపాత్రను పోషించింది. పార్టీలో సైద్ధాంతిక స్థాయిని పెంచేందుకు అధ్యయన తరగతులు, రెక్టిఫికేషన్ క్యాంపెయిన్ల నిర్వాహణపై శ్రద్ధ పెట్టింది. వివిధ భాషలలో పత్రికలను మరియు స్టడీ మెటీరియల్‌ని ప్రచురించింది. ఆదివాసి భాషలలో అధ్యయనాన్నీ, ప్రచారాన్నీ పెంచేందుకు ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టింది. ప్రాథమిక విద్యకై తయారు చేయబడిన పాఠ్యాంశాలనూ సిలబస్‌లనూ మెరుగుపర్చింది. ఆర్.పి.సి.లు నడుపుతున్న పాఠశాలలకూ, పి.ఎల్.జి.ఎ. యోధులకూ, ప్రజాసంఘాల సభ్యులకూ ఎడ్యుకేషన్‌కై మెరుగుపర్చబడిన పాఠ్యాంశాలను, సిలబస్‌లను అందించటం జరిగింది.

ఆకాశంలో సగం అయిన మహిళలను జాగృతం చేయడం, పోరాటంలో తమ వంతు భాగాన్ని తాము గెల్చుకునేలా రాజకీయ, నిర్మాణ, మిలటరీ, సాంస్కృతిక, ఇతర రంగాల్లో వారి సమర్థతలన అభివృద్ధి చేయటం పార్టీ సాధించిన అపురూపమైన విజయాల్లో ఒకటి. నేడు పి.ఎల్.జి.ఎ.లోని పోరాట శక్తిలో దాదాపు 40 శాతం మహిళలే. అయితే వేరు వేరు గెరిల్లా జోన్లలో ఈ శాతం వేరు వేరుగా ఉంది. మహిళలు ప్లాటూన్ కమాండర్లుగా, కంపెనీ స్థాయి కమిటీలో సభ్యులుగా పని చేస్తున్నారు.

పార్టీ విప్లవ సాంస్కృతిక కార్యకలాపాలను అభివృద్ధి చేయటానికి ఎంతగానో శ్రద్ధ వహించింది. అనేక రాష్ట్రాల్లో సాంస్కృతిక ప్రజాసంఘాలు గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పని చేస్తున్నాయి. ఈ సంస్థలు జాతీయ, ఎథినిక్ సాంస్కృతిక సాంప్రదాయాలు, శైలుల నుండి నేర్చుకునే, వాటిని అభివృద్ధి చేసే బహుళమైన సాంస్కృతిక రూపాల ద్వారా విప్లవ సందేశాన్ని ప్రచారం చేస్తాయి. ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలను ప్రోత్సహిస్తాయి. ఇవి ప్రజలను మౌలిక మార్పు కొరకు పోరాడేలా ప్రేరేపిస్తాయి. వీటి సాంస్కృతిక సందేశాలు ప్రజల మెదళ్ళపై స్వారీ చేసే పాత సమాజపు అభివృద్ధి నిరోధక విలువలపై దాడి చేసే దిద్దుబాటు పరికరాల పాత్రను నిర్వహిస్తాయి. ఈ సంఘాలు పార్టీని విశాల ప్రజానీకంతో కలిపే శక్తివంతమైన ఆయుధాలు. ఈ ప్రజాసంఘాలే కాకుండా పి.ఎల్.జి.ఎలో కూడా బెటాలియన్ స్థాయి నిర్మాణాల్లో సాయుధ సాంస్కృతిక బృందాలను ఏర్పరిచాం.

మరో ప్రాధాన్యత కలిగిన విషయం ఏమిటనగా పార్టీ ఏర్పడిన తర్వాత ఒక ప్లాను ప్రకారం పని చేసి స్థావర ప్రాంతాల ఏర్పాటుకు పరివర్తనా దిశగా గెరిల్లా బేస్‌లను విస్తరించగలిగాము. ఈ బేస్‌లలో అనేక గ్రామాలలో ఆర్.పి.సి.లను సంఘటితం చేయటంలో విజయవంతమైనాము. వ్యూహాత్మక కర్తవ్యాలను ముందుకు తీసుకుపోయే క్రమంలో ఉద్యమాన్ని మరింత సంఘటితం, విస్తృతం చేసి విప్లవ యుద్ధాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ఈ గెరిల్లా బేస్‌లు సహాయపడ్డాయి. కాంగ్రెస్ తర్వాత మరిన్ని ఆర్.పి.సి.లు ఏర్పడ్డాయి. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో గతంలో అనేక ఆర్.పి.సి.లను ఏర్పరిచాం. ఆ రాష్ట్రాల్లో ఉద్యమం సెట్‌బ్యాక్‌కి గురైనప్పటికీ రాజ్యాధికారాన్ని

చవిచూసిన ప్రజానీకం ఆ స్ఫూర్తితో ఈ పరిస్థితిని అధిగమించటానికి పోరాడుతున్నారు. డి.కె.లో (ఛత్తీస్‌గడ్‌లో) అనేక ఏరియా స్థాయి ఆర్.పి.సి.లు ఏర్పడ్డాయి. కొన్ని డివిజన్ స్థాయి ప్రజా ప్రభుత్వాలు కూడా పని చేయనారంభించాయి. మన దేశ విప్లవోద్యమ చరిత్రలో ఇది ఒక నూతన అనుభవం. బూటకపు ప్రజాస్వామిక వ్యవస్థనూ, మిధ్యా సంస్కరణల దోపిడి ప్రభుత్వాలను భారత ప్రజలు తిరస్కరించేందుకు వీలుగా ఈ ప్రజా ప్రభుత్వాలు ఒక ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక నమూనాగా నిలుస్తాయి. ఈ ప్రజా ప్రభుత్వాలు ప్రజల ఆర్థికాభివృద్ధి స్వయం సమృద్ధి సాధించే వైపుగా పురోగమించడానికీ, పార్టీకీ–పి.ఎల్.జి.ఎ.కి అండగా నిలవడానికి ప్రజల సహకార సమిష్టి శ్రమ ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంపొందించటానికి ఎంతో కృషి చేస్తున్నాయి. సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికార స్వాధీనం అనే కేంద్ర కర్తవ్యాన్ని పరిపూర్తి చేసేందుకు ఈ విధంగా పురోగమిస్తున్నాం.

2004లో ఐక్య పార్టీ ఏర్పడిన తరువాత విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు అమెరికా సామ్రాజ్యవాదం చేత రూపొందించబడిన ఎల్.ఐ.సి. వ్యూహాన్ని దేశవ్యాప్తంగా అమలు జరిపేందుకు శత్రువు తన ప్రయత్నాలను ముమ్మరం చేసాడు. పాలకవర్గాల రక్షణకు మనం ప్రమాదకరమని అర్థం చేసుకుంటున్నాడు. ఈ వ్యూహం ద్వారా పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించేందుకు ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాడు. ఈ విషయంలో శత్రువు గుర్తించదగిన పురోగతిని సాధించి తీవ్రమైన నష్టాల్ని కలుగజేసాడు. 2009లో మరింత క్రూరమైన, విస్తారమైన, తీవ్రమైన అణచివేత వ్యూహంగా కుఖ్యాత 'గ్రీన్‌హంట్ ఆపరేషన్' పేరుతో ప్రజల మీద యుద్ధాన్ని ప్రారంభించాడు. ఫాసిస్టు పద్ధతులను వుపయోగించి మమ్ములను నిర్మూలించేందుకు ఒక బృహత్తర ప్రణాళిక తయారైంది. బలగాలకు శిక్షణనిచ్చి ప్రత్యే బలగాలతో సహా భారీ స్థాయిలో ప్రచారం చేస్తున్నాడు. ప్రతి ఆపరేషన్‌లోనూ భారీస్థాయి బలగాలతో వార్‌జోన్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రజాసంఘాల కార్యకర్తలను పెద్ద ఎత్తున అరెస్టులు చేయటం, ఇళ్ళను తగులబెట్టడం, ఆస్తులను, పంటలను ధ్వంసం చేయడంతో పాటు మేకలు, పందులు, కోళ్ల లాంటి కొద్దిపాటి పశు సంపదను లూటీ చేసి తీసుకుపోవటం లాంటివి దినచర్యలుగా మారాయి. బూటకపు ఎదురు కాల్పుల హత్యలు కొనసాగాయి. పార్టీ పట్టణ ప్రాంత యంత్రాంగాన్ని ధ్వంసం చేసాడు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను విప్లవోద్యమం నుండి బయటకు లాగేందుకు ప్రజలు సమిష్టిగా శ్రమించి నిర్మించిన కుంటలు, చెరువులు, చిన్న డ్యాముల లాంటి వ్యవసాయయోగ్య ఆధారాలను ధ్వంసం చేసి, బూటకపు ప్రభుత్వ సంస్కరణలను అమలు జరుపుతున్నారు. ఈ తీవ్రమైన ఫాసిస్టు దాడిలో మేం తీవ్రమైన నష్టాలను పొందాం. కేంద్ర కమిటీ నాయకత్వంలో మొత్తం పార్టీ, పి.ఎల్.జి.ఎ. ప్రజా మిలీషియా, ఆర్.పి.సి.ల నాయకత్వంలోని విప్లవ ప్రజలు, ప్రజాసంఘాలు తప్పుల నుండి నేర్చుకుని దృఢంగా నిలబడి మన ప్రయత్నాలను అధికం చేసి శత్రు దాడిని తిప్పికొట్టాం. అదే సమయంలో శత్రువుకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటం చేసాం. శత్రు ప్రచారాన్ని బహిర్గతం చేసి తిప్పికొట్టాం. ఈ పరిస్థితి దేశంలో రాజకీయ పోలరైజేషన్‌కి అనుకూల పరిస్థితిని కల్పించింది. అభ్యుదయకాముకులు, ప్రజాస్వామిక శక్తులు ముందుకు వచ్చి ప్రజల మీద యుద్ధమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని వ్యతిరేకించి విప్లవకారుల పక్షం వహించారు. భారత ప్రభుత్వ దాడికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త ప్రజాభిప్రాయాన్ని బలోపేతం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఒక ఉద్యమం కూడా చేపట్టబడింది. ఈ పరిస్థితి శత్రువు యొక్క మానసిక యుద్ధాన్ని తిప్పికొట్టడంలో మా సిద్ధాంత పటిమను స్పష్టపరుస్తున్నది.

ఇంతటి తీవ్ర అణచివేత క్యాంపెయిన్‌లో పి.ఎల్.జి.ఎ. చేసిన ఎత్తుగడల ఎదురుదాడులలో శత్రువు పెద్ద సంఖ్యలో నిర్మూలించబడ్డాడు. దానితో మరింత ఎక్కువ బలగాలతో ఆపరేషన్లు చేపట్టాడు. పట్టణ ప్రాంతాలలోనూ, మైదాన ప్రాంతాలలోనూ నాయకత్వాన్నీ, కేడర్‌నూ దెబ్బకొట్టిన శత్రువు ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లోని నాయకత్వాన్ని టార్గెట్ చేస్తున్నాడు. ఇప్పటికే వార్‌జోన్లలో ఐదు లక్షల కేంద్ర, రాష్ట్ర బలగాలను మోహరించిన శత్రువు ఇంకా కొన్ని వేల బలగాల్ని పెంచాలనే ప్రయత్నాల్లో ఉన్నాడు. డ్రోన్ విమానాల్ని ఉపయోగించాడు. ఎయిర్‌ఫోర్స్ ఇప్పటికే సహాయక పాత్రను పోషిస్తున్నది. సైన్యాన్ని దించడానికి తయారుగా ఉంచారు.

ఈ దాడుల్ని ఎదుర్కొనే క్రమంలో పదివేల బలగాల్ని ఉపయోగించి చేపట్టిన 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్లను పి.ఎల్.జి.ఎ. ధ్వంసం చేసి మంచి అనుభవాలను పొందింది. అమూల్యమైన ప్రజల సహకారంతో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి మూడు రోజుల పర్యంతం కూడా శత్రువుతో పోరాడి నాయకత్వాన్ని దెబ్బతీయాలనే శత్రు పథకాన్ని వమ్ము చేసారు. హెలికాప్టర్ల ద్వారా పోలీసు, పారామిలటరీ బలగాలను మోహరించాలనే శత్రు ఎత్తుగడలను పి.ఎల్.జి.ఎ., మిలీషియాలు కలిసి మామూలు తుపాకులతో హెలికాప్టర్ల మీద కాల్పులు జరిపి ఎదుర్కొన్నారు.

చుట్టివేతలను మరింత పకడ్బందీ గావించటం, కూంబింగ్‌లు, దాడులతో మా శ్రేణుల్లోని అత్యధిక మెజారిటీలో ఉక్కు సంకల్పాన్ని వెలికితీసాయి. అయితే మరోవైపు అవి మా మధ్యలోనే దాగి ఉన్న చెడు శక్తులను కొన్నింటిని కూడా బహిర్గతం చేసాయి. ప్రజాయుద్ధం మన దేశ పరిస్థితులకు తగదని నమ్మబలికే కొందరు లిక్విడేషనిస్టులు తమ ఓటమి వాదాన్ని కప్పిపుచ్చుకునే విఫలయత్నం చేస్తూ వివిధ సాకులు చూపి పారిపోయే పిరికిపందలు, శత్రువు విసిరే రొట్టె ముక్కలకు ఆశపడి ప్రజల్ని అమ్మివేసే ద్రోహులూ–ఈ కష్ట కాలంలో అటువంటి వారందరినీ ఒకరి తర్వాత ఒకరిగా బహిర్గతం చేసాయి. ప్రజల్లో కొందరు శత్రు పాశవిక బలం ముందు "లొంగిపోయారు". పదే పదే భారీగా జరిగే దాడులు గ్రామాల్లోని పార్టీ నిర్మాణాలకూ, దాని ఫలితంగా ఆర్.పి.సి.లకూ, ప్రజాసంఘాలకూ కూడా భారీగా హాని కలిగించాయి. ప్రజల్లోనే ఒక సెక్షన్ మునుపటిలా క్రియాశీలంగా లేదు (పాసివ్‌గా మారింది).

2013 మొదటి భాగం (త్రైమాసికం)లో కేంద్ర కమిటీ ఉద్యమం ఎదుర్కొంటున్న పరిస్థితిని సమీక్షించి దేశవ్యాప్తంగా మా శ్రేణుల్లో కొనసాగుతున్న బలహీనతలు ఒకే స్థాయిలో లేవని చెప్పింది. దేశవ్యాప్తంగా మన ఉద్యమం కఠిన పరిస్థితిని ఎదుర్కొంటోందని నిర్ధారించింది. పార్టీలోనూ దేశవ్యాప్త విప్లవ పరిస్థితిలోనూ తారతమ్యాలే ఈ పరిస్థితి ఉత్పన్నం కావటానికి కారణాలని అంచనా వేసింది. అభివృద్ధి చెందుతున్న మా ఉద్యమాన్ని భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల సంపూర్ణ మద్దతు, గైడెన్స్‌తో నిర్మూలించాలని కనీవినీ ఎరుగని రీతిలో దేశవ్యాప్త బహుముఖ దాడిని ఆరంభించాయి. మేం కొన్ని నష్టాలను పొందాం. శత్రుబలగాల బలాధిక్యత వల్ల కొన్ని ప్రాంతాలలో

వెనక్కి తగ్గాం. రెండవ విషయం. విప్లవ యుద్ధంలో మారుతున్న పరిస్థితుల కనుగుణంగా పద్ధతులను మార్చుకోవటంలో వెనుకబడటం, కార్మికవర్గ వ్యతిరేక ధోరణులు పార్టీలో, పి.ఎల్.జి.ఎ.లో కొనసాగటంతో నష్టాలను నివారించుకోవటంలో వైఫల్యం చెందాం. కేంద్రకమిటీ ఈ పరిస్థితిని అధిగమించే విధంగా తయారు కావాలనీ, పార్టీ అంతటా ఎం.ఎల్.ఎం. సిద్ధాంతంపై ఎద్యుకేషన్ అందించాలనీ, పార్టీ మౌలిక రాజకీయ మిలటరీ పంథాలపై విద్య గరపాలనీ, పార్టీ పనిశైలినీ, పి.ఎల్.జి.ఎ. పోరాట శైలినీ ద్విగుణీకృతం చేయాలనీ, ఆచరణ నుండి పాఠాలు నేర్చుకోవాలనీ, తప్పులను లోటుపాట్లను సరిదిద్దుకుని పార్టీని బలోపేతం చేయాలనీ, పి.ఎల్.జి.ఎ.నూ, ప్రజాపునాదిని పెంచుకోవడం ద్వారా మొత్తంగా– పార్టీని బోల్షివీకరించుకోవటం ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలనీ కేంద్రకమిటీ పిలుపునిచ్చింది. పరిస్థితి ఏదైనప్పటికీ దాన్ని ఎదుర్కోవటానికి శక్తివంతమైన ఆయుధంగా మారాలనీ పిలుపిచ్చింది. మార్క్సిజం–లెనినిజం–మావోయిజం మన సిద్ధాంతం. దానిని వంటబట్టించుకుని ఆ ఆయుధాన్ని మరింత దృఢంగా చేబట్టాలి. ఇదే పార్టీ బోల్షివీకరణలోని కీలకమైన అంశం. ప్రస్తుతం ఈ బోల్షివీకరణ క్యాంపెయిన్ పార్టీలో కొనసాగుతోంది. మొత్తం పార్టీ పై స్థాయి నుండి కింది వరకు శ్రేణులన్నీ–తమ సామర్థ్యాలను పెంచుకొని శతృదాడిని ఓడించాలి.

తీవ్రమైన శతృదాడి మధ్యనే గత 15 నెలలుగా ఉద్యమాన్నీ, నాయకత్వాన్నీ కాపాడుకోవటానికి శ్రద్ధ పెట్టాము. ఇటీవలి కాలంలో ప్రజల మద్దతుతో పి.ఎల్.జి.ఎ. ఎత్తుగడల ఎదురుదాడులను నిర్వహించి శతృబలగాలను నిర్మూలించింది. ఆయుధాలను అమ్యునిషన్‌ను స్వాధీనపర్చుకుంది. వేలాది మంది ప్రజలు, ప్రజామిలీషియా, పి.ఎల్.జి.ఎ. నాయకత్వంలో రోడ్డు నిర్మాణ పరికరాలనూ, వాహనాలనూ, అతిథి గృహాలనూ, ప్రభుత్వ మరియు పెద్ద నిర్మాణ మైనింగ్ కంపెనీల క్యాంపు ఆఫీసులనూ ధ్వంసం చేసారు. మొత్తం పార్టీలో బోల్షివీకరణ క్యాంపెయిన్ ప్రారంభంతో పి.ఎల్.జి.ఎ. ప్రజాసంఘాలు, ఐక్యసంఘటన సంస్థలలో ఇప్పటికే మంచి ఫలితాలను సాధించగలిగాము. దీనిని ఇతర వ్యూహాత్మక ప్రాంతాలకు విస్తరించాలి. గతంలో రిట్రీట్ అయిన ప్రాంతాలలో తిరిగి ఉద్యమాన్ని నిర్మించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. కొంత బలహీనపడిన ప్రాంతాలలో బోల్షివిక్ స్పిరిట్‌తో పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఇంతటి నష్టాల, కష్టాల మధ్యనే సహ్యాద్రి పర్వత శ్రేణుల (పశ్చిమ కనుమలు) కర్ణాటక, కేరళ, తమిళనాడు బోర్డర్‌లో కొత్త యుద్ధరంగాన్ని ప్రారంభించాం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలకవర్గాల ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలను రహస్య మరియు బహిరంగ రూపాలలో కదిలించేందుకు మా పార్టీ ప్రయత్నాలను చేస్తోంది. వేలాది మంది ర్యాలీలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర బలగాలను తొలగించాలని వారి కోపాన్ని వ్యక్తపరిచారు. బూటకపు ఎన్‌కౌంటర్లనూ, సామూహిక హత్యాకాండలనూ, చట్టవ్యతిరేక అరెస్టులనూ, మహిళలపై అత్యాచారాలనూ, గ్రామాలపై దాడులనూ, ప్రజల సంపత్తిని లూటి చేసి విధ్వంసం చేయడాన్ని నిరసించి రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఆర్.పి.సి.లు ప్రజలను కదిలించి విప్లవ భూసంస్కరణలనూ మరియు ప్రజాసంక్షేమ కార్యక్రమాలనూ అమలు జరిపాయి. ఈ కార్యక్రమాలలో పి.ఎల్.జి.ఎ. కూడా పాల్గొన్నది. సల్వాజుడుం నిర్మాత, సల్వాజుడుం అరాచకాలకు ప్రధాన సూత్రధారి మహేంద్రకర్మను వధించడం ఒక గొప్ప విజయం. పార్టీ పిలుపునందుకుని ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలనూ, బీహార్–ఝార్ఖండ్, ఒడిశాలోని కొన్ని గ్రామీణ ప్రాంతాలలో, ఏ.ఓ.బి.లోని ప్రాంతాలలో వేలాది కిరాయి మూకలను ఎదుర్కొని బూటకపు ఎన్నికలను బహిష్కరించారు. మైనింగ్ జరుగుతున్న కొన్ని ఆదివాసి ప్రాంతాలలో విస్థాపనకు, విధ్వంసకర ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మెజారిటీ ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించారు.

ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లో భాగంగా మధ్య, తూర్పు భారతదేశంలోని యుద్ధ రంగాలలో ప్రజల చేత బలవంతంగా ఓట్లు వేయించటానికి వచ్చిన ప్రభుత్వ బలగాల మీద పి.ఎల్.జి.ఎ. ఎత్తుగడల ఎదురుదాడులను విజయవంతంగా నిర్వహించింది. "ఈ ప్రాంతాలను మావోయిస్టుల నుండి స్వాధీనం చేసుకున్నాం. అవి మా కంట్రోల్‌లోనే ఉన్నాయని" శత్రువు ప్రకటించిన ప్రాంతాలలోనే కొన్ని దాడులు జరిగాయి. 2014 మొదటి ఐదు నెలల కాలంలో, ఎన్నికల సమయంలోనే 31 చర్యలు జరిగి 63 శత్రు మూకలు నిర్మూలించబడగా, 122 మంది గాయపడ్డారు. ఒక పి.ఎల్.జి.ఎ. యోధుడు ఈ దాడుల్లో అమరత్వం చెందాడు. 36 ఆయుధాలనూ, 3366 తూటాలను స్వాధీనం చేసుకున్నాం. దేశవ్యాప్తంగా రెండు పెద్ద విశేష కార్డన్ అండ్ సెర్చ్ క్యాంపెయిన్ల కాలంలోనే శతృవు మీద ఈ దాడులు జరగటం విశేషం. వివిధ గెరిల్లా జోన్లలో పి.ఎల్.జి.ఎ కొనసాగించిన గెరిల్లా చర్యల కారణంగా మన ముఖ్యమైన ప్రాంతాలలో పెద్దఎత్తున బలగాలను మోహరించాలనుకున్న శతృవు తన పథకాన్ని విరమించుకుని విశాల ప్రాంతాలకు తన బలగాల్ని పంపించుకునే పరిస్థితికి నెట్టబడ్డాడు. అదనపు బలగాల కొరత కారణంగా ఇటువంటి క్యాంపెయిన్లను దేశంలోని ఇతర ప్రాంతాలలో కొనసాగించలేక కేవలం డి.కె.లోని బీజాపూర్, కొన్ని ప్రాంతాలలో మాత్రమే శత్రు క్యాంపెయిన్ కొనసాగింది.

శతృవు వ్యూహాత్మక "కార్పెట్ సెక్యూరిటీ" నెట్‌వర్క్‌లో భాగంగా పెద్ద సంఖ్యలో 2 నుంచి 6 కిలోమీటర్ల మధ్య భారీ స్థాయి ఫోర్టిఫైడ్ క్యాంపుల ద్వారా గెరిల్లా బేస్‌లనూ, యుద్ధజోన్లనూ చుట్టుముడుతూ వస్తున్న పథకానికి వ్యతిరేకంగా కొత్త పోరాట రూపాలు ఉనికిలోకి వస్తున్నాయి. రెండు సంఘటనలలో పి.ఎల్.జి.ఎ. తనకు తానుగానూ, ప్రజా మద్దతుతో అటువంటి క్యాంపులను రోజుల తరబడి సాయుధ చికాకు చర్యలతో చికాకుపరచటంతో ఆ క్యాంపులను ఎత్తేసుకోవటం జరిగింది. ఈ పోరాటల్లో మహిళల పాత్ర శ్లాఘనీయమైనది. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలలో కిరాయి ప్రభుత్వ బలగాలు ప్రజల మధ్య పంచిన వస్తువులను తిరస్కరించటమో లేదా ఆ వస్తువులను కుప్పగా పోసి తగులబెట్టటమో జరిగింది.

ఇదే కాలంలో గత 15 నెలల సమయంలో సి.పి.ఐ. (మావోయిస్టు) పార్టీలో సి.పి.ఐ (ఎం.ఎల్)నక్సల్బరీ పార్టీ విలీనం కావటం మరో ముఖ్యమైన విజయం. దేశంలో నిజమైన విప్లవకారులు ఐక్యతను సాధించే కృషిలో ఇది ఒక మలుపు. ఐక్యతా ప్రకటనలో ప్రకటించినట్లుగా ఈ ఐక్యత పార్టీ శక్తిసామర్థ్యాలు మరింత పెరిగి దేశ విప్లవానికి నాయకత్వం వహించే అగ్రగామి పాత్రను సమర్థవంతంగా

నిర్వహించేందుకు తోడ్పడుతుంది. తీవ్ర శత్రుదాడుల మధ్యనే జరిగిన మావోయిస్టుల ఈ ఐక్యత మొత్తం పార్టీనీ, పి.ఎల్.జి.ఎ.నీ, విప్లవ ప్రజానీకాన్ని గొప్పగా ఉత్సాహపరిచింది. అంతర్జాతీయ స్థాయిలో కూడా దీనిని ఉత్సాహంగా స్వాగతించారు.

మొత్తంగా చూస్తే మేమింకా గడ్డు పరిస్థితిలోనే ఉన్నాం. కాని దృఢసంకల్పంతో పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొని దానిని అధిగమించేందుకు ముందుకే పోతాం. మా కర్తవ్య సాధనకు మీరందిస్తున్న సంఘీభావం గొప్పగా దోహదపడుతుందని మేం భావిస్తున్నాం. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆపివేసేందుకు ఒక బలమైన క్యాంపెయిన్‌ని నడపాలనే అవసరాన్ని గుర్తించటంలో మాతో ఏకీభావం కుదిరినందుకు మేం సంతోషిస్తున్నాం. ఈ క్యాంపెయిన్, భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా జరిగే సంఘీభావ ఉద్యమమూ రెండూ ఒకదానికొకటి చేదోడువాదోడుగా ఉంటాయి. ఈ విప్లవ ప్రతీఘాతుక దేశవ్యాప్త బహుముఖ శత్రుదాడిని ఓడించటమే మాముందున్న తక్షణ కర్తవ్యం.

ప్రతి విప్లవమూ అలలు అలలుగానే పురోగమిస్తుంది. అది చారిత్రక నియమం. క్లిష్ట సమయంలో మేము మా సైద్ధాంతిక స్థాయిని పెంచుకుని, రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచి విప్లవ సందేశాన్ని విశాల ప్రజల్లోకి లోతుగా తీసుకొనిపోయి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని సృజనాత్మకంగా అన్వయిస్తూ ఎత్తుగడలను అభివృద్ధి చేసుకుంటూ మా రాజకీయ, నిర్మాణ, ప్రచార, శిక్షణ, సాంస్కృతిక, ఉత్పత్తి, సాంకేతిక, ఇతర కర్తవ్యాలలో కమ్యూనిస్టు-నిపుణులుగా (రెడ్ అండ్ ఎక్స్‌పర్ట్) ఉంటూ మరింత దృఢంగా అంకితమై త్యాగాలకు సిద్ధంగా వుండాలి. ఆ విధంగా చేయటం ద్వారా మాత్రమే ఈ పరిస్థితి నుండి మరింత ఐక్యంగా, మరింత క్రమశిక్షణతో, మరింత ధైర్యంతో, మరింత శక్తివంతంగా సంఘటితపడి మరింత గతిశీలంగా అభివృద్ధి చెందగలుగుతాం. గత మహత్తర విప్లవ పోరాటాల నుండి ఈ పాఠాలే లభించాయి. మహోపాధ్యాయుల బోధనలలో ఇవే సారాంశాలుగా ఉన్నాయి. విప్లవ యుద్ధపు ప్రతి మలుపులోనూ ప్రజలతో సంబంధాలను లోతుగానూ, ఉన్నత స్థాయిలో బలోపేతం చేసుకోవాలని వారు మనకు బోధించారు. ఉద్యమం ప్రతి ముఖ్య దశలోనూ మా రాజకీయ స్థాయిని పెంచుకోవటమే గాక ప్రజల రాజకీయ స్థాయిని కూడా పెంచాల్సిన కర్తవ్యం మళ్ళీ ముందుకు వస్తుంది. ప్రజల విప్లవ చొరవను, విప్లవ శక్తిని మరింత శక్తివంతంగా వెలికి తీసేందుకు ఈ కర్తవ్యాన్ని ధైర్యంగా చేపట్టాలి. గత పది సంవత్సరాల కాలంలో భారతదేశ ప్రజాయుద్ధంలో ఇవే మా విజయాలు, వైఫల్యాలు. ఈ విధంగా ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని ముందుకు తీసుకుపోయేందుకు మేము ఈ విధంగా కృషి చేస్తున్నాం.

**కామ్రేడ్స్!**

గత దశాబ్దిలో అంతర్జాతీయ స్థాయిలో కొన్ని ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. వాటిలో కొన్నిటిని మీ దృష్టికి తీసుకు రాదలిచాం. గత దశాబ్ది మొదట్లో ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న గ్లోబలైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు తిరగబడటంతో ప్రజాయుద్ధాలు, సాయుధ విముక్తి పోరాటాలు బలోపేతం అయ్యేందుకు తోడ్పడ్డాయి. కార్మికవర్గ భావజాలమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మరింత నిశితంగా స్థిరపడింది. ప్రపంచవ్యాప్తంగానూ, వివిధ దేశాల్లోనూ దీని ప్రభావంతో మావోయిస్టు శక్తుల మధ్య మరింత ఐక్యత ఏర్పడటానికి పరిస్థితులు బలపడ్డాయి. విప్లవపు నూతన తరంగాలను మనం చూడవచ్చు. దీనికి ప్రతిగా, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రజల పై ప్రపంచవ్యాప్త భారీస్థాయి విప్లవ ప్రతీఘాతుక దాడిని ప్రారంభించింది. టెర్రరిజంపై యుద్ధం పేరుతో చలామణి అవుతున్న దానిలో ఇదే ప్రధానం కాగా అన్ని సామ్రాజ్యవాద శక్తులూ, ప్రతీఘాతుక శక్తులు దానిలో చేరటమో లేదా మద్దతునివ్వటమో చేస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై ఆక్రమణ యుద్ధాలూ, ప్రజాస్వామిక హక్కుల కోత, ప్రజాపోరాటాల మీద దాడులు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఫాసిజం, సాయుధ పోరాటాలు, ప్రజాయుద్ధాలు, మావోయిస్టు పార్టీలకు వ్యతిరేకంగా తీవ్రమవుతున్న అణచివేత క్యాంపెయిన్లు-ఇవే వీటి ప్రధాన లక్షణాలు. ఒకే ఒక అగ్రరాజ్యమైన పొగరుబోతు అమెరికా సామ్రాజ్యవాదానికి పతనం ఆరంభమైంది. ఇరాక్ మీద యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త పోరాటాలు ప్రారంభమై యుద్ధం తర్వాత కూడా కొనసాగుతున్నాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో కూరుకుపోయిన దురాక్రమణదారులకు శక్తివంతమైన ప్రతిఘటన ఎదురవటంతో వారి పథకాలు తారుమారయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా వారి ఆధిపత్యానికి ఎదురు తిరిగి గ్లోబలైజేషన్, ఉదారీకరణ, ప్రైవేటీకరణ విధానాల వలన జరిగే వినాశనాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తున్నారు. ప్రజాయుద్ధాలు ముందుకు పోతున్నాయి. ఈ కారణాల వల్ల అమెరికా సామ్రాజ్యవాదం కొద్ది సంవత్సరాల్లోనే తన ఎత్తుగడలను మార్చుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడింది. బుష్ స్థానంలో ఒబామాని నిలిపారు. దశాబ్దాల యుద్ధం స్థానంలో బలగాలను మోహరించక పోవడమూ, బలగాలను ఉపసంహరించుకోవటం లాంటి ఆపత్కాల పథకాలు ముందుకు వచ్చాయి. ఇది ప్రపంచంలో అనుకూల పరిస్థితికి ఒక స్పష్టమైన సూచిక. అమెరికా సామ్రాజ్యవాదం బలహీనపడుతున్న సందర్భంలో మరో వైపున సామ్రాజ్యవాద శక్తుల మధ్య పోటీలో భాగంగా రష్యన్ సామ్రాజ్యవాదం తన వాటా కోసం ముందుకు వస్తోంది.

తీవ్రతరమవుతున్న సామ్రాజ్యవాద సంక్షోభం 2008 సంక్షోభంతో మరింత తీవ్రమైందని మనందరికి తెలుసు. సామ్రాజ్యవాద దేశాల్లోనూ, పీడిత దేశాల్లోనూ లక్షలాది ప్రజలు వీధుల్లోకి వచ్చి రాజ్య ప్రతీఘాతుక బలగాలతో బాహాబాహీ యుద్ధాలు చేసారు. కార్మికులు ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు మొత్తం నగరాల్ని ఆక్రమించి ప్రభుత్వాన్ని స్తంభింపజేసారు. విద్యార్థులు, యువజనులు, మహిళలు, కార్మికులు, కాందిశీకులు, పెన్షనర్లు-అందరూ పోరాటంలోకి వచ్చారు. ఎంతో అనుభూతినిచ్చిన అరబ్ తిరుగుబాట్లు ఇంకా మన హృదయాల్లో పదిలంగానే ఉన్నాయి. ప్రజల ద్వేషానికి గురైన అనేక నియంతృత్వాలు నిరంతరం కొనసాగిన పోరాటాలతో తొలగించవేయబడ్డాయి. ఈ పోరాటాల వెల్లువ ప్రజల కోరికలకు అనుగుణమైన నిజమైన ప్రజాస్వామ్యం, దోపిడి లేని ప్రజాపాలన వంటి వ్యవస్థలు ఏర్పడలేదు. కాని ఈ సమాజాలను తీవ్రంగా అతలాకుతలం చేసాయి. ఇవి ప్రపంచ ప్రజలలో ఆశను రేకెత్తించాయి. ఫలితాలు ఖచ్చితంగా లభిస్తాయి. ఇదే నేటి ప్రపంచ పరిస్థితి. కొత్త విప్లవ తరంగాలు మొదలవటానికి గల మంచి అవకాశాలను నేటి పరిస్థితి తెలియచేస్తోంది. కాని దీనికి మరో కోణం కూడా ఉంది. అదే విద్రోహాలు. చరిత్రలో మరొకసారి అంతర్జాతీయ

కమ్యూనిస్టు ఉద్యమంలో మంచి అనుకూల వాతావరణంలో ఫలితాన్ని రానివ్వకుండా రివిజనిజం అడ్డుకున్నది. ముఖ్యంగా చెప్పాల్సి వస్తే నేపాల్‌లో ప్రచండ-భట్టారాయ్‌ల ముఠా నాయకత్వం నేపాల్ ప్రజాయుద్ధానికి ద్రోహం చేసి చాలా నష్టాన్ని కలిగించింది. ప్రజాస్వామిక ముసుగు తగిలించుకుని ప్రజారక్షకులుగా ఫోజు పెడుతూ ప్రజలను నిజం తెలుసుకోనీయకుండా ప్రజాస్వామ్య నాటకాలాడే ప్రజాశత్రువుల ముసుగులు విప్లవ ప్రజల ముందు బహిర్గతమయ్యే అవకాశం ఈ విద్రోహం మూలంగా చేజారిపోయింది. కమ్యూనిజం స్థాపన కోసం మావోయిస్టుల నాయకత్వంలో ప్రారంభమైన ప్రజాయుద్ధాలను సామ్రాజ్యవాద వ్యతిరేకంగానూ, విశాల ప్రజారాశులను గెల్చుకుని వీటిని ఒక సమీకరణ కేంద్రంగా మలచుకొనే అవకాశం వీరివల్ల చేజారిపోయింది. మరోవైపు విచ్ఛిన్నకారులు మన సిద్ధాంతం మీద దాడి చేసి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత పతాకను తొలగించి దాని స్థానంలో డొల్లవాదనలు చేస్తున్న అవాకియనిజాన్ని ప్రవేశపెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివల్ల అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒకప్పుడు గౌరవస్థానాల్లో ఉన్న కొన్ని మావోయిస్టు పార్టీలు పతనమైపోయాయి. మావోయిస్టు పార్టీలను సంఘటితం చేసే, కొత్త వాటిని నిర్మించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కాని జరిగిన నష్టానికి పైవన్నీ సాక్షీభూతాలుగానే నిలుస్తాయి. ప్రపంచ కార్మికవర్గ విప్లవోద్యమంలో గణనీయమైన స్థాయిలో స్వీయాత్మక శక్తులు బలహీనపడ్డాయి. దీనికి కారణం విప్లవ క్యాంపులోని అంతర్గత శత్రువులే తప్ప శత్రు దమనకాండ కాదు.

పెంపొందుతున్న విప్లవ పరిస్థితికి, మావోయిస్టు శక్తుల స్వీయాత్మక సామర్థ్యానికి ఒక స్పష్టమైన గ్యాప్ ఉంది. ఇదొక వైరుధ్యం. దీనిని మనం తప్పనిసరిగా ఎదుర్కోవాలి. మన కార్యకలాపాలన్నీ దానిని అధిగమించటంపై కేంద్రీకరించాలి. ప్రపంచవ్యాప్తంగా పీడిత మరియు దోపిడికి గురవుతున్న ప్రజల గాఢమైన ఆకాంక్ష ఇదే. కాలం దీనిని డిమాండ్ చేస్తోంది. మావో చెప్పినట్లుగా "కాలాన్ని గంటల్ని చేజారనివ్వకండి".

సామ్రాజ్యవాద వ్యతిరేక విశాల ఐక్యవేదికను ప్రపంచవ్యాప్తంగా ఏర్పరిచే దానిలో భాగంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఆపివేయాలనే క్యాంపెయిన్‌ని బలోపేతం చేసేందుకు సాధ్యమైనంత సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులనూ, ప్రజాస్వామిక మరియు విప్లవ శక్తులను కదిలించేందుకు తీవ్రంగా కృషి చేయటమే కమ్యూనిస్టు శక్తుల ముందున్న ప్రథమ మరియు తక్షణ కర్తవ్యమనీ మా పార్టీ విశ్వసిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు శక్తుల ఐక్యత మరింత బలపడటం ద్వారా భారత విప్లవానికి కూడా బలమైన మద్దతు ఉంటుంది.

నేడు వివిధ పార్టీల స్వీయాత్మక శక్తుల సామర్థ్యాల కంటే భౌతిక పరిస్థితి అనుకూలతే ముందంజలో ఉంది. కమ్యూనిజం కోసం విశాల ప్రజారాశులను గెలుచుకునేందుకు విప్లవశక్తులు ఐక్యతతో ఎంతో చేయాల్సి ఉంది. ఇటీవలి కాలంలో ఉమ్మడిగా మేడే ప్రకటనలు, ముఖ్యమైన పరిణామాలపై సెమినార్‌లు, నయా రివిజనిజానికి వ్యతిరేక పోరాటాన్ని బలోపేతం చేసేందుకు మావోయిస్టు పార్టీల అనుభవాలను మదింపు వేసేందుకు సెమినార్లు, ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించేందుకు అంతర్జాతీయ సపోర్టు కమిటీల వంటి ఉమ్మడి వేదికలు మరియు సంఘీభావ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రయత్నాలను మేము స్వాగతించాం. మరియు వాటికి మద్దతును కొనసాగిస్తాం. ఈ కార్యక్రమాల ద్వారా ఏర్పడిన సన్నిహిత సంబంధాలను మరింత బలోపేతం చేస్తాం. సైద్ధాంతిక, రాజకీయ అంశాల్లో పెరుగుతున్న ఐక్యత మరింత పురోగమనానికి పునాదిగా ఉపయోగపడుతుంది.

భారత విప్లవం ప్రపంచ విప్లవానికి సేవ చేసినట్లే దాని భవిష్యత్తు మావోయిస్టులు ప్రపంచ వ్యాప్త విప్లవ పరిస్థితి ఎంత అనుకూలంగా మలుస్తారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. అలాగే అది ప్రపంచ విప్లవ పురోగమనానికి లింకుగా ఉంటుంది. హాంబర్గ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో విప్లవం పట్ల వ్యక్తపరచబడిన గాఢమైన కోరికతో మా విశ్వాసం మరింత పెరిగింది. వివిధ దేశాలలోని విప్లవోద్యమాలకు సంఘీభావాన్ని వ్యక్తపరిచే మంచి పద్ధతిగా మేం భావిస్తున్నాం. ప్రపంచ కార్మికవర్గపు అగ్రగామి దళపు డిటాచ్‌మెంట్‌లో భాగంగా మా పార్టీ నక్సల్బరీ వారసత్వాన్ని ఎత్తిపడుతూ మా దేశంలో కొనసాగిస్తున్న నూతన ప్రజాస్వామిక విప్లవం ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగమే. మా దేశ విప్లవంలో చేయబడిన అనన్యమైన త్యాగాలు ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా ఆయా దేశాలలో చేస్తున్న త్యాగాలలో, అమరత్వాలలో అంతర్భాగమే.

చివరిగా ముగించే ముందు భారతదేశ ప్రజాయుద్ధానికి మద్దతుగా మీరు చేసే ప్రయత్నాల గురించి కొద్దిగా మాట్లాడదలిచాం. మీ క్యాంపెయిన్ల వార్తలు, వివరమైన ఫోటోలు, చిత్రాలు మా కార్యకర్తల, పి.ఎల్.జి.ఎ యోధుల మరియు విప్లవ ప్రజానీకం వద్దకు విస్తృతంగా మా బహిరంగ, రహస్య పత్రికల ద్వారా, వివిధ పద్ధతుల ద్వారా తీసుకుపోతున్నాము. వివిధ దేశాలలో మిలిటెంట్ సంఘీభావ ప్రదర్శనలలో భారత రాయబార కార్యాలయాల ముందు మీరు చేసిన ప్రదర్శనలూ, వాల్ రైటింగ్‌ల ద్వారా ఈ విప్లవ సందేశాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్ళటం - ఈ మొత్తం క్యాంపెయిన్ గూర్చి తెలుసుకున్న మా పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజనీకం మేం ఒంటరిగా లేమనీ, మా సోదర సోదరీమణులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారనీ గ్రహించి మా హృదయాలు గర్వంతో ఉప్పొంగాయి. మీ కార్యకలాపాలు మమ్మల్ని ఉత్తేజపరిచాయి. అవి మమ్మల్ని కర్తవ్య సాధనకు మరింత అంకితమయ్యేలా చేసాయి. మీరు మాపై ఉంచిన విశ్వాసాన్ని పూర్తి చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తాం. మా భవిష్యత్తు ప్రపంచ విప్లవ భవిష్యత్తులోనూ, ప్రపంచ కార్మికవర్గ భవిష్యత్తులోనూ ఉంది. పీడిత జాతుల, పీడిత ప్రజల భవిష్యత్తు కూడా ప్రకాశవంతంగా ఉంది. కాని మార్గం కంటకావృతం, కఠినం, వంపులతో కూడి ఉంది. మన శత్రువుల, సామ్రాజ్యవాదుల, వారి తైనాతీల భవిష్యత్తు చీకటిగానూ, అనివార్యంగా వినాశనం దిశగా ముగుస్తుంది.

**సెప్టెంబర్ 10, 2014** | **విప్లవాభివందనాలతో**

**కేంద్రకమిటీ**

**సి.పి.ఐ.(మావోయిస్టు)**

# నిరాహార దీక్ష కాదు, సాయుధ పోరాటమే ఏకైక మార్గం!

## సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం రద్దుకు పోరాడుదాం!

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ)–1958ని రద్దు చేయాలనే డిమాండ్‌తో దాదాపు 16 ఏళ్ల నుండి నిరాహార దీక్ష చేసిన ఇరోం షర్మిల ఆగస్ట్ 9న తన దీక్షను విరమించింది. ఈ చట్టాన్ని రద్దు చేయాలని షర్మిల ఎందుకు కోరుకుంటున్నది? మధ్యలోనే దీక్షను ఎందుకు వదిలేసింది? అలా వదిలేయడం సరైనదా? కాదా? ఈ ప్రశ్నల గురించి చర్చించే ముందు ఈ చట్టాన్ని గురించి కొంత తెలుసుకుందాం.

మన దేశంలో, ఆ మాటకొస్తే ఏ దేశంలోనైనా హక్కులనేవి పాలకులు వల్లెవేయడానికీ, గొప్పలు చెప్పుకోవడానికి తప్ప సాధారణ ప్రజలకు అందుబాటులో వుండవు. పాలకుల చేతిలో అవి అపహాస్యం పాలవుతుంటాయి. హత్య చేయబడుతుంటాయి. జీవించే హక్కు అందుకు మినహాయింపేమీ కాదు. పాలకుల విధానాల వల్ల పోతున్న ప్రాణాల గురించి కాదు, ఇక్కడ మాట్లాడుకుంటున్నది మనుషులను పట్టుకొని హత్య చేయడం గురించి. సాధారణంగా ఈ హత్యలకు పాలకులు పెట్టే పేరు ఎన్‌కౌంటర్. కొన్ని సార్లు ఈ హత్యలు లాకప్ హత్యలు, ఉరిశిక్షల రూపంలో కూడా వుంటాయి. అయితే ఈ హత్యలకు పాల్పడిన సందర్భాల్లో సాయుధ బలగాలు, లేదా పాలకులు ఆ మరణం పరస్పర కాల్పుల వల్లనో, లాకప్‌లో జరిగిన ఆత్మహత్య వల్లనో సంభవించినట్టుగా చిత్రీకరిస్తారు. ప్రజలు నమ్మరని తెల్సికూడా అబద్ధాలే చెబుతారు తప్ప 'మేమే చంపాం' అని చెప్పరు. ఎందుకంటే అట్లా చంపడానికి వాళ్లకు చట్ట ప్రకారం అనుమతి లేదు. డబ్బుకూ, అధికారానికీ ఎంత ఊడిగం చేసే చట్టాలైనా నేరం, అందులోనూ హత్యా నేరం చేశామని ఒప్పుకునే వాళ్లను కనీసంగానైనా శిక్షించకమానవు. ఇట్లా చిత్రీకరించే, నమ్మించే ప్రయత్నం చేసే 'కష్టం' కూడా సాయుధ బలగాలకు కలగకుండా, సాయుధ బలగాలు చేసే హత్యలకూ, అత్యాచారాలకూ, చిత్రహింసలకూ, అరెస్టులకూ, గృహ దహనాలకూ ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త విధ్వంసానికీ లైసెన్సిచ్చే చట్టం ఒకటుంది. అదే సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం –1958.


తేనె బొట్టుతో దీక్షను విరమిస్తున్న షర్మిల

1958లో తయారైన ఈ చట్టం మొదట అసోం, మణిపూర్, నాగాలాండ్‌లోని పర్వత ప్రాంతాల్లో అమలయ్యేది. 1972లో దీన్ని ఈశాన్య ప్రాంతమంతటికీ (అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర, మిజోరాంలకు) విస్తరించారు. బ్రిటిష్ ఆక్రమణకు ముందు ఈశాన్య ప్రాంతం విడి విడి స్వతంత్ర జాతుల, తెగల పాలనలో వుండేది. బ్రిటిష్ వాళ్లు ఈ ప్రాంతాన్ని బలవంతంగా తమ వలస సామ్రాజ్యంలో ఒకటైన భారత దేశంలో కలుపుకున్నారు. బ్రిటిష్ వాళ్లు వెళ్లి పోయిన తర్వాత భారత్‌లో వలస పాలన ప్రత్యక్షంగా అంతమైంది. కానీ ఈశాన్య ప్రాంతంలో మాత్రం కొనసాగింది. ఇప్పుడది భారత్‌కు వలసగా మారింది. బ్రిటిష్ పాలనలో మొదలైన ఈశాన్య జాతుల స్వాతంత్ర్య పోరాటం నేటికీ కొనసాగుతున్నది. ఈ న్యాయమైన పోరాటాలను అణచడానికి అర్ధ సైనిక బలగాలనూ, సైన్యాన్ని దించిన పాలకులు ఆ బలగాలకు విచ్చలవిడి అధికారాలను కట్టబెట్టడం కోసం ఈ చట్టాన్ని చేసింది. ఇదే చట్టాన్ని సిక్కు జాతి ప్రజల పోరాటాన్ని అణచివేయడానికి పంజాబు, చండీగర్‌లకు వర్తించేలా సాయుధ బలగాల (పంజాబు, చండీగర్) ప్రత్యేక అధికారాల చట్టం పేరుతో 1983లో చేశారు. కశ్మీరీ ప్రజల ఆజాదీ ఆకాంక్షను కాలరాయడానికి కూడా ఇదే చట్టాన్ని 1990లో సాయుధ బలగాల (జమ్మూ–కశ్మీర్) ప్రత్యేక అధికారాల చట్టం పేరుతో తీసుకొచ్చారు.

ఈ చట్టంలోని సెక్షన్ 4 ద్వారా సాయుధ బలగాలకు దారుణమైన అధికారాలను కట్టబెట్టారు. దీని ప్రకారం ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నిషేధాజ్ఞలు అమల్లో వున్నప్పుడు అయిదు లేక అంతకంటే ఎక్కువ మంది గుమికూడినా, ఆయుధాలు కలిగి వున్నా, ఏ పరికరాన్నైనా ఆయుధంగా ఉపయోగించినా కాల్పులు జరిపి చంపవచ్చు. సాయుధ గ్రూపులు దాగి వుండే ప్రదేశాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేయవచ్చు. నేరం చేస్తారని అనుమానం వున్నా చాలు ఎవరినైనా వారెంట్ లేకుండా అరెస్టు చేయవచ్చు. అరెస్టు చేసేప్పుడు బలప్రయోగం చేయవచ్చు. వారెంటు లేకుండా సోదాలు చేయవచ్చు. సోదా చేసే క్రమంలో బలప్రయోగం చేయవచ్చు. ఇక్కడ సాయుధ బలగాలు అంటే వైమానిక బలగాలు కూడా కనుక వైమానిక దాడులు కూడా చేయవచ్చు.

అంటే ఈ చట్టం ప్రకారం ఎవర్ని ఎప్పుడైనా చంపొచ్చు, అరెస్టు చేయొచ్చు, చిత్రహింసలు పెట్టొచ్చు, ఇండ్లు, ఆస్తులు ధ్వంసం చేయొచ్చు. ఎందుకు చంపావంటే శాంతి భద్రతలకు విఘాతం కల్గించారనొచ్చు. ఎందుకు అరెస్టు చేశావంటే నేరం చేస్తారనే అనుమానం వుందనొచ్చు. ఎందుకు ధ్వంసం చేశావంటే మిలిటెంట్లు దాక్కున్నారని అనవచ్చు.

అసలు ఎందుకు చేశావని అడిగేది ఎవరని? ఈ చట్టం అట్లా అడిగే అవకాశాన్ని కూడా ఇవ్వదు. అట్లా అడగడమంటే గురి పెట్టిన తుపాకీకి ఎదురుగా నిలబడడమే. ఈ చట్టంలోని సెక్షన్ 6 సాయుధ బలగాలకు నేర విచారణ నుండి రక్షణ కల్పిస్తుంది. ఈ సెక్షన్ ప్రకారం సాయుధ బలగాలకు చెందిన ఎవరి మీదనైనా దావా గానీ, కేసుగానీ నేరుగా దాఖలు చేయడానికి వీలు లేదు. కేసు దాఖలు చేయాలంటే ముందుగా కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందాలి. ఈ కేసులను సాధారణ కోర్టుల్లో కాకుండా, ఆర్మీ కోర్టుల్లో విచారిస్తారు. ఈ కోర్టుల్లో జరిగే విచారణలు, శిక్షల గురించి ఎవరూ భ్రమలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. శిక్షించే ఉద్దేశమే వుంటే

అటువంటి విచ్చలవిడి అధికారాలు ఎందుకు కల్పిస్తారు?

సాధారణంగా పోలీసులకు అరెస్టు, సోదా, ఇంటరాగేషన్ చేసే అధికారం చట్ట ప్రకారం వుంటుంది. అయితే అరెస్టు, సోదాలకు వారెంటు అవసరం వంటి ఆంక్షలు కూడా వుంటాయి. వాటిని పోలీసులు లెక్క చేయరనేది వేరే విషయం. అదే విధంగా అమలు కాకపోయినప్పటికీ ముద్దాయికి కూడా కొన్ని హక్కులున్నాయి. కానీ ఈ చట్టం ప్రకారం సాయుధ బలగాలకు చంపే అధికారం కూడా వుండగా, 'ముద్దాయిల'కు ఎటువంటి కనీస హక్కులు లేవు.

చట్టం ఒప్పుకోని సందర్భాల్లోనే చట్టాన్ని తుంగలో తొక్కి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించే పోలీసులూ, సాయుధ బలగాలు చట్టమే గ్రీన్ సిగ్నల్ ఇస్తుంటే ఇక చెప్పాల్సిందేముంటుంది? ఏఎఫ్ఎస్‌పీఏ-1958 ఇస్తున్న లైసెన్స్‌తో ఈ ప్రాంతాల్లో సాయుధ బలగాలు పాల్పడని దారుణం లేదు. అడుగడుగునా పొంచి వున్న మృత్యువు, అత్యాచారం, హింస, విధ్వంసం నడుమ ఇక్కడి జన జీవనం దుర్భరం అయిపోయింది. బతుక్కీ, చావుకీ నడుమ గీతలు చెరిగిపోయాయి. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత వేల ప్రాణాలు పోయాయి. మరెంతో మంది కనిపించకుండా పోయారు. మహిళలపై అత్యాచారాలకు లెక్కే లేదు. అనాథ పిల్లలు, విధవల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. అసలిక్కడ జీవితమన్నదే లేకుండా పోయింది. అయితే శవాలుగా మారడం లేకుంటే జీవచ్ఛవాలుగా మిగలడం.

ఈ చట్టం అండగా చేసిన ఘోరాలు కొన్నింటిని మచ్చుకు చెప్పుకుంటే... జమ్మూ-కశ్మీర్‌లోని కుప్వారా జిల్లా, పోష్పొరా గ్రామంలో 1991లో సోదా పేరుతో గ్రామస్తులందరినీ కుప్ప వేసి, అందరి ముందూ వంద మంది మహిళలపై లైంగికాత్యాచారం చేశారు. దీనిపై ప్రభుత్వం ఎటువంటి విచారణా జరపలేదు. అనంత్‌నాగ్ జిల్లా బిజ్ బెహారా గ్రామంలో ఒక శాంతియుత ప్రదర్శనపై 1993లో బీఎస్ఎఫ్ జరిపిన కాల్పుల్లో దాదాపు 35 మంది పౌరులు చనిపోయారు. ఈ కాల్పులు జరిపిన బీఎస్ఎఫ్ మీద విచారణ జరిపేందుకు ప్రభుత్వం అనుమతించలేదు.

మణిపూర్‌లో రాజధాని ఇంఫాల్ సమీపంలోని మాలం బస్‌స్టాండ్‌లో బస్ కోసం వేచి చూస్తున్న ప్రయాణికులపై 2000 నవంబర్ 1న అస్సోం రైఫిల్స్ బలగాలు జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో పది మంది చనిపోయారు. మృతులలో 62 సంవత్సరాల ఒక వృద్ధురాలు, జాతీయ సాహస బాలుడి అవార్డు పొందిన 18 సంవత్సరాల ఒక బాలుడూ వున్నారు. ఈ దారుణ ఘటనకు కదిలిపోయిన ఇరోం షర్మిల ఇటువంటి దారుణాలకు ఊతం ఇస్తున్న క్రూర చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆ తర్వాతి రోజు నుండే నిరాహార దీక్ష మొదలు పెట్టింది. దీక్ష ప్రారంభించిన నాలుగో రోజునే పోలీసులు ఆత్మహత్య ప్రయత్నం కింద ఆమెను అరెస్టు చేశారు. బలవంతంగా ఆహారం తినిపించాలని ప్రయత్నించిన పోలీసులను ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది. దానితో బలవంతంగా సెలైన్ ఎక్కించారు. ఆ తర్వాత నుండీ ఆమెను అరెస్టు చేయడం, విడుదల చేయడం అనే ప్రహసనం 2016 ఆగస్టు 9 వరకూ కొనసాగుతూనే వచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ ఆస్పత్రిలోని ఒక ప్రత్యేక వార్డు ఆమెకు జైలుగా మారింది. బలవంతంగా ఇక్కడ తనకు ముక్కులో నుండి గొట్టం ద్వారా ఇస్తున్న ఆహారం కారణంగా ఆమె ప్రాణాలు నిలిచి వున్నాయి. కానీ ఆమె ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. పాలిపోయి, పీలగా తయారయింది. ఆమెకు అవయవాలపై పట్టు లేకుండా పోయింది. అవయవాలు ఏవీ సరిగా పనిచేయని స్థితికి చేరుకుంది. ఆమెను పరీక్షిస్తున్న డాక్టర్లు ఏ క్షణానైనా ఆమెకు ఏమైనా జరగవచ్చు అని చెప్పారు. నిరాహార దీక్ష మొదలు పెట్టేనాటికి ఆమె 28 సంవత్సరాల నవ యువతి. ఇప్పుడామెకు 43 ఏళ్లు.

ఇరోం షర్మిల పేరిట రెండు రికార్డులు నమోదయ్యాయి. మొదటిది అత్యంత సుదీర్ఘ కాలం పాటు నిరాహార దీక్ష చేయడం, కాగా రెండవ రికార్డు అత్యంత ఎక్కువసార్లు జైలు నుండి విడుదలవడం. ఇంత సుదీర్ఘ కాలం దీక్ష చేసినందుకు గాను షర్మిల మణిపూర్ ఉక్కు మహిళగా పేరుపొందింది. ఠాగూర్ శాంతి బహుమతి సహా మరెన్నో పురస్కారాలను పొందింది. ఆమెకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పలు సంఘాలు, సంస్థలు కోరి వున్నాయి.

ఏళ్ల తరబడి ఇలా ఆస్పత్రిలో వుంటున్న షర్మిలను చూసేందుకు ఆమె తల్లి ఎప్పుడూ వెళ్లేది కాదట. కృశించిపోయి పీనుగలాగా మారిన బిడ్డను చూడలేక, చూసి, తను బాధపడి బిడ్డను మరింత బాధపెట్టడం ఇష్టం లేక ఆమె వెళ్ల లేదట. 'నా బిడ్డ ఏ ఆశయం కోసం ఈ పని చేస్తూ వుందో అది నెరవేరే దాకా నా బిడ్డను చూడను' అన్నదామె. ఈ తల్లీ బిడ్డలకు సంఘీభావంగా మణిపూర్‌లో ఒక తల్లుల సంఘమే ఏర్పడింది.

ఏఎఫ్ఎస్‌పీఏ-1958కు వ్యతిరేకంగా ఒక్క షర్మిల మాత్రమే పోరాడ్డం లేదు. దీనికి వ్యతిరేకంగా మణిపూర్‌లో నిరంతరాయంగా మిలిటెంట్ ఆందోళన జరుగుతున్నది. 2004 జూలై 10న తన ఇంట్లో నిద్రిస్తూ వుండిన తంగజం మనోరమ అనే 32 ఏళ్ల యువతిని అస్సోం రైఫిల్స్ జవాన్లు తీసుకెళ్లి చంపేశారు. ఈ దారుణానికి ప్రతిస్పందనగా 12 మంది మహిళా సామాజిక కార్యకర్తలు ఇంఫాల్‌లోని అస్సోం రైఫిల్స్ హెడ్‌క్వార్టర్స్ ముందు నగ్న ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంది. కానీ పాలకులకు మాత్రం కొంచెం కూడా సిగ్గనిపించలేదు. ఈ ప్రదర్శన చేసిన వాళ్లలో ఒకరు, మణిపూర్ తల్లుల సంఘం నాయకురాలు న్గాంబీ 'మా మీద సాయుధ బలగాలు నిరంతరం జరిపిన అత్యాచారాలే మమ్మల్ని ఈ పనికి పురికొల్పాయి' అన్నారు. ఆమె మరో సందర్భంలో 'ఈ దుర్మార్గ చట్టం ఎత్తివేయడానికి, తమ జీవితాల్లో కొంచెమైనా శాంతి రావడానికి మణిపూర్ మహిళలు ఎన్నిసార్లు బట్టలు విప్పెయ్యాలో' అన్నారు.

నిజానికి ఈ ప్రాంతాల్లో జరుగుతున్న ఘోరాలు వెలుగులోకి వస్తున్నది కూడా తక్కువే. ఎందుకంటే ఇక్కడి మీడియా మీద విపరీతమైన ఆంక్షలున్నాయి. మొత్తంగా ఒక అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదిక్కడ.

ఈ చట్టం ప్రాథమిక హక్కులకు భంగం కల్గిస్తున్నది కనుక రాజ్యాంగ వ్యతిరేకమైనదనీ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు కూడా వ్యతిరేకమైనదనీ పలు హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు చేస్తున్న వాదనలు పాలకులు వినిపించుకోవడం లేదు. దీన్ని సవాల్ చేస్తూ నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ చట్టం రాజ్యాంగ బద్ధమైనదేనని తీర్పు చెప్పి తన

అప్రజాస్వామిక వైఖరిని చాటుకుంది.

ఈ చట్టాన్ని నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్స్‌లో భాగమయ్యే సాయుధ బలగాలకు కూడా వర్తింపజేయాలని సీఆర్‌పీఎఫ్ అధికారులు కోరుతున్నారు. ప్రస్తుతం దండకారణ్యంలో వైమానిక దాడులు చేయడానికి ప్రభుత్వం తయారవుతున్నది. ఇప్పటికి రెండు చోట్ల – బస్తర్‌లోని బీజాపూర్ జిల్లాలోనూ, తెలంగాణా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కొండల్లోనూ – సాయుధ బలగాలు వైమానిక దాడి కోసం డ్రిల్స్ కూడా నిర్వహించాయి. ప్రభుత్వం ఎక్కడ సైన్యాన్ని దింపినా ఇటువంటి చట్టాన్ని తోడిచ్చే పంపుతుంది. కనుక ఈ చట్ట ప్రమాదం ఛత్తీస్‌గఢ్‌లో కూడా పొంచి వుంది.

ఇరోం షర్మిల నిరాహార దీక్షను వదిలేయడం సరైందా కాదా అనేది ఇప్పుడు చర్చిద్దాం.

ప్రజలపై నిరంకుశత్వం అమలవుతున్న వ్యవస్థలో నిరాహార దీక్ష వంటి శాంతియుత పోరాటానికి చోటు లేదని గ్రహించి ఆమె వదిలేసి వుంటే కనుక ఆమె నిర్ణయం చాలా సరైనది. కానీ ఆమె ఎన్నికల్లో నిలబడి, ముఖ్యమంత్రి అయ్యి, ఏఎఫ్ఎస్‌పీఏను తొలగిస్తానని చెప్పారు.

16 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత కూడా దోపిడీ పాలక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటరీ వ్యవస్థపై ఆమెకు భ్రమలు తొలగిపోలేదని దీని ద్వారా స్పష్టమవుతున్నది. ఆయుధాలూ, బల ప్రయోగంపై ఆధారపడిన పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటం సాయుధంగానే వుండడం అనివార్యం. కనుక ఏళ్ల తరబడి శరీరాన్ని శుష్కింపచేసుకొని ఆమె చేసిన పోరాటం వ్యర్థమయిపోయిందని చెప్పక తప్పదు.

అయితే శాంతియుతం అయినప్పటికీ 16 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు ఆమె చేసిన నిరాహార దీక్ష ప్రపంచంలోనే అపూర్వమైనది, అద్వితీయమైనదని ఒప్పుకొని తీరాలి. అది కూడా ఆమె వ్యక్తిగత స్వార్థం కోసం చేసింది కాదు. కనుకనే దేశవ్యాప్తంగా అసంఖ్యాక ప్రజానీకం ఆమెను అభిమానించారు. మద్దతు తెలిపారు. ఒక ఆందోళనాకారిణిగా ఆమెకు విశేష గుర్తింపు వచ్చింది. మణిపూర్ పోరాట నమూనాగా ఆమెను అభివర్ణించిన వాళ్లూ వున్నారు. అటువంటిది ఎన్నికల మార్గాన్ని ఎంచుకొని పోరాటకారిణి గుర్తింపును ఆమె రద్దు చేసుకొంది. అంతేకాదు సుదీర్ఘ పోరాట చరిత్ర వున్న మణిపూర్ ప్రజానీకానికి పోరాటాన్ని నీరుగార్చే తప్పుడు సందేశాన్ని ఇచ్చిందామె.

నిరాహార దీక్షను విరమించాలనే ఇరోం నిర్ణయంపై మణిపూర్‌లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. ఎన్నికల మార్గంలోకి పోవాలనే ఆమె నిర్ణయాన్ని కూడా వ్యతిరేకించారు. ఇది స్వాగతించాల్సిన విషయం. ఈ వ్యతిరేకత ఏఎఫ్ఎస్‌పీఏ పట్ల ప్రజలకున్న ఆగ్రహం నుండి పుట్టింది. అయితే ఏఎఫ్ఎస్‌పీఏ ఎత్తివేసే వరకూ ఆమె దీక్షను కొనసాగించాలని ఎవరైనా కోరుకుంటే మాత్రం అది సరైనది కాదు. ఇన్నాళ్లూ ఆమె కొనసాగించిన దీక్ష నిష్ప్రయోజనంగా నిరూపితమైంది. మరెన్నాళ్లు కొనసాగించినా అది నిష్ప్రయోజనమే అయి వుండేది. కనుక దీక్ష కొనసాగించడం అనేది ఒక ఫలితం లేని, తప్పుడు దారిని అంటిపెట్టుకొని వుండడమే అవుతుంది.

ఒక బ్రిటన్‌కు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనే ఇరోం నిర్ణయం పట్ల కూడా వ్యతిరేకత వస్తున్నది. ఇది సరైనది కాదు. తిండి తినాలనే, పెళ్లి చేసుకోవాలనే, సంతోషంగా జీవితం గడపాలనే ఆమె కోరికలను సమర్థించాలి.

ఇరోం దీక్ష విరమణ అనేది సాయుధ పోరాట ప్రాసంగికతను మరొకసారి నిరూపిస్తున్నది. శాంతియుత పోరాటాల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి ప్రజలను సాయుధ పోరాటాల వైపుకు నెడుతున్నది.

ఏ చట్టమైనా ప్రస్తుత దోపిడీ వ్యవస్థను పరిరక్షించడం కోసమే తయారవుతుంది. దోపిడీ పాలక వర్గాలు తమ దోపిడీని కొనసాగించడం కోసమే క్రూర చట్టాలను ప్రయోగిస్తాయి. దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాటాలు పెరుగుతున్న కొద్దీ చట్టాలకు కోరలు పెరుగుతూ వుంటాయి. కనుక ఏఎఫ్ఎస్‌పీఏ వంటి ఆటవిక చట్టాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయాల్సి వుంటుంది. ఇటువంటి చట్టాలకు వ్యతిరేకంగా చేసే పోరాటం వ్యవస్థకు వ్యతిరేకంగా చేసే పోరాటమే అవుతుంది. ❐

**'...జాతుల సమస్య, అంతిమ విశ్లేషణలో వర్గ సమస్యే. ఈ వెలుగులో చూసినప్పుడు, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయడానికి కార్మికవర్గ నాయకత్వంలో భారత పాలక వర్గాలకు, సామ్రాజ్యవాద నరభక్షకులకు వ్యతిరేకంగా జరుగుతున్న మరింత విశాలమైన పోరాటంలో భాగంగానే జాతుల పోరాటాలు నిజమైన విముక్తిని సాధించగలవు. మన పార్టీ ఈ జాతుల పోరాటాలకు నిర్ద్వంద్వంగా మద్దతునివ్వాలి. మిలటరీ శక్తితో ఈ ఉద్యమాల్ని అణచివేయడానికి దుర్మార్గంగా ప్రయత్నిస్తున్న భారత పాలకవర్గాల్ని అది దృఢంగా ఎదిరించాలి. జాతుల మీద హిందీనిగానీ, ఇంగ్లీషుని గానీ లేదా ఏ ఇతర భాషను గానీ ఏకపక్షంగా రుద్దడానికి భారత పాలకవర్గాలు చేసే ప్రయత్నాల్ని కూడా అది ఎదిరించాలి. విడిపోయే హక్కుతో సహా, ఆ హక్కు వరకూ ఉన్న స్వయం నిర్ణయాధికార హక్కుని దృఢంగా సమర్థించి ఎట్టి పరిస్థితుల్లోనైనా దాన్ని గురించి నొక్కి చెప్పాలి. సామ్రాజ్యవాద భూస్వామ్య వర్గాల ప్రయోజనాల్ని పరిరక్షించి, వాటికి ప్రాతినిధ్యం వహించే ప్రస్తుత కేంద్రీకృత రాజ్యాంగయంత్రాన్ని సమూలంగా ధ్వంసం చేసి ప్రజా రిపబ్లిక్కుల నూతన సమాఖ్య ఏర్పాటులోనే జాతుల సమస్యకు సరైన అంతిమ పరిష్కారం దొరుకుతుందనే వైఖరిని కూడా మన పార్టీ సమర్థించి దాన్ని నొక్కి చెప్పాలి...'**

***'పార్టీ కార్యక్రమం' 15వ పేజీ, 20వ అంశం***

# వాళ్ళిప్పుడు హుందాగా తమ తలలు పైకెత్తి నిటారుగా నిల్చున్నారు



# వాళ్ళే ప్రజా గెరిల్లాలు

*వాళ్ల జీవితం భూమితో ముడి పడి ఉంది. పాత సామాజిక వ్యవస్థతో సాయుధంగా తిరగబడకుండా భూమి దక్కదనే విషయాన్ని వారికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధం నేర్పింది. అంతేకాదు భూమి కోసం పోరాటం ప్రజాస్వామ్య సారంగా వుంటుందనే విషయాన్ని కూడా వాళ్లకు అవగతం చేసింది. అందుకే వాళ్ళు ప్రజావిముక్తి కోసం, ప్రజల పక్షాన, ప్రజా విముక్తి గెరిల్లాలుగా మారారు. ఈ సంచిక నుండి వాళ్ల జీవితాలను తెలుసుకుందాం.*

నాపేరు సోమ్డి (వయస్సు 22) మా అమ్మ పొడియమి సుక్కుడి, నాన్న పేరు జోగాల్, మా సొంత ఊరు దండకారణ్యంలోని కుమ్మఫిర బోదమ్ దగ్గర ఉన్న పడలే బాక్రసోల్, ఆ ఊరిలో మేము మా తాత నుండి సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకొని బతుకుతూ ఉండేవాళ్ళం. ఎండాకాలమైనా, వర్షాకాలమైనా నిత్యం గల గల పారుతూ ఉండే సెలయేటి నీళ్ళు మా పొలానికి అందుతూ ఉండేవి. అందువల్ల సంవత్సరానికి రెండు పంటలు పండిస్తూ హాయిగా ఉండేవాళ్ళం. కాని రోజులు బాగాలేవు. ఆ ఊరి పెద్దాల్ (పెత్తందారు) కన్ను మా భూమిపై పడింది. ఆ భూమిని ఆక్రమించుకోవడానికి వాళ్ళు చేయని ప్రయత్నమంటూ లేదు. భూమిని విడిచి పెట్టాలని బెదిరించారు. చంపాలని ప్రయత్నాలు చేసారు. వాటన్నింటికి మా నాన్న భయపడలేదు. అంతే కాదు "నా ప్రాణాలైనా ఇస్తాను గానీ నా భూమిని వదలను. లేలేత రెమ్మలాంటి ముగ్గురు పిల్లలు నాకు ఉన్నారు. ఈ భూమిని నమ్ముకునే వారిని పోషించుకుంటున్నాను. నా భూమి మీకిస్తే వాళ్ళనెలా పెంచుకుంటాను. మీరు ఏం చేసుకుంటారో చేసుకొండి భూమైతే వదిలేది లేదు" అని తెగేసి చెప్పాడు. మా తాతకు మా నాన్న ఒక్కడే, అన్నదమ్ములు లేరు. ఒక అక్క ఉంది. ఈ గొడవలను చూసిన మా అత్త తమ్ముణ్ని చంపేస్తారని చాలా భయపడింది. దాంతో ఆ రోజు సాయంత్రం మా ఇంటికి వచ్చింది. ఎక్కడైనా వెళ్ళి భూమి వెతుక్కొని బతకమనీ, అడవిపై ఆధారపమని చెప్పి కన్నీరు మున్నీరైంది. దాంతో మా నాన్న ఆలోచన మారింది. భూమి కోసం వెతుకులాట ప్రారంభించాడు మా నాన్న. జగదల్‌పూర్, రాయ్‌పూర్, కిరండుల్ వంటి పట్టణాలు జేగురుగొండ, పిడియా, బిడియటుంగల్ వంటి గ్రామీణ ప్రాంతాలు అన్నీ తిరిగాడు. చివరకు బీజాపూర్ జిల్లా గంగలూర్ ఏరియా కడ్డేరు పంచాయితీలోని దుర్ద ఊరిలో కొంచెం భూమి దొరికింది. దానితో మా నాన్న మా కుటుంబాన్ని తీసుకొని కట్టుబట్టలతో సొంత ఊరునూ, తన వాళ్ళనూ వదిలి బయలుదేరాడు. ఆ రోజు ఉదయం కుమ్మఫిర బోదమ్ వద్ద బస్సు ఎక్కి సాయంత్రం 5గంటలకు కిల్లెపాల్ వద్ద బస్సు దిగాం. అయితే అప్పటికే చీకట్లు కమ్ముకోనారంభించాయి. నన్ను మా నాన్న తన భూజాలకెత్తుకున్నాడు. వడివడిగా నడక ప్రారంభించాం. కొత్త ప్రాంతానికి తోడు దట్టమైన అడవి మా భయాన్ని రెట్టింపు చేసింది. దారిలో జంతువుల వల్ల ఏ ఆపద రాకుడదని మా అమ్మ దేవుడ్ని మొక్కుకోసాగింది. చివరకు దుర్ద ఊరు చేరుకున్నాం. అయితే అప్పటికి రాత్రి ఎంత సమయం అయ్యిందో తెలియదు.

2001 మధ్య కాలం నుండి మేం ఆ ఊరిలో కొత్త భూమిని సాగు చేయడం ప్రారంభించాం. ఆ భూమిని సాగులోకి తేవడానికి మా కుటుంబం చాలా కష్టపడింది. కాని దక్కిన ఫలితం మాత్రం చాలా స్వల్పం. ఎందుకంటే ఆ భూమికి నీటి సదుపాయం తక్కువ. అందువల్ల దాంట్లో నుండి వచ్చే పంట కూడా తక్కువే. మా అమ్మ, నాన్న, ఇద్దరన్నయ్యలు పొద్దుపొడిచిన దగ్గర నుండి పొద్దుగూకే వరకు ఆ భూమిలో పని చేస్తూనే ఉండేవారు. అయినా ఏ పూట మేం కడుపు నిండా తిన్నది లేదు. ఆకలికి తట్టుకోలేక మా అన్నయ్యలు అడవికి వెళ్ళి దుంపలు తెస్తే మా అమ్మ వాటిని ఉడికించి మాకు పంచి పెట్టేది. ఆ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల జబ్బులకు మా నాన్న తనకు తెలిసిన మూలికా వైద్యం చేస్తుండేవాడు. దానికి వాళ్ళు తమకు తోచినంత సహాయం (బియ్యం) చేసేవాళ్ళు. అది కూడా సరిపోక మా నాన్న కూలీకి ఉదయాన్నే పోయి సాయంత్రానికి తిరిగి వచ్చేవాడు. 2001 నుండి 2004 వరకు మా కుటుంబం ఎంత కష్టపడినా మా ఆకలి పెరిగిందే తప్ప తగ్గింది లేదు. మమ్మల్ని ఎలా పెంచాలనే బెంగతోనే మా నాన్న ఎల్లప్పుడు ఉండేవాడు. చివరకు ఆ బెంగతోనే 2004 చివరలో జబ్బు చేసి చనిపోయాడు. దాంతో మా అమ్మ వేం దిక్కులేనివాళ్ళం అయిపోయాం. చనిపోయిన మా నాన్న శవాన్ని కప్పే బట్టలు కొనడానికి మా అమ్మ ఆ ఊరిలో 1000 రూ॥ల అప్పు తెచ్చింది. ఆ డబ్బుతోనే మా నాన్న దినకర్మ చేసాం. అయితే ఆ అప్పు తీర్చడం కోసం మా అమ్మ రాత్రి పగలు కష్టపడి పని చేసేది. నాన్న లేడనే బెంగ, మా ఆకలిని తీర్చడం, అప్పు ఇవన్నీ ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీసాయి. జబ్బు పడిన తర్వాత ఆమె మరింత కృంగి పోయింది. ఒకరోజు ముఖ్య విషయం చెప్పడానికన్నట్లు మా అన్నయ్యలిద్దర్ని పిలిచింది. నేను మా అమ్మ వీపుకు చేరపడి మెడచుట్టు చేతులు వేసి వినసాగాను. "మీరు తొందరగా పెరిగి పెద్దవాళ్ళయి ఆ అప్పు ఎలాగైనా తీర్చాలని" చెప్పింది. అమ్మ బాధపడుతున్నదని అర్థమైంది కాని ఆ మాటల వెనుక ఉన్న లోతు, దు:ఖం నాకు అర్థం కాలేదు. ఎందుకంటే అంత కరువులో కూడా వాళ్ళు ముందు నా పొట్ట నింపి తరువాతే

వాళ్ళు తినేవారు. చివరికి నాన్న పోయిన ఏడాదికి అంటే 2005 లో అమ్మ చనిపోయింది. దీంతో తల్లిలేని కోడిపిల్లల మాదిరి అయ్యింది మా పరిస్థితి. సొంత ఊరునూ అయిన వాళ్ళను వదులుకొని వచ్చిన మేం ఒంటరి వాళ్ళం అయ్యాం. ఒక విధంగా చెప్పాలంటే అనాథలమయ్యాం. అప్పటి వరకు ఉన్న ఆకలి సమస్యతో పాటు అనేక సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది. అమ్మ ఉన్నప్పుడు ప్రతి పని ఎలా చేయాలో దగ్గర ఉండి మాకు నేర్పించేది. కానీ ఇప్పుడెలా? అన్నం వండాలంటే వడ్లు దంచాలి. నాకు దంచడం రాదు. అయినా ప్రయత్నించాను. దీన్ని చూసిన మా అన్నయ్యలు నా చేతిలో రోకలి తీసుకుని "నీవు వెళ్ళిపో" అంటూ నన్ను పంపించి వాళ్లు దంచడం మొదలు పెట్టారు. అయితే దంచిన ధాన్యం చెరగడం వారికి రాదు నాకు వచ్చు. దాంతో మళ్ళీ నన్ను పిలిచేవారు. ఇలా ఏ పని చేయాలన్నా ముగ్గురం కలిసి చేయాల్సి వచ్చేది. ఒక రోజు అన్నయ్యలిద్దరు ఉదయాన్నే పొలానికి పోవడంతో నేను అన్నం వండాల్సి వచ్చింది. బియ్యం పోసేముందు నీళ్ళు వేడెక్కాయో లేదో తెలుసుకోవడానకి గంటెతో నీళ్ళు తీసి చేతిలో పోసుకున్నాను. చెయ్యి కాలిపోయింది. ఇంకొకరోజు నీళ్ళు మరగకుండానే బియ్యం పోసాను. అన్నం సరిగ్గా  ఉడకలేదు. అన్నం మంచిగా వండటానికి సరిగ్గా 4 నెలలు పట్టింది. ఈ బాధలు భరించలేక నాకు చావలేక బతుకుతున్నామని అన్పించింది. ఇప్పటికీ నాకు అమ్మా, నాన్నలు లేని పిల్లలను చూస్తే నా చిన్నతనమే గుర్తుకు వస్తుంది. పూటకు తిండే దొరకని ఈ సమాజంలో తల్లి దండ్రులు లేని పిల్లల సంరక్షణ ఎవరు చూస్తారు? వారిని మంచి తిండి, శుభ్రమైన బట్టలు ఎవరు ఇస్తారు? వారిని ఎవరు గారాబం చేస్తారు? ఇలా ఎన్నో ప్రశ్నలు నా మదిని తొలిచేవి. మా కంటూ ఎవరూ లేరు. రెక్కలు ముక్కలు చేసుకొని శ్రమించిన తిండి దొరకని పరిస్థితి. మేం, మీ లాంటి ఎందరో  మీ లాంటి బాధలు పడుతున్నారు. ఈ బాధలకు తోడు ప్రభుత్వం మా మీద కక్ష కట్టి 2005లో సల్వాజుడుంను ప్రారంభించింది. దానితో మా బతుకులు మరింత దుర్భరమయ్యాయి. హత్యలు, అత్యాచారాలతో ఒక భయానక వాతావరణం ఏర్పడింది. అప్పటి వరకు నిశ్శబ్దంగా ఉన్న పల్లెల్లో చిచ్చు రేగింది. సొంత మనుషులే శతృవులయ్యారు. ఊర్లు వల్లకాడులయ్యాయి. పంటలు నాశనమయ్యాయి. గొడ్లు, మేకలు, కోళ్ళు ఒకటేమిటి విలువైన ప్రతీది ప్రజల నుండి దొంగించారు. నాశనం అయ్యింది. ఎక్కడ చూసిన విధ్వంసం విలయతాండవం చేసింది. ఇలాంటి తరుణంలో ఒక రోజు మా పెద్దన్నయ్య అడమాల్ మా ఇద్దరిని పిలిచి తన దగ్గరనే కూర్చోపెట్టుకొని నెమ్మదిగా మాట్లాడటం మొదలు పెట్టాడు. "అమ్మ, నాన్నలు పోయిన దగ్గర నుండి మన కష్టాలు ఎక్కువయ్యాయి. మనకు భూమి లేదు, గొడ్లు లేవు, కూలీ చేసుకుందామంటే కూలీ పని లేదు. కనీసం అడవిలో దుంపలు తినైనా బ్రతుకుదామంటే అవి కూడా తినలేని పరిస్థితిని సల్వాజుడుం అభియాన్ తీసుకువచ్చింది. ఈ పరిస్థితి మన ఒక్కరికే కాదు ఈ ప్రాంత ప్రజలందరి స్థితి అలాగే వుంది. ఎన్ని రోజులు ఈ బాధలు భరిస్తాం. అందుకనే నేను ఒక నిర్ణయానికి వచ్చాను" అంటూ ఊపిరిపీల్చుకునేందుకు ఒక్క నిమిషం ఆగి మరల చెప్పడం ప్రారంభించాడు. "ఈ సమస్యలన్ని పరిష్కారం కావాలంటే మనం సాయుధంగా పోరాడాలి. అందుకే నేను దళంలోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను" అని చెప్పడం ముగించాడు. తను చెప్పడం ముగించిన మరుక్షణమే మేం ఇద్దరం తన కాళ్ళు చుట్టుకున్నాం. "అడమాల్ నీవే ఇంటికి పెద్దవాడివిరా అమ్మ, నాన్న చనిపోయినా నీపై ఆధారపడి బ్రతుకుతున్నాం. నీవు వెళ్ళిపోతే మమ్మల్ని ఎవరు చూస్తారు. నీవు వెళ్ళడానికి వీళ్ళేదు మేం ఒప్పుకోం" అని ఏడ్చాం, బతిమాలాం, కోపడ్డాం. అయినా మా అన్నయ్య వినలేదు. సాయంత్రం 6గం॥లకు అన్నం తిని మాకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

అన్నయ్య మాకు దూరమవడం అనేది ఒక సమస్య అయితే ఊరి వాళ్ళకు ఏం చెప్పాలి అనేది మరొక సమస్య. దళం బలవంతంగా తీసుకుపోయిందని అబద్ధం చెబుదామని అనుకుని ఏడుస్తూనే పడుకున్నాం. మేం ఇంకా నిద్రలేవకముందే తెల్లవారుజామున 4గం॥లకు డోలు కొట్టిన శబ్దం వినబడింది. ఆ శబ్ధం విన్న నేను మా చిన్నన్నయ్యతో 'అన్నయ్య ఆ డోలు ఎందుకు కొడ్తున్నారు' అని అడిగాను. దానికి బదులుగా మన అన్నయ్య దళానికి వెళ్ళిన విషయం తెలిసిందేమో అన్నాడు. మన అన్నయ్య దళానికి వెల్తే వాళ్ళకేంటి అన్నాను. "మన ఊరంతా ప్రభుత్వ నిర్బంధంలో వారి ఆధీనంలో ఉంది. మన ఊరి నుండి 8 మందిని తీసుకుపోయి పోలీసు క్యాంపుల పక్కన ఉన్న నిర్బంధ శిబిరాల్లో పెట్టారు. ఊరిపై అనేక ఆంక్షలు పెట్టారు. అంతేకాదు మన ఊరిలోని పెద్దాల్‌లు సల్వాజుడుంతో కలిసి పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారు. అందుకే మన కష్టాలు ఇప్పటినుండి మరింత పెరుగుతాయి" అన్నాడు. అయినా నీవు ఆ డోలు గురించి ఎక్కువ ఆలోచించకు అని చెప్పాడు. తర్వాత కొద్దిసేపటికీ అందరు జమ అయ్యి మమ్మల్ని పిలిచారు. మేం వెళ్ళీ వెళ్లగానే మీరు దళానికి ఆశ్రయమిస్తూ ఆదరిస్తున్నారు. మీ అన్నయ్య  మాపై పగ తీర్చుకోవడానికే దళానికి వెళ్ళాడు. మీరు ఇక్కడ ఉండి మా సమాచారం పార్టీకి అందజేస్తున్నారు అంటూ తిట్టడం ప్రారంభించారు. కొద్దిసేపటికి మేం గొంతు పెగల్చుకుని నెమ్మదిగా మా అన్నయ్యను దళం బలవంతంగా తీసుకుపోయింది. మాకేం సంబంధం లేదు. అని మాత్రం చెప్పగలిగాం. వారు మా మాటల్ని నమ్మలేదు. అంతేకాదు నిరంతరం గుంపులు గుంపులుగా చేరి మా గురించి మాట్లాడుకునేవారు. మీరు బ్రతకాలంటే మీ అన్నయ్యను వెనక్కి తీసుకురండి లేదంటే మీ ఇద్దరి కాళ్ళు కట్టి మంటలో వేసేస్తాం అని బెదిరించారు. ఒక రోజు నీళ్ళు తీసుకురావడానికని బోరింగ్ వద్దకు వెళ్ళిన నాతో అక్కడ మహిళలు ఈ బోరింగ్ నక్సలైట్లు ఇచ్చింది కాదు ప్రభుత్వం ఇచ్చింది. నీవు నీళ్ళు తీసుకుపోవడానికి వీల్లేదు అంటూ తిట్టడం మొదలు పెట్టారు. నేను వారికి జవాబు చెప్పలేక మౌనంగా నీళ్ళు పట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ ఇంటికి చేరుకున్నాను. సల్వాజుడుం వాళ్ళు పెట్టిన మీటింగ్‌కు వెళ్ళిన అన్నయ్య ఇంకా రాలేదు. ఏం జరుగుతుందోననే బెంగతో నేను వాకిలి వైపే ఎదురుచూడసాగాను. దిగాలు పడిన ముఖంతో ఇంటికి చేరుకున్న అన్నయ్యను చూసి నా మనస్సు కుదుటపడింది. ఒక రోజు ఇద్దరం కలిసి నయమేల్ సంతకు వెళ్ళాం. సంతలో ఆరుగురు సల్వాజుడుం గుండాలు వచ్చి మమ్మల్ని చుట్టుముట్టారు. నేను భయంతో బిగుసుకుపోయాను. మీ నక్సలైట్లు గెలుస్తారని మీరు అనుకుంటున్నారా? ఎప్పటికి గెలవరు. సల్వాజుడుం జిందాబాద్, నక్సల్‌వాది ముర్దాబాద్ అంటూ నినాదాలు ఇచ్చి వెళ్ళిపోయారు. వారు వెళ్ళగానే గుండెలు అరచేతిలో పట్టుకొని ఇంటికి చేరుకున్నాం.

ఒకరోజు అన్నయ్య, నేను కలిసి వరి కోతకు పొలానికి వెళ్ళాం. పక్కపొలంలోని పెద్దాల్ కుటుంబం వాళ్ళు అన్నాచెల్లెలిద్దరిని గొడ్డలితో నరికిపారేస్తే సరి అని మాట్లాడుకుంటున్న మాటలు మా చెవిన పడ్డాయి. దాంతో మా అన్నయ్య మనం కష్టపడి పంట కోసిన దీన్ని తిననిచ్చేలాలేరు. పద ఇంటికి పోదాం అని నన్ను తీసుకుపోయాడు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే ఆందోళనతో ఎన్నో నిద్రలేని రాత్రుళ్ళు గడిపాం. చివరకు నేను చనిపోతే మంచిదనే ఆలోచనకు వచ్చాను. బలంగా, పొడుగ్గా ఉన్న తాడును తయారు చేసుకున్నాను. ఇద్దరం అన్నం తింటుండగా చిన్నగా చెప్పాను. అన్నయ్య ఊరి వాళ్ళు మనల్ని మంటలోవేసి చంపుతామని అంటున్నారు కదా దానికన్న మనమే అడ్డాకు చెట్లు ఎక్కి ఉరి వేసుకుని చనిపోతే మంచిదని నాకు అనిపిస్తుంది అని అన్నాను. దీనికి మా అన్నయ్య కోపంగా ఏ మాట్లాడుతున్నావు, అమ్మ, నాన్న మనల్ని ఎంత ముద్దుగా చుసుకున్నారో ఎంత కష్టపడ్డారో మరచిపోయావా? ఏం తప్పు చేసామని మనం ఆత్మహత్య చేసుకోవాలి? అలా అలోచించకు. నేనయితే సల్వాజుడుం గుండాలను ఒకరిద్దరినైనా చంపే చనిపోతాను అని అన్నాడు. అన్నయ్య మాటల కన్న నేను చనిపోతే తను ఒంటరివాడవుతాడనే నా ప్రయత్నాలు విరమించుకున్నాను. రోజులు భారంగా దొర్లుతున్నాయి. ఇంతలో చెవి వినబడని కారణంగా దళం నుండి మా పెద్దన్నయ్య అడమాల్ 2006, ఫిబ్రవరిలో ఒక రోజు రాత్రి ఇంటికి వచ్చేసాడు. అప్పటికీ మా ఊరు సల్వాజుడుం ప్రభావంలోనే ఉంది. హఠాత్తుగా వచ్చిన మా అన్నయ్యను చూసి మేం కోప్పడ్డాం. నీవు ఎందుకు వచ్చావు. నీవు వెళ్ళిన దగ్గర నుండి ఊరివాళ్ళు, సల్వాజుడుం గుండాలు ఎన్ని బాధలు పెట్టారో నీకు తెలుసా? ఇంత నిర్బంధంలో నిన్ను ఎక్కడ దాచి పెట్టాలి అని అన్నాం. కానీ తన అనారోగ్యం కారణంగా తనని మాతోనే ఉంచుకోవాలని అనుకున్నాం. ఎవరికి అర్థం కాకుండా అడవిలో 6 నెలల పాటు దాచిపెట్టాం. ఈ లోగా ఒక రోజు రాత్రి 7గురితో కూడిన జన మిలీషియా దళం మా ఇంటికి వచ్చింది. వాళ్ళు రావడం మాకు చాలా సంతోషం కలిగించింది. ఊరివాళ్ళకు తెలియకుండా సమీప అడవిలో వారిని ఉంచి వారికి తిండి, నీరు ఏర్పాటు చేసాం. 5 రోజుల పాటు ఉండి వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు వచ్చి వెళ్ళిన కొద్ది రోజులకే మా చిన్నన్నయ్య (బుదరామ్) దళంలోకి వెళ్ళాడు. అతను వెళ్తున్నప్పుడు నాకు అడ్డు చెప్పాలని అన్పించలేదు. అప్పటికి సల్వాజుడుం పై ప్రజల, పి.ఎల్.జి.ఎల ఎదురుదాడి మొదలవడంతో గ్రామస్తులు ఇంతకు ముందులా మమ్మల్ని తీవ్రంగా వేధించడం లేదు. అయితే సూటిపోటి మాటలతో మమ్మల్ని బాధపెట్టేవారు. 2008 నుండి పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వెళ్ళాలని ఆలోచన నాలో బలపడుతూ వచ్చింది. అయితే నా ప్రవర్తనలో వచ్చిన మార్పును గమనించిన గ్రామస్తులు మీ అమ్మ, నాన్న దళంలో పుట్టారా? మీ అన్నయ్య దళంలో చనిపోతే అతని శవాన్ని కుక్కలు, నక్కలు పీక్కుతింటాయి. ఊరిలో చనిపోతే గౌరవంగా దినకర్మ చేస్తాం. అక్కడ ఎవరు చేస్తారు అందుకే నీవు దళానికి వెళ్ళాలనే ఆలోచన వదిలిపెట్టి హాయిగా పెళ్ళి చేసుకుని ఇక్కడ ఉండు అని చెప్ప సాగారు. వారు ఎన్ని రకాలుగా చెప్పినా ఆ మాటాలు నాకు రుచించలేదు. ఈ కష్టాలకు, బాధలకు కారణాలు అర్థం అయ్యాయి. తుపాకికి తుపాకితోనే సమాధానం చెప్పాలనే నిర్ణయానికి వచ్చాను.

2009 డిసెంబర్‌లో దళంలోకి వెళ్ళాను. రెండు నెలల ట్రైనింగ్ అనంతరం గంగులూరు ఏరియాలో పని చేసాను. పార్టీ అవసరాల రీత్యా 2010 లో మార్చి నెలలో ఎ.ఒ.బికి బదిలీ చేయబడ్డాను. నేను దళంలోకి వచ్చిన రోజున నా వంటి మీద ఒక్క లుంగీ మాత్రమే ఉంది. అర్థాకలితో వచ్చాను. పార్టీలోకి వచ్చిన తరువాతే నాకు కడుపు నిండా మంచి తిండి దొరికింది. శుభ్రమైన బట్టలు కట్టుకుంటున్నాను. అన్నిటికన్నా ఎలాంటి అవమానాలు, దు:ఖం లేని జీవితం దొరికింది. ఆత్మగౌరవంతో, సంతోషంగా బ్రతుకుతున్నాను. ప్రజల మౌలిక సమస్యలైన భూమి, అధికారం, ఆత్మగౌరవం వంటివి పరిష్కారం కావాలంటే కొద్ది మంది పోరాడితే సరిపోదని అర్థం అయ్యింది. అందుకు లక్షలాది మంది ప్రజలను సాయుధం చేయాలని అర్థం అయ్యింది. అయితే ఎ.ఒ.బిలో నేను ముందుగా ఎదుర్కొంటున్న సమస్య భాష సమస్య. దాంతో పాటు ఉండే పెద్ద పెద్ద కొండలు కూడా. ఒక రోజు కోరాపుట్‌లోని దేవ్‌మాలి పర్వతం ఎక్కుతున్నప్పుడు ఎక్కలేక నా కళ్ళనుండి నీళ్ళు తిరిగాయి. ఇంత పెద్ద కొండలు ఎక్కడం నా వల్ల కాదు అని అనిపించింది. అయితే కొండపైకి చేరుకున్నాక అలసట తీర్చుకోవడానికి కూర్చున్న నాకు మొట్టమొదట నేను పని చేసిన ఏరియాలో అక్కడి కమాండర్‌తో ఎంత కష్టమైనా, ఎంత దూరమైనా వెళ్ళి పని చేస్తానని అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. అంతే కాదు ఇల్లు కూడా గుర్తుకు వచ్చింది. అక్కడి కష్టాల కన్నా ఇవి ఎక్కువ కాదని అనిపించింది. అంతే ఆ రోజు నుండి నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. భాష నేర్చుకున్నాను. పెద్ద పెద్ద కొండలు ఎక్కుతున్నాను. పార్టీ సిద్ధాంత, రాజకీయాలను అర్థం చేసుకుంటున్నాను. శత్రువుతో జరిగిన అనేక ఎదురు కాల్పులలో పాల్గొన్నాను. ఈ ప్రజా యుద్ధంలో మంచి కార్యకర్తగా, సైనికురాలిగా నా కర్తవ్యాన్ని నిర్వహించాలని అనుకుంటున్నాను. అలా చేయడం ద్వారా మాత్రమే ఈ దేశంలోని కోట్లాది మంది ప్రజల విముక్తి సాధ్యమవుతుంది. అంతే కాదు తల్లి తండ్రి లేని నాలాంటి వారెందరో స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో బతుకగలుగుతారు. ఎటువంటి బాధలు, కష్టాలు లేని సమసమాజాన్ని నిర్మించగల్గుతారు. ❐

“ నువ్వొక డాక్టర్‌వి కావాలన్నా
యాక్టర్‌వి కావాలన్నా
సైంటిస్టువి కావాలన్నా
ముందు నీవు కమ్యూనిస్టువి కావాలి
మంచి కమ్యూనిస్టువి కావాలి ”
– మహాకవి శ్రీశ్రీ

అమరుల చరిత్ర

# మన్యం ప్రజలు మరచిపోలేని మహోన్నత ప్రజా యుద్ధ సేనాని

## కామ్రేడ్ రవి అమర్ రహే

2016 ఏప్రిల్‌లో మన పార్టీ సీనియర్ నాయకుడు, ఈస్టు డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ రవి అనారోగ్యంతో అమరుడైనాడు.

రవి అసలు పేరు కుడుముల వెంకటరావు. విశాఖజిల్లా, చింతపల్లి మండలం, కొమ్మంగి గ్రామంలో జన్మించాడు. 10వ తరగతి వరకు చదువుకున్నాడు. తను చదువుకునే రోజుల్లోనే ఆర్.ఎస్.యులో చేరిండు. అప్పటినుండే చురుకుగా, మిలిటెంట్‌గా ఉండేవాడు. ప్రజల జీవితాల్ని అప్పటినుండే చదివిండు. అలా తన విప్లవ ప్రయాణం మొదలై, 21 సంవత్సరాలు...విప్లవ జీవితం కొనసాగిస్తూ, అనేక ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ ముందుకు సాగిండు.



బలమైన వర్గపోరాటం ఉన్నచోట నిజమైన కార్మికవర్గ నాయకత్వం ఏర్పడుతుంది. నిజమైన కార్మికవర్గ నాయకత్వం ఏర్పడిన చోట వర్గ పోరాటం మరింతగా సంఘటితపడి విస్తృతమవుతుంది. ఈ గతితార్కిక సంబంధాన్ని రవి పుట్టి పెరిగిన ప్రాంతానికీ, రవికీ మధ్య అన్వయించుకోవచ్చు. చింతపల్లి ప్రాంతంలో రాజ్యాన్ని సవాల్ చేస్తూ ప్రజలు నిర్వహించిన వీరోచిత వర్గ పోరాటానికి నాయకత్వం వహించిన కొంగంటి సోమన్న (నాగన్న) మద్దెల స్వర్ణలతలు వీరమరణం పొందిన ప్రాంతం, గొప్ప విప్లవ నాయకుడిగా రవికి జన్మనిస్తే, రవి నాయకత్వంలో గాలికొండ ఏరియా ప్రాంత ప్రజలు సాయుధ వర్గ పోరాటాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ళి విప్లవ ప్రజా కమిటీలు నిర్మించుకున్నారు. ఈ మొత్తం క్రమంలో రవి విప్లవ ప్రస్థానం నల్లేరు మీద బండిలా సాఫీగా సాగలేదు. 1995-96లో సీలేరు (టి.ఆర్.సి) గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ జలేంద్రుడు నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన విద్యార్థి ఉద్యమానికి ఆర్.ఎస్.యు నాయకత్వం వహించింది. ఆ ఉద్యమంలో కా.రవి క్రియాశీలకంగా పాల్గొంటూ ముందుండి నడిపించాడు. ఈ క్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థి ఉద్యమ నాయకత్వం పై కక్షగట్టింది. ఫలితంగా కా.రవితో పాటు అనేక మంది విద్యార్థులను పాఠశాల నుండి బహిష్కరించారు. ఆ తరువాత జి.మాడుగుల మండలం కొత్తూరులో కేంద్రీకృత ఆశ్రమోన్నత పాఠశాలలో చేరిండు. ఒక సంవత్సరం పాటు చదువు కొనసాగించిండు. తిరిగి పాఠశాల యాజమాన్యం నుండి కా.రవికి చుక్కెదురైంది. విప్లవ రాజకీయాలతో విద్యార్థులను రెచ్చగొడుతున్నాడనీ, చీటికి మాటికి ఉద్యమాన్ని, విద్యార్థులను రోడ్లెక్కిస్తున్నాడనే నిందారోపనలు చేస్తూ టి.సి (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికట్) ఇచ్చి పంపించివేసారు. ఇదే మాదిరిగా నాతవరం పాఠశాల యాజమాన్యం కూడా కా.రవిని ఒక సంవత్సరం పాటు కొనసాగించి బహిష్కరించింది. చివరికి శరభన్నపాలెం స్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేసాడు. ఇదే సమయంలో రాడికల్ విద్యార్థి సంఘంలో పని చేస్తూ మావోయిస్టులకు సహకరిస్తున్నాడనే నేపంతో రెండుమార్లు అరెస్టు చేసారు. ఒక దఫా బైండోవర్ కేసు పెట్టి వదిలేయగా, రెండవదఫా అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది మాసాల తరువాత బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రభుత్వం, పాఠశాలల యాజమాన్యం అవలంబించిన నిరంకుశ వైఖరి రవి ఉద్యమ సంకల్పాన్ని వీసమెత్తు కూడా కదిలించలేకపోయింది. ఆయన విద్యార్థులతో కలివిడిగా కలిసిపోయాడు. విద్యార్థులు ఉక్కుకోటలా మారి ఆయన్ని అనేక పోలీసు దాడుల నుండి రక్షించారు. రెండు దశాబ్దాలుగా మెట్టు మెట్టుగా కఠినమైన మలుపులతో కొనసాగిన ఈ విప్లవ ప్రస్థానం రవిని గొప్ప విప్లవనాయకుడిగా ప్రజలకు అందించింది. అయితే మన్యంలో ఆదివాసీలు దోపిడీ వ్యవస్థ చేత పీడించబడుతూనే, మరొక పక్క మలేరియా మహమ్మారి బారిన పడి మృత్యువాత పడుతున్నారు. అలాంటి మలేరియా మహమ్మారి కా.రవిని కబళించింది. ఈ నష్టం మన ఎ.ఒ.బి ఉద్యమానికి మరీ ముఖ్యంగా ఈస్ట్ డివిజన్ ఉద్యమానికి వెంటనే పూడ్చుకోలేనిది.

కా.రవి దగ్గరి బంధువులైన కా.జవ్వాది నాగరాజు, కా.ఎమజుక్కా వెంకటేశ్వర్లు కూడా విప్లవోద్యమంలో పని చేస్తూ 1985 సెప్టెంబర్‌లో అమరులైనారు. చాలా సహజంగానే రవిపై వీరి ప్రభావం పడింది. మరొక పక్క ఈస్ట్ డివిజన్ ఉద్యమానికి రవి పుట్టి పెరిగిన ప్రాంతం 1980, 90ల వరకు ఆయువుపట్టుగా ఉండటం కూడా కా.రవి విప్లవోద్యమం వైపు అడుగులు వేయడానికి దోహదపడింది. అలా చిన్నప్పటినుండి విప్లవ కార్యచరణకు దగ్గరవుతూ క్రమంగా రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. మన్యంలో 1995 ప్రారంభంలో సీలేరు (టి.ఆర్.సి) మొదలు కొయ్యూరు, పాడేరు, అరకు, అడ్డతీగల, రాజఒమ్మంగి, వై.రామవరం, రంపచోడవరం మండలాల్లో అనేక హైస్కూల్స్, కాలేజీలో విద్యార్థి ఉద్యమం విస్తరించి ఊపందుకుంది. విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న విద్యాపరమైన హాస్టల్ సమస్య పైన, వివక్ష, స్కూల్, కాలేజీ యాజమాన్యాల నిరంకుశ విధానాలపై జరిగిన అనేక పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ నాయకత్వం వహించాడు. 1996 మన్యంలో జరిగిన చారిత్రాత్మకమైన విద్యార్థి ఉద్యమంలో కా.రవి ముందుపీఠిన నిలబడ్డాడు. ఆ ఉద్యమంలో విద్యార్థులతో పాటు వేలాది మంది ఆదివాసీ రైతాంగాన్ని సమీకరించాడు. రైతాంగ సమస్యలకు, విద్యార్థి సమస్యలకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఆచరణలో రుజువు చేసాడు. ఆ విధంగా విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా, చురుగ్గా పాల్గొంటూ నాయకత్వం వహించి తన రాజకీయ అవగాహనను విస్తృతం చేసుకున్నాడు.

విద్యార్థి ఉద్యమాన్ని అణచిపెట్టడానికి ప్రభుత్వ సంస్కరణలతో పాటు స్కూళ్ళను పోలీసు శిబిరాలుగా మార్చారు. విద్యార్థి నాయకత్వాన్ని దెబ్బ తీయడానికి అనేక కుట్రలు పన్నారు. మైనారిటీ తీరని వారిని దళాల్లో రిక్రూట్ చేసుకుంటున్నారనీ, వాళ్ళు వెనక్కి రావాలని ఉత్తరాలు, తల్లిదండ్రులకు బెదిరింపులు జారీ చేసారు. కానీ ఆదివాసీ విద్యార్థులు ఈ కపట నాటకాలను సులువుగానే అర్థం చేసుకున్నారు. విప్లవ చైతన్యంతో, సమరశీల పోరాటాలతో ప్రజావిముక్తికై యుద్ధం కావాలనే పార్టీ పిలుపులో భాగంగా కా.రవి 1998లో ఆదివాసీ రైతాంగ సాయుధ పోరాటంలో భాగమయ్యిండు. ఒక సంవత్సరం పాటు ఎల్లవరం దళంలో పని చేసాడు. 1999 నుండి గాలికొండ ఏరియా ఉద్యమంలో భాగమైనాడు. ఇదే సంవత్సరం జరిగిన దిద్దుబాటు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. పార్టీకి, ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ఉద్యమ కార్యాచరణలో దొర్లిన తప్పుల విషయంలో ప్రజల్లో నిజాయితీగా ఆత్మ విమర్శను ప్రవేశపెట్టి వారి విమర్శలను సవినయంగా స్వీకరించిన గొప్ప కమ్యూనిస్టు కార్యకర్త. 2000 సంవత్సరం నుండి 2002 వరకు గాలికొండ దళ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ఈ క్రమంలో పార్టీ ఇచ్చిన పి.ఎల్.జి.ఎ క్యాంపెయిన్‌ను గాలికొండ ఏరియాలో విజయవంతంగా చేపట్టాడు. వందలాది మంది యువతీ యువకులను మిలీషియా నిర్మాణంలోకి సమీకరించి, వారికి రాజకీయ, మిలటరీ తర్ఫీదునిచ్చి సంఘటితం చేసే కృషిలో కా.రవి పాత్ర కీలకం. అంతే కాకుండా వారికి చిన్న చిన్న శతృ టార్గెట్లను ఎంపిక చేసి కార్యాచరణలో దింపేవాడు. 1995లో అప్పటి కోరుకొండ దళం ఏరియా (ఇప్పటి పెదబయలు దళం ఏరియా) మద్దిగరువు ప్రాంతంలోని గొందివల్లి గ్రామంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా॥ జాంబ్రి (ప్రభాకర్) దుర్గన్నలు అమరులైనారు. ఈ ఘటనకు కారకుడైన బుటారి రంగడుని నిర్మూలించడానికి ఐదుగురు మిలీషియా సభ్యులను ఒకటిగా ఏర్పర్చి, వారికి ఒక నెల సమయం ఇచ్చి పంపించాడు. చాలా కాలంగా తప్పించుకు తిరుగుతున్న ఇన్‌ఫార్మర్‌ని ఖతం చేయడంలో మిలీషియా టీం సఫలీకృతం కావడం వెనకాల కా.రవి పాత్ర మరువలేనిది. ఆ విధంగా మిలీషియాను తీర్చి మలచటంలో విశేషంగా కృషి చేసాడు. అలాంటి కృషి ఫలితంగా గాలికొండ ఏరియా ఉద్యమంలో మిలిషియా స్వతంత్రంగా శతృవును దెబ్బ తీయటానికి అనేక ప్రయత్నాలు చేసింది. రిక్రూట్‌మెంట్‌కి ఊట చెలిమిగా కూడా పని చేసింది.

2002 లో చేపట్టిన నిర్మాణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయటంలో కీలకపాత్ర పోషించాడు. ప్రజల సమస్యలను తీసుకొని వాటిపై పోరాటాలను నిర్మించి, పెద్ద ఎత్తున ప్రజలను కదిలించాడు. ముఖ్యంగా స్థానిక తెగపెత్తందార్లకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం చెప్పుకోదగినది. ఎందుకంటే అప్పటి వరకు తమ తమ గ్రామాలపై ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, సాంఘికంగా, రాజకీయంగా ఆధిపత్యం చెలాయిస్తూ భూస్వామ్య ప్రభువుల పాలనను తలపిస్తుండినారు. దీనికి పునాది భూమి కనుక భూమి సమస్య కేంద్రంగా ఈ పోరాటం నడిచింది. చాలా మంది తెగ పెత్తందార్లు లొంగిరావడం, మరి కొంతమంది ఇతర ప్రాంతాలకు పారిపోవడం జరిగింది. లొంగి రాకుండా ప్రజలకు వ్యతిరేకంగా నిలబడ్డ చీడిగొంది భాస్కరరావు, పెద్ద ఆగ్రహారం గోపాలరావు లాంటి పెత్తందార్లను టార్గెట్ చేసి, వారి స్థిర, చరాస్థులను ప్రజల పరం చేసి వారిని ఉద్యమ ప్రాంతం నుండి బహిష్కరించారు. వందలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని భూములు లేని నిరుపేద ఆదివాసీ ప్రజలకు పంపిణీ చేసారు. ఆ విధంగా ప్రజల సమస్యలను జోడించి, నిర్మాణ క్యాంపెయిన్ విజయవంతం చేయడంలో కా.రవి ముఖ్య భూమికను పోషించాడు. దీంతో గ్రామాల్లో తెగపెత్తందార్లకు పుట్టగతులు లేకుండా పోయి, ప్రజల సమిష్టి ఆధిపత్యం (విప్లవ ప్రజా కమిటీల రూపంలో) ఉనికిలోకి వచ్చింది.

మన జోన్‌లో ఈస్ట్ డివిజన్ పరిధిలోని గాలికొండ ఏరియాను ప్రధాన గెరిల్లా బేస్‌గా నిర్ణయించుకున్నాక ఏర్పాటు చేసిన స్పెషల్ గెరిల్లా దళానికి కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ఆ కాలంలో శతృవు గెరిల్లా బేస్‌లో చొరబడి దాడి చేయాలనే ఎత్తుగడలను వమ్ము చేయడంలోనూ, తిప్పికొట్టడంలోను ముందున్నాడు. ప్రజా రక్షణ కోసం గ్రామ మిలీషియాను సాయుధం చేస్తూ రాజకీయ, మిలటరీ తర్ఫీదునిచ్చాడు. ఆ మిలీషియాలు సాయుధులై స్థానిక గెరిల్లా దళాలలోకి భర్తీ అయ్యారు. దోపిడీ ప్రభుత్వాల ఆధునిక సైనిక బలగాలతో సైతం ధైర్యం, సాహసాలతో తలపడే స్థాయికి ప్రజలు ఎదిగే విధంగా సాయుధ పోరాట రాజకీయలతో ప్రజల చైతన్యాన్ని పెంచడానికి అహర్నిశలు శ్రమించాడు. విప్లవ ప్రజా కమిటీల ద్వారా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే రాజకీయాలతో ఉద్యమం అభివృద్ధి చెందేలా ప్రజల సమిష్టి శ్రమ ఆధారంగా విప్లవకర అభివృద్ధి, సహకార ఉద్యమం పెంపొందేలా గ్రామ స్థాయిలో విప్లవ ప్రజా కమిటీలు నిర్మించుకుంటూ అనేక గ్రామాలను కలిపిన ఏరియా విప్లవ ప్రజా కమిటీని నిర్మించడానికి తన వంతు బాధ్యతను క్రియాశీలకంగా నిర్వహించాడు.

2007 నాటికి ఎ.ఒ.బి ఉద్యమం తాత్కలికంగా వెనుకపట్టు పట్టిన నేపథ్యంలో తీసుకున్న ఎత్తుగడల్లో భాగంగా అప్పటి వరకు ఆర్గనైజేషన్-మిలటరీ నిర్మాణాలను కలిపి ప్లాటూన్ నిర్మాణాలను ఏర్పర్చడం జరిగింది. అందులో భాగంగా ఈస్ట్ ప్లాటూన్‌లో కా. రవి భాగమైనాడు. తనలో ఉన్న మిలటరీ సామర్థ్యం, చొరవ, తెగువ, సాహసం, ధైర్యం వంటి లక్షణాల రీత్యా డివిజన్ యాక్షన్ టీం కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అయితే అనతి కాలంలోనే వేరొక నిర్మాణానికి బదిలీ కావాల్సి వచ్చింది. ముఖ్యంగా ఎ.ఒ.బి ఉద్యమాన్ని రివైవ్ చేయాలనే లక్ష్యంలో భాగంగా సి.ఆర్.సి మొదటి కంపెనీని ఏర్పర్చి ఎ.ఒ.బికి కేటాయించింది. అలా ఏర్పడిన మొదటి కంపెనీలో ఒక ప్లాటూన్‌కు కమాండర్‌గా కా.రవి నియమింపబడ్డాడు. 2014 అక్టోబర్ వరకు కొనసాగిండు. 2014లో రాజ్యం ప్రేరేపిత గూండాల చేతిలో హత్యకు గురై కా.శరత్ అమరుడు కావడంతో ఈస్ట్ డివిజన్ కమిటీలో ఏర్పడిన వెలితిని వెరొకరితో భర్తీ చేయలేని స్థితిలో కా.రవి ఈస్ట్ డివిజన్‌కి బదిలీ చేయడం జరిగింది. అప్పటి నుండి 2010లో మూడవ కంపెనీ నిర్మాణం జరగడంతో కా॥ రవి మొదటి కంపెనీ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. మొదటి కంపెనీ ఎ.ఒ.బిలో చేపట్టిన గునికిరాళ్ల ఆంబుష్, బలిమెల ఆంబుష్, నాల్కోపై

దాడి వంటి చర్యల్లో కా.రవి విజయవంతమైన పాత్ర పోషించాడు. నాల్కో, గునికిరాళ్ళ ఘటనల్లో గాయాలపాలైనప్పటికీ, తను నిర్వహించాల్సిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడంలో తనకు తానే సాటి. గాయాలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నా శత్రువు అంటే తనలో వున్న తీవ్రమైన వర్గ కసియే తను ఏ మాత్రం నిబ్బరాన్ని కోల్పోకుండా ఊగిసలాడకుండా మరింత నిబ్బరాన్ని ప్రదర్శించేవాడు. 1998 చివరిలో బొడిగెడ్డ–బొడిపడ జంట రైడ్లతో మొదలుకొని ధారకొండ, కలిమెల–మోటు, కోరాపుట్–ఆర్.ఉదయగిరి వరకు పలు పోలీసుస్టేషన్లు, క్యాంపులపై మెరుపు దాడులు నిర్వహించి పి.ఎల్.జి.ఎ బలగాల సాయుధశక్తిని పెంచడంలో కా.రవి కీలక పాత్ర పోషించాడు. పైన పేర్కొన్న పోలీసుస్టేషన్లు, క్యాంపులపై మెరుపు దాడుల్లో కా.రవి ప్రధాన అస్సాల్ట్ టీమ్స్‌లో వుంటూ, దాడులు విజయవంతం చేయడంలో ముందుపీఠిన నిలిచాడు. బుడ్డడుపాడు, తూరుమామిడి, లూసం, పలగరేవు, గునికిరాళ్ళు, బలిమెల... ఇలా అనేక ఆంబుష్‌లలో శత్రు బలగాలను నిర్మూలించడంలో ధైర్యంతో, సాహసంతో, తెగువతో పోరాటంలో ముందున్నాడు. అనేక ఎన్‌కౌంటర్లలో నిబ్బరంగా ఉంటూ శత్రువును ప్రతిఘటిస్తూ సురక్షితంగా పి.ఎల్.జి.ఎ బలగాలను రిట్రీట్ చేయించేవాడు. శత్రువు చుట్టివేతకు గురైన ఘటనల్లో వాడి వలయాన్ని గండికొట్టి, మన పి.ఎల్.జి.ఎ బలగాలను సురక్షితంగా బయటపడేందుకు మార్గం సుగుమం చేయడంలో కా.రవి చొరవ, ధైర్యం, సాహసం, తెగువను ప్రదర్శించేవాడు. ఉద్యమానికి తీవ్ర నష్టాల్ని కల్గించిన గబ్బిలం సంజీవరావు, బుటారి రంగడు, పొట్టి బస్తాడు, చింతకాయల శ్రీను, లగుడు, నూకి నాయుడు... ఇలా అనేక మంది విప్లవ ద్రోహులను ఖతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. వర్గ యుద్ధానికి అడ్డు నిలిచిన భూస్వామ్య నిరంకుశ పెత్తందార్లు, బడా వ్యాపారులు, కాంట్రాక్టర్ల మదమణచడంలో, వారిని శిక్షించడంలో ప్రజల క్రియాశీలక భాగస్వామ్యాన్ని పెంచడానికి అవిరాళ కృషి జరిపాడు. శత్రు ఎత్తుగడల్ని తిప్పికొట్టే ప్రతి ఎత్తుగడని చొరవగా అనుసరించడం ఒకటైతే, ధైర్యసాహసాలతో ఉన్నత త్యాగాలకు సిద్ధపడి ప్రజాయుద్ధ చర్యల్ని తీవ్రతరం చేస్తే, వ్యూహాత్మక కర్తవ్యాల్ని నెరవేరుస్తూ శత్రు చుట్టుముట్టి అణచివేత దాడులను నిర్మాణాలు చేయించారు. శత్రువు చుట్టుముట్టి అణచివేత దాడులను ఓడించగలుగుతాం అనే అవగాహనను ఆచరణలో రుజువు చేసినవాడు కా.రవి. అందుకే ఒక మిలటరీ కమాండర్‌గా, పోరాట యోధుడుగా, పార్టీ క్యాడర్ల, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఒక గొప్ప మిలటరీ కమాండర్‌నూ, ఒక యువ పోరాట యోధున్ని ఎ.ఒ.బి ఉద్యమం కోల్పోవడం ఇప్పట్లో పూడ్చుకోలేని నష్టమే.

2014 అక్టోబర్ నుండి తిరిగి ఈస్ట్ డివిజన్ ఉద్యమానికి ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం అందించడానికి కృషిని ప్రారంభించాడు. ఈ క్రమంలో అటవీ ఖనిజ సంపదలను సామ్రాజ్యవాదులు వాళ్ళ దళారీలైన భారత బడా పెట్టుబడిదారీ వర్గం కొల్లగొట్టుకు పోవడాన్ని మిలిటెంట్ పోరాటాల ద్వారా అడ్డుకునే విధంగా ప్రజలను సమీకరించాడు. 1/70 చట్ట సవరణ చేసి ఈ దోపిడీ వర్గాలకు బాక్సైట్ ఖనిజ సంపదను ధారాదత్తం చేయాలని 97 జీ.ఒను జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని తీవ్ర నిర్బంధ కాలంలో కూడా వేలాది మంది ప్రజలు కదిలి దిమ్మెర పోయేటట్లు చేయడంలో కా.రవి అవిశ్రాంతంగా కృషి చేసాడు. బాక్సైట్ వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని నిర్వీర్యపరిచి దెబ్బ తీయాలనే కుట్రలో భాగంగా బాక్సైట్ పునరావాస కమిటీలను ప్రభుత్వం ఏర్పర్చింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో ఎన్.పి, కలెక్టర్, జడ్.పి ఛైర్‌పర్సన్, జడ్.పి.సి.ఇ.ఒలతో ఏర్పడిన పునరావాస కమిటీలో మాజీ సర్పంచ్ సాగిన వెంకటరమణకు కూడా భాగస్వామ్యం కల్పించారు. గ్రామస్థాయిలో జర్రెల, మొండిగెడ్డ పంచాయితీల్లో కూడా పునరావాస కమిటీలు ఏర్పర్చినారు. ఈ పంచాయితీల్లో బాక్సైట్‌కు అనుకూలంగా తీర్మానాలు చేయించారు. దీంట్లో సాగిన వెంకటరమణ పాత్ర కీలకం. బాక్సైట్ వ్యతిరేక పోరాటంలో భాగంగా వీడిని ఖతం చేసారు. మిగిలిన వారి స్థిర, చరాస్థులను ప్రజలపరం చేసారు. దీనికి కా॥ రవి ప్రత్యక్షంగా పాల్గొని నాయకత్వం వహించాడు. అడవిపై, ప్రభుత్వ అటవీ భూములపై హక్కు కోసం పోరాడి వందలాది హెక్టార్ల కాఫీ తోటలు స్వాధీనం చేసుకొని, విప్లవకర భూసంస్కరణల ద్వారా సమానంగా పంచుకొని ఉమ్మడిగా సాగు చేసుకుంటున్నారు. ఇతర అన్ని కాఫీ తోటలపై హక్కు కావాలంటూ మరింత సమరశీల పోరాటాలకు ప్రజల్ని సన్నద్ధపరిచే కృషిలో నిమగ్నమైనాడు.

అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దోపిడీ ఆర్థిక, రాజకీయ, సంస్కృతులను ధ్వంసం చేసి పీడిత ప్రజల విముక్తి దిశగా నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలు, ఆర్థిక, సంస్కృతులను నెలకొల్పడమే మన విప్లవ లక్ష్యం. ఇది దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలోనే సాధించగలం అనే సైద్ధాంతిక అవగాహనతో ఎలాంటి ఊగిసలాట లేకుండా, ఎంటువంటి శషభిషలకు గురి కాకుండా సిద్ధాంతం పట్ల పూర్తి విశ్వాసంతో పని చేసాడు. దోపిడీ పాలక వర్గాలను బలప్రయోగం ద్వారానే కూలదోసి పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని నిర్మించడమే మన విప్లవ వ్యూహం అనే స్పష్టతతో ప్రజల్లో పని చేసాడు కా.రవి. అందుకే పీడిత ప్రజల విముక్తి లక్ష్యంగా ప్రజలకు సేవ చేస్తూ, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తుదిశ్వాస విడిచేంతవరకు పోరాడిన గొప్ప విప్లవకారుడు కా॥ రవి. శత్రువు పట్ల ఎంత కసిగా ఉంటాడో పీడిత ప్రజల పట్ల అంతే వర్గ ప్రేమాభిమానం, గౌరవాన్ని ప్రదర్శించేవాడు. అంతే కాకుండా తన తోటి కామ్రేడ్స్ సమస్యలను పట్టించుకొని పరిష్కరిస్తూ, వారి పట్ల గౌరవభావాన్ని కలిగి వుండేవాడు. అలాగే వారి విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడిగా గుర్తింపు పొందాడు. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారంలో అత్యంత శ్రద్ధ కనబర్చేవాడు. **"పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడానికి మనం విశాల ప్రజారాశుల్లోకి పోవాలి. కానీ ఇంకా మధ్య తరగతి ప్రజానీకం చుట్టూతానే మన కార్యాచరణ వుందని చర్చించేవాడు".** కింది వర్గాల్లోకి పోయి పని చేయడం ద్వారానే వర్గపోరాటం పదునెక్కుతుందనీ, రిక్రూట్‌మెంట్ బ్రేక్ అయ్యి పి.ఎల్.జి.ఎలో భర్తీ అవుతారనీ, ఫలితంగా ప్రజాసైన్యం పెరిగి, ప్రజాయుద్ధ చర్యలు తీవ్రతరం కాబడి, ప్రజల్లో ప్రజాయుద్ధం పట్ల నమ్మకం పెంచవచ్చని పరితపించేవాడు. ముఖ్యంగా కాఫీ పోరాటంలో మనం కింది వర్గాల్లోకి పోవాల్సిన అవసరం ఇంకా మిగిలే వుందని చర్చించేవాడు. అంటే వర్గ దృక్పథం పట్ల కూడా ఒక స్పష్టతతో ఆచరణలో దాని అమలుకు పార్టీ సీరియస్‌గా కృషి చేయాల్సిన అవసరం వుందని

నొక్కి చెప్పేవాడు.

ఎవరిలోనైనా కొన్ని మంచి లక్షణాలతో పాటు కొన్ని బలహీనతలు వుండటం సహజమే. కా.రవిలో ఉండే ఉదారవాదం మూలంగా తనలాగా తన యూనిట్ సభ్యులను తయారు చేయడంలో కొన్ని సమస్యలు అర్థమవుతున్నా వాటిని సకాలంలో పార్టీ పద్ధతుల్లో పరిష్కరించడంలో పొలిటికల్‌గా, మిలటరీ పరంగా తీర్చి మలచడంలో కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాడు. అలాగే సైన్యానికి (కంపెనీకి) నాయకత్వం వహించడంలో కూడా సమస్యలు ఎదుర్కొన్నాడు. తనపై వచ్చిన విమర్శల్లో ఒక్కోసారి రియాక్ట్ అయ్యేవాడు. అయినప్పటికీ తిరిగి పునరాలోచించుకొని ఆత్మవిమర్శ చేసుకునేవాడు. దాని నుండి బయటపడటానికి సీరియస్‌గా ప్రయత్నించేవాడు. తనను విమర్శించిన కామ్రేడ్స్ పట్ల ఎన్నడూ వ్యతిరేక భావంతో గానీ , ఎడం పాటించడం గానీ చేయలేదు. విశాల దృక్పథంతో కామ్రేడ్స్‌తో కలగలిసిపోయేవాడు. సంకుచితంగా ఆలోచించడమనేది తన కార్యాచరణలోనే లేనిది. అలాగే తన విప్లవ కార్యాచరణలో అనేక నిర్మాణాల్లో (డి.వి.సి/సి.వై.పి.సి/ఎ.సి/పి.పి.సి) వుండి పని చేశాడు. కానీ తన మూలంగా ఆ కమిటీల ఫంక్షనింగ్‌కి ఆటంకమయ్యే విధంగా గానీ అనైక్యత చోటు చేసుకునే విధంగా గానీ, కామ్రేడ్లి సంబంధాలకు విఘాతం కలిగే విధంగా గానీ ఎన్నడూ వ్యవహరించలేదు. అయితే సమస్యలను లోతుగా చర్చించి పరిష్కారానికి దోహదపడేలా క్రియాశీలక పాత్ర పోషించే దగ్గర సమస్య వున్నప్పటికీ మొత్తంగా విశాల దృక్పథంతో మెలిగేవాడు. తన దాంపత్య జీవితంలో కూడా ఆదర్శవంతంగానే ఉన్నాడు. ఎందుకంటే పార్టీలో చాలామంది సహచరుల ఎంపిక విషయంలో వివాహానికి ముందు, వివాహం అయిన తర్వాత సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నుండి చూస్తే కా॥ రవి, కా॥ కుమారిని జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకోవడంలో గానీ, దాంపత్య జీవితంలోగానీ, ఆమె అరెస్ట్ అయి జైలులో ఉన్నప్పుడు ఆ తరువాత విడుదలై ఉద్యమంలో కొనసాగలేననీ, ఇంటివద్దనే ఉంటూ సహరిస్తున్నప్పుడు కూడా వారి దాంపత్య జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు లేవు. వారి కార్యాచరణ విప్లవ ప్రయోజనాలకు ఆటంకం కలిగించే రీతిలో లేదనే చెప్పుకోవచ్చు. అయితే ఇదే సమయంలో కొన్ని సమస్యలు, విమర్శలు లేవా అంటే ఉన్నప్పటికీ మొత్తంగా చూస్తే వారి దాంపత్య జీవితం అన్యోన్యంగానే సాగిందని చెప్పవచ్చు. ఆ మేరకు ఆదర్శవంతంగా ఉండటానికి ప్రయత్నించారు.

ఎ.ఒ.బి ఉద్యమం తాత్కాలిక వెనకపట్టు పట్టిన నేపథ్యంలో తిరిగి ఉద్యమాన్ని రివైవ్ చేయడానికి కృషి జరుగుతున్న సమయంలో ఈస్ట్ డివిజన్ ఉద్యమం కా.రణదేవ్, కా.శరత్, కా.రవిలను కోల్పోవడం డివిజన్ ఉద్యమానికీ, అలాగే జోన్ ఉద్యమానికీ తీరని నష్టదాయకం. ఎందుచేతనంటే ఆ ముగ్గురు కామ్రేడ్స్ ఇక్కడే పుట్టి, పెరిగి, ఉద్యమంలోకి వచ్చి అనతికాలంలోనే నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఇక్కడి ప్రజల, సానుభూతిపరుల, క్యాడర్ల అపార విశ్వాసాన్ని చూరగొన్న కామ్రేడ్స్. అయితే వీరిలో కా.రణదేవ్ శత్రువుతో జరిగిన పోరాటంలో హోరాహోరీగా పోరాడుతూ అమరుడైతే, కా.శరత్ రాజ్యం ప్రేరేపిత గూండాలు జరిగిన దాడిలో హత్యకు గురై అమరుడు కాగా, కా.రవి తీవ్ర అనారోగ్యంతో అసువుల బాసిందు. ఆ కామ్రేడ్స్ అమరత్వాలు విభిన్న రూపాల్లో ఉన్నప్పటికీ, పీడిత ప్రజల విముక్తి లక్ష్యంగా ప్రజలకు సేవ చేస్తూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తమ చివరి శ్వాస విడిచేంతవరకు పోరాడి నేలకొరిగారు. మన్యం ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్న అమరులు ప్రజా జీవితాల్లో ఎంతగానో నిలిచిపోయారు. అపారమైన అనుభవాన్ని అందించారు. ఎన్నెన్నో సాహసిక పోరాటాలు ప్రజాయుద్ధ మార్గమంతా వెదజల్లారు. వారు చిందించిన రక్తం ఊటసెలిమెల్లో, జీవనదుల్లో కలిసి కొండా కోనలు, మెట్టతోటలు, మైదానపు మాగాణాలను ఎర్రబార్చనుంది. వీరి అమరత్వం ప్రతి ఇంటిలో దీపమై వెలగనుంది. ప్రతి గూడెంలో స్థూపమై నిలవనుంది. కామ్రేడ్స్ రవి, రణదేవ్, శరత్‌ల పోరాట దీక్ష స్ఫూర్తితో వేలాదిగా ప్రజలు కదిలి అశృనయనాలతో, బిగిసిన పిడికిళ్ళతో అమరుల ఆశయ సాధనకై పునరంకితమవుతూ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఇంకా ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ ప్రజాసైన్యాన్ని పటిష్టపరుస్తూ ప్రజారాజ్యాధికారాన్ని స్థిరపర్చడమే అమరులకు మనం అందించగల నిజమైన విప్లవ నివాళి అవుతుంది. అప్పుడే తూర్పు కనుమలపై సమున్నతంగా ఎర్రజెండాను ఎత్తిపట్టి నిలుపగలుగుతాము. అమరుల అమూల్య స్వప్నమైన అంతిమ లక్ష్యం కమ్యూనిస్టు సమాజ స్థాపనకై, మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేస్తూ, సోషలిజం నిర్మాణ కోసం ఈ సందర్భంగా దృఢంగా ప్రతిజ్ఞ చేద్దాం. ❐

## యుద్ధంలో త్యాగాలు తప్పవు

**యుద్ధంలో త్యాగాలు తప్పనిసరిగా వుంటాయి. త్యాగాలు లేకపోతే విజయం వుండదు. నా కుమారుడిని త్యాగం చేయటం, యితరులు తమ కుమారుల్ని త్యాగం చేయడం రెండూ ఒకటే. తమ బిడ్డల్ని ప్రేమించని తల్లిదండ్రులెవరూ ఈ ప్రపంచంలో వుండరు. అయితే నా కోసం విచారించకండి. ఏమంటే ఇది పూర్తిగా ముందుగా ఊహించలేనిది.**

**విషయాలు ఎందుకు ఎలా జరుగుతాయో మనకు తెలుసు. విప్లవం కోసం తమ బిడ్డల రక్తాలు ధారపోసి త్యాగాలు చేసిన సామాన్య ప్రజలు అనేకానేక మంది వున్నారు. వారికి బాధోపశమనం కల్పించాల్సిన అవసరం వుంది. వారి పట్ల మరింత ఎక్కువ ఆదరణ చూపడం పైన మనం మరింత శ్రద్ధ పెట్టాల్సి వుంది.**

*(కొరియా యుద్ధంలో అసువులు బాసిన తన కొడుకు 'మావో ఆన్‌యింగ్' మరణవార్త విన్నపుడు మావో చేసిన వ్యాఖ్య.
మావో రచనలు: 7వ సంపుటి.)*

# నారాయణపట్న ఉద్యమానికి ఊపిరూదిన దండకారణ్య వేగుచుక్క

## కామ్రేడ్ జైరాం కు క్రాంతికారీ లాల్ సలామ్

భూస్వామ్య దళారీ నిరంకుశ ప్రభుత్వ దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడి అడవిపై, భూమిపై అధికారాన్ని సాధించుకొని, జనతన సర్కార్ల రూపంలో ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించుకున్న ప్రజలకు ఫలితాలు దక్కకుండా సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో దోపిడీ వర్గాలు సల్వాజుడుం పేరుతో **'అంతా ధ్వంసం చేయి, అందర్ని చంపు'** అనే రీతిలో ఫాసిస్టు క్రూర నిర్బంధాన్ని బి.జె.పి ప్రభుత్వం ప్రారంభించింది. దశాబ్దాల పోరాటాల ఫలితంగా రద్దయిపోయిన రీతి, రివాజులను తిరిగి పునరుద్ధరిస్తామని సల్వాజుడుం నేతలు మహేంద్రకర్మ, బలరాం కశ్యప్, కేదార్ కశ్యప్, రాంవిచార్ నేతం లాంటి వారు దండకారణ్య వ్యాపితంగా గూండాలతో దాడులు చేయించి వందలాది మంది స్త్రీ, పురుషులనూ, పిల్లలనూ, వృద్ధులనూ పొట్టన పెట్టుకున్నారు. 200లకు పైగా గ్రామాలలో వేలాది ఇళ్ళను నేలమట్టం చేసారు. మహిళలను అత్యాచారాలకు గురి చేసారు. కోట్లాది రూపాయల విలువగల ఆస్థుల్ని ధ్వంసం చేసారు. ఇటువంటి పరిస్థితుల్లో "నవయువకుల్లారా! కోయ భూంకాల్ మిలీషియాలో చేరండి, న్యాయమైన పోరులో భాగస్వాములు కండి, విముక్తి దండకారణ్యాన్ని నిర్మించండి" అనే పార్టీ పిలుపునందుకొని వందలాది మంది యువతీ, యువకులు కోయ భూంకాల్ మిలీషియాలో, పి.ఎల్.జి.ఎలో చేరి దండకారణ్య ఉద్యమాన్ని ఉరకలెత్తించారు.



ఆ దండకారణ్య దండుల్లోంచి దూసుకొచ్చిన నిప్పురవ్వే కామ్రేడ్ జైరాం. బీజాపూర్ జిల్లా కేసూర్ గ్రామంలో నిరుపేద కోయ కుటుంబంలో పుట్టిన జైరాం పై చిన్నతనం నుంచే పార్టీ ప్రభావం బలంగా వుండేది. ఆ ప్రాంతంలో పార్టీ, సంఘం బలంగా వుండటంతో తను ఆదివాసీ బాలల సంగటన్‌లో చేరి గ్రామంలో జరిగే గ్రామ మీటింగులకూ, కల్చరల్ ప్రోగ్రామ్‌లకు హాజరయ్యి ఎనలేని ఉత్తేజాన్ని పొందుతూ పేద ప్రజల రాజ్యాధికార అవసరాన్ని గ్రహించాడు, దానికై ఆకాంక్షించాడు. విప్లవ పాటల్లో, మాటల్లో పరిష్కార మార్గాలను గుర్తించాడు. తన కుటుంబ సభ్యులు విప్లవంలో పని చేస్తుండటంతో వారసత్వంగా విప్లవాన్ని స్వీకరించాలని కలలు కన్నాడు. ఒక పక్క రాణిబొదిలి, కోరాపుట్, ఉర్పల్‌మెట్ట, ముర్కినార్ లాంటి పి.ఎల్.జి.ఎ సాహసోపేత దాడులు ప్రజాసైన్య కవాతులతో అడుగులు కలిపేలా చేస్తే మరోపక్క సల్వాజుడుం ప్రజలపై చేస్తున్న ఫాసిస్టు దాడులు తన ఉడుకు రక్తాన్ని ఉరకలు వేయిస్తూ సాయుధ పోరులోకి దూకేలా చేసింది. అలా చిన్న వయస్సులోనే (2006) ప్రజాసైన్యంలోకి రిక్రూట్ అయ్యాడు. అయితే తన వయస్సును దృష్టిలో పెట్టుకొని స్థానిక పార్టీ తనను జన మిలీషియా దళంలో ఒక సంవత్సర కాలం ఉంచిన పిదప 2007లో ఎ.ఒ.బి ఉద్యమాన్ని రివైవ్ చేయడంలో భాగంగా ఎ.ఒ.బికి పంపబడిన పి.ఎల్.జి.ఎ బలగాలలో కా.జైరాం ఒకరు. వచ్చీ రావడంతోనే సి.ఆర్.సి మొదటి కంపెనీలో సి.వై.పి.సి మెంబర్‌కు గార్డుగా తను బాధ్యతలు ఉన్నతంగా నిర్వర్తించాడు. చిన్న వయస్సులోనే రాష్ట్రాన్ని దాటి రావటమే కాకుండా పార్టీ ఇచ్చిన బాధ్యతల్ని తూ.చ తప్పకుండా పాటించడంలో ముందుండేవాడు. తనకు చిన్నవయస్సు నుంచి సహజంగా వున్న చొరవతో ప్రజలతో, తోటి కామ్రేడ్స్‌తో కలగలసిపోతూ తెలుగు, కువ్వి, ఒడియా భాషల్ని అతి సునాయాసంగా నేర్చుకోగలిగాడు. దాంతో ఎ.ఒ.బి ఉద్యమాన్నీ, ప్రజల స్థితిగతుల్ని అర్థం చేసుకోవడం కొంత సులువైంది.

స్థానిక ఉద్యమాలతో పెనవేసుకుపోతూ ఎ.ఒ.బిలో అన్ని డివిజన్స్‌లో తను పని చేస్తున్న సమయాల్లో ముఖ్యమైన ఆధారపడ్డదగ్గ భూమికను పోషించాడు. సి.ఆర్.సి కంపెనీ 1, 3లలో పని చేస్తున్న సమయాల్లో ఆయా యూనిట్స్ చేపట్టిన ముఖ్యమైన అన్ని మిలటరీ చర్యలలో తను ముందుండేవాడు. చారిత్రాత్మక నయాగఢ మల్టిరైడ్, నాల్కో రైడ్, బలిమెల, పోత్కల్, పాలూరు, పాట్మాండ్ లాంటి విజయవంతమైన ఆంబుష్‌లలో రాజులకోట, తడతల్, అబ్లియాంబ, మసాన్‌మండ, మండపల్లి, పనికి లాంటి చోట్ల జరిగిన దొంగ ఎదురు కాల్పుల్లో కూడా శతృవు కుటిల ఎత్తగడల్ని తిప్పికొట్టాడు. పై అన్ని మిలటరీ చర్యలలో కూడా తాను అడ్వాన్స్‌లో ముందుండేవాడు. రిట్రీట్‌లో వెనకుండేవాడు. తన చొరవ, ధైర్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను సి.వై.పి.సి గుర్తించి జైరాంను పి.పి.సి.ఎమ్‌గా ప్రమోట్ చేసింది. నారాయణపట్న ఉద్యమాన్ని నిలబెట్టడంలో భాగంగా తనను డిప్యూటేషన్‌పై నారాయణపట్న ఎ.సిలోకి మార్చినప్పుడు స్థానిక ప్రజలతో కలగలసిపోతూ జె.ఎమ్.ఎస్ కమాండర్‌గా గెనువా బాహినికి నాయకత్వం వహించాడు. ఉద్యమానికి మద్దతుగా ప్రజా వ్యతిరేకుల్ని, ఇన్‌ఫార్మర్లను మిలీషియాతో కంట్రోల్ చేస్తూ అనేక ఖతం కార్యక్రమాలకు నాయకత్వం వహించాడు. ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా మిలీషియాకు అనేక మిలటరీ తర్ఫీదుల్ని అందించాడు. 2010 నుండి తను అమరుడయ్యేంత వరకు కోరాపుట్ ఉద్యమంతో మమేకమవుతూ ఉన్నతమైన పాత్రనే పోషించాడు. కోరాపుట్ వుద్యమ ప్రాంతమంతటా తన పేరు తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. చివరికి ఎ.పి.ఎస్.ఐ.బి కూడా తన పేరు, ఫోటోలతో రివార్డులు ప్రకటించిందంటే యుద్ధంలో తన పాత్రను చాలా సులభంగానే అర్థం చేసుకోవచ్చు. కంపెనీలో, దళాల్లో తను ఉన్నాడంటే ఏ పనైనా చేయగలమనే ఒక భరోసా ఆ యూనిట్‌కు ఉండేది. టీచర్‌గా, టెక్నీషియన్‌గా, ఇన్‌స్ట్రక్టర్‌గా, సెక్షన్ కమాండర్‌గా చివరికి డాక్టర్‌గా తను ప్రజలకు అందించిన సేవలు మరువలేనివి. **'ఒక మంచి కమాండర్ కావాలంటే ముందు మంచి సైనికుడిగా తయారవ్వాలి'**

# పట్టణాల నుండి పల్లె పోరాట పట్టును పట్టుకున్న

# అలుపెరుగని విప్లవ ఆణిముత్యం

# కామ్రేడ్ ఆజాద్ కు జోహార్లు

2016 మే 4న విశాఖ జిల్లా కొయ్యూరు మండలం యు.చీడిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని మద్రిపాకల-పాలసముద్రం గ్రామాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో హోరాహోరీగా పోరాడుతూ నేలకొరిగిన పీడిత ప్రజల ప్రియతమ పుత్రులు కా.ఆజాద్, కా.కమల, కా.ఆనంద్‌లు ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించారు.



కా.ఆజాద్ అసలు పేరు గోపాల్ కానీ ప్రజలలో గుర్తింపు ఉన్న పేరు ఆజాద్. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామంలో విప్లవ భావాలు కలిగి వున్న కుటుంబంలో జన్మించాడు. అప్పటికే తన తండ్రి విప్లవోద్యమంలో పని చేస్తుండటం తన తోడబుట్టిన అక్క ఒకరు బయట ప్రజాస్వామిక సంఘాల్లో పని చేస్తుండటం, మరొకరు పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో వుండటం అప్పుడప్పుడు పార్టీ అవసరాల రీత్యా నాయకత్వ కామ్రేడ్స్ తమ ఇంటికి వస్తూ పోతుండటం వల్ల సహజంగానే వీరి ప్రభావం కా.ఆజాద్‌పై పడింది. మొత్తంగా చూసినప్పుడు కా.ఆజాద్ చిన్నప్పటి నుండి విప్లవ భావాలతో పుట్టి పెరిగిండు. ఇంజనీరింగ్ వరకు చదువుకొని బూర్జువా చదువులకు స్వస్తి చెప్పి విప్లవ పాఠాలు నేర్చుకోవడానికీ, విప్లవోద్యమంలో పని చేయడానికి తన సంసిద్ధతను పార్టీకి తెలియజేసాడు. ఉన్నత విద్యనభ్యసించి వుండటం, చురుగ్గా చొరవగా ఉండటాన్ని గమనించిన పార్టీ తనకి కొరియర్ బాధ్యతలు ఇచ్చి తన సేవలను వినియోగించుకోవాలనుకుంది. అలా 2002 నుండి తన విప్లవ కార్యాచరణ మొదలైంది. తనకు అప్పగించిన కొరియర్ బాధ్యతలను అత్యంత జాగరూకతతో, చాకచక్యంగా నిర్వహించాడు. శత్రువు ఫలానా అని గుర్తించడానికి అవకాశం లేకుండా చాలా సాదాసీదాగా ఉంటూ ఉద్యమ సమాచారాన్ని చేరవేసేవాడు. ఆ క్రమంలోనే తన రాజకీయ అవగాహనను కూడా విస్తృతపరచుకున్నాడు. ఉద్యమ అవసరాలకు అనుగుణంగా తయారు కావడానికి అన్ని విధాలుగా తన సంసిద్ధతను పెంచుకుంటున్న క్రమంలో 2006లో అరెస్ట్ అయ్యాడు. ఇంటరాగేషన్ పేరుతో శత్రువు పెట్టిన శారీరక, మానసిక చిత్రహింసలు ఆజాద్ ఉద్యమ సంకల్పాన్ని పీసమెత్తు కూడా కదిలించలేకపోయాయి. పార్టీ రహస్యాలను రవ్వంత కూడా రాబట్టలేకపోయాడు. చివరకు కా.ఆజాద్‌కు ఇష్టం లేకపోయిన బలవంతంగా కావాలనే శత్రువు ఒక పథకం ప్రకారం లొంగుబాటు చూపించి ఉద్యమ శ్రేణుల్లో గందరగోళం కలిగించేందుకు విఫల ప్రయత్నం చేసారు. దీంతో కొంతకాలం ఇంటి వద్దనే గడపాల్సి వచ్చింది. తన అరెస్టు గురించి, బలవంతపు లొంగుబాటు గురించి సవివరమైన వివరాలతో పాటు తన ఆత్మ విమర్శను కూడా రాసి పంపించాడు. తిరిగి పార్టీ తనను ఉద్యమంలో పని చేయడానికి అవకాశం కల్పించిన వెంటనే 2009లో అడవికి వయనమయ్యిండు. పూర్తికాలం విప్లవ కార్యాచరణలో భాగమవుతూ కఠినమైన గెరిల్లా జీవితాన్ని ఎంచుకొని ఈస్ట్ డివిజన్ ఉద్యమంలో అడుగుపెట్టాడు.

తను పుట్టి పెరిగిన పట్టణ జీవితానికి, తను ఎంచుకున్న కఠినమైన విప్లవ గెరిల్లా జీవితానికి మధ్య బోలెడంత వ్యత్యాసం ఉన్నప్పటికీ ఇక్కడ ప్రజల నిష్కల్మషమైన జీవితాలు, తోటి మనుషులను ప్రేమించే వాళ్ళ మనస్తత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కానీ తనలో ఉన్న పెటీబూర్జువా మనస్తత్వం సుపిరియారిటీ కాంప్లెక్స్ మూలంగా వారి ఆదరాభిమానాలు చూరగొనటంలో కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాడు. అయితే ఆ సమస్యల మూలాలను గుర్తించడం, వాటి నుండి బయటపడే అనే దానికి నిరంతరం అంటిపెట్టుకుంటూ సహచరులతో కలిసిమెలిసి ఉండేవాడు.

తనతోపాటుగా డి.కె నుంచి ఎ.ఓ.బికి వచ్చిన కామ్రేడ్స్‌లో అనేక మంది తిరిగి వెళ్ళిపోయినప్పటికీ తను రాజకీయంగా, చైతన్యయుతంగా అసలు సిసలైన కమ్యూనిస్టుగా పార్టీ ఇచ్చిన కర్తవ్యాల్ని పరిపూర్తి చేయడానికే ప్రాణత్యాగం చేసాడు. ఈ 10 సంవత్సరాల విప్లవ జీవితంలో తను చిన్న చిన్న వ్యక్తిగత సమస్యల్ని ఎదుర్కొన్నప్పటికీ వాటన్నింటిని తాను చైతన్యయుతంగా అధిగమించాడు. నమ్మిన ఆశయాలకే కట్టుబడ్డాడు.

చివరిగా స్థానిక పార్టీ తీసుకున్న టి.సి.ఓ.సి నిర్ణయంలో భాగంగా ప్రమాదవశాత్తు మైన్ పేలి కా॥ జైరాం అమరుడు కావడం అనేది ఎ.ఓ.బి ఉద్యమానికి తీవ్రమైన నష్టాన్నే కలిగించింది. **'ఎందరో పుడతారు, అందరూ చనిపోతారు, కొందరు మాత్రమే చరిత్రలో అమరులుగా నిలుస్తారు'.** ఆ కొందరిలో కామ్రేడ్ జైరాంది సుస్థిర స్థానం. కా॥ జైరాం నడిచిన బాటలో మరింత దృఢంగా నడవడమే తనకు మనమిచ్చే ఘనమైన విప్లవ నివాళి. తన ఆశయ సాధనకై గుండెనెత్తురులద్దిన జెండానెత్తుకొని తను నెలకొల్పిన ఆదర్శాలను తరతరాలకందిస్తూ ప్రజాయుద్ధంలో ముందుకు సాగుదాం.

## కామ్రేడ్ ఆజాద్ ఇంటికి రాసిన మొదటి, చివరి లేఖ

*జనవరి 23, 2016*

ప్రియమైన అమ్మ, నాన్న, చిన్నక్కలకు నా విప్లవాభివందనాలు.

మనం భౌతికంగా దూరంగా వున్నా మానసికంగా ప్రతి క్షణం కలిసే వున్నాం. మీరు చిన్నప్పటినుండి నాలో నింపిన విప్లవ భావాలు తీవ్రమైన ప్రజాయుద్ధంలో ఎంతటి కఠినమైన పరిస్థితితులనైనా ఎదుర్కొనే శక్తినిస్తున్నాయి. నేడు దేశవ్యాపితంగా మనం చేస్తున్న ప్రజాయుద్ధం కష్టకాలంలోనే ఉంది. అయినప్పటికీ మన పార్టీ (క్రిటికల్ మాస్) పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాని స్థితిని సాధించింది. అదే సమయంలో శతృవు ఎల్.ఐ.సి అనే యుద్ధరీతిలో మన విప్లవోద్యమాన్ని ఎదుర్కొంటున్నాడు. ఇందులో ప్రధానమైనదీ, అత్యంత ప్రమాదరమైనది 'పోరాడే ప్రజల, పోరాటకారుల మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేసి విప్లవోద్యమాన్ని బలహీనపర్చి దాన్ని నిర్మూలించే ప్రయత్నం చేయడం, దీన్నే మానసిక యుద్ధం' అంటారు. ఇందులో భాగంగా మన సిద్ధాంతానికి కాలం చెల్లిపోయిందనీ, దేశంలో పరిస్థితులు మారిపోయాయనీ, ప్రజలు యుద్ధం చేయరనీ, ఒకవేళ చేసినా బలమైన భారత సైన్యాన్ని ఎదుర్కొని గెలువలేరనీ, యుద్ధం చేసి ఓడిపోవడం కన్నా లొంగిపోవడమే మేలని ప్రచారం చేస్తూ, మీ పిల్లలను లొంగిపొమ్మని చెప్పండని విప్లవకారుల కుటుంబాలకు 'కౌన్సిలింగ్' చేస్తున్నాడు. ఆ కౌన్సిలింగ్ బాధలు భరించలేక వృద్ధాప్యంలో తమకు తోడుండమనీ, కన్నపేగు కనికరించమని ప్రకటనలు ఇప్పిస్తున్నాడు. మీరు ఎన్నటికీ అలా చేయరని మాకు తెలుసు.

అమ్మా! వర్గశతృవు చాలా కిరాతకుడు, కుటిలమైనవాడు. అలా లొంగని కుటుంబాలను అనేక ఇబ్బందుల పాలు చేసి, హింసించి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తాడు. విద్యా, ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం... ఏ బతుకుదెరువు లేకుండా చేస్తాడు. ఇల్లు, వ్యవసాయం అన్నింటిని ధ్వంసం చేస్తాడు. అత్యాచారాలు చేసినా చెదరని ఉక్కు సంకల్పంతో మీరు వాడిని ఎదుర్కొండి. మన పీడిత వర్గ రక్తంలోనే విప్లవముందని చాటి చెప్పండి. మీకు ఆశ్చర్యమనిపించవచ్చు. లక్షలాది పోలీసు బలగాల మధ్య మన పార్టీ, ఉద్యమం ఎలా మనగలుగుతుందని. సు:ఖమెరుగని కష్టజీవులు మా చుట్టు ఉన్నారు. తమ బతుకులు మారాలనీ, దోపిడీ రాజ్యాన్ని అంతం చేయాలనీ, అందుకు యుద్ధమే ఏకైక మార్గమనీ, ప్రజాసైన్యం లేకపోతే తమకిక ఏమీ లేదని నమ్మి తమ సైన్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. శతృవు పెట్టే చిత్రహింసలు నిత్యం భరిస్తూ ఎంతో కసితో, సాహసంతో వాడి లోపాలను, బలహీనతలను అధ్యయనం చేసి మాతో కలిసి అదును చూసి వాడిని దెబ్బ కొడుతున్నారు. వారు ఆకలితో అలమటిస్తూ మాకు అన్నం పెడుతున్నారు. అందుకు వారు అనేక అత్యాచారాలకు గురౌతున్నారు. అయినప్పటికీ వారు మమ్మల్ని ఆదేశిస్తున్నారు. యుద్ధం ఆపవద్దనీ, శతృవును పూర్తిగా నిర్మూలించాలనీ అంటున్నారు. కారణం యుద్ధం వారికి కష్టాలనే కాదు అనేక ప్రాంతాలలో వారికి అధికారాన్ని తెచ్చి పెట్టింది. మొదటిసారిగా వారు విప్లవాన్ని రుచి చూస్తున్నారు. వారు దాన్ని కోల్పోవటానికి సిద్ధంగా లేరు. అమ్మా ! దేశంలో అన్ని ప్రాంతాలు ఒకేలా లేవు. కనుక ప్రజాయుద్ధం కూడా అన్ని చోట్ల, అన్ని సమయాల్లో ఒకేలా సమానంగా అభివృద్ధి చెందదు. ఈ రోజు మన రాష్ట్రంలో మనం బలహీనపడటానికీ, మరో రాష్ట్రంలో కొన్ని విజయాలు సాధించటానికీ సంబంధముంది. గెలుపు, ఓటమి, గెలుపు ఓటమి...అంతిమంగా గెలుపు అని మన సిద్ధాంతం చెబుతుంది. చరిత్రలో ప్రజాయుద్ధాలన్నీ గెలుపు ఓటముల గుండా పయనించి చివరకు గెలిచాయి. మనమూ గెలుస్తాం. దేశంలో శతృసైన్యం లక్షల్లో ఉంది. అయితేనేం మన పీడిత ప్రజలు కోట్లల్లో ఉన్నారు. న్యాయమైన ప్రజాయుద్ధంలో అంతిమ విజయం ప్రజలదే.

చిన్నక్క, మానస, రాజు, మీ మనవరాలు ఆరాధ్యలు ఎలా ఉన్నారు ? ఆరాధ్య మీ పెంపకంలో ఉత్తమ మానవతావాద విలువలతో, విప్లవ భావాలతో ఎదుగుతుందనీ, విప్లవంలో పీడిత ప్రజల పక్షానే నిలుస్తుందని విశ్వసిస్తున్నాను.

అమ్మా, నాన్నా ! మీరు విప్లవోద్యమంలో ప్రత్యక్షంగా భాగం కాలేకపోతున్నందుకు విచారించవద్దు. మీ కృషి మూలంగానే మేము దృఢంగా కొనసాగుతున్నాము. మీ శక్తి మేరకు మీరు పని చేసారు. ఇప్పటికీ మీరు విప్లవ పక్షానే ఉన్నారు. మీరు చేయవలసిందల్లా మమ్మల్ని వీరోచితంగా పోరాడమని ప్రోత్సాహించండి. ఉన్నత విజయాలు సాధించమని ఆశీర్వదించండి.

**విప్లవాభినందనలతో**

**మీ ప్రియమైన అబ్బాయి**

క్రమం కూడా కా.ఆజాద్ కార్యాచరణలో మనకు కనిపిస్తుంది. అందుకే తన గెరిల్లా జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ రాజకీయ చైతన్యంతో వాటిని అధిగమిస్తూ, చివరి రక్తం బొట్టు వరకు తను విప్లవోద్యమంలోనే కొనసాగాలని దృఢంగా నిశ్చయించుకొని ప్రజలే గురువులుగా భావించి వాళ్ళ దగ్గర నుండి జీవిత సత్యాలు నేర్చుకోవడానికి తీవ్రంగా కృషి చేసిండు.

2009 నుండి అమరుడయ్యేంత వరకు ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏరియాను ఉద్యమ కార్యక్షేత్రంగా ఎంచుకొని పని చేసాడు. దళ సభ్యుడిగా, పార్టీ సభ్యుడిగా, ఏరియా కమిటీ మెంబర్‌గా, ఎల్.జి.ఎస్ కమాండర్‌గా, ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. ఈ ప్రాంతంలో జరుగుతున్న వర్గ పోరాటాన్ని అర్థం చేసుకోవడానికి కృషి చేస్తూనే ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలపై లోతుగా అధ్యయనం చేస్తూ సమస్యలకు పరిష్కారం సాయుధ పోరాటమే తప్ప మరో మార్గం లేదనీ, తను నేర్చుకున్న వర్గ రాజకీయాలను ప్రజలకు బోధించడంలో నిరంతరం కృషి చేసాడు. అప్పటికే ఆ ప్రాంతంలో జరుగుతున్న కాఫీ, బాక్సైట్ పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించాడు. కాఫీ ఉద్యమానికి అడ్డంకిగా నిలిచిన రేంజర్ మాధవరావు మజ్జిని ఖతం చేయుటంలో ముందున్నాడు. మన్యంలో వర్గపోరాటానికి అడ్డంకిగా నిలుస్తూ ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించిన విప్లవ ద్రోహులు కన్నవరం బాత్రి, ఎంద్రకోట మాజీ నరేష్ లాంటి వారిని ప్రజల భాగస్వామ్యంతో ఖతం చేడటంలో కా.ఆజాద్ క్రియాశీలక పాత్ర పోషించాడు. పోలీసు ఏజెంట్ వెంకటలక్ష్మిని ప్రజల సమక్షంలో మీడియా ముందు ప్రవేశపెట్టి ఆమె దురాగతలను ఒక్కొక్కటిగా బయటపెట్టి శత్రు కుయుక్తులను తిప్పికొట్టడంలో కూడా ముందున్నాడు. ప్రజా వ్యతిరేకులు కాంగ్రెస్ పార్టీ నాయకులైన దేవరాపల్లి మత్స్యరాజు మంగళపాలెం సర్పంచ్ బాలరాజుల ఇండ్లపై ఆర్థిక దాడి చేయుటానికి ప్రజలను సమీకరించడంలో చురుకైన పాత్ర వహించాడు. ఇలా అనేక మంది దుర్మార్గులైన పెత్తందార్లు, బడా వ్యాపారులు, కాంట్రాక్టర్లను అడ్డు తొలగించుకుంటూ ఉద్యమాభివృద్ధికి బాటలు వేసాడు. దోపిడీ వర్గాల రాజ్య యంత్రాంగాన్ని దెబ్బతీయకుండా మన ఉద్యమ కేంద్ర కర్తవ్యం వైపు గానీ, బాక్సైట్, కాఫీ పోరాటాలను మరింత సమరశీల పోరాటాల వైపు ముందడుగు వేయలేమని భావించాడు. అందుకే దోపిడీ వర్గాల సాయుధ బలగాలను దెబ్బతీడానికి పలగరేవు వద్ద ఆంబుష్ ఏర్పాటు చేసి శత్రువును దెబ్బకొట్టారు. ముగ్గురు బి.ఎస్.ఎఫ్ జవాన్లతో పాటు ఎస్.ఆర్ కంపెనీ సిబ్బంది ఒకరు చావగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ఘటనలో కా.ఆజాద్ శత్రువు రాకపోకలను గమనిస్తూ తెలియజేసే స్కౌట్‌గానూ, అదే సమయంలో అదనపు శత్రు బలగాల రాకను అడ్డుకునే స్టాప్ పార్టీగానూ వ్యవహరించాలనే కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించి ఆంబుష్ విజయవంతం కావడానికి దోహదపడిండు.

2010లో పెదబయలు ఏరియా కిల్లంకోట దగ్గర ఆపర్చునిటీ ఆంబుష్‌లో దూకుడుగా ముందుకు వస్తున్న గ్రేహౌండ్స్ బలగాలను అడ్డుకొని ముగ్గురు జవాన్లను తీవ్రంగా గాయపర్చి వాడి దూకుడుకి కళ్ళెం వేసిన అస్సాల్ట్ టీంలో కా.ఆజాద్ కూడా వున్నాడు. 2012లో పినలువ్వాసింగి వద్ద మన పి.ఎల్.జి.ఎ బలగాలపై శత్రువు చేసిన కౌంటర్ ఆంబుష్‌లో మన బలగాలు దాడికి గురి కాకుండా తగిన ప్రతిఘటన ఇవ్వడంలో కా.ఆజాద్ భాగస్వామ్యం వుంది. ఇలా చెరువూరు, పోతురాజుగుమ్మల, ఎర్రచెరువుల వంటి ఎదురుకాల్పుల ఘటనల్లో సాధ్యమైనంత మేరకు ప్రతిఘటించడానికి ముందుకొచ్చాడు. ఆ విధంగా శత్రువును ఎదుర్కోవాలనే సంసిద్ధతను కనబర్చాడు. శత్రుదాడిని ప్రతిఘటించడం ద్వారానే ఆత్మరక్షణ వుంటుందనే అవగాహనను ఆచరణలో రుజువు పర్చాడు. ఆఖరికి తను అమరుడైన ఘటనలో కూడా శత్రువును దీటుగా ఎదుర్కోవడం ద్వారానే మిగిలిన కామ్రేడ్స్ ఆ మేరకు సురక్షితంగా రిట్రీట్ కావడానికి దోహదపడింది.

విప్లవోద్యమంలో గెరిల్లా జీవితం చాలా కఠినమైనదని గుర్తిస్తూ నిరంతరం తనకు తానుగా ఆ కఠినమైన పరిస్థితులను ఎదుర్కొనే విధంగా సన్నద్ధం కావడంలో భాగంగా నిరంతరం రాజకీయ అధ్యయనం పై కేంద్రీకరించడంతో పాటు మిలటరీ విషయాలపై దృష్టి పెట్టి నేర్చుకోవడానికి ప్రయత్నం చేసేవాడు. పార్టీ కూడా తనను గెరిల్లా సైనిక యోధునిగా తీర్చిదిద్దడం కోసం చేసిన ప్రయత్నాల్లో భాగంగా 2013లో సెంట్రల్ మిలటరీ క్యాంపులోనూ, అదే సంవత్సరం జూన్‌లో జరిగిన మిలటరీ క్యాంపులోనూ, విద్యార్థిగా పాల్గొనే అవకాశం కల్పించింది. ఇలా తనకు దొరికిన అవకాశాలను ఉపయోగించుకొని మిలటరీ టెక్నిక్‌లనూ, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను, జ్ఞానాన్ని పొందుతూ తన పునాదిని మరింత పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నించాడు.

కా.ఆజాద్ 11 సంవత్సరాల క్రితం అతి పెద్ద సామాజిక మార్పు కోసం బాధ్యతను చేపట్టాడు. ఇటువంటి గొప్ప బాధ్యతను చేపట్టడం వేరు. "తుది శ్వాస వరకు ఎవరైతే ప్రజల కోసం, విప్లవం కోసం జీవిస్తారో వారే నిజమైన విప్లవకారులు, కమ్యూనిస్టులు". కా.ఆజాద్ ఈ కోవకు చెందినవాడే. అయితే ఆయనలో ఏర్పడిన ఈ ఔన్నత్యం సీదాసాదాగా ఏర్పడలేదు. ప్రజల కోసం జీవించాలనే నిర్ణయం తీసుకున్న దగ్గర నుండి తన పాత భావాలపై ముఖ్యంగా పెటీబూర్జువా భావాలపై ఎడతెగని పోరాటం చేస్తూ, తనని తాను కమ్యూనిస్టుగా మలుచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. మరోవైపు సమాజ మార్పు కోసం జరుగుతున్న సాయుధ వర్గ పోరాటంలో పూర్తిగా మమేకమైండు. ఈ వర్గ పోరాట కార్యాచరణ ఆయనను ఒక దృఢమైన కమ్యూనిస్టు కార్యకర్తగా, నాయకుడిగా మలిచింది. ఆయన విప్లవ జీవితం అనేక సమస్యలను ఎదుర్కొంటూ విప్లవ భావాలలో, కార్యాచరణలో స్థిరత్వం ఏర్పడి అభివృద్ధి కోసం ఒక మలుపు తిరుగుతున్న సమయంలో ప్రజాద్రోహి దళం సమాచారాన్ని శత్రువుకు చేరవేయడంతో సమాచారం అందుకున్న శత్రువు దళం మకాంపై దాడి చేయుడంలో కా.ఆనంద్, కా.కమలతో పాటు కా.ఆజాద్ అమరులైనారు. ఇప్పుడిప్పుడే నాయకత్వంలోకి ఎదుగుతున్న యువ నాయకత్వం అమరులు కావడం ఉద్యమానికి పీడిత ప్రజలకు ఎనలేని నష్టాన్ని కల్గించింది. ❐

# పోరాటంలో పుష్పించిన ఎర్ర కమలమా

## మా కమ్యూనిస్టు కమల

## అందుకో మా అరుణారుణ వందనాలు

మానవ చరిత్రను నిర్మించింది, నిర్మిస్తున్నది, భవిష్యత్‌లో నిర్మించేదీ కూడా ప్రజలే. ఇది చారిత్రక సత్యం. ఈ చరిత్ర అంతా కూడా వర్గ పోరాటాల చరిత్రే. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా నేడు భారతదేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి చోదకశక్తులు ప్రజలే. ఎవరో విముక్తి ప్రదాతలు వచ్చి మా తలరాతలు మారుస్తారని ఎదురు చూసి మోసపోయే వారికి కాలం చెల్లిపోయింది. మార్క్సిజం అనే కార్మికవర్గ విముక్తి సిద్ధాంతంలో సి.పి.ఐ (మావోయిస్టు) ప్రజల మెదళ్ళను సాయుధం చేస్తున్నది. "ఈ మట్టిని తొల్చుకొని విప్లవాలు లేస్తున్నాయి. మట్టి మనుషులనబడేవారే నేడు మరో చరిత్ర నిర్మాణానికి పునాది రాళ్ళు పేర్చుతున్నారు". మట్టి మనుషుల విముక్తి ఉద్యమాల నుండే మహానేతలు, యోధులు, యోధురాళ్ళు తయారవుతున్నారు. తమను తాము విముక్తి చేసుకోవడానికి సాయుధం అయి సర్కార్‌కు సవాల్ విసురుతున్నారు. దీనిని ఆపడం, అంతం చేయడం ఎవరి తరం కాదని చేయి చేయి, భుజం భుజం, కదం కదం కలుపుతూ వడివడిగా ముందుకు సాగుతున్నారు.



ఇలాంటి మట్టి మనుషుల మధ్య మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని సాలూరు గ్రామంలో 26 సంవత్సరాల క్రితం నిరుపేద ఆదివాసీ కుటుంబంలో వల్లెల బాలయ్య దంపతులకు జన్మించిన ముగ్గురు సంతానంలో ఏకైక కుమార్తె మన కమల. తల్లిదండ్రులు పెట్టిన పేరు గంగి. పేదరికంలో పుట్టి, పేదరికంలో పెరిగిన కమల తన కుటుంబాన్ని, ప్రజలను ప్రత్యక్షంగా చదివింది (అనుభవించింది). అక్షరాలు నేర్పే పాఠశాలకు వెళ్ళి చదువు నేర్చుకోవడం సాధ్యపడలేదు. పేదరికంలో పెరిగినా తల్లిదండ్రుల ప్రేమకు లోటు లేకుండా పెరిగింది. తను పుట్టి పెరుగుతున్న ప్రాంతంలో అప్పటికే వర్గపోరాటం ప్రారంభమై ప్రజాయుద్ధంగా, సాయుధ పోరాటంగా ఎదుగుతూ వచ్చింది. తల్లిదండ్రులు కొద్దిపాటి పోడు వ్యవసాయంతో పాటు, వెదురు కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతూ తనను పెంచి పోషించారు. అక్కడ అడవి మీద అధికారం, అటవీ ఉత్పత్తుల రేటు పెంపుదల కోసం జరిగిన పోరాటంలో పాల్గొని వెదురు నరికి తీసుకెళ్ళే జె.కె. పేపర్ కంపెనీలో తండ్రి మేటు ఉద్యోగంలో చేరాడు. చిన్ననాటి నుండే పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ శ్రమజీవిగా ఎదిగింది. చుట్టూ జరుగుతున్న విప్లవోద్యమాన్ని ఆకళింపు చేసుకున్నది. ప్రజల కష్టాలకూ, బాధలకూ, కన్నీళ్ళకు కారణమైన ఈ వ్యవస్థ పట్ల వర్గ కసిని పెంచుకుంది. పార్టీ బోధించే విప్లవ రాజకీయాలను అర్థం చేసుకుంది. తన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. గ్రామంలో ఉంటూ పార్టీ ఇచ్చే పిలుపులు కార్యక్రమాలను అందుకొని తన ఆచరణకు పదును పెట్టుకుంది. తను నమ్మిన సిద్ధాంతం కోసం పీడిత ప్రజల విముక్తి లక్ష్యంతో 2007లో కుటుంబాన్నీ, గ్రామాన్నీ వదిలి స్వచ్ఛందంగా పూర్తికాలం విప్లవ కార్యకర్తగా పార్టీలో చేరింది. 2007లో కలిమెల ఏరియాలో జనమిలీషియా సభ్యురాలిగా పార్టీ యిచ్చిన ప్రతిఘటన, ప్రచార ఆందోళన కార్యక్రమాలను పట్టుదలతో అమలు చేసింది.

2008 మల్కనగిరి డివిజన్‌లో వ్యూహాత్మక లక్ష్యంతో కుడుములగుమ్మ (బోండగాటి) ప్రాంతానికి విస్తరించాలని పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాంత దళానికి ఎంపిక చేసిన వారిలో కా.కమల సభ్యురాలిగా వెళ్ళాలని నిర్ణయించినప్పుడు ఎలాంటి తటపటాయింపులు, ఊగిసలాట ప్రదర్శించకుండా విప్లవోత్సాహంతో అమలు చేసింది. 2008 నుండి 2013 వరకు అదే ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణానికి అంకితమై అహర్నిశలు కృషి చేసి కష్టించి పని చేసింది. తాను ఎదుగుతూ విప్లవోద్యమాన్ని ఎదిగిస్తూ దానికి నాయకత్వం వహించింది. 2008 గుమ్మ ఏరియాలో విప్లవోద్యమ నిర్మాణం ప్రారంభంలో కొత్త ప్రాంతాన్ని, ప్రజల భాషనూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలనూ అర్థం చేసుకోవడం, శత్రువు కల్పించే ఆటంకాలను అధిగమించడం, ఒకవైపు దళ సభ్యురాలిగా తన విధులను నిర్వహించడం, ప్రజల భాష నేర్చుకొని వారికి రాజకీయాలు బోధించడానికి అవసరమైన అధ్యయనం కోసం చదువు నేర్చుకోవడం కోసం పట్టుదలగా కృషి చేసి సాధించింది.

గుమ్మ ఏరియాపై ఆధారపడి దానిని కలుపుకొని 2009 కోరాపుట్ జిల్లాలోని బైపర్‌గూడ ఏరియాకు విస్తరించి ఎమ్.కె.బి డివిజన్ ఉద్యమ నిర్మాణం అయింది. గుమ్మ బ్లాక్‌లోని విచ్ఛినాంచల్ (కటాఫ్) ప్రజలు నిర్వాసితులయ్యి ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ప్రాథమిక సౌకర్యాలకు కూడా దూరమయ్యారు. 2009లో విచ్ఛిన్నాంచల్‌లోని విశాల ప్రజారాశులను పై సమస్యల ప్రాతిపదికన వేలాది మంది ప్రజలను కూడగట్టి ప్రభుత్వ వ్యతిరేక మిలిటెంట్ ప్రజాందోళనను నడపడంలోనూ, దున్నేవారికే భూమి నినాదంలో గురుశెట్టి నుండి భూస్వాముల వందలాది ఎకరాల భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయడంలో తన వంతు భూమికను పోషించింది. ఏరియాపై శత్రు నిర్బంధం విరుచుకుపడగానే దానిని ప్రతిఘటించాలనే పార్టీ పిలుపుతో 2011లో స్థానిక శత్రు ఏజెంట్లనూ, ప్రజావ్యతిరేకులను

శిక్షించడంలోనూ, 2012లో సాయుధ శత్రువును నిర్మూలించి ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని చేపట్టిన టి.సి.ఓ.సిలో దన్నుగూడ వద్ద బి.ఎస్.ఎఫ్ అధికారులను చంపి ఆయుధాలు స్వాధీనం చేసుకొని విజయవంతం చేసిన కార్యక్రమంలోనూ చురుకుగా పాల్గొన్నది. పట్టుదలగా స్థానిక ప్రజల భాషను నేర్చుకుంది. తెలుగు, కోయా, ఒడియా, కువ్వి భాషలను మాట్లాడుతూ ప్రజలకు వారి స్వంత భాషలోనే రాజకీయాలు బోధిస్తూ వారిలో ఒకరిగా కలిసిపోయింది. తనకు ఎలాంటి బాధ్యతలు ఇచ్చినా చేయలేను అని కాకుండా తోటి కామ్రేడ్స్ సహకారంతో పట్టుదలగా ప్రయత్నం చేసి సాధించి తీరేది. చిన్నవి నుండి పెద్ద క్యాంపుల వరకు కా.కమల నిర్వహణ కమిటీలో కిచెన్ (వంట) బాధ్యతలు చూసేది. ఎంతో నేర్పు, ఓర్పుతో అందులో లీనమై పని చేసేది. నాయకత్వానికి ఆమె కిచెన్ నిర్వహణ బాధ్యతలో ఉందంటే పూర్తి భరోసా ఉండేది. శ్రమైక జీవన సౌందర్యానికీ, ప్రజా సంస్కృతికి ఆమె నిలువుటద్దం. ప్రజల సమిష్టి ప్రయోజనాలకు మనస్ఫూర్తిగా అంకితమై పని చేసిన కార్యకర్త. ఆమెను అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణ ఏమంటే పార్టీలో మహిళా కామ్రేడ్స్ శారీరక బలహీనతలను దృష్టిలో పెట్టుకొని పల్లీలు, బెల్లం నెలకు ఒకసారి తెప్పించి ఇస్తున్నాం. ఆ బరువు తన వ్యక్తిగతానికి పట్టుకోవడం ద్వారా సమిష్టి కోసం పట్టుకోవాల్సిన బరువు తగ్గించుకోవాల్సి వస్తుందని సున్నితంగానే పల్లీల కోటాను తిరస్కరించింది. పెటీబూర్జువా దృక్పథాన్నీ, అలవాట్లనూ, జీవితంలోకి దరి చేరనీయకుండా సాదాసీదాగా కార్మికవర్గ జీవనాన్నీ, క్రమశిక్షణను స్వచ్ఛందంగా పాటించింది. నిస్వార్థంగా, నిజాయితీగా ఉండటం, సూటిగా, స్పష్టంగా మాట్లాడటం కా.కమల నుండి ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త నేర్చుకోదగిన విలువలు. తన గురించిగానీ, తన కుటుంబం గురించి గానీ ఆలోచించి ఆ సమస్యలను పరిష్కరించమని ఏనాడు పార్టీ ముందుకు తేలేదు. 2010లో అకస్మాత్తుగా రెండు చెవులు వినబడకుండా అయ్యాయి. అయినా చలించలేదు. 2013 వరకు మిషన్ సహకారంతో వింటూ వచ్చింది. 2013లో పార్టీ ఆమె చెవులకు ఆపరేషన్ చేయించడం ద్వారా తిరిగి వినికిడి శక్తిని పొందింది. అనారోగ్యం విప్లవానికి ఆటంకంగా ఏనాడు భావించలేదు. ప్రజల, తోటి కామ్రేడ్స్ వర్గబంధాన్ని పెంచుకుంది. కమ్యూనిస్టులందరినీ గౌరవించేది, ప్రేమించేది. కమ్యూనిస్టు మానవ సంబంధాలకు ఆమె నిలువెత్తు సాక్ష్యం. ఆమెలోని విశాల దృక్పథమే అందరి ప్రేమానురాగాలను చూరగొనగల్గింది.

2012లో ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయింది. గుమ్మ ఏరియాలో మహిళా ఉద్యమ నిర్మాణ బాధ్యతలు తీసుకొని ఉద్యమంలో మహిళల భాగస్వామ్యం పెంచింది. సారా, బహు భార్యత్వం, మహిళలపై పితృస్వామిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వాన్ని అందించింది. గుమ్మ ఏరియా ప్రజలలో చెరగని ముద్ర వేసింది. అక్కడి ప్రజల నుండి గొప్ప విశ్వాసాన్ని చూరగొన్నది. 2013లో టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ పార్టీ నిర్ణయించింది. అయినప్పటికీ ఎలాంటి శషబిషలు లేకుండా అమలు చేసింది. ఆ రంగంలో అనుభవం లేకపోయినా పట్టుదలగా నేర్చుకోవడానికి ప్రయత్నం చేస్తూ అనుభవం సంపాదించింది. అప్పటి నుండి అమరురాలయ్యేవరకు జోన్ అవసరాలకు తగిన విధంగా పట్టుదలగా తన సేవలను అందించింది. పార్టీలోని కార్మికవర్గేతర పెటీ బూర్జువా ధోరణుల స్థానంలో గతితార్కిక దృక్పథాన్ని పెంపొందింపజేసి నిజమైన కార్మికవర్గ పార్టీగా తీర్చిదిద్దడానికి పార్టీ చేపట్టిన బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో తనను మరింతగా తీర్చి మలచుకోవడానికి కృషి చేసి ఎదిగింది. 2015 నవంబర్‌లో పి.ఎస్-1లో పని చేస్తున్న కా.నగేష్‌ను (ఎ.సి.ఎమ్.) పార్టీ అనుమతితో పెళ్ళి చేసుకుంది. కొద్ది రోజులకే పార్టీ అప్పగించిన పనుల నిర్వహణలో భాగంగా ఈస్ట్ డివిజన్‌కు వెళ్ళింది. మలేరియా భారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. కోలుకొని తిరిగి కార్యక్రమంలోకి వెళ్ళి ఏప్రిల్ 4 మర్రిపాకల వద్ద దళం మకాంపై ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు జరిపిన ఆకస్మిక దాడిలో కా.ఆజాద్, కా.ఆనంద్‌లతో పాటు అమరురాలైంది. నేడు విప్లవోద్యమం దేశవ్యాపితంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. దీనిని అధిగమించి పురోగమించడానికి బోల్షివీకరించబడుతున్న పార్టీ కార్యకర్తల్లో ఉన్నత విలువలు కల్గిన కా.కమలను కోల్పోవడం విప్లవానికి లోటే. కష్టజీవులలో పుట్టి, వర్గపోరాటంలో ఎదిగి కమ్యూనిస్టుగా జీవించి విప్లవకారిణిగా మరణించిన కమల విప్లవకారులందరికీ ఆదర్శనీయమైంది. అనుసరణీయమైంది. తన ఆశయ సాధనకు అంకితమవుతూ ప్రజల నుండి వేలాది కమలలను తయారు చేద్దామని ప్రజలు, పార్టీ, ప్రజా గెరిల్లాలు మరో మారు శపథం చేసారు. ❐

---

**"ఉదాత్త వీరులను చూడగలిగితే**
**మనం వర్తమాన కాలంలోనే చూడాలి"**

- కామ్రేడ్ మావో

# గోదావరి అలలపై విప్లవ కెరటంలా ఎగిసిన విప్లవ యోధుడు

# కామ్రేడ్ ఆనంద్ కు అరుణారుణ వందనాలు

2016 మే 4వ తేదీన విశాఖ జిల్లా కొయ్యూరు మండలం మర్రిపాకల-పాలసముద్రం గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ప్రత్యేక పోలీసు బలగాలతో, హెూరాహెూరీగా జరిగిన పోరాటంలో మన ప్రియతమ కామ్రేడ్స్ ఆజాద్, కమల, ఆనంద్‌లు అమరత్వం పొందారు. వీరిలో కామ్రేడ్ ఆనంద్ విప్లవ ప్రయాణం ఇలా మొదలైంది.



తూర్పు గోదావరి జిల్లా, అడ్డతీగల మండలం, దబ్బపాలెం గ్రామంలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో కామ్రేడ్ ఆనంద్ పుట్టాడు. తన అసలు పేరు జడుమూరు వెంకటేశ్వర్లు. కామ్రేడ్ ఆనంద్ అన్న కూడా విప్లవకారుడు. ఇంటి దగ్గర తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా వుంటూనే మరొపక్క సంఘం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. దళం గ్రామ పొలిమేరల్లోకి రాగానే యువకులను సమీకరించుకొని దళానికి తిండిని సమకూర్చడం, రక్షణ కల్పించడం వంటి పనులు నిర్వహించి, తన రాజకీయ అవగాహనను విస్తృతపర్చుకున్నాడు.

కామ్రేడ్ ఆనంద్ పుట్టి పెరిగిన ప్రాంతం ఒకప్పుడు సీరియస్ వర్గపోరాటం జరిగిన ప్రాంతం. ఈ నేలతల్లి విముక్తి కోసం పీడిత వర్గాల ప్రియతమ ముద్దు బిడ్డలు అనేకమంది రక్తతర్పణం చేసిన ప్రాంతం కావడం, సహజంగానే అమరుల ప్రభావం కా.ఆనంద్‌పై పడింది. స్వయాన తోడబుట్టిన అన్నయ్య కూడా ఉద్యమంలో పని చేస్తుండటం, తనకు విప్లవోద్యమం వైపు అడుగులు వేయడానికి దోహదపడింది. అలా విప్లవ కార్యాచరణకు దగ్గరవుతూ 2004లో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో అడుగుపెట్టాడు. మొదట కోనలోవ దళ సభ్యుడిగా, ఆ తరువాత గార్డుగా బాధ్యతలు నిర్వహించాడు. ఇంటి వద్ద కొద్దో గొప్పో చదువుకున్నప్పటికీ ఉద్యమంలోకి వచ్చాకనే చదువును ఉద్యమ అవసరాలకు అనుగుణంగా పట్టుదలతో కృషి చేసి మెరుగుపర్చుకున్నాడు. అనతికాలంలో (2008)నే ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. ఈ కాలంలోనే ఈస్ట్ ప్లాటూన్‌లో కొంతకాలం పని చేసాడు. ఆ తర్వాత జోన్‌లో ఏర్పాటైన యాక్షన్ టీంలో మరి కొంతకాలం పని చేసాడు. అయితే యాక్షన్ టీం నుండి ఒక సభ్యుడు దిగజారిపోయి శత్రువు ముందు మోకరిల్లటంతో యాక్షన్ టీం గురించి శత్రువుకు దాదాపు తెలిసినట్టేననీ, ఇక ముందు ఆ నిర్మాణాన్ని కొనసాగించలేమని ఎస్.జడ్.సి. రద్దు చేసింది. తదనంతరం ఈ యాక్షన్ టీంను మల్కనగిరి డివిజన్‌లో ఎల్.జి.ఎస్.లో కలపడం జరిగింది. ఆ ఎల్.జి.ఎస్.లో కూడా కా.ఆనంద్ పని చేసాడు. తరువాత ఈస్ట్ డివిజన్ అవసరాల రీత్యా బదిలీ చేసారు. 2013 నుండి అమరుడయ్యేంత వరకు గాలికొండ ఏరియా సభ్యుడిగా ఎల్.జి.ఎస్ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు.

ఈ మొత్తం కాలంలో విప్లవోద్యమ అవసరాలకు అనుగుణంగా తనను తాను మల్చుకోవడం, కొత్త విషయాలు నేర్చుకోవడానికి చొరవ చేసేవాడు. క్యాడర్‌తో, ప్రజలతో ఇట్టే కలగలిసిపోయేవాడు. భాషలు (కువ్వి, ఒడియా, కోయ) నేర్చుకోవడానికి కూడా శ్రద్ధ పెట్టాడు. మిలటరీ రంగంపై దృష్టి పెట్టి కొన్ని టెక్నిక్స్‌ను పట్టుకొని నేర్చుకోవడంతో కూడా ముందున్నాడు. ఆర్.ఉదయగిరి, నాల్కో వంటి రైడ్స్‌లో పాల్గొన్నాడు. గొల్లవలస ఫైరింగ్‌లో సీరియస్‌గా గాయపడినప్పటికీ ఎటువంటి గందరగోళానికి గురి కాకుండా నిబ్బరంగా, ధైర్యంగా కొట్లాడుతూ రిట్రీట్ అయ్యాడు. ఈస్ట్ డివిజన్ ఉద్యమానికి తీవ్ర నష్టాల్ని కలిగించిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ అప్పన్నను ఖతం చేయటంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. సామ్రాజ్యవాదులకు వారి దళారీలైన భారత బడా పెట్టుబడిదారి వర్గానికి, బాక్సైట్ ఖనిజ సంపదను ధారాదత్తం చేయాలనీ 97 జీ.వో జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని తీవ్ర నిర్బంధ కాలంలో కూడా వేలాది మంది ప్రజలు కదిలి దిమ్మెరపోయేటట్లు చేసారు. ఇందులో కూడా కా.ఆనంద్ తన శక్తి మేరకు ప్రజలను కదిలించడంలో చురుగ్గా పాల్గొన్నాడు. అడవిపై హక్కు తమదేనంటూ, కాఫీ తోటలపై హక్కు కావాలంటూ మరింత సమరశీల పోరాటాలకు ప్రజలను సమాయత్తం చేసే పనిలో కూడా భాగస్వామ్యమయ్యాడు.

ఇదే సమయంలో అనేక సమస్యలు, విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. విమర్శను పాజిటివ్ దృక్పథంతోనే అర్థం చేసుకొని అందులో నుండి బయటపడేందుకు నిజాయితీగా ప్రయత్నించాడు. జీవిత సహచరితో తలెత్తిన సమస్యలను కూడా పార్టీ పద్ధతుల్లో పరిష్కరించుకోవడానికి శాయశక్తులా ప్రయత్నం చేసాడు. ఉద్యమ జీవితంలో ఎదురైన ఆటుపోట్లను తనకున్న రాజకీయ చైతన్యంతోనూ, పార్టీ తోడ్పాటుతోనూ పరిష్కరించుకోవడానికే ప్రాధాన్యతనిచ్చాడు తప్ప ఎన్నడూ ఊగిసలాటకు గురి కాలేదు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పేద ప్రజల విముక్తే లక్ష్యంగా ప్రజలకు సేవచేస్తూ తన చివరి రక్తంబొట్టు నేలరాలేవరకు శత్రువుతో హెూరాహెూరీగా పోరాడుతూనే నేలకొరిగాడు తప్ప ఎప్పుడూ వెనుదిరిగి చూడలేదు. "మృత్యువు నోటినుండే ప్రజారాజ్యాధికారం ఉద్భవిస్తుంది" అన్న చారిత్రక సత్యాన్ని పుణికిపుచ్చుకున్న మన్యం త్యాగాల బాటలో పురోగమిస్తూనే ఉంది. ఈ నేలతల్లి విముక్తి కోసం పీడిత ప్రజల ముద్దు బిడ్డ కామ్రేడ్ ఆనంద్ తన అమూల్యమైన ప్రాణాలర్పించాడు. ఈ గడ్డపై పోరాడుతూ రక్తం చిందించిన తమ బిడ్డల ఆశయాలను సాఫల్యం చేయడానికి విప్లవ పార్టీ నాయకత్వంలో ప్రజలు ప్రజాయుద్ధానికి పునరంకితమవుతున్నారు. అమరుల అమూల్య స్వప్నమైన అంతిమలక్ష్యం కమ్యూనిస్టు సమాజ స్థాపనకై, మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేస్తూ, సోషలిజం నిర్మాణం కోసం ఈ సందర్భంగా దృఢంగా ప్రతిజ్ఞ చేద్దాం.

❐

# ఎమ్.కె.వి.బి డివిజన్

## 1. "ఆపరేషన్ గ్రీన్‌హంట్" లో పోలీసులు అనుసరిస్తున్న ఒక సాధారణ భయోత్పాత రూపం-ప్రజలపై కాల్పులు

2015 మే 1న గూడెం మండలం తీములబంద వద్ద డి.ఆర్.డిపోకు వెళ్తున్న చెరుకుంపాకల గ్రామస్తులపై పోలీసులు (ఎపిఎస్‌పి, సిఆర్‌పిఎఫ్) కాల్పులు జరిపారు. మే 27న కొయ్యూరు మండలం పోకలపాలెం వద్ద అడ్డాకులకు వెళ్తున్న వారిపై గ్రేహౌండ్స్ పోలీసులు కాల్పులు జరిపారు. ఈ రెండు ఘటనలు కూడా యాదృచ్ఛికమైనవి కాదు. ఇవి చాలా ప్రణాళికాబద్ధంగా నిర్దేశించిన లక్ష్యంపై జరిపిన దాడులు. ముందు మే 1న కాల్పులు జరిపిన చెరుకుంపాకల మనకు బలమైన మద్దతు గల గ్రామం. ఈ గ్రామంలో గల ప్రజాసంఘ, పార్టీ నిర్మాణాలపై సుదీర్ఘ కాలంగా శతృవు ఒకవైపు భౌతికంగా నిర్మూలించేందుకు ప్రయత్నాలు చేస్తూనే లొంగిపొమ్మని వివిధ మార్గాలలో హెచ్చరికలు పంపుతూ, భయభ్రాంతులకు గురి చేసేందుకు తరచుగా కాల్పులకు పాల్పడుతున్నాడు. చెరుకుంపాకల గ్రామంపై కాల్పులు జరపడం ఇది మొదటిసారి కాదు. గతంలో ఆ గ్రామం వద్దనే పొలం పనులకు వెళ్తున్న వారి పై కాల్పులు జరిపారు. గ్రామాన్ని పగలు, రాత్రి అనేకసార్లు చుట్టుముట్టారు. తీవ్రమైన నిర్బంధం మూలంగా ఆ గ్రామ సంఘ నాయకత్వం సైతం రహస్య జీవితం గడుపుతున్నారు. తీవ్రమైన మానసిక వేధింపులు, నోటీసులు, హెచ్చరికలు, గ్రామంపై దాడులు, వీటికి తోడు మే 1న వీరిపై జరిపిన కాల్పుల మూలంగా మానసిక స్థైర్యం కోల్పోయిన ఆ గ్రామ సంఘ-పార్టీ కార్యకర్తలు 12 మే 2015న పోలీసులకు లొంగిపోయారు. ఇది రాజకీయంగా ఆ పాకెట్ ప్రజా ఉద్యమంపై ప్రతికూల ప్రభావాన్ని వేసింది. రెండవ ఘటన మే 27, పోకలపాలెంపై జరిగింది. ఉధృతమౌతున్న బాక్సైటు వ్యతిరేక ఉద్యమంలో ముందు పీఠిన నిలుస్తున్న గ్రామాలపై శతృవు నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తున్నాడు. బాక్సైటు వ్యతిరేక ర్యాలీలకు, సభలకు ఉవ్వెత్తున సాగుతున్న ప్రజాసమీకరణకు విఘాతం కల్పించేందుకు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రజా సమీకరణలకు ముందుగా గ్రామలలో పెద్దఎత్తున పోలీసు బలగాలను మొహరింపచేస్తున్నాడు. వీళ్ళు ఆయా గ్రామాలలో బాక్సైటు వ్యతిరేక ర్యాలీలకు, సభలకు వెళ్ళవద్దనీ, అక్కడ కాల్పులు కూడా జరుపుతామనీ, ప్రజలను బెదిరిస్తూ మీటింగ్‌లు చేస్తున్నారు. ముందుగా నిర్దేశించుకున్న గ్రామాల వద్ద ఏదో ఒక సాకుతో ప్రజలపై కాల్పులు జరుపుతున్నారు. అందులో భాగంగానే కన్నవరం పాకెట్‌లో ప్రజా సమీకరణకు కీలక పాత్ర పోషిస్తున్న పోకలపాలెం గ్రామాన్ని ఎంపిక చేసుకుని ప్రజలపై కాల్పులు జరిపారు. ఈ ఘటన కొయ్యూరులో బాక్సైటు వ్యతిరేక ధర్నాకు జరిపిన ప్రజా సమీకరణపై కొంత ప్రభావాన్ని వేసింది.

## 2. గోబరపడ ఎన్‌కౌంటర్ కారకుడు రమణ ఖతం

విశాఖ జిల్లా ముంచింగ్‌పుట్ మండలం గోబరపడ గ్రామం వద్ద జూన్ 20 2015న గుమ్మ ఏరియా దళం మకాంపై ఆంధ్రా గ్రేహౌండ్స్ పోలీసులు పక్కా సమాచారంతో ఉదయం 8 గంటలకు దాడి చేసారు. ఆ సమయంలో బహిర్భూమికి వెళ్ళి తిరిగి వస్తున్న కా.సోను పోలీసు కాల్పులలో అమరుడయ్యాడు. ఈ ఘటనపై ప్రజలలో విచారణ జరపగా నిజాలు బయటపడ్డాయి. ఆల్ అవుట్ అభియాన్-2 పేరుతో వందలాది గ్రేహౌండ్స్ బలగాలు ఈ ప్రాంతంలో దళం కోసం జూన్ 17 నుండే గాలింపులు కొనసాగిస్తున్నారు. దళం 19 సాయంత్రం గోబరపడ గ్రామానికి వెళ్ళింది. అప్పటికే పోలీసులు ఆ గ్రామ పరిసరాలకు వచ్చి ఉన్నారు. ఈ విషయం దళానికి తెలియకుండా ఉంచాలని గ్రామపెద్దలు ప్రజలను కంట్రోలు చేసారు. దళం గ్రామానికి వచ్చిన సమాచారం 19వ తేది రాత్రే పోలీసులకు అందింది. 20న ఉదయం దళం మకాం ఎక్కడుందనే విషయం గ్రామనాయక్ కుటుంబం ద్వారా నిర్ధారించుకుని గ్రామస్తులు ఎవరూ బయటకు వెళ్ళకుండా ఉండేందుకు గ్రామనాయక్ జగబంద్ నాయక్, గ్రామ సిపిఎమ్ నాయకుడు రమణలు కంట్రోలు చేసారు. సొన్యో ఒంతాలు, దొబులు, లొయికన్‌లనే విప్లవ ద్రోహుల సహకారంతో దళం దేరాలోకి నేరుగా వచ్చి దాడి చేసారు.

ఈ దాడి తరువాత గ్రామనాయక్ జగబందు కుటుంబాన్ని, మేకలు, గొడ్లు, ఇతర వస్తువులు, కొడుకు లొయికన్ కుటుంబాన్ని కూడా తీసుకుని గ్రామం విడిచిపోయాడు. సొన్యో ఒంతాలు కూడా గ్రామం విడిచి వెళ్ళిపోయాడు. జులై 24న దళం, మిలీషియా, ప్రజలు కలిసి గ్రామంలో ప్రజా కోర్టు నిర్వహించి విచారించగా పై విషయాలు అర్థం అయ్యాయి. సిపిఎమ్ గ్రామనాయక్ రమణను పట్టుకోగా, దొబులు తప్పించుకుని పారిపోయాడు. జగబంద్ ఇంటిని పూర్తిగా ధ్వంసం చేసి, లొయికన్, దొబులు, సొన్యో ఒంతాలు, రమణల ఇళ్ళలోని సామాన్లూ కొన్ని మేకలూ ప్రజలకు పంపిణీ చేసారు. ఈ సంఘటనతో సంబంధం ఉన్న రమణను 25న ఖతం చేయడం జరిగింది. ఈ దాడి జరగడానికి గల కారణాలను మరింత లోతుల్లోకి వెళ్ళి పరిశీలిస్తే ఈ ప్రాంతంలోకి దళం కొత్తగా విస్తరణలో భాగంగా వెళ్ళింది. ఈ గ్రామం సిపిఎమ్ ప్రభావంలో ఉంది. నాయకులకు మన విస్తరణను అడ్డుకోవాలనే పథకం ఉంది. గ్రామనాయక్ భూస్వామి. ప్రజల పై తిరుగులేని పెత్తనం చలాయిస్తున్నాడు. వీరు మనల్ని ఎదుర్కోవడానికి భౌతిక దాడి చేయించి అడ్డుకోవాలనే పథకంతో పోలీసులతో ముందుగానే చేతులు కలిపాడు.

## 3. "దున్నేవారిదే భూమి" నినాదంతో భూస్వాముల భూములు స్వాధీనం చేసుకుని, పంపిణీ చేసుకున్న వ్యవసాయ కూలీ, పేద రైతాంగం

విశాఖ జిల్లా పెదబయలు ఏరియాలోని జాముగూడ పంచాయితీలోని గుంజివడ గ్రామానికి చెందిన బాలం నాయుడు, చింతలవీధి గ్రామంలో అరుపతి పడాలు, ఒలకల వీధికి చెందిన.......ఈ ముగ్గురు వద్ద గ్రామంలోని మిగిలిన వారందరి కన్నా ఎక్కువ భూములు ఉన్నాయి. బాలం నాయుడు కుటుంబ

సభ్యులు ఉద్యోగాలు చేస్తూ బయటే సెటిల్ అయ్యారు. కూలీలను పెట్టి పని చేయించడం, కౌలుకు ఇవ్వడం ద్వారా ప్రజలను దోచుకుంటున్నారు. రాజకీయ నాయకుడుగా ఈ ప్రాంతంపై ఎదురులేని పెత్తనం చలాయిస్తున్నాడు. గుంజివడ తిరుపతి పడాలు కూలీలను పెట్టి పని చేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాడు. ఈ గ్రామాలలో నేటికి భూమిలేని వ్యవసాయ కూలీ, పేద రైతాంగం ఉన్నారు. ఈ కుటుంబాలు కూలీపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామంలోని విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో పై ముగ్గురికి చెందిన 60 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని గుంజివడ, ఒలకలవీధి, చింతలవీధిలలో 65 నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది. స్వాధీనం చేసుకుని పంపిణీ చేసుకున్న భూమిని వెంటనే దుక్కులు దున్ని సాగుచేసి పంటలు వేసుకున్నారు.

## 4. దున్నేవారికే భూమి-విప్లవ ప్రజాకమిటీలకే అధికారం అంటూ సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్న రైతాంగం

మన ఎ.ఒ.బి జోన్‌లో భాగమైన ఎమ్.కె.వి.బి డివిజన్‌లోని గ్రామీణ ప్రాంతంలో నేటికీ నూటికి 90% ప్రజలు రైతాంగంగానే ఉన్నారు. అంటే వీరంతా భూమిపై ఆధారపడే జీవిస్తున్నారు. అయితే అందులో భూమిలేని నిరుపేదల సమస్యలపై ప్రధానంగా మన పార్టీ ప్రారంభం నుండి పని చేస్తున్నది. 'అడవిపై అధికారం అదివాసీలదే పీడిత ప్రజలదే' అనే నినాదంతో ప్రభుత్వ ఆధీనంలోని అటవీ భూములు, భూస్వామల ఆక్రమణలోని భూములు, తెగ పెద్దల స్వాధీనంలో వున్న భూములు, మన వర్గ సంఘాల నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకున్న వేలాది ఎకరాల భూములను వ్యవసాయ కూలీ, పేద రైతాంగానికి పంపిణీ చేసాం. ప్రభుత్వం భూసంస్కరణలు అమలు చేయకపోగా భూస్వామ్యాన్ని రక్షించడంలో భాగంగా ప్రభుత్వ సాయుధ బలగాలతో ప్రజలపై దాడులకు పూనుకొని భూములు భూస్వాములు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, తెగ పెద్దల చేజారకుండా కాపాడుతూ వస్తున్నది. విప్లవ ప్రతిఘాతుకత్వాన్ని ఎదుర్కొంటూనే ప్రజలు 'దున్నేవారికే భూమి, విప్లవ ప్రజా కమిటీలకే అధికారం' నినాదంతో సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. వ్యవసాయంలో ఉత్పత్తి శక్తులను స్వావలంబన కూడిన అభివృద్ధిని సాధించడానికి కృషి చేస్తున్నారు. అలాగే (ఉత్పత్తి శక్తులపై) భూమిపై అధికారం కలిగి వుండి ప్రజలపై తమ రాజకీయ అధికారాన్ని చలాయిస్తున్న ప్రజా శతృవులపై వర్గపోరాటం ద్వారా రాజకీయ అధికార సాధనకు ప్రజలు సంఘటిత పడుతున్నారు.

మల్కనగిరి జిల్లా తెంతులిగుమ్మ బ్లాక్‌లోని కటాఫ్ ఏరియాలో బియానిబుడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, గ్రామ పెత్తందార్లు, ఆదివాసి భూస్వామి అయిన బలరాం జిల్లా బి.జె.పిలో చురుకైన స్థానిక నాయకుడిగా కొనసాగుతూ పంచాయితీలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని చలాయిస్తూ ప్రజలకు, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తూ గ్రామంలో సంఘ నిర్మాణాన్ని అడ్డుకోవడం, బెదిరింపులకు గురి చేసాడు. చుట్టుపక్కల గ్రామాలలో పార్టీ నాయకత్వంలో జరుగుతున్న వర్గపోరాటంతో ప్రభావితులైన గ్రామ ప్రజలు పార్టీ నాయకత్వంలో బలరాం దోపిడీ, అరాచకాలను ప్రశ్నించారు. దాంతో తన ఆధికారాన్ని కోల్పోయి ప్రజల తీర్పుకు కట్టుబడటం ఇష్టం లేక గ్రామాన్ని వదిలి కుటుంబంతో సహా పారిపోయి పోలీసుల చెంతకు చేరాడు. దాంతో బలరాం ఇల్లు, పశువులు, ఇంటిలోని సామాను, భూములను ప్రజలు స్వాధీనం చేసుకొని విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో గ్రామంలో భూమిలేని వ్యవసాయ కూలీ, పేద రైతులు 12 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి ఒక ఎకరం చొప్పున భూమి పంపిణీ చేయడం జరిగింది. అలాగే 13 పశువులను 10 కుటుంబాలకు, ఇల్లు 2 కుటుంబాలకు, ఇంటిలో ధాన్యం, గృహోపకరణాలను గ్రామస్తులందరికీ పంపిణీ చేయడం జరిగింది.

గుసంపొద్దూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, గ్రామ పెత్తందారు, భూస్వామీ అయిన గోపాల్, ఆయన తమ్ముడు సహదేవ్‌లు గ్రామంలోని సారవంతమైన నీటి సౌకర్యం కలిగి సాగుకు యోగ్యమైన భూములను తమ రాజకీయ ఆధిపత్యం ప్రయోగించి స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నారు. గ్రామంలో వీరి మాట వినని వారిని బెదిరించడం, గ్రామం వదిలిపోయే విధంగా వత్తిడి చేయడంతో, అనుచరుల ద్వారా దాడులు చేయించడం చేసారు. గ్రామంలో ప్రజలను పార్టీ వైపు వెల్లకుండా, సంఘ నిర్మాణం ఏర్పడకుండా అడ్డుకుంటూ వచ్చారు. చివరకు పోలీసుల ఏజెంట్లుగా మారి వారి అనుచరులతో దళంపై దాడికి పథకం వేసారు. అది విఫలమై దేహశుద్ధికి గురయ్యారు. ఆ తర్వాత అన్నదమ్ములిద్దరు గ్రామం విడిచి నేరుగా పోలీసులతో చేతులు కలిపారు. ఆ తరువాత ప్రజలు వీరి అనుచరులను లొంగదీసుకున్నారు. ప్రజలు వీరి భూములు, ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. మేలైన 20 ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని గ్రామంలోని భూమిలేని వ్యవసాయ కూలీ 13 కుటుంబాలకు పంపిణీ చేసుకున్నారు. 17 గొడ్లు, 16 మేకలు, 100 క్వింటాళ్ళకు పైగా ధాన్యం, ఇంటిలోని వస్తువులు 2 ఇళ్ళు చుట్టుపక్కల 6 గ్రామాల ప్రజలకు పంపిణీ చేసుకున్నారు.

బచ్చులిపొద్దూరు గ్రామ పెత్తందారు, పంచాయితీ వార్డు సభ్యుడు, ప్రజా వ్యతిరేకి దొన పోలీసు ఏజెంటుగా మారి పార్టీ చేతిలో దేహశుద్ధికి గురయ్యాడు. ఆ తర్వాత ప్రజలకు లొంగిపోయినట్లు నటిస్తూ దళంపై దాడి చేయాలని పథకం వేసుకొని విఫలమై గ్రామం వదిలి పారిపోయాడు. అతని భూమిలో కొంత భాగాన్ని కుటుంబ సభ్యులకు వదిలి వేసి మిగిలిన భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రామానికి చెందిన 30 ఎకరాల భూమి ఒరపొద్దూరు గ్రామస్తుల (ఇద్దరు) చేతిలో తాకట్టులో వుండగా విడిపించి అందులో నుండి 20 ఎకరాలను గ్రామంలోని 27 కుటుంబాలకు పంపిణీ చేసి మిగిలిన 10 ఎకరాల భూమిలో సమిష్టిగా వ్యవసాయం చేసే విధంగా సంఘం, ప్రజలు కలిసి నిర్ణయించారు.

ఒరపొద్దూరు గ్రామంలో పెత్తందారు, ప్రజావ్యతిరేకి గాసి, ఇతని కొడుకు సాహెబు పోలీసు ఏజెంట్లుగా మారి గ్రామ బహిష్కరణకు గురయ్యారు. వారి భూమితో పాటు మరొ ఇద్దరు గ్రామ పెత్తందార్ల ఆధీనంలో వున్న 40 ఎకరాల ఒనబాది (గ్రామం నుండి వెళ్ళిపోయిన కుటుంబాలకు చెందిన భూమి) భూములను వారి నుండి స్వాధీనం చేసుకుని భూమిలేని 40 కుటుంబాలకు సంఘం నాయకత్వంలో పంపిణీ చేసారు.

తోటగూడ, సన్యాసిగూడ గ్రామాల మధ్య నీటి సౌకర్యం లేకుండా బీడుగా వున్న భూములను చెక్ డ్యాంను నిర్మించి సాగులోకి తేవాలని గత సంవత్సరం సంఘం, ప్రజలు కలిసి నిర్ణయించాం. రెండు

గ్రామాల ప్రజలు ఒక నెల రోజులకు పైగా శ్రమించి సమిష్టి చెక్ డ్యాంను నిర్మించారు. ఈ సంవత్సరం కాలువ నిర్మాణ పనులు కూడా పూర్తి చేసి 2 గ్రామాలకు చెందిన 48 కుటుంబాలకు ఒక్కొక్కరికి 1 ఎకరం చొప్పున పంపిణీ చేసి సాగులోకి తెచ్చారు. అర్లింగ్‌పడ గ్రామ నాయక్‌కు చెందిన 5 ఎకరాల భూమి సంఘం నాయకత్వంలో స్వాధీనం చేసుకుని పంపిణీ చేసుకున్నారు.

సిమ్లిపొద్దూరు గ్రామంలో క్రిస్టియన్ మత పెద్ద రాము, ఆయన తమ్ముడు మాజీ సంఘ నాయకుడు లుంపెన్ అయిన రవి ప్రజా వ్యతిరేకిగా మారి సంఘాన్ని దెబ్బతీయడానికి అనేక కుట్రలు పన్ని అవి బహిర్గతం కావడంతో గ్రామం వదిలి పారిపోయి పోలీసులను ఆశ్రయించారు. వీరికి చెందిన 3 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని గ్రామంలోని 5 కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి.

గొబరిపడ గ్రామానికి చెందిన తెగ నాయకుడు .......తన రాజకీయ ఆధిపత్యాన్ని ఉపయోగించుకొని ప్రజలపై దాడులు, భూములు స్వాధీనం చేసుకొని క్రూరమైన భూస్వామిగా మారాడు. ఆ ఏరియాకి దళం వెళ్ళి ప్రజలతో సంబంధాలు, సంఘ నిర్మాణాల కృషి ప్రారంభించగానే తన అధికారం కొనసాగించడం ప్రమాదంలో పడిందని భావించి పోలీసు ఏజెంటుగా మారి దళంపై దాడి చేయించాడు. ఇది బహిర్గతమై గ్రామం నుండి పారిపోయి పోలీసు రక్షణలో వుంటున్నాడు. ఇతని 20 ఎకరాల సారవంతమైన పొలాన్ని, సుమారు 30 క్వింటాళ్ళ ధాన్యాన్ని జప్తు చేసుకుని ప్రజల పరం చేయడం జరిగింది.

భూములను సాగులోకి తేవడం, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం, పంటల మార్పిడి, పండిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలను సాధించడం తదితర కార్యక్రమాల ద్వారా వ్యవసాయక విప్లవం చేపట్టాము. అందులో భాగంగా అడవులు నశించి, బోడికొండలుగా మారి ఆహార పంటల సాగుకు ఉపయోగపడని భూములలో జీడిమామిడి మొక్కలు నాటాలని ప్రజల అభిప్రాయంతో కటాఫ్ ఏరియాలోని తాబేరు, అర్లింగ్‌పడ, కొండంజరి, నడింజరి, మర్రివడ, సన్యాసిగూడ, తోటగూడ, జొంత్రి, దకడపొద్దూరు, దాబగూడ, బొజ్జగూడ గ్రామాలలో 8వేల మొక్కలు నాటారు. అలాగే పెదబయలు ఏరియాలోని ఇనుపతీగల, జమదంగి గ్రామాలలో ప్రతి కుటుంబం 30 నుండి 60 మొక్కల చొప్పున నాటారు.

ప్రజల పోషకాహార సమస్యను మెరుగుపర్చడంలో భాగంగా 10 గ్రామాలలో వివిధ రకాల 200 పండ్ల మొక్కలు, 5 గ్రామాలలో ఒక్కొక్క గ్రామంలో 50, 60 చొప్పున మునగ మొక్కలు నాటారు.

భూముల సాగులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించగా వారు దున్నుకోవడానికి కొందరికి పశువులు లేకపోవడం, వయస్సు మళ్ళిన వృద్ధులు వుండటం, సీజన్‌లో కొన్ని కుటుంబాలు అనారోగ్యాల పాలై భూమిని సాగు చేయలేకపోతున్నారని మాట్లాడారు. ఈ సమస్యను అధిగమించడానికి కొన్ని కుటుంబాలు కలిసి శ్రమ సహకార టీంలుగా ఏర్పడాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం కటాఫ్ ఏరియాలో 17 గ్రామాలలో 5-10 కుటుంబాలు గ్రూపులుగా ఏర్పడి సాగు చేసారు. దకడపొద్దూరు గ్రామంలో అన్ని కుటుంబాల మొత్తం భూమిని సమిష్టి వ్యవసాయ క్షేత్రం కిందకు తెచ్చి పండించిన పంటను సమానంగా పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. తాబేరు గ్రామంలో ఎక్కువ కుటుంబాలు ఉండటంతో గ్రామంలోని మొత్తం కుటుంబాలు 2 సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకుని సాగు చేసారు. ఈ పద్ధతి ద్వారా గ్రామాలలోని ఎక్కువ భూమిని సాగులోకి తేవడం, పంట ముందే వేయడం పూర్తి చేసారు. ఈ కార్యక్రమం ఏరియాలోని గ్రామాలపై మంచి ప్రభావం వేసి మిగిలిన గ్రామాలు కూడా ఈ పద్ధతి అనుసరించాలని చర్చించారు.

ఈ సంవత్సరం కటాఫ్ ఏరియాలో రైతులు పండించిన పసుపు కొనుగోలు చేస్తున్న షావుకారులు, మధ్య తరగతి దళారులు రేటు నిర్ణయించే వరకు కొనుగోలు నిలిపి వేసి 1కిలోకు 10 రూపాయలు (60 నుండి 70కి) రేటు పెంచుకున్నారు.

## 5. ప్రభుత్వ సంస్కరణల అమలులో మధ్య దళారీలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలు

విప్లవోద్యమం నిర్మాణం అవుతున్న ప్రాంతాలలో ప్రజల మౌలిక సమ్యలపై వర్గపోరాటం నుండి ప్రజలను పక్కదారి పట్టించి ప్రభుత్వంపై భ్రమలు పెంచడానికి సంస్కరణల అమలు ఒక సాధనంగా ఉపయోగిస్తూ వస్తున్నారు. ఈ సంస్కరణలు అమలు చేయడానికి గ్రామాలలో పెటీ బూర్జువా సెక్షన్ కూడా తయారైంది. సంస్కరణల ద్వారా రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, మధ్య దళారీలు లక్షలాది రూపాయలు సంపాదిస్తూ ప్రభుత్వానికి బలమైన మద్దతుదారులుగా తయారవుతున్నారు.

విశాఖపట్నం జిల్లా పెదబయలు మండలంలోని వింజరి గ్రామ పంచాయితీలో ప్రభుత్వం నుండి 9 లక్షల 60 వేల రూపాయలు నిధులు మంజూరు అయినాయి. ఈ నిధులను సర్పంచ్, పి.ఆర్.ఒ, ఎమ్.పి.డి.ఓ, టి.డి.పి నాయకులు, విలేకర్లు కలిసి పంచుకున్నారు. ఈ విషయం ప్రజల ద్వారా సంఘం, పార్టీ దృష్టికి వచ్చి ప్రజాకోర్టులో సర్పంచ్‌ని నిలదీయగా వాస్తవాలను అంగీకరించి డబ్బులు ప్రజలకు వాపస్ ఇస్తానని అంగీకరించాడు. ప్రజలు 7 లక్షల 50 వేలు వసూలు చేసి పంచాయతీలో తీవ్రమైన మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్న నానబరి, సుజరి, తల్లాంబు గ్రామాల కోసం కేటాయించి పైప్‌లైన్ తెచ్చి ట్యాంక్‌లు నిర్మించి గ్రామాలలో నీటి సరఫరా చేస్తున్నారు.

జాంగూడ పంచాయితీలో 5 గ్రామాల ప్రజలు మంచినీటి సౌకర్యం కోసం ప్రభుత్వం 4 సంవత్సరాల క్రితం 36 లక్షల రూపాయలు కేటాయించింది. కానీ ఇప్పటికీ ఆ నిధులను వినియోగించి పనులు ప్రారంభించకుండా స్థానిక రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై ప్రజలకు తెలియకుండా కాజేయడానికి పథకం వేసుకున్నారు. ఈ విషయం ఆలస్యంగానైనా సంఘం దృష్టికి రావడంతో పార్టీ నాయకత్వంలో ప్రజా కోర్టు నిర్వహించి వాస్తవాలను అంగీకరింపజేసి పనులు ప్రారంభించే విధంగా నిర్ణయం చేసారు. ఇదే పంచాయితీలో పినరావెళి గ్రామానికి గ్రావిట్ 1.5 లక్షల మంజూరు అయ్యాయి. ఈ డబ్బులను స్థానిక నాయకుడు వెంకట్రావ్ కాజేసాడు. ఈ విషయాన్ని ప్రజల్లో పెట్టి విచారించి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ పంచాయితీ వి.ఎ.ఒ నాగమణి భర్త సేల్స్‌మెన్. స్కూల్ బిల్డింగ్ నిర్మాణం, కిరోసిన్

అమ్మకం, చంద్రన్న కానుక పేరుతో వచ్చిన వస్తువులలో పాల్పడిన అవినీతిపై ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంలో ప్రజల్లో పెట్టి విచారించి అవినీతిని అంగీకరింపజేసారు. కుమ్డ పంచాయితీలోని ఉప్పచెరువు గ్రామంలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పతకంతో 2 లక్షల పనులు చేయించి కూలీలకు డబ్బులు ఇవ్వకుండా వి.ఆర్.సి, పోస్ట్‌మెన్, మేటులూ కల్సి పంచుకున్నారు. ప్రజలు అడిగితే బెదిరింపులకు గురి చేసారు. ఈ విషయాన్ని ప్రజలు పార్టీ దృష్టికి తీసుకురాగా ప్రజాకోర్టు నిర్ణయించి ఆ డబ్బులను ప్రజలకు పంపిణీ చేశారు.

మల్కనగిరి జిల్లా కుడుముల గుమ్మ బ్లాక్ ఒంద్రపల్లి పంచాయితీ సేల్స్‌మెన్ ఎంపిక ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం, కిరోసిన్‌లో ప్రజలకు కోత విధించి మిగుల్చుకొని బయటి మార్కెట్‌లో అమ్ముకోవడం చాలా కాలంగా చేస్తున్నాడు. ఈ విషయం నిలదీసిన ప్రజలను మోసగిస్తూ వస్తున్నాడు. ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంలో పంచాయితీలో గ్రామాల ప్రజల మధ్య పెట్టి విచారించగా వాస్తవాలను అంగీకరించాడు. ప్రతీ నెలా మిగులు బియ్యం ఏ మేరకు ఉన్నా కార్డులేని నిరుపేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. జొడాంబ గ్రామ పంచాయితీ సర్పంచ్ భర్త జగర్నాథ్ మట్టికల్లు గ్రామానికి ప్రభుత్వం కేటాయించిన సోలార్‌ప్లాంట్, వాటర్ ట్యాంకును కాజేసి తన స్వంత ఇంటికి ఉపయోగించుకున్నాడు. ఈ విషయం ప్రజల్లో పెట్టి విచారించి వీటిని మట్టికల్లు గ్రామానికి యిప్పించడంతో పాటు సర్పంచ్‌ను తప్పును కూడా అంగీకరింపజేసాం.

పనసపుట్ పంచాయితీ సంగోయి గ్రామానికి చెందిన కొందరు దళారులు టైమలు గ్రామ కూలీలను ఆంధ్రకు కాంట్రాక్టర్‌ల దగ్గర పనులకు పంపి వచ్చిన కూలీ డబ్బులు యివ్వలేదని మోసం చేసారు. ఈ విషయం పార్టీ ప్రజల్లో పెట్టి విచారించగా వాస్తవాలను అంగీకరించి తక్షణమే 50 వేలు చెల్లించారు. మిగిలిన 1లక్ష రూపాయలు యిస్తామని అంగీకరించారు.

బియానిబుడ్డి గ్రామంలో గంజాయి వ్యాపారి సొద రైతుల నుండి గంజాయి కొనుగోలు చేసి షావుకార్లకు అమ్మి ఆ డబ్బులతో గ్రామం విడిచి పారిపోయాడు. ఆయన ఆస్తులు (గొడ్లు, మేకలు, ఇళ్ళు) స్వాధీనం చేసుకుని సంఘం నాయకత్వంలో రైతులకు పంపిణీ చేయడం జరిగింది.

కుమ్డ పంచాయితీ పోస్టుమెన్ కొండబాబు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కూలీల నుండి 100 రూపాయలకు 5 రూపాయల చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నాడు. ప్రజలు అడిగితే నిర్లక్ష్యంగా జవాబు చెప్పడం, బెదిరించడం చేసాడు. పార్టీ ప్రజాకోర్టులో నిలదీయగా అంగీకరించి తప్పు ఒప్పుకొని తన పద్ధతిని మార్చుకున్నాడు.

### 6. రాజ్య ప్రాయోజిత విచ్ఛినాంచల్ భిరోద్ అభియాన్‌ను ప్రతిఘటిద్దాం-విచ్ఛిన్నాంచాల్ వికాస్ కోసం పోరాడదాం అంటూ ప్రతినబూనిన ప్రజలు :

ఎమ్.కె.వి.బి డివిజన్‌లో వర్గపోరాటం ప్రజాయుద్ధంగా అభివృద్ధి అవుతూ ప్రజల క్రీయాశీలక భాగస్వామ్యం పెరుగుతుండటం సహించలేని రాజ్యం అక్రమ అరెస్టులు, గ్రామాలపై దాడులు, బూటకపు ఎన్‌కౌంటర్లు పార్టీ నాయకత్వ నిర్మూలనపై కేంద్రీకరించింది. ప్రజలు ఈ దాడిని ప్రతిఘటించడం ప్రారంభం



కాగానే రాజ్య ప్రాయోజిత సాయుధ గూండాలను తయారు చేసి ఆయుధాలు యిచ్చి భిచ్ఛిన్నాంచల్ భిరోద్ అభియాన్ పేరుతో మాజీలను, శత్రు ఏజెంట్లను తయారు చేసి విప్లవ సానుభూతి పరులపైన దాడులు చేసి హత్యలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురి చేయడం ప్రారంభించింది. అందులో భాగంగా మార్చి నెలలో కోరాపుట్ తెంతులిగుమ్మ మాజీ సర్పంచ్ విప్లవ సానుభూతిపరుడు గోవర్ధన్‌ను మల్కనగిరి కోరాపుట్ స్టేట్ హైవే పైన మంత్రియాంబ వద్ద కాల్చి చంపారు. బైపర్‌గూడ బ్లాక్ కలియజోడి వద్ద దెబోను ఈ గూండాలే హత్య చేసారు. ఏప్రిల్ 6న మల్కనగిరి జిల్లా కుడుములగుమ్మ బ్లాక్‌లోని సింగోయి గ్రామానికి చెందిన విప్లవ సానుభూతిపరుడు జయరాం ఆంధ్రప్రదేశ్ బార్డర్ జ్వాలపుట్ పట్టణంలో పట్టపగలే కాల్చి చంపి మరి కొందరిని చంపుతామని పేర్లు ప్రకటించారు. ఈ హత్యలు బిచ్ఛిన్నాంచల్ బిరోద్ అభియాన్‌లో భాగంగా చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ హత్యలపై పోలీసులు పెదవి విప్పడం లేదు. సామాన్యులను అరెస్టు చేసి వ్యక్తిగత హత్యలుగా ప్రకటించి ప్రజలలో మరింత బహిర్గతమయ్యారు. ఈ హత్యలను, వీటి వెనక వున్న రాజ్యం కుట్రలను నిరసిస్తూ కటాఫ్ ఏరియాలో జొడాంబ, పనసపుట్, ఆంద్రపల్లి పంచాయితీలో గ్రామాల ప్రజలు 'బిచ్ఛిన్నాంచాల్ భిరోద్ అభియాన్‌ను ప్రతిఘటిద్దాం. రాజ్య ప్రాయోజిత గుండాల చేతిలో హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి. ఈ గుండాల చేతిలో అమరులైన కుటుంబాలను ఆర్థికంగా, హార్ధికంగా ఆదుకుందాం' అంటూ 5 వేల మంది బహిరంగ సభ జరుపుకొని నిర్ణయించుకున్నారు. ఈ సభలోనే ప్రజలు వేలాది రూపాయలు, బియ్యం, జమ చేసి అమరుడు జయరాం కుటుంబానికి అందజేసారు. అండగా వుంటామని హామీ ఇచ్చారు. ఈ దాడులను సామూహికంగా, సాయుధంగా ఎదుర్కొంటామని శపథం చేసారు. ప్రభుత్వం ఈ హంతక దాడులను ఆపకపోతే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

### 7. నిర్బంధం-ప్రతిఘటన

విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలన్నే దృష్టి తలంపుతో కొనసాగుతున్న దాడికి దీర్ఘకాలిక, వ్యూహాత్మక దృష్టి వుంది. అందులో భాగంగా మన విప్లవోద్యమ పరిస్థితులకు అనుగుణమైన నిర్దిష్ట కాలవ్యవధితో కూడిన లక్ష్యాలను రూపొందించుకొని వేరు వేరు పేర్లతో క్యాంపెయిన్ రూపంలో దాడిని కొనసాగిస్తూన్నాడు. 2015 జనవరిలో నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్ ఆలౌట్ పేరుతో రెండు రాష్ట్రాల బలగాలు సంయుక్తంగా సమన్వయంతో పెద్ద ఏరియా డామినేషన్ అభియాన్‌ను తెరిపి ఇవ్వకుండా

కొనసాగించారు. గత 6 నెలలుగా కొత్త రూపాలలో సమాచార ఆధారిత దాడుల పై కేంద్రీకరణ పెరిగింది. మన కార్యక్రమాలను అడ్డుకోవడం, ఆటంకాలను కల్పించడంతో భాగంగా ఏరియా డామినేషన్‌ల ఫ్రిక్వెన్సీ తగ్గించబడి సమాచార ఆధారిత దాడులపై కేంద్రీకరణ పెరిగింది. మన కార్యక్రమాలను అడ్డుకోవడం, ఆటంకాలు కల్పించడంతో భాగంగా ఏరియా డామినేషన్ కొనసాగుతున్నప్పటికీ ప్రధానంగా దళాల పక్కా సమాచారం వున్నప్పుడు ఒకే రోజు రాత్రికి రాత్రే వీలైనంత సమీపం వరకు వేగంగా వాహనంలో ప్రయాణం చేసి వచ్చి తెల్లవారే సరికి గ్రామాన్నీ, దాని పరిసరాలను 3-5 బ్యాచీలు చుట్టుముట్టి క్లియర్ చేయడం, అదే రోజు తిరిగి వాపస్ కావడం ఉంది. కొన్నిసార్లు మనం ఉన్న పాకెట్ గురించి సమాచారం వెళ్ళితే దానిని కవర్ చేస్తూ 5-10 బ్యాచీల వరకు వచ్చి మూడు రోజులు గాలించి మన సమాచారం లేదనుకుంటే వాపస్ అవుతున్నాడు. ఇలాంటి అభియాన్‌లు కట్‌ఆఫ్, పెదబయలు ఏరియాలలో వేర్వేరుగా 6,7 సార్లు జరిగాయి. దళాల సమాచారంతో వచ్చిన పోలీసులతో తృటిలో ఎన్‌కౌంటర్ నుండి బయటపడ్డ ఘటనలు కట్‌ఆఫ్‌లో 4, పెదబయలులో 6 వుంటాయి. జనరల్ అభియాన్‌లు మరో 5సార్లు చేపట్టాడు. ముఖ్యంగా ఈసారి పార్టీ, పి.ఎల్.జి.ఎను నిర్మూలించే లక్ష్యంతో ఈ దాడి కొనసాగుతున్నది. ప్రజలపై, గ్రామాలపై దాడులు తగ్గాయి. మొత్తంగా అరెస్ట్‌లు పెదబయలులోని వాకపల్లిలో ముగ్గురు, ఖైనర్‌గూడలో ఇద్దరని మాత్రమే చేసారు. సరెండర్స్ కోసం కొన్ని ప్రయత్నాలు చేసినా పెద్ద సఫలత సాధించలేదు. అయితే విప్లవ సానుభూతి పరులను హత్యలు చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి విప్లవ ఉద్యమం నుండి దూరం చేయడానికి రాజ్యప్రాయోజిత సాయుధ ముఠాలతో దాడులు చేసి కోరాపుట్ జిల్లా తెంతులిగుమ్మ గ్రామానికి చెందిన గోవర్ధన్, కలియజోల వద్ద దెబోను, మల్కనగిరి జిల్లా సింగొాయి గ్రామానికి చెందిన జయరాంలను హత్య చేసి విచ్ఛినాంచల్ విరోధ్ అభియాన్ పేరుతో మరిన్ని దాడులు చేస్తామని హెచ్చరిస్తూ మరికొందరి పేర్లను ప్రకటించాడు.

– మానసిక యుద్ధంలో భాగంగా అసత్య ప్రచారం, పార్టీకి, వ్యక్తులకు లేఖలు రాయడం చేస్తున్నారు.

– కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా కొత్తగా పెదబయలు ఏరియా దాని సరిహద్దులో రాళ్ళగడ్డ, రుడకోటలో క్యాంపులు పెట్టారు. మద్దిగరువు, లక్ష్మీపూర్‌లలో క్యాంపులు నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దండకారణ్యం-బైపరిగూడ సరిహద్దుల్లో కొర్తనపల్లిలో క్యాంపు పెట్టి మన సమన్వయాన్ని అడ్డుకుంటున్నారు. బి.పి.జి ఏరియాలో దండబడిలో క్యాంపు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గురుప్రియ బ్రిడ్జిని శరవేగంగా పూర్తిచేయడానికి ప్రభుత్వ యంత్రాంగమంతా కేంద్రీకరించి పనులు చేస్తున్నది. బ్రిడ్జి నిర్మాణం తర్వాత కట్‌ఆఫ్ ఏరియాలో 4 క్యాంపులు పెట్టడానికి నిర్ణయించారు.

– రోడ్లు, సెల్‌టవర్‌ల నిర్మాణాన్ని పోలీసు బలగాల రక్షణలో నిర్మిస్తున్నారు.

– ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌తో పాటు, ఇంటలిజెన్స్ కోసం రహస్యంగా చిన్న టీంలను, అడవిలో మనం ప్రయాణం చేసే మార్గాలను, గ్రామాలను పరిశీలిస్తూ అబ్జర్వేషన్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు.

## ప్రతిఘటన

ఖైపరగూడ ఏరియాలో మన ఆర్గనైజేషన్‌లో గ్యాప్‌తో ప్రజానిర్మాణాలు దెబ్బతిని మన ప్రజా పునాది బలహీనపడింది. ఈ అవకాశాన్ని శత్రువు తనకు అనుకూలంగా మలుచుకొని ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను పెంచుకున్నాడు. మన పని విధానంలోని బలహీనతలు కూడా తోడై దళం చాలా సార్లు దాడులకు గురయ్యింది. మనం ప్రజా పనిని కొనసాగించాలంటే శత్రువును, వాడి నెట్‌వర్క్‌ను దెబ్బతీయడం ముఖ్యమైనదిగా మారింది. అందులో భాగంగా డిసెంబర్, జనవరిలో నెల రోజుల ప్రతిఘటన కార్యక్రమం చేపట్టాం. అందులో భాగంగా కటపద, చిప్పకూరు, కొలియాంటల్ సెల్‌టవర్స్ 200-300 మంది ప్రజల భాగస్వామ్యంతో ధ్వంసం చేసాం. దండాబడిలో వడ్డీవ్యాపారం, దుకాణం ఇతర వ్యాపారాలతో రాజకీయ నాయకుడిగా, గుండాగా, పోలీసు ఏజెంటుగా పని చేస్తున్న బాపిని ప్రజల డిమాండ్ మేరకు ఖతం చేసి వాడి వాహనాలు దగ్ధం చేసి, ఆస్తులను ధ్వంసం చేశాం. దీని తర్వాత శత్రువు వస్తాడనే అంచనాతో కలియజోల వద్ద మైన్స్ అమర్చాం. అనుకున్న విధంగా శత్రువు రావడం, మైన్స్ పేల్చడంతో రామగిరి బి.ఎస్.ఎఫ్ క్యాంపు డిప్యూటీ కమాండెంట్‌తో పాటు మరో జవాన్ ఖతం అయ్యాడు. మరొకరికి గాయాలయ్యాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మన ఉద్యమ ప్రాంతాలలో కొత్తగా 5 బి.ఎస్.ఎఫ్ క్యాంపులు పెట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా రూడకోట గ్రామంలో బి.ఎస్.ఎఫ్ నిర్మాణ పనులు చేపట్టారు. దాని సప్లై, రక్షణకు ప్రతి రోజు రోడ్ ఓపెనింగ్ పార్టీలు తిరుగుతున్నాయి. వాటిపై ఆంబుష్ చేయడానికి దూలిపుట్ వద్ద 5 బిగ్‌గన్‌లను అమర్చి కాలి నడకన వస్తున్న సి.ఆర్.పి.ఎఫ్ బలగాలపై పేల్చాం. అందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయని ప్రజలు చెప్పారు. మనం అనుకున్న లక్ష్యం సఫలం కాలేదు. కాని ఈ సంఘటన ప్రజల పై మంచి ప్రభావం వేయగా, పోలీసుల దూకుడుకు కొంత ఆటంకాలు ఏర్పడ్డాయి.

– కట్‌ఆఫ్ ఏరియాలో 2012లో అండికల్ గ్రామంలో చౌకీదారు, పోలీసు ఏజెంట్ అయిన మాణిక్యాన్ని మన పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది. మాణిక్యం కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆయన కొడుకు విశ్వనాథానికి హోంగార్డు ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుండి విశ్వనాథ్ చిత్రకొండలో ఉంటూ ఎ.పి గ్రేహౌండ్స్ వాళ్ళతో కట్‌ఆఫ్ ఏరియాకు రావడం, ఇన్‌ఫార్మర్లను తయారు చేయడం కంటిన్యూ చేస్తున్నాడు. తన స్నేహితుడి వివాహానికి రహస్యంగా హాజరై చివరికి మన పి.ఎల్.జి.ఎకు చిక్కాడు. విచారించగా అన్ని విషయాలు అంగీకరించాడు. ప్రజల ఆమోదంతో ఖతం చేసాం.

– గుసంపొద్దూరు గ్రామం నుండి పారిపోయి పోలీసుల రక్షణలో వుంటూ ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలతో కట్‌ఆఫ్ ఏరియా కూంబింగ్‌లో పాల్గొంటున్న సహదేవ్ రబ్బ గ్రామంలో గంజాయి సాగు చేస్తుండగా ప్రజల సమాచారంతో పి.ఎల్.జి.ఎ దాడి చేసి ఖతం చేసింది.

– బొజ్జగూడలో నివాసం వుంటున్న అరాచకుడు, లుంపెన్ అయిన సింగుడను పోలీసు ఏజెంటుగా ప్రజలు అనుమానిస్తూ ప్రజలలో పెట్టి విచారించి రెండు సార్లు దేహశుద్ధి కూడా చేసారు.

అయితే ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా పోలీసులకు మరింత చురుకుగా సహకరించడం ముఖ్యంగా మన దళాల ప్రయాణ దిశలపై కొండపై అబ్జర్వేషన్ పోస్టు ఏర్పాటు చేసుకొని గమనించడం, ఇన్‌ఫార్మర్ టీంలకు షెల్టర్ ఏర్పాటు చేయడం, సమాచారం చేరవేయడం ప్రధాన పనిగా మార్చుకున్నాడు. పట్టుకొని విచారించి ఖతం చేసాం.

– పెదబయలు ఏరియాలో మద్దకొండ సత్యారావు పోలీసు ఏజెంటుగా పని చేస్తూ సంఘాలను సరెండర్ కావాలని ఆర్గనైజ్ చేయడం, పోలీసు జన సంపర్క్ శిబిరాలలో పాల్గొని పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటం, ప్రజలూ పార్టీ చేసిన హెచ్చరికలను ఖాతరు చేయకపోవడంతో పి.ఎల్.జి.ఎ ప్రజా ఆమోదంతో ఖతం చేసింది.

– బూసిపుట్ శివయ్య చాలా కాలంగా పోలీసు ఏజెంటుగా రహస్యంగా పని చేస్తూ ఇన్‌ఫార్మర్‌ను తయారు చేయడం, ప్రజలను అరెస్టు చేయించడం, ప్రజలకు, పార్టీకి అనుకూలంగా వున్నట్టు నటిస్తూ వచ్చాడు. రామయ్య అనే ఇన్‌ఫార్మర్‌ను విచారించిన సందర్భంగా శివయ్య కార్యకలాపాల తీవ్రత అర్థం కావడంతో శివయ్యను ప్రజాకోర్టులో పెట్టి విచారించి ప్రజల ఆమోదంతో ఖతం చేసాం.

## ప్రజల ప్రతిఘటన

– కూంబింగ్‌కు వచ్చిన బలగాలు తిరిగి వెళుతున్నప్పుడు కోంద్రు, నానబరి గ్రామాల మధ్య మద్దెగరువు సంతకు వెళ్ళి తిరిగి వస్తున్న కోంద్రు యువకులను అరెస్టు చేసి తీసుకెళుతున్నప్పుడు ఈ సమాచారం తెలుసుకున్న నానబరి గ్రామ ప్రజలందరు కర్రలు, విల్లుకాడులు పట్టుకొని వెంబడించి చివరికి పోలీసులను అడ్డుకొని ఘర్షణ పడ్డారు. ఎస్.ఐని కూడా కొట్టారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పోలీసులు అరెస్టు చేసిన యువకులను విడిచిపెట్టి పారిపోయారు.

– కోంద్రు గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని ప్రతిసారి కూంబింగ్ కొనసాగుతుంటుంది. ఈ గ్రామానికి అన్ని వైపుల నుండి బ్యాచ్‌లు గాలిస్తూ గ్రామ సంఘ నాయకత్వాన్ని, ముఖ్యులను పట్టుకోవడం, దళం ఉంటే దాడి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలా కూంబింగ్‌కు వచ్చే బలగాలను అడ్డుకోవాలని సంఘం ఇచ్చిన పిలుపుతో గ్రామ ప్రజలందరూ సామూహికంగా వెళ్ళి కూంబింగ్‌కు వచ్చిన బలగాలను నిలదీయాలని నిర్ణయించుకొని బయలుదేరారు. సాయుధమై వస్తున్న ప్రజా సమూహాన్ని చూసి గ్రేహౌండ్స్ బలగాలు తోక ముడిచి వెనుతిరిగాయి. ప్రజలు సుమారు మూడు కిలోమీటర్ల దూరం వరకు తరిమి కొట్టారు.

– మరోసారి పోలీసులు వచ్చారని నానబరి, కోంద్రు గ్రామాల ప్రజలు యువకులను పంపి పోలీసులను గమనిస్తుండగా పట్టుకున్నారు. ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న 2 గ్రామాల ప్రజల సమన్వయంతో రెండు వైపుల నుండి చుట్టుముట్టి ఘర్షణకు దిగారు. ప్రజల ప్రతిఘటనకు ఖంగు తిన్న పోలీసులు పట్టుకున్న యువకులను ప్రజలకప్పగించి వెళ్ళిపోయారు.

– సుజరి గ్రామంలోని కొందరు రైతులు వారి సాంప్రదాయ ఆయుధాలైన బర్మార్‌లను పట్టుకొని వేటకు వెళ్ళారు. ఆ సందర్భంగా వారికి కూంబింగ్ బలగాలు తారసపడ్డాయి. రైతులను చుట్టుముట్టి బలవంతంగా వారి వద్ద వున్న బర్మార్‌లను పోలీసులు లాక్కున్నారు. ఈ విషయం తెలుసుకున్న మొత్తం గ్రామ ప్రజలు కర్రలు, గొడ్డళ్ళు, కత్తులు పట్టుకొని పోలీసులను వెంబడించి పట్టుకుని, తమ ఆయుధాలు ఇవ్వమని అడగగా పోలీసులు దాడి చేసే ప్రయత్నం చేసారు. వెంటనే చేతిలో ఉన్న ఆయుధాలతో ప్రజలు తిరగబడ్డారు. "మా ఆదివాసీ ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు ధరించడం మా హక్కు" అని నిలదీసారు. పరిస్థితి విషమించిందని గమనించిన గ్రేహౌండ్స్ బలగాలు ఆయుధాలు అప్పగించి బిక్కముఖంతో వెనుదిరిగారు.

– కూంబింగ్‌కు వచ్చిన ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు మండపల్లి గ్రామంలో స్కూల్ టీచర్స్‌ను అరెస్ట్ చేసి విచారణ పేరుతో పట్టుకుని వెళుతున్నప్పుడు గ్రామస్తులు పోలీసులను అడ్డుకొని విడిపించుకున్నారు.

– సూరిమెట్టలో పోలీసులు గ్రామస్తులను ఇళ్ళ నుండి బయటకు పిలిపించి జనసంపర్క్ శిబిరం పేరుతో ప్రజలతో సమావేశం జరిపి వస్తువులు పంపిణీ చేసి పేపర్‌లలో వార్తలు రాయించుకున్నారు. "మాకు కనీస మౌలిక అవసరాలు తీర్చలేని పోలీసులు ఫోటోల కోసం ఫోజులిచ్చి వస్తువులు పంచిపెట్టగానే మా అవసరాలు తీరతాయా'' అంటూ చైతన్యవంతగా అర్థం చేసుకొని వస్తువులన్నింటిని రోడ్డుపై వేసి తగులబెట్టారు.

– ''రాజ్య ప్రాయోజిత విచ్ఛినాంచల్ విరోద్ అభియాన్ ప్రతిఘటిద్దాం. విచ్ఛినాంచల్ వికాసం కోసం పోరాడదామంటూ" కట్‌ఆఫ్ ఏరియాలో దళం ఐదు వేల మంది ప్రజలతో విజయవంతంగా సభ జరిపింది.

**పార్టీ సహకారంతో, సమిష్టిగా ఐక్యమై చెక్ డ్యాం నిర్మించుకున్న తోటగూడ-సన్యాసిగూడ ప్రజలు**





## ఈస్ట్ డివిజన్

### 1. కోరుకొండలో ఔట్‌పోస్టులకు వ్యతిరేకంగా ఆదివాసుల పోరాటం

చింతపల్లి మండలం, బలపం పంచాయితీ ఆర్.జె కొత్తూరులో నిర్మించ తలపెట్టిన పోలీస్ ఔట్‌పోస్టుకు వ్యతిరేకంగా ఆదివాసీలు కదం తొక్కారు. బలపం పంచాయితీ పరిధిలోని గ్రామాల వారితో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనులు ఆందోళనకు దిగారు. జిల్లా ఎస్.పి కోయ ప్రవీణ్‌కుమార్ రాళ్ళగెడ్డ కొత్తూర్‌లో ఔట్‌పోస్టు నిర్మాణానికి స్థల పరిశీలన జరిపి, నిర్మాణానికి అవసరమైన కొలతలు తీసారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆదివాసీలు తొలుత కోరుకొండ గ్రామంలో పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంతబయలు నుండి కోరుకొండ జంక్షన్ వరకు పోలీస్ ఔట్‌పోస్ట్ ఎత్తివేయాలి, బాక్సైట్ తవ్వకాలు జి.ఒ నెం. 97ను తక్షణమే రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేసారు. దీంతో కోరుకొండ గ్రామం ఒక్కసారిగా దద్దరిల్లింది. ర్యాలీ అనంతరం రాళ్ళగెడ్డ కొత్తూరులో నిరసన చేపట్టేందుకు వెళ్ళారు.

ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకున్న పోలీసు బలగాలు ఆ పరిసర ప్రాంతాల్లో మోహరించాయి. రాళ్ళగెడ్డలో ఆందోళన చేపట్టేందుకు వచ్చిన ఆదివాసీలు కొంత మంది సాంప్రదాయ ఆయుధాలైన “కత్తులు, కర్రలను వెంటతేవడంతో దీనిపై చింతపల్లి సి.ఐ రుద్రశేఖర్ వారిని ప్రశ్నించారు. కత్తులు, కర్రలే మా సాంప్రదాయం. మేము ఇప్పటి వరకు ఎవ్వరి రక్షణపై



ఆధారపడలేదు. ఆధారపడము. మేము మా తాతల ముత్తాతల నుండి ఈ అడవితల్లి ఒడిలో పక్షులు, ప్రాణుల నడుమ స్వేచ్ఛగా జీవిస్తున్నాం. మీ ప్రభుత్వాలు తీసుకువచ్చిన ఔట్‌పోస్టులు మా స్వేచ్ఛకు సంకెళ్ళు వేస్తుంది. మా జీవనోపాధిగా వున్న 10 ఎకరాలను మీరు అక్రమంగా బలవంతంగా గుంజుకుంటున్నారు. ఇప్పటికే మీ కూంబింగ్‌ల సందర్భంగా అనేక మంది మా ఆదివాసీ మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇప్పుడు మీ ఔట్‌పోస్టు నిర్మించి ఆదివాసీ మహిళలపై ఆకృత్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. అందుకే పోలీసు ఔట్‌పోస్టులకు తాము వ్యతిరేకం” అని ఆదివాసులు సమాధానమిచ్చారు. ఔట్‌పోస్టు నిర్మాణం ప్రభుత్వ పాలసీ అని, ఆదివాసుల రక్షణ కోసం దీన్ని నిర్మిస్తున్నామని సి.ఐ చెప్పారు. ఔట్‌పోస్టులు మా రక్షణ అనేది పచ్చి అబద్ధం. ఇది బాక్సైట్ గనులను లీజుకు తీసుకున్న బడా వ్యాపారులకు, వారి కంపెనీలకు రక్షణ. మేము చేస్తున్న బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేయడం కోసమే ఈ ఔట్‌పోస్ట్ అని గట్టి సమాధానమే ఇచ్చారు. ఈ దశలో పోలీసులకు, ఆదివాసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

### 2. ప్రజా ప్రతినిధుల మెడలు వంచి సంతను సాధించుకున్న 60 గ్రామాల ప్రజలు

విశాఖ జిల్లా కొయ్యూరు మండలం పలకజీడి, యు.చీడిపాలెం, మఠం భీమవరం, పంచాయితీలకు చెందిన 60 గ్రామాల ప్రజలకు సంత సదుపాయం లేదు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు దూరాన వున్న వై.రామవరం సంతపై ఆధారపడాల్సిన పరిస్థితి. అందుబాటులో సంత ఉండాలని ప్రజలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యతో పాటు అపరాల గిట్టుబాటు ధరల వంటి సమస్యపై పోరాడేందుకు 2014లో రేవులకోట, గంగవరం పాకెట్‌లలో రెండు పాకెట్ స్థాయి పోరాట కమిటీలను ఏర్పాటు చేసాము. ఈ పోరాట కమిటీలు ఏటా గిట్టుబాటు ధరల కోసం, షావుకార్ల వడ్డీ వ్యాపారం, జి.సి.సి డిపో అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు సంత సాధనకై ప్రజలను చైతన్యవంతులను చేసి, స్థానిక ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి సంత ఏర్పాటుకు కృషి చేసింది. ఎట్టకేలకు అక్టోబరు 2015లో పలకజీడి గ్రామం వద్ద సంత ఏర్పాటు కావడంతో 60 గ్రామాల ప్రజలకు సంత కష్టాలు తప్పాయి.

### 3. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా కదిలిన సాయుధ యువత (మిలీషియా)

గాలికొండ, కోరుకొండ ఏరియాల నుండి 50 మంది మిలీషియా కామ్రేడ్స్ ఏకమై 8 క్యాంపెయిన్ టీంలుగా ఈ ప్రాంతంలో బాక్సైట్‌కు వ్యతిరేక క్యాంపెయిన్‌ను చేపట్టారు. ఈ క్యాంపెయిన్ సందర్భంగా చంద్రబాబు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలలో బహిర్గతం చేసారు. బాక్సైట్ తవ్వకాలకు అనుకూలంగా రూపొందించిన 97 జి.ఓ వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజల మద్దతును మరింతగా కూడగట్టారు. నెల రోజులకు పైగా జరిగిన ఈ రాజకీయ క్యాంపెయిన్‌ను శత్రు సాయుధ బలగాల ఏరియా డామినేషన్ల మధ్య నిర్వహించారు. ఈ క్యాంపెయిన్ టీంల విజయానికి ప్రధాన కారణం ప్రజల నుండి సంపూర్ణ మద్ధతు వుండటమే. ఈ క్యాంపెయిన్ తదనంతరం వారి రాజకీయ, మిలటరీ జ్ఞానం పెంచేందుకు ప్రస్తుత రాజకీయ పరిస్థితి–మన కర్తవ్యాల పైనా, బూబిట్రాప్‌లు తయారు చేయడంపైనా తర్ఫీదునందించారు. ఈ 50 మందితో పాటు 3 పాకెట్లకు చెందిన మరో 100 మందికి కూడా రాజకీయ పరిస్థితి–మన కర్తవ్యాలపై అవగాహన కల్పించారు.

### 4. కామ్రేడ్స్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని రాజకీయ ఖైదీల విడుదలను డిమాండ్ చేసిన ప్రజలు

మార్చి 23న 300 మంది ప్రజలతో భగత్‌సింగ్, రాజ్‌గురు,

సుఖ్‌దేవ్‌ల వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా వారి అసంపూర్తి కలలను నిజం చేసేందుకు వారి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ సామ్రాజ్యవాదులతో దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాలతో వీరోచితంగా పోరాడుతూ శత్రు నిర్బంధంలో (జైళ్ళలో) మగ్గుతున్న మావోయిస్టు, ఇతర రాజకీయ ఖైదీలకు సంఘీభావం తెలుపడంతో పాటు వారి విడుదలకు డిమాండ్ చేసారు.

### 5. ప్రజాద్రోహులకు శిక్షలు

2016 జూన్‌లో స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన కొంది మంది నాయకులను ప్రజలలో పెట్టి శిక్షించడం జరిగింది. వీరు విప్లవోద్యమాన్ని దెబ్బ తీసేందుకు స్థానిక సంఘ నాయకత్వాన్ని బెదిరిస్తూ లొంగుబాట్లను ప్రోత్సహించారు. ఇటువంటి వారిలో ఈతరుబ్బు గ్రామానికి చెందిన 'మాతే సోమయ్య' (టి.డి.పి), పెగకొండే గ్రామానికి చెందిన కొర్ర గాసి (టి.డి.పి), పెదవలస గ్రామానికి చెందిన సూరి (టి.డి.పి) ముఖ్యులు. వీరిని వందలాది మంది ప్రజల సమక్షంలో, వారి వారి గ్రామాలలో విడి విడిగా విచారించి హెచ్చరికలు, దేహశుద్ధులు చేయడం జరిగింది. ఈ ప్రజాపంచాయితీలు ప్రజా వ్యతిరేకుల్లో గుబులు పుట్టించడంతో పాటు ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చాయి.

### 6. లొంగుబాట్లను వ్యతిరేకించిన గాలికొండ ఏరియా విప్లవ ప్రజానీకం

విశాఖ జిల్లా, కొయ్యూరు మండలం, బూదరాళ్ళ పంచాయితీ తూమువలస, మూకుడుపల్లి గ్రామాలకు చెందిన రస్సో, ఝాన్సీలు దశాబ్ది కాలానికి పైగా పార్టీలో పని చేసారు. ఈ క్రమంలో పార్టీ పి.ఎల్.జి.ఎలలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ఏరియా కమిటీ స్థాయికి ఎదిగారు. అయితే ఉద్యమ అవసరాలకనుగుణంగా తమ కమ్యూనిస్టు చైతన్యాన్ని పెంచుకోలేకపోయారు. ఈ విషయాన్ని పార్టీ



ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి గుర్తింపజేస్తూ, వారిలో పరివర్తన తెచ్చేందుకు ప్రయత్నించింది. ఈ మధ్య కాలంలో పార్టీని బోల్షివీకరించడంలో భాగంగా పార్టీ పి.ఎల్.జి.ఎలు దిద్దుబాటు క్యాంపెయిన్‌ను చేపట్టాయి. ఈ క్యాంపెయిన్ పార్టీ పి.ఎల్.జి.ఎలలోని చాలా మంది కామ్రేడ్స్ దృక్పథంలో మార్పు తెచ్చింది. వారిని కార్మికవర్గ ఉత్తమ పుత్రులుగా, పుత్రికలుగా తీర్చిదిద్దుతున్నది. కానీ ఈ ఇద్దరు కామ్రేడ్స్ తమ ఆలోచనలను, ఆచరణను మార్చుకొనేందుకు ఏ మాత్రం సిద్ధపడక శత్రువు ముందు లొంగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న గాలికొండ విప్లవ ప్రజానీకం వారి లొంగుబాట్లను వ్యతిరేకించారు. అంతే కాకుండా 400 మంది ప్రజానీకంతో ప్రజాకోర్టు నిర్వహించి వారి తప్పును అంగీకరింపచేసారు. 'మూడేళ్ళపాటు వాళ్ళు గ్రామాలను వదిలి వెళ్ళరాదనీ, కనీసం వారపు సంతకు కూడా వెళ్ళకూడదని షరతులు పెట్టారు. ఈ పంచాయితీ ఆ ప్రాంత ప్రజల గొప్ప రాజకీయ చైతన్యాన్ని వ్యక్తీకరించింది. రోజు రోజుకు వర్గ యుద్ధంలో రాటుదేలుతూ, విప్లవ చైతన్యాన్ని ప్రదర్శించిన గాలికొండ ప్రజానీకానికి విప్లవ జేజేలు తెలుపుదాం.

### 7. కొత్తూరు ఎ.పి.ఎఫ్.డి.సి కాఫీ ఎస్టేట్ ఆక్రమణ :

ఈస్ట్ డివిజన్‌లో ఎ.పి.ఎఫ్.డి.సి కాఫీ తోటల ఆక్రమణ నూతన ఎస్టేట్‌లకు విస్తరిస్తోంది. ఇటీవల గూడెం మండలం ఆర్.వి నగర్ పరిధిలో గల కొత్తూరు ఎస్టేట్‌ను మన పార్టీ నాయకత్వంలో ప్రజలు ఆక్రమించుకున్నారు. గూడెం మండలానికి చెందిన పి.కొత్తూరు, డి. కొత్తూరు, పేములంక, టి.గొందిపల్లి, చెక్కరాయివీధి, ఒ.గొందిపల్లి, బోనంగిపల్లి, గొద్దుచింత, గ్రామాలకు చెందిన ప్రజలు సుదీర్ఘకాలంగా ఈ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. అలలు అలలుగా పురోగమిస్తున్న కాఫీ తోటల ఆక్రమణ పోరాటం ఈ ఎస్టేట్‌ను కూడా తాకడంతో ప్రభావితులైన ప్రజలు కాఫీ తోటలను ఆక్రమించుకునేందుకు సిద్ధపడ్డారు. ఆక్రమణ పోరాటానికి ఆటంకంగా వున్న ఈ ఎస్టేట్ రేంజర్ మరియు ఫీల్డ్‌మెన్‌లను సెప్టెంబర్ 5న మన పి.ఎల్.జి.ఎ అండతో ప్రజలు అదే ఎస్టేట్‌లో ప్రజాకోర్టు నిర్వహించి నిలదీసారు. కొత్తూరు కాఫీ ఎస్టేట్ పూర్తిగా ప్రజల పరమైందని ఇకపై ఎ.పి.ఎఫ్.డి.సి అధికారులు, ఉద్యోగులు ఎవరూ ఎస్టేట్‌లో అడుగు పెట్టరాదని ప్రకటించారు. ఈ ప్రజాకోర్టుకు కొత్తూరు ఎస్టేటు పరిధిలో గల పైన పేర్కొన్న 8 గ్రామాలకు చెందిన 280 మంది (100 మంది మహిళలు) ప్రజలు హాజరయ్యారు. గూడెం పోలీసు స్టేషన్ మరియు సి.ఆర్.పి.ఎఫ్ అవుట్‌పోస్టులకు అతి సమీపంలో గల ఈ ఎస్టేటు ఆక్రమణ, ప్రజాకోర్టు కాఫీ తోటల ఆక్రమణ పోరాటంలో కలసి వచ్చే ఇతర ఎస్టేట్‌ల ప్రజలపై మంచి ప్రభావాన్ని వేసింది.

### 8. పి.ఎల్.జి.ఎ వారోత్సవాల్ని ఘనంగా జరుపుకున్న గునికిరాయి విప్లవ ప్రజనీకం

ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని గునికిరాయి పాకెట్ కమిటీ డిసెంబర్ 2 పి.ఎల్.జి.ఎ వారోత్సవాల్ని ఘనంగా నిర్వహించింది. నిప్పులు చెరిగే నిర్బంధం మధ్యనే శత్రు కళ్ళుగప్పి 300 మందితో డిసెంబర్ 7న బహిరంగ సభ నిర్వహించారు. 15 సంవత్సరాల బాక్సైట్ ఉద్యమాన్ని నెమరు వేసుకుని ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీనీ, పార్టీలో త్యాగాల చరిత్రనూ గుర్తు చేసుకున్నారు. ఇవాళ తెలుగుదేశం ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాల పేరుతో ప్రజలను నిర్వాసితులను చేసే కుట్రలను తిప్పి కొట్టాలని ప్రతినబూనారు. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ అధికారం కోసం మన్యం పితూరి సేనలో చేరి పి.ఎల్.జి.ఎ ప్రజా సైన్యాన్ని నిర్మించాలని నినదించారు. 'నిజమైన ప్రజాస్వామ్యం దున్నేవారికే భూమి, ప్రజారాజ్య స్థాపన కోసం పీడిత ప్రజలందరూ సాయుధం కావాలి' అని పిలుపునిచ్చారు.

### 9. ప్రజావ్యతిరేకి, అధికార పార్టీ(టి.డి.పి)నాయకుడు, మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాంగిన వెంకటరమణ ఖతం

సాంగిన వెంకటరమణ గతంలో కోరుకొండ ఏరియా పరిధిలో, గూడెం మండలం, జెర్రల పంచాయితీ ప్రెసిడెంట్‌గా పని చేసాడు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రాంతం బాక్సైట్ తవ్వకాలకు నిలయం కావడంతో ఇతను బాక్సైట్ ఉద్యమంలో కలిసి వస్తున్నట్టు నటిస్తూ మరోపక్క బాక్సైట్ అనుకూలమైన పునరావాస కమిటీ సభ్యులను తయారు చేస్తూ వచ్చాడు. మరీ ముఖ్యంగా 2008లో బాక్సైట్‌కు అనుకూలంగా గ్రామసభ జరిపినట్టుగా దొంగ సంతకాలు సృష్టించి ప్రభుత్వానికి అప్పగించాడు. ఈ విషయం పై స్థానిక ప్రజలు తనను గ్రామసభకు రావాలని కోరగా తిరస్కరించి తప్పించుకున్నాడు. నిలదీసిన ప్రజలను పోలీసులకు చెప్పి బెదిరించడం చేస్తున్నాడు. బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేస్తున్న మన ప్రజా రాజ్య కమిటీ గునికిరాయి పాకెట్‌లోని సభ్యులకు నోటీసులు పంపించడం, చివరికి వారిని తీసుకుని పోయి ఎస్.పి అకుల్ సబర్వాల్ ముందు హాజరు పరిచి నా పేరు బయటకు రావద్దని బెదిరించడం చేస్తున్నాడు. సదరు విషయాలు మన పార్టీ దృష్టికి వచ్చిన వెంటనే (2010) హెచ్చరించడం జరిగింది. అయినా మారలేదు.

టి.డి.పి అధికారంలోకి వచ్చిన తర్వాత తన పదవిని అడ్డం పెట్టుకుని గ్రామకంఠం భూములనూ, గ్రామ ఉమ్మడి టేకు చెట్లను తన సొంతానికి వాడుకుంటూ, ప్రశ్నించిన వారిని బెదిరిస్తూ, తన దోపిడీని కొనసాగిస్తున్నాడు. వెంకటరమణ అరాచకత్వం, దోపిడీ, అణచివేత, ప్రజా వ్యతిరేక విధానాలను గుర్తింపజేస్తూ 3 విడతలుగా లేఖలు వాయడం, కబురు పెట్టడం జరిగింది. వీటిని ఖాతరు చేయకపోవడంతో 2016 జనవరి 5వ తేదీన స్థానిక ప్రజలు, జనమిలీషియా, పి.ఎల్.జి.ఎ బలగాలు కలిపి 250 మంది తన స్థిర, చరాస్తులను స్వాధీనం చేసుకొని, కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసి వెంకటరమణను ఖతం చేయడం జరిగింది. ఈ ఘటన బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంపై మంచి అనుకూలతను కలిగించింది.

### 10. ప్రభుత్వం మెడలు వంచి వారపు సంతను సాధించిన విప్లవ ప్రజానీకం

ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని రాళ్ళగడ్డ, బొడపాదూర్, బొడిగడ్డ, పంచాయితీల ప్రజలు ఐక్యమై అక్టోబర్ 30న (2015) 500 మందికి పైగా కదిలి అటగూడ బి.ఎస్.ఎఫ్ క్యాంప్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రజలు పోరాటానికి దిగడంతో పభుత్వం సంత జరిగే విధంగా హామీ ఇచ్చింది. గతంలో ఈ సంత పలగరేవు దగ్గరనే వుండేది. ఆగస్టు 2015న మనం చేసిన ఆంబుష్ తర్వాత సంతను అటగూడ వద్దనే జరపాలని పోలీసుల కోరిక మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ప్రజలు, వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులతో అనేక సమస్యలను ఎదుర్కొన్న పీడిత ప్రజలు, వ్యాపారులు సంఘాలతో సంఘటితమై పోరాడి సంతను తిరిగి పలగరేవుకు తెచ్చుకుని విజయం సాధించారు.

### 11. నిర్బంధం-ప్రతిఘటన

కేంద్రంలో బి.జె.పి రాష్ట్రంలో టి.డి.పి ప్రభుత్వాలు అధికారం చేపట్టిన తర్వాత దేశంలో, రాష్ట్రంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశను తీవ్రతరం చేసారు. మరీ ముఖ్యంగా విశాఖ మన్యంలో విలువైన బాక్సైట్ గనులను కొల్లగొట్టేందుకు టి.డి.పి ప్రభుత్వం సామ్రాజ్యవాద, కార్పొరేట్ కంపెనీలతో లాలుచీ పడుతూ మన్యం ఆదివాసులపై కిరాయి అర్ధసైనిక బలగాలను దింపి యుద్ధం చేస్తుంది.

ఈ సంవత్సరం 2016 ఫిబ్రవరి నుండి ఎప్రిల్ వరకు కంటిన్యూగా ఆపరేషన్స్ తీసుకుని గ్రామాల పై దాడులు చేయడం, సంఘ నాయకత్వాన్ని అరెస్టులు చేయడం, గ్రామస్తులను పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా హింసించడం, ఇంట్లో వస్తువులను ధ్వంసం చేసి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బంగారం, డబ్బు మొదలైన వాటిని అక్రమంగా స్వాధీనపర్చుకున్నారు. బాక్సైట్ తవ్వకాలను తీవ్రతరం చేయడంలో భాగంగా తార్రోడ్డు, టెలికమ్యూనికేషన్, బాక్సైట్‌ను తరలించడానికి మన్యం వ్యాపితంగా 100 బి.ఎస్.ఎఫ్ క్యాంపులు పెట్టాలని కేంద్రానికి ప్రతిపాదన పంపారు. అందులో భాగంగా ఆర్.జి కొత్తూరులో ఒక క్యాంపును ఏర్పాటు చేసారు. పోలీసు క్యాంపులను ఫోర్టిఫైడ్ క్యాంపులుగా ఆధునీకరిస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్ల నిర్మాణం పనులు వేగవంతం చేసారు. అందులో భాగంగా ఆంధ్ర-ఒడిశా వ్యూహాత్మక ప్రాంతంలోకి ఈ రోడ్ల విస్తరణను చేపట్టారు. ఉద్యమ ప్రాంతంలో చింతపల్లి నుండి చిత్రకొండ (కోరుకొండ మీదుగా) చిత్రకొండ నుండి ముంచంగిపుట్ (బూషిపుట్ మీదుగా) ముఖ్యమైన రోడ్లను పూర్తి చేసుకునే పనిలో ఉన్నారు. ఆంధ్ర-ఒడిశా పోలీసు బలగాల మధ్య మరింత సమన్వయం పెరిగింది. విశాఖ-మల్కనగిరి జిల్లాల ఎస్.పిలు మన దళాల సమాచారం అందిన వెంటనే సమన్వయంతో బలగాలను మోహరించి జాయింట్ ఆపరేషన్స్‌ను కొనసాగిస్తున్నారు.

మన విప్లవోద్యమాన్ని నిర్మూలించి ఇక్కడి ఖనిజాలను తరలించడానికి లింకు రోడ్లకోసం ఆంధ్ర ఒడిశా ప్రభుత్వాలు వేగంగా పుంజుకుంటున్నాయి. ఆధునీకరిస్తున్నారు. ఈ మధ్య కాలంలో బలపం పంచాయితీ ఆర్.జి కొత్తూరు వద్ద 2.7 కోట్ల నిర్మాణంతో బి.ఎస్.ఎఫ్ క్యాంపు నిర్మాణం పూర్తి చేసుకోబోతున్నారు. (ప్రస్తుతం పూర్తయింది) ఇవిగాక మన డివిజన్స్ మధ్య, ఏరియాల మధ్య సమన్వయం దెబ్బ తీసేందుకు క్యాంపుల నిర్మాణం జరిగే విధంగా ప్లాన్ రూపొందించుకుంటున్నారు. శతృవు మన సమాచారం సేకరణ కోసం ప్రత్యేకంగా కేంద్రీకరిస్తూ వివిధ రూపాలలో మన సమాచారాన్ని సేకరిస్తున్నాడు. సమాచార ఆధారిత దాడులకు ప్లాన్ చేస్తున్నాడు. అలాగే మన నిర్మాణాలను దెబ్బ తీసే పథకాన్ని అమలు చేస్తున్నాడు. అందులో భాగంగా సంఘ నాయకత్వాన్ని పట్టుకున్న లేదా లొంగిపోయిన వెంటనే వారి నుండి సమాచారం సేకరించడం చేస్తున్నారు. మన దళాల, సంఘ నాయకుల కదలికలు వెంట వెంటనే తెలిసే విధంగా మన ఉద్యమ ప్రాంతంలో లొంగిపోయినవారు, అరెస్టయినవారు, వ్యాపారస్తులు, అంగన్‌వాడీ, సి.హెచ్.డబ్లూ, వి.ఎస్.ఎస్ వగైరా ప్రభుత్వం చుట్టూ తిరిగే వారి నుంచి శతృవు రహస్య నెట్‌వర్క్‌ను విస్తృతపరుచుకుంటున్నాడు.

ఈ మధ్య కాలంలో జెర్రల మాజీ సర్పంచ్ ప్రస్తుత మండల

మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాంగిన వెంకటరమణను మన పి.ఎల్.జి.ఎ ఖతం చేస్తే అది ఎక్కడ నుండి ఆపరేట్ అయ్యింది? అందులో ఎవరెవరు పాల్గొన్నారు అనేది శతృవుకు స్పష్టంగా అర్థం అయింది. 2013 డిసెంబర్ కోరుకొండలో ఇద్దరు హెూంగార్డులను చంపినప్పుడు పట్టుకున్నది, తాళ్ళు కట్టింది, చంపింది ఎవరెవరనే ప్రతి చిన్న విషయం శతృవు వద్దకు చేరింది. అంటే శతృవు నెట్‌వర్క్ ఎంత రహస్యంగా నిర్మించాడనేది అర్థం చేసుకోవచ్చు. శతృ నెట్‌వర్క్‌ను అర్థం చేసుకుని దాన్ని ఛేదించి ధ్వంసం చేయడంలో గానీ మన దళాలు, సంఘనాయకత్వం రహస్య పని విధానానికి పూనుకోవడంలో మరింత మెరుగుదల రావలసిన అవసరం వుంది.

శతృవు మన విజయాలను ఏ మాత్రం సహించడం లేదు. ఏ చిన్న ఘటన జరిగినా దాని ప్రభావాన్ని ప్రజలపై పడకుండా చేసేందుకు పూనుకుంటున్నాడు. గత సంవత్సరం మనం టి.డి.పి నాయకులను కిడ్నాప్ చేస్తే వెంటనే రియాక్ట్ అయి ఏరియాలో సంఘ, మిలీషియా నాయకులను 34 మందిని అరెస్ట్ చేసాడు. ఇదే తరహాలో మల్కనగిరి జిల్లా బొడపొద్దూర్‌లో సర్పంచ్‌ని మన పి.ఎల్.జి.ఎ నవంబర్ 26న ఖతం చేస్తే ఆ ప్రాంతం నుండి, ప్రతి గ్రామం ప్రజల నుండి పట్టుకుని ఇంటరాగేషన్ చేసి వదిలాడు. జనవరి 5న సాంగిన వెంటకరమణను ఖతం చేస్తే 7వ తేదీ కల్లా ఆ ప్రాంత సాధారణ ప్రజలనుండి సంఘ నాయకుల వరకు 24 మందిని అరెస్టు చేసాడు. ఈ నిర్బంధాన్ని తట్టుకోలేక 12 కుటుంబాలు గ్రామాల్ని వదిలి పారిపోయారు. నవంబర్ 2015న గూడేం ప్రాంతంలో కాఫీ తోటల్ని స్వాధీనం చేసుకున్న ప్రాంతం నుండి, ప్రతి గ్రామం నుండి సంఘ నాయకులను సాధారణ ప్రజలను పిలుచుకోవడం చేసి బెదిరిస్తున్నారు. ఒకరిని తీవ్రంగా హింసించి జైళ్ళో పెట్టాడు. నిరంతరం కూంబింగ్‌లు చేస్తున్నారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి ప్రజలు స్వాధీనం చేసుకున్న కాఫీతోటల్ని కాల్చి బుగ్గిపాలు చేసారు. ఈ ఘటనలు చూస్తే శతృ దాడిలో మరింత మార్పు వచ్చింది అనేది రుజువు చేస్తున్నాయి.

**ప్రజల ప్రతిఘటన**

పెరుగుతున్న శతృదాడి మధ్యలోనే ప్రజలు మరింత వర్గ కసిని పెంచుకుంటున్నారు. శతృవు ఎంత అణచిపెట్టాలని చూస్తే అంత వర్గకసితో ముందుకు వస్తున్నారు. ఈ మధ్య కాలంలో శతృవు ఏ గ్రామం పై దాడి చేసినా ప్రజలంతా సాయుధులై ప్రతిఘటించి తమ సంఘ నాయకత్వాన్ని రక్షించుకోవడం, శతృవు చెరనుండి తమ నాయకుల్ని విడిపించుకోవడం చేస్తున్నారు. గునుకురాయి గ్రామంపై శతృవు రెండుసార్లు దాడి చేస్తే గ్రామ ప్రజలంతా తిరగబడి శతృవును ప్రతిఘటించారు. మూడు విడతలుగా పోలీసు అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా 600 మంది ప్రజలు కదిలి బహిరంగ సభలు నిర్వహించారు. రెండు విడతలుగా మండల సెంటర్లకు వెళ్ళి తమ నాయకులను విడిచిపెట్టాల్సిందిగా డిమాండ్ చేసారు. పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా 4 పంచాయితీల ప్రజలు 800 మంది కదిలి తమ ప్రాంతంలో పోలీసు క్యాంపులు పెట్టవద్దని డిమాండ్ చేసారు. ఆర్.జి కొత్తూరు వద్ద నిర్మిస్తున్న పోలీసు క్యాంపు బాక్సైట్ తవ్వకాలు వేగిరం చేయడంలో భాగంగా జరుగుతుంది. దీని ద్వారా బాక్సైట్ వ్యతిరేక వుద్యమాన్ని, ప్రజా వుద్యమాన్నీ అణచివేయడం కోసమే అంటూ నినదించి క్యాంపు నిర్మాణం ఆపాలని ఫిబ్రవరి 5వ తేదీన డిమాండ్ చేసారు. ఈ క్యాంపు నిర్మాణం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు వస్తాయనీ, పైగా ఇక్కడ 3 కుటుంబాలు సారవంతమైన మాగాణి భూమిని కోల్పోయి నిర్వాసితులుగా మారతారనీ, ఈ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరుగుతామనీ, ఈ క్యాంపు ద్వారా స్థానిక ఆదివాసీలకు ఒరిగింది ఏమి లేదనీ, అందుకు క్యాంపు నిర్మాణం వెనక్కు తీసుకోవాలని స్థానిక ఆదివాసీ మహిళలు, పురుషులు పోలీసులతో ఘర్షణకు దిగి క్యాంపుకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 18 తేదీన కేంద్ర హెూం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నయకత్వంలో విశాఖపట్నంలో జరిగిన డి.జి.పిల సమావేశం తర్వాత దాడి మరింత తీవ్రతరమైంది. అందులో భాగంగానే మే 4న మర్రిపాకల-పాలసముద్రం మధ్య పక్కా సమాచారంతో దళంపై దాడి చేసి ముగ్గురు కామ్రేడ్స్‌ను హత్య చేసాడు. ఈ సంఘటన తర్వాత 2 సంవత్సరాలలో ఈస్ట్ డివిజన్‌లో మవోయిస్టు పార్టీ లేకుండా చేస్తామని పోలీసు అధికారులు ప్రకటనలు చేస్తున్నారు.

## 12. ప్రజావ్యతిరేకి రామలింగంను ప్రజాకోర్టులో నిలదీసిన విప్లవ ప్రజానీకం

విశాఖ జిల్లా కోరుకొండ ఏరియా కమిటి పరిధిలోని అమ్మవారి దారకొండ పంచాయితీ భౌగోళికంగా చాలా విశాలమైన ప్రాంతం. గతంలో మన ఉద్యమానికి బలమైన ప్రాంతంగా ఉండేది. శతృదాడి పెరిగిన తరువాత ఈ ప్రాంతంతో మనకు కొంత గ్యాప్ ఏర్పడింది. దీంతో ప్రభుత్వం రామలింగం లాంటి వారిని తయారు చేసుకుని సంస్కరణలు అమలు చేస్తున్నది. ఈ సంస్కరణల వల్ల ఒక చిన్న సెక్షన్, కొద్ది మంది వ్యక్తులు లాభపడ్డారు. ప్రజల జీవితాల్లో మార్పులేదు. ఈ పంచాయితీ బాక్సైట్ ప్రభావిత ప్రాంతాలలో ఒకటిగా ఉంది. బాక్సైట్ ఉద్యమాన్ని తీవ్రతరం చేయటంలో భాగంగానే ఈ ప్రాంతం పై గత సంవత్సరం నుండి గ్రామ స్థాయి నుండి కేంద్రీకరించి పనిచేయటం జరిగింది. కింది స్థాయి నిర్మాణాల నుండి, పాకెట్ స్థాయి నిర్మాణం వరకు తీసుకున్నాం. కొత్తగా ఏర్పడిన పాకెట్ నిర్మాణంలో గ్రామ సమస్యలు చర్చ పెట్టగా రామలింగం సమస్యను ముందుపెట్టారు. రామలింగం ముందునుంచి ప్రజలకు వ్యతిరేకంగా ఉంటున్నాడు. మన పార్టీ రామలింగంను ఇప్పటికి మూడుసార్లు ప్రజాకోర్టులో పెట్టించింది. అయినా అతనిలో మార్పు రాలేదు. దీంతో పాకెట్ ప్రజల్లో పెట్టాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. నిర్ణయానికి అనుగుణంగా పాకెట్‌లో ప్రజలకు కబుర్లు పంపి 14-7-15న ప్రజాకోర్టు నిర్వహించాం. రామలింగం అవినీతి గురించి ప్రజలు మాట్లాడి ఆ డబ్బులను తిరిగి చెల్లించాలనీ, లేకుంటే ఏరియా బహిష్కరణ చేయాలని నిర్ణయం చేసారు. రామలింగం అవినీతి సంబంధించిన 6000, 400 పెంకులు వెంటనే ఇవ్వాలనీ, స్కూలు పని నవంబర్ లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. అంతేకాకుండా కా.సన్యాసిరావు పేరు మీద వచ్చిన లక్ష రూపాయలలో 80,000 తిన్నాడు. వీటిని కూడా జనవరి లోగా చెల్లించాలని అలా కాని పక్షంలో కట్టుబట్టలతో ఏరియా బహిష్కరణ చేయాలని 250 మంది సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్య ప్రజలలో మంచి ప్రభావాన్ని వేసింది.

### 13.విశాఖ ఎస్‌పి సద్భావనా యాత్రని తిప్పికొట్టిన కోరుకొండ ఏరియా విప్లవ ప్రజానీకం:

మన ఉద్యమ ప్రాంతాల్లో పోలీసులు, జనమైత్రీ, సద్భావన యాత్రలు నిర్వహిస్తూ ఒక సెక్షన్ ప్రజల్ని గెలుచుకోవటానికి వాలీబాల్, నెట్లు, దుప్పట్లు, మంకీ క్యాప్‌లు, చీరలు, ప్లేట్లు పంపిణీ చేస్తూ ఇదే అభివృద్ధి అంటూ భ్రమల్లో ముంచెత్తుతున్నారు. అంతే కాకుండా ప్రజలతో కలసి సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. ఇంకొక వైపు సాయుధ దాడిని చేస్తూ బలపం కాఫీ పోరాటాన్ని అణచడానికి 5 సంవత్సరాల నుండి ప్రయత్నాలు చేస్తున్నాడు.

మార్చి 15న పోలీసులు కోరుకొండ వారపు సంతలో జనమైత్రి పెట్టి బిర్యాని, చీరలు, వాలీబాల్, నెట్లు పంపిణీ చేసాడు. ప్రజల్ని సంతలో నిర్బంధించి, వత్తిడి తీసుకువచ్చి బలవంతంగా వీటిని పంచిపెట్టారు. తిరిగి గ్రామాలలోకి చేరుకున్న ప్రజలు గ్రామాల వారీగా మీటింగ్‌లు వేసుకుని శతృవు ఇచ్చినవి తీసుకోవద్దని నిర్ణయించుకుని 4 గ్రామాల ప్రజలు వాటిని కాల్చివేసారు. శతృ మాయమాటలు నమ్మవద్దనీ, వస్తువులను తీసుకోరాదని ప్రజలను ఉద్దేశిస్తూ కమిటీ నాయకత్వం మాట్లాడారు.

### 14. ప్రాణాలు అర్పించైనా బాక్సైట్‌ను అడ్డుకుంటాం

ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటి పరిధిలో (మన్యం వ్యాప్తంగా) గత కొంత కాలంగా బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాలు రగులుతున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకూ ధారాదత్తం చేసింది. ప్రజల మనోభావాలతో ఏ మాత్రం సంబంధం లేకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నది. ఈ విధానాలకు వ్యతిరేకంగా సంవత్సర కాలంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు.

జులై 19న పాడేరులో ఐటిడిఏ పాలకమండలి సమావేశం జరుగుతుండగా బాక్సైట్‌కు వ్యతిరేకంగా గ్రామాల వారీగా తీర్మానాలు చేసి పెసా కమిటీలతో పాటు గ్రామానికి ఇద్దరు చొప్పున హాజరయ్యారు. ఐటిడిఏ పాలకమండలి సమావేశంలో బాక్సైట్‌కు వ్యతిరేకంగా మొదటి తీర్మానం చేయాలని ఆందోళన చేసారు. చివరికి ఈ సమావేశం అర్ధాంతరంగానే ముగిసింది. ఇదే రోజున కోరుకొండ వారపు సంతలో బాక్సైట్ వ్యతిరేక మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు వ్యాపారస్తులు కూడా సహకరించారు. సుమారుగా 2000 మంది ప్రజలు హాజరైన ఈ సభను ఉద్దేశిస్తూ కమిటీ సభ్యులు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలనీ, బాక్సైట్ తవ్వకాలను విరమించుకోవాలనీ డిమాండ్ చేసారు. ప్రజలు సాయుధంగా బాక్సైట్ ఉద్యమానికి సిద్ధం కావాలని కూడా పిలుపునిచ్చారు. ఇదే మీటింగ్‌లో విశాఖ జిల్లా ఎస్‌పి కోయ ప్రవీణ్ గ్రామాల దత్తత పేరుతో నాటకమాడుతున్నాడనీ, చిత్తశుద్ధి ఉంటే బాక్సైట్‌కు వ్యతిరేకమా, అనుకూలమా అనేది తేల్చి చెప్పాలనీ, ప్రజల మౌలిక సమస్య అయిన భూమి సమస్యను పరిష్కరించగలరా అని ప్రశ్నించారు. అంతే కాకుండా ప్రజలంతా పోలీసులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### 15. అమర వీరుల బంధు మిత్రుల సభ

ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా పరిధిలో అమరుల, విప్లవకారుల, నిర్బంధానికి గురవుతున్న కుటుంబాలతో సభ నిర్వహించారు. మన ఉద్యమ ప్రాంతంలో శతృవు అమరుల, విప్లవకారుల కుటుంబాల వద్దకు వెళ్ళి కంటి ఆపరేషన్లు చేయిస్తూ, చీరలు, డబ్బులు ఇస్తూ పార్టీలో ఉన్న మన కామ్రేడ్స్‌ని లొంగిపొమ్మని వారితో చెప్పిస్తున్నాడు. ఈ కుటుంబాలను కలవడంలో మనకున్న పరిమితులను ఉపయోగించుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. దీన్ని దృష్టిలో పెట్టుకుని జులై 28 సందర్భంగా ఈ కుటుంబాలతో కలసి మాట్లాడేందుకు నిర్ణయం జరిగింది. దీనికి అనుగుణంగానే అమరుల, విప్లవకారుల బంధు మిత్రులను పిలవడం జరిగింది. వీరితో పాటు నిర్బంధాన్ని అనుభవిస్తున్న కుటుంబాలను కూడా పిలిచాం. వీరంతా సభను ఉద్దేశిస్తూ శతృవు విసురుతున్న వలలో చిక్కుకున్నామనీ, వాడు చేస్తున్న ప్రచారానికి మోసపోయామనీ, పిఎల్‌జిఎ ఉంటేనే మాకు ధైర్యమనీ, పార్టీని ఎల్లవేళలా కాపాడుకుంటామనీ, శతృవుకు వ్యతిరేకంగా సాయుధంగా ఉద్యమిస్తామనీ, వాడి ప్రలోభాలకు లొంగిపోమనీ, అవసరం అనుకుంటే పూర్తిస్థాయి కార్యకర్తలుగా ఉద్యమంలో పని చేస్తామనీ ప్రతిజ్ఞ చేసారు.

## మల్కనగిరి డివిజన్

### ☆ విప్లవ ప్రచారం

### 1. మార్చి 8 శ్రామిక మహిళా దినోత్సవం

కలిమెల బ్లాక్‌లోని కుర్మనూర్ పంచాయితీ కోడిగండి గ్రామంలో శ్రామిక మహిళా పోరాట దినం జరిగింది. ఈ సభకు దూలిగండి, ఆర్.వి.టి, ఎర్రగుమ్మి, సపటిజోల, ఎలకనూరు, బూషిపాకల, గుర్రాలూరు, ఆలూర్‌పేట, పెద్దుబ్, లోతుపాకల, సువలేటి మొదలైన గ్రామాల (సుమారు 12 గ్రామాల) నుండి 95 మంది మహిళలు, 125 మంది పురుషులు మొత్తం 215 మంది శ్రామిక ప్రజలు పాల్గొని సభను విప్లవోత్సహంతో నిర్వహించుకున్నారు.

2. బొడిగట్ట పంచాయితీ టేక్‌కూడ కాలనీలో సంఘం నాయకత్వంలో 200 మంది ప్రజలతో సభ నిర్వహించుకున్నారు. సంఘం సభ్యురాలు శ్రామిక మహిళా విముక్తి పతాకను ఎగురవేయడంతో సభ ప్రారంభమైంది. సభలో వక్తలు పితృస్వామ్య భావజాలానికీ, రాజ్యహింసకు, సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా తమ ఉపన్యాసాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ సభ సందర్భంగా గ్రామాల నుండి సేకరించిన బియ్యం, చోళ్ళు, పప్పులు, (1క్వింటాలు) భర్తలు చనిపోయిన మహిళలకు పంచి పెట్టారు.

### 3. షహీద్ భగత్‌సింగ్ సంస్మరణ సభ

బ్రిటిషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విద్యార్థి యువజనులను కూడగట్టి, అనేక మిలిటెంట్ చర్యలను చేపట్టి బ్రిటిషు పార్లమెంటులో బాంబులు విసిరి చిరునవ్వుతో ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల సంస్మరణ సభకు బొడిగట్ట పంచాయితీ కలిమెల బ్లాక్ కొర్రాబ్ చుట్టుపక్కల గ్రామాలైన రాజులకొండ, బొడిగట్ట, గొందిగూడ, మర్రిగట్ట కాలనీ, పెద్దటేక్‌గూడ, కన్నెగూడ గ్రామాల నుండి 120 మంది ప్రజలతో ఊరేగింపు, ఆ తర్వాత సభ జరిగింది. సభలో వక్తలు ఇప్పుడున్న జైళ్ళల్లో జరుగుతున్న అరాచకం, అణచివేతను వివరించారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను ఎత్తిపట్టారు. నిర్బంధాలు, చిత్రహింసలకు వెరవకుండా విప్లవ ప్రజానీకం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### 4. జనవరి 26 (బూటకపు స్వతంత్రం) బ్లాక్ డే.

1947 జనవరి 26న భారత దేశానికి వచ్చిన బూటకపు స్వతంత్రాన్ని నిరసిస్తూ పార్టీ ఇచ్చిన పిలుపుతో బొడిగట్ట పంచాయితీలోని మర్రిగట్ట, కాలనీ, పెద్దటేక్‌గూడ, చిన్నటేక్‌గూడ, కన్నెగూడ, బెజ్జంగివాడ గ్రామాలలో ప్రజలు పోస్టర్లు వేసారు. మర్రిగట్ట స్కూల్‌పై, బెజ్జంగివాడ గ్రామంలో నల్లజెండాలు ఎగురవేసి నిరసన తెలిపారు. సాయుధ శక్తి ద్వారా దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల రాజ్యాంగయంత్రాన్ని ధ్వంసం చేసి పీడిత ప్రజల అధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## ☆ విప్లవ ద్రోహులను మట్టుబెట్టిన పి.ఎల్.జి.ఎ, విప్లవ ప్రజానీకం

### 5. ప్రజావ్యతిరేకి బుద్ధు (బుట్టి) ఖతం

కలిమెల బ్లాక్ బొడిగట్ట పంచాయితీ టేక్‌గూడ కాలనీకి చెందిన బుద్ధు లంపెన్‌గా వుంటూ అరాచకంగా తయారయ్యాడు. ఒకసారి ఆర్.పి.సి డబ్బులను దొంగిలిస్తే తిరిగి ఆ డబ్బును కుటుంబం ఆర్.పి.సికి చెల్లించింది. ఈ మధ్య కాలంలో అదే గ్రామంలో దూలాల్‌తో పాటు చేతులు కలిపి మన పి.పి.సి, ఆర్.పి.సి సభ్యులను అరెస్టు చేయించిన దాంట్లో ముఖ్యుడు. బుద్ధు ప్రజావ్యతిరేక చర్యలను పసిగట్టిన ప్రజలు, పార్టీ అతన్ని ప్రజాకోర్టులో పెట్టి విచారించగా 2015లోనే ఇంటెలిజెన్స్ అధికారి బెహర్‌తో సంబంధాలు పెట్టుకొని మన సమాచారాన్ని శత్రువుకు చేరవేస్తున్నాడని తేలింది. బుద్ధు చెప్పిన విషయాలతో పాటు ప్రజలు మరి కొన్ని విషయాలు కోర్టుముందుంచారు. బుద్ధు సుమారుగా 79 సార్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సమాచారం ఇచ్చి వచ్చాడని తెలియజేసారు. బుద్ధు అరాచకాల విషయంలో ప్రజలు ఎన్నోసార్లు అతనికి చెప్పడం జరిగింది. అయినా ప్రవర్తన మారలేదు. ఇతడు మారతాడనే విశ్వాసం కుటుంబానికి కూడా లేకపోవడంతో ప్రజాభిప్రాయం మేరకు ప్రజాకోర్టు అతన్ని ఖతం చేయాలని నిర్ణయించింది. ప్రజా నిర్ణయం ప్రకారం పి.ఎల్.జి.ఎ బలగాలు బుద్ధును ఖతం చేసాయి.

### 6. ప్రజాకోర్టు తీర్పు మేరకు ఇన్‌ఫార్మర్ విక్రమ్‌ను ఖతం చేసిన పి.ఎల్.జి.ఎ

కలిమెల బ్లాక్ చిన్నటేక్‌గూడ గ్రామంలో విక్రమ్ 2002 నుండి 2005 వరకు పార్టీలో దళ సభ్యుడిగా పని చేసాడు. కొంతకాలం నాయకత్వానికి గార్డుగా కూడా వున్నాడు. ఆ తర్వాత రాజకీయంగా దిగజారిపోయి ఇంటికి వెళ్ళి సాధారణ జీవితం గడపనారంభించాడు. 2015 గ్రీన్‌హంట్ 3వ దఫాలో శత్రునిర్బంధంలో వచ్చిన మార్పులో భాగంగా గ్రామస్తులకు ఎవరికి తెలియకుండా శత్రువు ముందు సరెండర్ అయ్యి వచ్చాడు.

2016 మార్చి నెలలో పోలీసులు గ్రామంపై దాడి చేసి అందరితో పాటు విక్రమ్‌ని కూడా పట్టుకుపోయారు. 15 రోజులు పోలీస్ కంట్రోల్‌లో ఉంచుకొని తిరిగి గ్రామానికి పంపించారు. 15 రోజులు పోలీస్ కస్టడీలో వున్న విక్రమ్‌పై గ్రామస్తులకు అనుమానం కలిగింది. ప్రజాభిప్రాయం మేరకు దళం వాడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా పోలీసుల దగ్గర నుండి 20వేల రూపాయలు తీసుకొని ఇన్‌ఫార్మర్‌గా మారిన విషయం బయటపెట్టాడు. అంతకన్న ముందే సెల్‌మెంబర్ అందాల్, మాజీ దళ సభ్యుడు కమలాకర్‌లను పోలీసులకు పట్టించడం, ఇండ్ల పై దాడులు చేయించడం వంటి ప్రజావ్యతిరేక ఘటనల్లో తన పాత్ర వుందని ప్రజాకోర్టులో ఒప్పుకున్నాడు. ప్రజా వ్యతిరేకులను ఖతం చేయడమే సరైందనే ప్రజాభిప్రాయంతో పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది.

### 7. ప్రజాద్రోహి, ఇన్‌ఫార్మర్ సురేష్ ఖతం

కలిమెల బ్లాక్, మన్యంకొండ పంచాయితీ సొవులూరు గ్రామానికి చెందిన షకీల పార్టీలో పని చేసి గత సంవత్సరం సరెండర్ అయింది. సంఘ నాయకులను పట్టించడం, దళం ఆచూకీ తెలియజేయడమే కాకుండా పోలీసుల వెంటనే తిరుగుతుంది. షకీల బంధువు సురేష్, అన్న రాము ఇద్దరు షకీలతో సంబంధాలు పెట్టుకొని దళం సమాచారం మొబైల్ ద్వారా పోలీసులకు వెంటవెంటనే తెలియజేస్తున్నారు. జనవరి 12 ఎన్‌కౌంటర్ జరిగిన రోజున పోలీసులు సొవులూరు గ్రామానికి వెళ్ళి కొంత మందిని కొట్టారు. అంతకు ముందే కలిమెల వెలుతున్న సొవులూరు గ్రామస్తులను షకీల చూపించడంతో వారిని పోలీసులు కొట్టి సరెండర్ చేయించుకొని పంపించారు. 2015 డిసెంబర్‌లో రాము, సురేష్‌లకు కలిపి డబ్బులు కూడా ఇచ్చింది. షకీలను పట్టుకోవాలని ప్రజలు పథకం కూడా వేసారు. విషయం అర్థమై రాత్రికి రాత్రే పారిపోయింది. సురేష్, రాములను ఇన్‌ఫార్మర్ పని మానుకోవాలనీ, చేసిన తప్పులను పార్టీ దగ్గర ఒప్పుకోవాలని మందలించారు. అయినా వారి పద్ధతి మారలేదు. ప్రజలను బెదిరించడం, దళ సమాచారం ఇవ్వడంతో ఒక రోజు రాత్రికి రాత్రే మన మకాంను పోలీసులు చుట్టుముట్టారు. ముందుగానే మనం అలర్ట్ అవ్వడం వల్ల ప్రమాదం తప్పింది. అన్ని కోణాల్లో నిజానిజాలు పార్టీకి తేటతెల్లం కావడంతో ఇద్దరిపై చర్య తీసుకోవాలని ప్రజలు, ఎ.సి కమిటీ నిర్ణయించింది. విషయం పసిగట్టిన రాము పారిపోయాడు. ఏప్రిల్ 24న ద్రోహి సురేష్‌ని పట్టుకుని ఇంటరాగేషన్ చేసి అనంతరం ఖతం చేయడం జరిగింది.

### 8. ప్రజావ్యతిరేకి, పోలీసు ఏజెంట్ జైరామ్ కొర్ర ఖతం

మల్కనగిరి జిల్లా, కుడుముల గుమ్మ బ్లాక్, బొడపొదూర్ పంచాయితీ కోరుకొండ ఏరియా పరిధిలో జైరామ్ కొర్ర పంచాయితీ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నాడు. ఈ పంచాయితీలో అవినీతిలో రాటుదేలాడు. ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, ఉపాధికార్డ్ ఏది కావాలన్నా

వీడికి లంచం ఇవ్వవలసిందే. అంతే కాకుండా మహిళలతో అక్రమ సంబంధాలు పెట్టుకోవడం, లొంగని మహిళలను బెదిరించి లొంగదీసుకోవడం, వావి వరసలు లేని లైంగిక సంబంధాలు పెట్టుకోవడం మొదలైన వాటిలో ముఖ్యుడుగా ఎదిగాడు. అక్రమ వసూలు, అక్రమ వ్యాపారాలలో ప్రజలను అనేక రకాలుగా పీడించేవాడు. ఈ ఆక్రమాలతో పాటు రాజ్యంతో మిలాఖత్ అయి ప్రజా వుద్యమాన్ని అణచడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 2004లో ఒకసారి, 2011లో మరొకసారి పార్టీ వీడిని ప్రజాకోర్టులో పెట్టి దేహశుద్ధి చేసి హెచ్చరించింది. అయినా మార్పు రాలేదు. 2012లో అటగూడ సమీపానికి బి.ఎస్.ఎఫ్ క్యాంప్ రావడంతో వీడి ఆటలకు హద్దులు లేకుండా మితిమీరిపోయాడు. నిరంతరం పోలీసుల సంబంధాల్లో వుండి దళ సమాచారాన్ని చేరవేయడం, ప్రజలను అరెస్టులు చేయించడం కొనసాగించాడు. ఈ ప్రాంతంలో దళం కదిలికలు వున్నాయనీ, ఇక్కడ మరొక క్యాంపు అవసరమనీ ఎస్.పిని డిమాండ్ చేసాడు. దీంతో 2014లో సరియగూడ వద్దకు మరో క్యాంపు వచ్చింది. రెండు క్యాంపుల అండతో గ్రామంలోనే ఉంటూ మన వర్గ సంఘాల, ప్రజల కదలికలను వాడి ఏజెంట్ల ద్వారా పసిగట్టి శతృవుకు సమాచారాన్ని చేరవేస్తూ మన కార్యాచరణకు అడ్డంకిగా మారాడు. ఈ విషయాన్ని ప్రజలు మరోసారి చర్చించడంతో ప్రజాకోర్టు నిర్వహించి ప్రజామోదంతో 2015 డిసెంబర్ 26న వీడిని ఖతం చేయడం జరిగింది. ఈ చర్య స్థానిక ప్రజలలో మంచి ప్రభావాన్ని వేసింది.

## ☆ పోరాట పథంలో మల్కనగిరి జిల్లా విప్లవ ప్రజానీకం

### 9. ప్రజల సమస్యలపై ర్యాలీ

కలిమెల, కోరుకొండ బ్లాక్‌లోని కుర్మనూరు, పప్పులూరు, కప్పతాట్టి, దొరగూడ, నవగూడ, గుంటువాడ పంచాయితీలో ఉన్న గ్రామాల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. స్థానిక ప్రజా ప్రతినిధి అయిన సర్పంచ్‌కి చెప్పినా ఫలితం లేకపోవడంతో సమస్యలకు పరిష్కారం పోరాట మార్గమేననుకున్నారు. ముఖ్యంగా మంచినీరు, విద్యా, వైద్య సమస్యలు ప్రధానమైనవి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) ఉన్నా డాక్టర్లు లేకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. పాఠశాలలు వున్నా తరగతి గదులు లేకపోవడం, అపరిశుభ్రత, అర్థాకలి మొదలైన సమస్యలతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. మొత్తంగా మౌలిక సదుపాయాలైన టీచర్ల కొరత మూలంగా సకాలంలో సిలబస్ పూర్తి కాకపోవడం మరో పెద్ద సమస్యగా మారింది. విద్యారంగంలోనే కాక కొండరెడ్ల రిజర్వేషన్, రేషన్ కార్డుల సమస్య, వుండటానికి ఇళ్ళు లేకపోవడం, మెక్కుబడిగా ఇందిరా ఆవాస్ ఇళ్ళను ప్రారంభించి మధ్యలోనే ఆపివేయడం, అర్హులైన వృద్ధులకు పెన్షన్ నమోదు చేయకపోవడం, కొన్ని పంచయితీ (నవగూడ)ల్లో పి.హెచ్.సిలు లేకపోవడం, వున్న పి.హెచ్.సిలలో డాక్టర్లను కేటాయించకపోవడం, వున్న ఆస్పత్రులలో అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం, పశువైద్యశాల లేకపోవడంతో అనేక పశువులు రోగాల బారిన పడి మరణించడం, రేషన్ సబ్ సెంటర్ల కొరత, సాగునీరు-చెక్ డ్యాం-వీధి రోడ్ల నిర్మాణాల కొరత మొదలైన సమస్యల (మొత్తం 22 డిమాండ్లు)పై ఆదివాసీ వికాస్ సంఘం నాయకత్వంలో మూడు వేల మంది ప్రజలు మే 3వ తేదీన మల్కనగిరి జిల్లా సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

### 10. సర్పంచ్‌ని నిలదీసి నీటి సమస్యను పరిష్కరించుకున్న పప్పలూరు ప్రజానీకం

పప్పులూరు గ్రామానికి చెరువు మంజూరై సంవత్సరం గడిచిపోయింది. కాని అది ఆచరణకు నోచుకోలేదు. ఈ సంవత్సరం వర్షాల్లేక తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కోవాల్సి వచ్చింది. చివరకు పశువులక్కూడా నీళ్ళు దొరకని పరిస్థితి. ఈ విషయాన్ని సర్పంచ్ కొమ్మల్ లచ్చన్ దృష్టికి చాలా సార్లు తీసుకువెళ్ళినా లాభం లేకపోయింది. అతను వాయిదాలు వేయడం తప్ప అమలు చేయలేదు. దళం గ్రామానికి వచ్చినప్పుడు ప్రజల సమక్షంలో సమస్యలపై చర్చ జరపగా గ్రామంలోని చెరువు సమస్య కూడా ముందుకు వచ్చింది. 10 గ్రామాల ప్రజలు పార్టీ సమక్షంలో సర్పంచ్ కొమ్మల్ లచ్చన్‌ను నిలదీసారు. దానితో తప్పని పరిస్థితులలో సర్పంచ్ 5 రోజుల్లోనే ప్రొక్లేనర్ తెచ్చి పని ప్రారంభించాడు. అతి కొద్ది సమయంలోనే సమస్య పరిష్కారమయ్యింది. తమ గ్రామ నీటి సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తపరిచారు.

### 11. తునికాకు రేటు పెంచుకున్న ప్రజలు

గత సంవత్సరంలో ఒక కట్ట తునికాకుకు 1.25 పైసలు వుండగా ఈ సంవత్సరంలో 25 పైసల పెంపుకను పోరాటం చేసి విజయం సాధించారు. బుష్‌కట్టింగ్ ఒక రోజుకు 150 రూ॥లు పెంచుకున్నారు. గత 2 సంవత్సరాలు (2014, 2015) గా తునికాకు కార్మికులకు ఇవ్వవలసిన బకాయిలను కూడా పూర్తిగా చెల్లించడానికి ఒప్పుకున్నారు. మల్కనగిరి జిల్లాలోని గోవిందపల్లి, కలిమెల, పొట్టేరు, పొడియా, కుర్మగూడ, కప్పతాటి, నవగూడ, దొరగూడ, గుంటవాడ, పంచాయితీ గ్రామాల్లో ఈ సంవత్సరం కొత్తగా తునికాకును కొనడం ప్రారంభించినా ఇదే రేటు ఇవ్వక తప్పడం లేదు.

### 12. అక్రమ భూమి తగాదా పరిష్కరించుకున్న మజ్జిపాకల ప్రజానీకం

కలిమెల బ్లాక్, కూర్మగూడ పంచాయితీ మజ్జిపాకల గ్రామ సంఘం భూమి సమస్యను పార్టీ దృష్టికి తీసుకువచ్చింది. మజ్జిపాకల గ్రామం నుండి వెళ్ళిపోయిన కుటుంబానికి సంబంధించిన ఒక ఎకరం భూమిని అక్కడే ఉంటున్న బొబ్బిలి కొద్ది సంవత్సరాలుగా ఆ భూమిని ఆక్రమించి అందులో పండిన ఫలసాయాన్ని అనుభవిస్తున్నాడు. గ్రామంలో అక్రమంగా సాగు చేయబడుతున్న భూములను భూమిలేని వారికి అప్పగించాలని ఆలోచించారు. పార్టీ ఆ గ్రామానికి వెళ్ళినప్పుడు గ్రామస్తులు ఈ సమస్యను ముందుకు తెచ్చారు. అదే రోజు ప్రజల, సంఘనాయకత్వం సమక్షంలో బొబ్బిలి తాను ఆక్రమించిన భూమిని వదిలివేయాలని నిర్ణయించడంతో భూమి నుండి వైదొలగుతానని ఒప్పుకున్నాడు.

**(62వ పేజీ తరువాయి)**

వర్గం చేసిన సుదీర్ఘమైన పోరాటంలో అనేక ఓటములకు గురైన తర్వాతనే విజయం సాధించిందనే విషయాన్ని వీరు మరిచిపోతున్నారు. పారిస్ కమ్యూన్ సమయం నుండి కార్మికవర్గం తన ప్రతీ ఓటమి నుండి గుణపాఠాన్ని తీసుకుంది. తప్పుల నుండి నేర్చుకుంటూ, ఓటముల నుండి గుణపాఠాలు తీసుకుంటూ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కార్మికవర్గం అగ్రగామి దళం పాత్ర నిర్వహిస్తూ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం మరియు అన్ని రకాల విప్లవ వ్యతిరేక వర్గాలను ఓడిస్తూ మొదట ఒక దేశంలోనూ, తర్వాత అనేక దేశాల్లోనూ, చివరికి ప్రపంచవ్యాప్తంగా సోషలిజం స్థాపనకు పోరాటం చేస్తూ ఉంటుంది. ఈ వార్షికోత్సవాల సందర్భంగా మరొకసారి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతానికి మరో ప్రత్యామ్నాయం లేదని గొంతెత్తి ప్రకటిద్దాం. కార్మికవర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీకి మరో ప్రత్యామ్నాయం లేదని ఎలుగెత్తి చాటుదాం. సోషలిజానికి కమ్యూనిజానికి మరో ప్రత్యామ్నాయం లేదని ప్రపంచం దద్దరిల్లేలా ప్రచారం చేద్దాం.

ఇందులో రెండు వార్షికోత్సవాలు-బోల్షివిక్ విప్లవపు శత వార్షికోత్సవమూ మరియు కారల్ మార్క్స్ 200వ జన్మదినాన్ని ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్మికవర్గం జరుపుకుంటుంది. మన సి.పి.ఐ(మావోయిస్టు) పార్టీ అంతర్జాతీయ కార్మికవర్గపు ఒక డిటాచ్‌మెంట్. శాస్త్రీయ సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మన పార్టీకి మార్గదర్శకం. ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో సృజనాత్మకంగా అమలు జరుగుతుంది. దృఢమైన పట్టుదలతో మితవాద అవకాశవాదంతోనూ, అతివాద సెక్టేరియనిజంతోనూ, అన్ని రకాల రివిజనిజాలతోనూ పోరాటం జరుపుతుంది. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి అత్యంత సాహసంతోనూ, అమరులు ఇచ్చిన ప్రేరణతోనూ పోరాటం చేస్తుంది. అంతర్జాతీయ కార్మికవర్గంతో భుజం భుజం కలిసి ఇటువంటి మహత్తరమైన ఉత్సవాలు జరుపుతుంది. ప్రపంచంలో నిజమైన మావోయిస్టు పార్టీలు, సంస్థలు, వ్యక్తులు వారి వారి దేశాల్లో విప్లవ పోరాటాలు నడిపినట్లుగానే మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోతూ మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని ఎత్తిపడుతూ, రక్షిస్తూ, అనుసరిస్తూ, అమలు జరుపుతూ, అభివృద్ధి పరచటమనేది మన కర్తవ్యం. ఈ క్రమంలో భాగంగానే ఈ మూడు గొప్ప ప్రపంచ కార్మికవర్గ విప్లవోత్సవాలను జరుపుకుందాం. ఈ ఉత్సవాలను జరుపుకోవడం అంటే విప్లవ సారాంశమైన మార్క్సిజాన్ని గ్రహించటమే. గతంలో విజయవంతమైన కార్మికవర్గ విప్లవాల ప్రేరణ నుండి ఉత్తేజాన్ని పొందటం, అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవాల నుండి సకారాత్మక, నకారాత్మక అనుభవాలను గ్రహించటం, మన ఓటముల నుండి, తప్పుల నుండి గుణపాఠాలను తీసుకోవటం, భవిష్యత్తులో తప్పులు దొర్లకుండా మన శక్తిని మరింత పెంచుకుంటూ నూతన సామాజిక మరియు విప్లవ పరిస్థితులలో సామ్రాజ్యవాదానికీ, అన్ని రకాల అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి పురోగమించాలి.

అందువల్ల మన పార్టీ శక్తిసమర్థతలకు అనుగుణంగా ఈ చారిత్రక మహోత్సవాలను అన్ని చోట్ల జరుపుకోవాలి. అన్ని పార్టీ శాఖలూ సంసిద్ధంగా ఉండి ఈ మహోత్సవాలలో ప్రజలు చురుగ్గా పాల్గొని వీటిని విజయవంతం చేసేలా శక్తివంచన లేకుండా కృషి చేయాలి. నక్సల్బరీ 50వ వార్షికోత్సవాన్ని 2017 మే 23 నుండి మే 29 వరకు జరపాలి. బోల్షివిక్ విప్లవపు శత వార్షికోత్సవాలను 2017 నవంబర్ 7 నుండి 13 వరకు జరపాలి. మార్క్స్ 200వ జన్మదినాన్ని 2018 మే 5 నుండి 11 వరకు జరపాలి. ఈ మహోత్సవాలన్నింటిని క్యాంపెయిన్లుగా వారం రోజుల పాటు జరపాలి. ఒకవేళ పైన ఉదాహరించిన తేదీల్లో ఈ ఉత్సవాలు జరపలేకపోతే అదే సంవత్సరంలో ఏదైనా ఒక సమయం ఎన్నుకొని జరపాలి.

**కామ్రేడ్స్,**

నేడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయి ఉత్పత్తి శక్తులను ధ్వంసం చేస్తూ ప్రపంచవ్యాప్తంగా తన దోపిడీని, అణచివేతను, ఆక్రమణ యుద్ధాలను తీవ్రతరం చేసింది. ప్రపంచంలోని మెజారిటీ దేశాలు, జాతులు మరియు ప్రజలపై సామ్రాజ్యవాద దాడి ఫలితంగా భారీ స్థాయిలో అసంతృప్తి మరియు ప్రజలలో ప్రతిఘటన తలెత్తింది. రాబోవు సామాజిక ఉప్పెన ప్రపంచంలో అభివృద్ధి నిరోధకులను, వారి వ్యవస్థలను అతలాకుతలం చేస్తుంది. అందువల్ల వారు విప్లవ ప్రతీఘాతుక మోసపూరిత ఎత్తుగడలతో ఎం.ఎల్.ఎమ్. సిద్ధాంతం పైనా, సోషలిస్టు విప్లవాల పైనా, నూతన ప్రజాస్వామిక విప్లవాల పైనా, జాతి విముక్తి ఉద్యమాల పైనా, ప్రజల అన్ని రకాల ప్రజాస్వామిక పోరాటాల పైనా తప్పుడు ప్రచారంతో ప్రజల అసంతృప్తిని దారి మళ్ళించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిస్థితులలో మనం సిద్ధాంతపరంగా, రాజకీయంగా, మిలటరీపరంగా మిగతా అన్ని విషయాలలోనూ విస్తృత పరిధిలో శత్రువును ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ మూడు మహా ఉత్సవాలను ఈ లక్ష్యం కోసం ఉపయోగించాలి. ఈ సందర్భాలలో దేశంలోని కార్మికులకు, రైతాంగానికి, విద్యార్థి, యువతకు, మేధావులకు, పీడిత సామాజిక సెక్షన్లకు, మహిళా, దళిత, ఆదివాసీ, పీడిత జాతులకు, మత మైనారిటీలకు మరియు పీడిత ప్రజారాశులకు ఈ సందర్భంగా రాజకీయపరమైన అవగాహన కలిగించాలి. అన్ని రకాల పద్ధతులలో సందర్భానుసారంగా పాలకవర్గ దాడిని ఎదుర్కొనేందుకు ప్రజలు సంఘటితపడి ప్రతిఘటించాలని పిలుపునివ్వాలి. నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కమ్మనీ, ప్రజాయుద్ధంలో పెద్దసంఖ్యలో మిలిటెంట్‌గా చేరమనీ ప్రజారాశులను మనం అభ్యర్థించాలి. నూతన ప్రజాస్వామిక విప్లవమే పీడిత ప్రజల విముక్తికి ఏకైక మార్గమని ప్రజలలో విస్తృతంగా సందేశాన్ని ప్రచారం చేయాలి. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం నేడు పాలకవర్గాలకు మరియు సామ్రాజ్యవాదానికి మరింత నమ్మకంగా సేవ చేస్తూ కమ్యూనిజంపైనా, అన్ని ప్రగతిశీల ప్రజాస్వామిక సిద్ధాంతాలపైనా, ఉద్యమాల పైనా, సంస్కృతిపైనా, విలువల పైనా, ప్రజా ఆకాంక్షలపైనా పార్లమెంటరీ ముసుగులోనే బహిర్గతంగా తీవ్రదాడిని కొనసాగిస్తున్న నేటి తరుణంలో మన వైపు నుండి కొనసాగించే ప్రచారం కీలకమైనదిగా ఉంటుంది.

ఈ మహోత్సవాలను నిర్వహించటానికి మనం రెండు రకాల కార్యక్రమాలను ప్లాన్ చేయాలి. మొదటి పథకం ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో మన పార్టీ, పి.ఎల్.జి.ఎ, ఆర్.పి.సి మరియు విప్లవ ప్రజాసంఘాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలు. రెండవది బహిరంగ లీగల్ కార్యక్రమాలు. ఇవి ప్రధానంగా నగరాలు, బహిరంగ ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక శక్తులు, ప్రగతిశీల శక్తులు, విప్లవ శక్తులు మరియు స్వచ్ఛందంగా వ్యక్తుల ద్వారా నిర్వహించబడే కార్యక్రమాలు. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం మన ప్రజాసంఘాల నాయకత్వం చాలా ఎక్కువ చొరవను ప్రదర్శించాలి. వారు ఈ ప్రోగ్రాంలను ప్లాన్ చేసుకొనే క్రమంలో మిగతా మన మిత్ర శక్తులతో కలిసి ఈ కార్యక్రమాలను నిర్వహించే విధంగా బాధ్యత తీసుకోవాలి.

నక్సల్బరీ పోరాట 50వ వార్షికోత్సవం అంతర్జాతీయ ప్రాధాన్యతను సంతరించుకున్నప్పటికీ ఇది ప్రధానంగా మన దేశంలో కొనసాగుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి సంబంధించినది. అఖిల భారత స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ ఈ మహోత్సవాల సందర్భంగా మనం కొన్ని వెసులుబాట్లు, చొరవను ప్రదర్శించగలిగితే మావోయిస్టు అనుకూల శక్తులు, రాడికల్ ప్రజాస్వామిక పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వారు ముందుకు రావచ్చు. ఇతర శక్తులతో, వ్యక్తులతో కలిసి నిర్వహించే ఉమ్మడి కార్యక్రమాల సందర్భంగా నక్సల్బరీ ప్రాధాన్యతను గానీ, సిద్ధాంత రాజకీయపరమైన విషయాల సారాంశాన్ని గానీ పలుచబరిచే అవగాహనాపరమైన ప్రచారాన్ని అనుమతించకూడదు. అందువల్ల నక్సల్బరీ మార్గాన్నీ, నక్సల్బరీ రాజకీయాలను ఎత్తిపట్టే శక్తులతో ఐక్యం కావటమనేది ఉపయోగకరం. సాధారణంగా వారు కొనసాగుతున్న విప్లవ ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతుగానే ఉంటారు. పై విషయాలను దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో వారు పాల్గొనేలా చూడాలి. భారత దేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం కొనసాగుతున్న నేటి పరిస్థితిలో నక్సల్బరీ వార్షికోత్సవాన్ని సరైన కార్యక్రమాలను రూపొందించుకొని నిర్వహించాల్సిందిగా దేశంలోనూ, వివిధ దేశాలలోనూ గల సరైన కార్మికవర్గ పార్టీలకు, సంస్థలకు, వ్యక్తులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు, భారత విప్లవ సమర్థకులకు కేంద్రకమిటీ పిలుపునిస్తున్నది.

నిజమైన మార్క్సిస్టులు రివిజనిస్టులు కూడా బోల్షివిక్ విప్లవపు శత వార్షికోత్సవాలను, మార్క్స్ 200వ జన్మదిన వార్షికోత్సవాలను జరుపుకుంటారు. అందువల్ల నక్సల్బరీ వార్షికోత్సవాల వలే గాక ఈ కార్యక్రమాలను విశాల ప్రాతిపదికపై నిర్వహించడానికి అవకాశం వుంది. కానీ మనం మార్క్స్ బోధనలలోని సారాంశమైన రాజ్య వ్యవస్థను బలవంతంగా ధ్వంసం చేసి కార్మికవర్గ నియంతృత్వం ద్వారా సోషలిజాన్ని నిర్మించి వర్గరహిత సమాజమైన కమ్యూనిజం వైపుకు ప్రయాణం చేయాలనే అంశాన్ని ఎత్తిపట్టే సరైన మార్క్సిస్టు మరియు ప్రజాస్వామిక శక్తులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించాలి. మార్క్సిజానికి సారాంశమైన ఈ విషయాన్ని రష్యాలో లెనిన్, స్టాలిన్ నాయకత్వంలో మొదట ఆచరణలో పెట్టారు. తర్వాత రివిజనిస్టులు దానిని వదిలేశారు. ప్రపంచవ్యాప్తంగా రివిజనిస్టులు, నయా రివిజనిస్టులు మార్క్సిజం పేరుతోనే మార్క్సిస్టు వ్యతిరేక పద్ధతులు కొనసాగిస్తూ పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాదానికి సేవ చేస్తున్నారు. ఈ శక్తులే ప్రపంచవ్యాప్తంగా నేడు కార్మికవర్గాన్ని పురోగమిస్తున్న విప్లవోద్యమంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. మన దేశంలో అవకాశవాదులైన సి.పి.ఐ(ఎం)లు ప్రధానంగా మార్క్స్ బోధించిన ఈ ముఖ్య నియమానికి కట్టుబడి ఉండటం లేదు. అందువల్ల ఈ ఉత్సవాలలో వారిని నేరుగా వారి వారి పార్టీల పేర్లతో పాల్గొననీయవద్దు. ఈ సందర్భంగా మనం ఒక విషయాన్ని మరిచిపోరాదు. శత్రు వ్యతిరేక పోరాటంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యమై అన్ని రకాల అవకాశవాదాలకూ వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడకుండా శత్రువుతో జరుపుతున్న పోరాటం కూడా ముందుకు పోదు. మార్క్సిస్టు బోధనల సారాంశాన్నీ, బోల్షివిక్ విప్లవాన్నీ ఎత్తిపట్టే మేధావులు పైన చెప్పిన రివిజనిస్టు పార్టీలను సమర్థించేవారైనప్పటికీ మన ఫోరంలోనూ, కార్యక్రమాలలోనూ వారిని పాల్గొననీయవచ్చు. బోల్షివిక్ విప్లవ వార్షికోత్సవం, మార్క్స్ జయంతిని అంతర్జాతీయంగా నిర్వహిస్తారు కాబట్టి మన దేశంలో ఏదైనా ఒక పెద్ద నగరంలో అంతర్జాతీయ స్థాయిలో అందరికీ ఆమోదయోగ్యమైన తేదీలలో కార్యక్రమం నిర్వహించేలా శ్రద్ధ తీసుకోవాలి. ఆ కార్యక్రమాన్ని మన మూడు వార్షికోత్సవాల విషయాలు వచ్చేలా ఉపయోగించుకోవచ్చు. అదే విధంగా అంతర్జాతీయంగా నిజమైన విప్లవ శక్తులు నిర్వహించే కార్యక్రమాల్లో మన దేశంలోని విప్లవ శక్తులు పాల్గొనాలి.

ఈ కార్యక్రమాలను నిర్వహించకుండా అడ్డుకునేందుకు గ్రామీణ ప్రాంతంలో గానీ, పట్టణ ప్రాంతంలో గానీ శత్రువు నుండి ఆటంకులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందనేది మన దృష్టిలో ఉండాలి. ఇటువంటి పరిస్థితులలో మనం వాస్తవంగా ఆచరణలో అమలయ్యే విధంగా ప్లానులు రూపొందించుకొని విజయవంతం చేసేలా మన పథకం ఉండాలి. పట్టణ ప్రాంతాలలో మనకున్న ప్రజాపునాదిని ఆధారం చేసుకొని ప్రజల్ని కదిలించి బహిరంగ సభలు, హాలు మీటింగులు, సెమినార్లు నిర్వహించాలి. అన్ని కార్యక్రమాల్లోనూ ఎం.ఎల్.ఎం సిద్ధాంతాన్నీ, ప్రస్తుత పరిస్థితులలో దాని అవసరాన్నీ, భవిష్యత్తులో దాని ప్రాధాన్యతనూ వివరిస్తూ, పార్టీ యొక్క సిద్ధాంత రాజకీయ పంథాని ప్రజల వద్దకు తీసుకెళ్ళాలి. బూర్జువా, పెటీ బూర్జువా సిద్ధాంతాలైన ఆర్థికవాదం, సంస్కరణవాదం, పార్లమెంటరిజం, పోస్ట్ మోడర్నిజం వంటి సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం–లెనినిజం–మావోయిజం ఒక్కటేననేది అర్థం చేయించాలి. రష్యా, చైనా విప్లవాలలో రివిజనిస్టులు, రెనగేడ్లు, పెట్టుబడిదారీ మార్గీయులు విద్రోహాలు జరిపి నష్టం చేకూర్చినప్పటికీ మొదట ఆ దేశాలలో విప్లవాలు విజయవంతం కావటమూ, సోషలిస్టు నిర్మాణ క్రమంలో వారు సాధించిన విజయాలను, అద్భుతాలను నమూనాలను ప్రజలకు అర్థం చేయించాలి. రష్యా, చైనాలలోనూ, కొన్ని మిగతా సోషలిస్టు దేశాలలోనూ ఆ వ్యవస్థలు కూలిపోవటానికి గల అసలైన కారణాలను లోతుగా విమర్శనాత్మకంగా చర్చించాలి. గతంలో జరిగిన వైఫల్యాలు తిరిగి పునరావృతం గాకుండా నివారించేందుకు కార్మికవర్గపు శాస్త్రీయ సిద్ధాంతాలపై మన అభిప్రాయాలను వివరిస్తూ ఉత్పత్తి కోసం పోరాటం, వర్గపోరాటం, శాస్త్రీయ ప్రయోగాలు, కార్మికవర్గ నాయకత్వం అనుసరించే వర్గ పంథా, ప్రజా పంథా వంటి పద్ధతి, పనిశైలి గురించి ప్రజారాశులకు అర్థం చేయించాలి.

మరోవైపు పార్టీ, పి.ఎల్.జి.ఎ, ఆర్.పి.సి.లు, విప్లవ ప్రజాసంఘాలు భారత విప్లవోద్యమం సాధించిన విజయాలను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలి. పై నుండి కింది వరకు అన్ని పార్టీ కమిటీలు, పార్టీ ప్రాథమిక యూనిట్లు, ప్రజాసంఘాలలోనూ, ఐక్యసంఘటనలలోనూ గల పార్టీ ఫ్రాక్షన్లు ఎం.ఎల్.ఎం., బోల్షివిక్ విప్లవం, మన దేశ నూతన ప్రజాస్వామిక విప్లవాలపై సిద్ధాంత రాజకీయ అధ్యయన తరగతులను నిర్వహించాలి. పార్టీ, మిలీషియా మరియు ప్రజాసంఘాలు నూతన రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్లు నిర్వహించి నూతన శక్తులను భర్తీ చేసుకొని తమ శక్తిని పెంపొందించుకోవాలి. గెరిల్లా జోన్లలో శత్రు దాడి జరగవచ్చనే దాన్ని దృష్టిలో ఉంచుకొని రహస్య, రక్షణ పద్ధతులను పాటిస్తూ కాగడాల ప్రదర్శనలు, సాయుధ ప్రదర్శనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, గ్రూపు సమావేశాలు నిర్వహించాలి. నగరాలలో కూడా కలిసి వచ్చే శక్తులను కలుపుకొని ప్రజాసంఘాల ద్వారా ర్యాలీలు, హాల్ మీటింగులు, పబ్లిక్ మీటింగులు, సెమినార్లు నిర్వహించాలి. మన పార్టీ, పి.ఎల్.జి.ఎ., ఆర్.పి.సి విప్లవ ప్రజాసంఘాలు ప్రచార సామాగ్రిని తయారు చేయాలి. మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వాలి. సిద్ధాంత, రాజకీయపరమైన పుస్తకాలను ప్రచురించాలి. ఆయా భాషల్లో పత్రికలను ప్రత్యేక సంచికలుగా తీసుకురావాలి. విప్లవ సిద్ధాంతం, చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ప్రచురించాలి. ప్రచార సామగ్రి మరియు వివిధ రకాల పుస్తకాలు ప్రజలకు అర్థమయ్యే విధంగా సింపుల్‌గానూ, సృజనాత్మకంగానూ ఉండాలి. ప్రజాసంఘాలలోని ఫ్రాక్షన్లు ఈ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి. ఎం.ఎల్.ఎం., రష్యా విప్లవం, పార్టీ చరిత్ర గురించి పార్టీ శ్రేణులకు అర్థమయ్యే విధంగా సరళమైన శైలిలో ఉండే విధంగా పుస్తకాలు, బుక్‌లెట్స్, వ్యాస సంకలనాలు తీసుకు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ మూడు వార్షికోత్సవాల సందర్భంగా మొత్తం పార్టీ యొక్క సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని పెంపొందించేందుకు కృషి చేయాలి.

విప్లవాలు కార్మికుల, పీడిత ప్రజల పండుగలు. విప్లవ విజయాలు వీరోచిత బలిదానాలకు ఫలితాలు. రాబోయే ఈ మహోత్సవాలు కూడా పీడిత ప్రజలకు పండుగ దినాలే. అందువల్ల విశాల ప్రజారాశులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా మన ప్రచారం, సమీకరణ ఉండాలి. సాధ్యమైనంత ఎక్కువ మందిని ఈ మొత్తం కార్యక్రమాలలో పాల్గొనేలా అవకాశం ఉన్న అన్ని పద్ధతులనూ ఉపయోగించాలి. తద్వారా కొనసాగుతున్న విప్లవ యుద్ధంలో ప్రజలు ఉత్సాహవంతంగా తమ పాత్రను పెంపొందించుకునేలా ఈ ఉత్సవాలను నిర్వహించాలి.

**కామ్రేడ్స్,**

అంతర్జాతీయ కార్మికవర్గం వర్గరహిత సమాజాన్ని నిర్మించేందుకు శత్రువుతో వేల యుద్ధాలను చేస్తూ కఠినతరమైన మార్గంలో ముందుకు పోయేందుకు విశాల ప్రజారాశులకు నాయకత్వం వహించే బాధ్యతను తన భుజాలపై వేసుకున్నది. ప్రస్తుత మార్క్సిజమైన ఎం.ఎల్.ఎం అనే అద్భుత ఆయుధాన్ని చేబూని ముందుకు పురోగమించే చారిత్రక కర్తవ్యాన్ని చేపట్టింది. అంతర్జాతీయ కార్మికవర్గంలో డిటాచ్‌మెంట్‌గా ఉన్న మన పార్టీ మన దేశంలోని దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో నక్సల్బరీ పోరాటం నుండి ఎన్నో ఎగుడుదిగుళ్ళనూ, అనేక కఠిన మార్గాలనూ అధిగమించి కొన్ని విజయాలను సాధించింది. దేశంలో పాలక వర్గాలు సామ్రాజ్యవాదులతో కలిసి కొనసాగిస్తున్న ఫాసిస్టు నిర్బంధ పద్ధతులను ఎదుర్కొంటూ అనేక మంది అమరులు తమ రక్తతర్పణతో నిర్దిష్ట పరిస్థితులకు ఎం.ఎల్.ఎం. సిద్ధాంతాన్ని అన్వయిస్తూ పురోగమించే క్రమంలో కొన్ని విజయాలు సాధించింది. ఈ రాబోయే మహోత్సవాలలో మన విజయాలను రక్షించుకుంటూ వాటి నుండి నూతన ఉత్తేజాన్ని పొందుతూ ప్రజాయుద్ధాన్ని మరింత ముందుకు తీసుకుపోదాం. మన ఆచరణలో దొర్లిన సకారాత్మక, నకారాత్మక అనుభవాలనూ, తప్పుల నుండి నేర్చుకున్న అనుభవాన్నీ, ఎం.ఎల్.ఎం. సిద్ధాంతంతో జోడించి మొత్తం పార్టీని, ప్రజలను ఎడ్యుకేట్ చేసి తగిన విధంగా తీర్చిదిద్దాలి. ఈ మహోత్సవాల ద్వారా పార్టీ, పి.ఎల్.జి.ఎ., ఆర్.పి.సి., ప్రజాసంఘాలు, మిత్రశక్తులు ప్రజలలో పోరాట చేవను పెంచి మరింత ఉత్సాహంగా పాల్గొనేలా తయారు చేయాలి. మనం మన మిత్ర శక్తుల, ప్రజల విశ్వాసాన్ని చూరగొని మన వైపు వచ్చేలా చేసి వారందరినీ ఐక్యపరిచి బలోపేతం చేసి అందరి ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా కొట్లాడేలా చేయాలి. దేశంలోని అశేష పీడిత ప్రజలను భరించలేని పేదరికం, అణచివేతలతో అర్ధవలస, అర్ధభూస్వామ్య సామాజిక బంధనాలతో బంధించిన స్థితి నుండి విముక్తిని పొందేందుకు నూతన ప్రజాస్వామికం, సోషలిజం మరియు కమ్యూనిజం ద్వారా మాత్రమే విముక్తి సాధ్యమనే విధంగా ప్రచారం చేయాలి. అంతర్జాతీయ కార్మికవర్గ మహోపాధ్యాయులైన మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల ద్వారా రూపొందించబడి కొనసాగించబడిన, ఆ తర్వాత మావో ద్వారా అభివృద్ధి చేయబడిన ఈ మార్గమే ఏకైక మార్గమని ప్రచారం చేయాలి. ఈ మార్గాన్నే అక్టోబర్ విప్లవం, చైనా విప్లవం, నక్సల్బరీ పోరాటాలు ప్రయాణించి అదే సరైన మార్గమని నిరూపించాయి. రాబోయే ఈ మూడు మహత్తర వార్షికోత్సవాల సందర్భంగా కేంద్రకమిటీ ఇచ్చిన ఈ పిలుపును అన్ని పార్టీ యూనిట్లు, పార్టీ సభ్యులు విశాల ప్రాతిపదికన ప్రజలలో ప్రచారం చేయలి. వారంతా చురుకుగా ఈ కార్యక్రమాలలో పాల్గొనేలా చేసి ఈ వార్షికోత్సవాలు విజయవంతమయ్యేలా అందరూ కృషి చేయాలి.

విప్లవాభినందనలతో,

గణపతి

ప్రధాన కార్యదర్శి, కేంద్ర కమిటీ

సి.పి.ఐ. (మావోయిస్టు)

❒

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## కేంద్రకమిటీ

### చారిత్రక నక్సల్బరీ సాయుధ విప్లవపు 50వ వార్షికోత్సవాన్నీ, ప్రపంచాన్ని కుదిపేసిన రష్యన్ సోషలిస్టు విప్లవపు శతాబ్ది వార్షికోత్సవాలను, ప్రపంచ కార్మికవర్గపు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ ద్విశతాబ్ది జన్మదిన మహోత్సవాలను అత్యంత విప్లవోత్సాహంతో జరుపుకుందాం !

**కేంద్ర కమిటీ పిలుపు**

**16 మార్చి, 2016**

**ప్రియమైన కామ్రేడ్స్, భారత విప్లవ మిత్రులు, కార్మికులు, రైతాంగం, పీడిత ప్రజలారా !**

అతి కొద్దికాలంలో మనం మూడు గొప్ప చారిత్రక వార్షికోత్సవాలను జరుపుకోబోతున్నాం. గొప్ప నక్సల్బరీ విప్లవ రైతాంగ సాయుధ పోరాటానికి 50 ఏళ్ళు పూర్తి కావస్తోంది. సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ నిర్మాతల్లో ఒకరైన కా.చారుమజుందార్ నక్సల్బరీ సాయుధ విప్లవాన్ని ప్రారంభించటంతో భారతదేశ విప్లవంలో కొత్త విప్లవ మార్గం మొదలైంది. మరొకరైన కా.కన్హయ్ ఛటర్జీ భారత ప్రజాస్వామిక విప్లవంలో నూతన ప్రారంభాన్ని మొదలు పెట్టారు. రష్యన్ సోషలిస్టు విప్లవ విజయానికి కూడా వందేళ్ళు పూర్తి కావస్తున్నాయి. కా.లెనిన్, కా.స్టాలిన్‌ల నాయకత్వంలో రష్యాలో సార్వత్రిక తిరుగుబాటు పద్ధతిలో పెట్టుబడిదారీ ఫ్యూడల్ శక్తుల రాజ్యాధికారాన్ని కూలదోసి కార్మికవర్గపు, పీడిత ప్రజానీకపు నూతన రాజ్యం స్థాపించబడింది. ఈ రాజ్యం సోషలిజాన్ని నిర్మాణం చేయాలనే కర్తవ్యాన్ని పూర్తి చేసి కమ్యూనిజానికి ప్రయాణం చేయాలనే లక్ష్యాన్ని కలిగి ఉండింది. మార్క్సిజం మార్గదర్శకత్వంలో కార్మికవర్గ పార్టీ ఈ కార్మికవర్గ సిద్ధాంతాన్ని సరిగ్గా అన్వయించి అమలు జరపటంతో బోల్షివిక్ విప్లవం విజయాన్ని సాధించింది. బోల్షివిక్ పార్టీ సరైన వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ అనుసరిస్తూ పార్టీ లోపలా, బయటా గల మితవాద, అతివాద అవకాశవాదాలకు వ్యతిరేకంగా రాజీ లేని పోరాటాన్ని నిర్వహించింది. సోషలిస్టు నిర్మాణ ప్రక్రియలోనూ, దేశీయ, అంతర్జాతీయ అవకాశవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలోనూ మార్క్సిస్టు సిద్ధాంతం గుణాత్మకమైన అభివృద్ధి స్థాయిని సంతరించుకొని మార్క్సిజం-లెనినిజం అనే నూతన స్థాయికి అభివృద్ధి చెందింది. కార్మికవర్గ సిద్ధాంతమూ, రాజకీయాలు, శాస్త్రీయ సోషలిజాలకు నిర్మాత మరియు గొప్ప తాత్వికుడైన మహోపాధ్యాయుడు కారల్‌మార్క్స్ యొక్క 200వ జన్మదినం కూడా అతి సమీపంలోనే ఉంది. శాస్త్రీయ సిద్ధాంతాన్నీ, కార్యపద్ధతినీ రూపొందించి ఆయన మానవజాతికి కొత్త మార్గాన్ని చూపించాడు. బూర్జువా, పెటీ బూర్జువా సిద్ధాంతాలైన ఆర్థిక శాస్త్రం, రాజనీతి మరియు సంస్కృతులకు వ్యతిరేకంగా జరిగిన తీవ్ర వర్గ పోరాటాల నుండీ, కార్మికవర్గ పోరాటాలలో భాగంగా తలెత్తిన అతివాద, మితవాద అవకాశవాదాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల నుండి మార్క్సిస్టు సిద్ధాంతం అభివృద్ధి చెందింది. వేల సంవత్సరాల వర్గదోపిడీ, అణచివేతలతో బంధించబడిన మానవ సమాజానికి మార్క్సిస్టు సిద్ధాంతం ఒక కొత్త యుగానికి నాంది పలికింది. మార్క్సిస్టు సిద్ధాంతం వర్గరహిత సమాజం వైపు సమాజాన్ని మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టటంతో మానవజాతి విముక్తి అనే ఊహలను వాస్తవాలుగా మార్చింది.

నేటి ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం వలన తలెత్తిన వేతన బానిసత్వం, దోపిడీ, వివక్షత, ఆధిక్యత, పేదరికం, అణచివేత, సంక్షోభాలు, యుద్ధాలు, విధ్వంసాలకు ఏకైక ప్రత్యామ్నాయం సోషలిజం, కమ్యూనిజమేననీ, ఇది తిరుగులేని సత్యమనీ ఈ మూడు వార్షికోత్సవాల సందర్భంగా నొక్కి వక్కాణించాల్సిన అవసరం ఉంది. పెట్టుబడిదారీ విధాన వ్యతిరేక పోరాటంలో కార్మికవర్గం కుళ్ళిపోయిన పాత సామాజిక సంబంధాలను రద్దు చేసి సోషలిజం పై ఆధారపడి వర్గరహిత వ్యవస్థ వైపు ప్రయాణం చేసే నూతన సామాజిక సంబంధాలను ఏర్పరచాలి. తీవ్రమైన వర్గపోరాటం నుండి వేలాది సంవత్సరాల వర్గ ఆధిపత్యపు చరిత్రను రద్దు చేయటం ద్వారానే మానవ సమాజపు అసలైన చరిత్ర ప్రారంభమవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ శాశ్వతమనీ, కమ్యూనిజం సంబంధం లేని విషయమనీ ఎవరైతే వాదిస్తున్నారో వారు ఈ విషయాలను మరిచిపోతున్నారు. ఆ విషయాలేమంటే, మానవ సమాజం చాలాకాలం వర్గరహిత సమాజంగానే ఉండింది. ఆ వర్గరహిత సమాజంలోనే వర్గ సమాజపు బీజాలు ఏర్పడి ఒక సమాజం తర్వాత మరో సమాజం ఒక దాని కంటే మరొకటి ఉన్నతమైందిగా మార్పు చెందుతూ మానవ చరిత్రలో చివరి విప్లవకర వర్గంగా కార్మికవర్గం ఉద్భవించింది. ఈ కార్మికవర్గపు నేతృత్వంలోనే సమాజం మళ్ళీ వర్గరహిత సమాజంగా మార్పు చెందుతుంది. పరిస్థితులన్నీ పరిపక్వమైన తర్వాత మానవ సమాజం "శక్తికి తగిన పని, అవసరానికి తగిన ఫలితం" అనే నినాదాన్ని తన బ్యానర్ మీద లిఖించుకుంటుంది. రష్యా, చైనాలలోని సోషలిస్టు వ్యవస్థల పతనం గురించి మాట్లాడేవారు కావాలనే ఒక విషయాన్ని దాచిపెడుతున్నారు. భూస్వామ్య వర్గం నుండి రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకునేందుకు బూర్జువా

తరువాయి భాగం 59వ పేజీలో